
బుధవారం 28-6-2023


'రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'

సాక్షి
సత్యమేవ జయతే
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15 సంచిక: 284

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



భారత్ శుభారంభం
పురుషుల 'కబడ్డీ చాంపియన్‌షిప్'లో రెండు మ్యాచ్‌ల్లో విజయం - 12లో



మూడు రోజుల నష్టాలకు చెక్
సెన్సెక్స్ 446 పాయింట్లు జంప్.. నిఫ్టీ 126 పాయింట్లు అప్ - 13లో



5 వందే భారత్ రైళ్లు ఒకేసారి...
ప్రధాని నరేంద్ర మోదీ ఒకేసారి అయిదు వందే భారత్ రైళ్లకు మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో పచ్చజెండా ఊపారు.
వివరాలు 6లో ▸



మమతకు గాయాలు
పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ హెలికాప్టర్ అత్యవసరంగా ల్యాండింగ్ అవడంతో ఆమెకు గాయాలయ్యాయి.
వివరాలు 6లో ▸



మణిపూర్‌కు సాయం చేసేందుకు..
ఈశాన్య రాష్ట్రాల్లో శాంతిని పునరుద్ధరించేందుకు ప్రజలు తమకు సహాయం చేయాలని కోరుతూ ఆర్మీ వీడియో విడుదల చేసింది.
వివరాలు 6లో ▸



యూపీలో మరో ఎన్‌కౌంటర్
ఉత్తరప్రదేశ్‌లో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ గుఫ్రాన్‌ను కౌశంబి జిల్లాలో మంగళవారం తెల్లవారుజామున ఎన్‌కౌంటర్ చేశారు.
వివరాలు 6లో ▸

దారుణాలకు కేరాఫ్ చంద్రబాబే!

ఎస్సీ, ఎస్టీలపై అఘాయిత్యాల్లో అప్పట్లో టాప్-10లో ఏపీ

సాక్షాత్తూ బాబుకే దళితులంటే చిన్నచూపు ; అందుకే ఈసడింపు మాటలు

- అప్పట్లో వారిపై యథేచ్ఛగా దాడులు; కేసులు పెట్టకుండా బెదిరింపులు..
- వైఎస్ జగన్ హయాంలో సమగ్ర సంస్కరణలు; రెండుసార్లూ ఎస్సీలకే హోంమంత్రి
- దళితులు, ఎస్టీలపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు; పోలీసు సంస్కరణలు.. దీంతో నాలుగేళ్లలో తగ్గిన దాడులు, వేధింపులు... ఎన్‌సీఆర్‌బీ గణాంకాల్లో వెల్లడి
- సత్వర దర్యాప్తు... సకాలంలో ఛార్జిషీట్లు... బాధితులకు పరిహారం పెంపు.. ఇవన్నీ విస్మరించిన రామోజీ.. రాజధానిలో దళితులకు ఇళ్లు రావటంపై అక్కసు
- కేంద్రం నిధులు ఓకే చేయటంతో.. జగన్ ప్రభుత్వానికి పేరు రాకూడదని కుట్ర..
- ఆ కథనాన్ని చిన్నగా ప్రచురిస్తూ... ఎస్సీ, ఎస్టీలపై దాడులంటూ బ్యానర్ స్టోరీ
- నిజానికి రాజధానిలో పేదలకు ఇళ్లు రాకుండా రకరకాల కుట్రలు చేసిన ఎల్లో ముఠా
- చివరకు కోర్టులో ఓడినా... కేంద్రం నిధులు ఇవ్వకుండా లేఖలు.. వీరికి జతకలిసిన ఎంపీ రఘురామకృష్ణరాజు... అయినా పారని ఎత్తులు
- చివరకు కేంద్రం ఆమోదించటంతో చేసేదేమీ లేక.. దాడులు పెరుగుతున్నాయంటూ ఆక్రోశం

2లో



బాబు, రామోజీలపైనే ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టాలి
- దళితులపై దాడులు టీడీపీ హయాంలోనే ఎక్కువ
- ముక్కు నేలకు రాసినా బాబును దళితులు క్షమించరు
- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున

2లో

టీడీపీ మాలల ఆత్మీయ సమావేశానికి చంద్రబాబు డుమ్మా
- అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా సమావేశం నిర్వహణ
- గతంలో మాదిగల సమావేశానికీ దూరంగా ఉన్న చంద్రబాబు

2లో

కౌంట్‌డౌన్ మొదలు...

100 రోజుల్లో వన్డే ప్రపంచకప్



- భారత్ వేదికగా మరో 100 రోజుల్లో విశ్వ క్రికెట్ సంరంభం మొదలుకానుంది. ఈ మెగా టోర్నీకి సంబంధించి మంగళవారం అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసింది. అక్టోబర్ 5న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో 2019 ప్రపంచకప్ ఫైనలిస్టులు ఇంగ్లండ్, న్యూజిలాండ్ జట్ల మధ్య మ్యాచ్‌తో ఈ టోర్నీ మొదలవుతుంది. అక్టోబర్ 15న అహ్మదాబాద్‌లోనే చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. నవంబర్ 19న అహ్మదాబాద్‌లో జరిగే ఫైనల్‌తో టోర్నీ ముగుస్తుంది. 46 రోజులపాటు భారత్‌లోని 10 వేదికల్లో జరిగే ఈ టోర్నీలో 10 జట్ల మధ్య మొత్తం 48 మ్యాచ్‌లు జరుగుతాయి. హైదరాబాద్‌కు మూడు మ్యాచ్‌లు కేటాయించినా... భారత జట్టు మ్యాచ్‌ను తిలకించే భాగ్యం మాత్రం అభిమానులకు దక్కడంలేదు. భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, పాకిస్తాన్, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ జట్లు ర్యాంకింగ్ ఆధారంగా నేరుగా ప్రపంచకప్‌కు అర్హత సాధించాయి. ప్రస్తుతం జింబాబ్వేలో జరుగుతున్న క్వాలిఫయింగ్ టోర్నీలో ఫైనల్ చేరిన రెండు జట్లు (క్వాలిఫయర్-1, క్వాలిఫయర్-2) ఈ ఎనిమిది జట్లతో కలుస్తాయి. అహ్మదాబాద్, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, ఢిల్లీ, ధర్మశాల, హైదరాబాద్, లక్నో, పుణేలలో మ్యాచ్‌లు జరుగుతాయి. సెమీఫైనల్స్ మ్యాచ్‌లకు ముంబై (నవంబర్ 15న), కోల్‌కతా (నవంబర్ 16న) ఆతిథ్యమిస్తాయి. ఫైనల్ మ్యాచ్ నవంబర్ 19న అహ్మదాబాద్‌లో జరుగుతుంది. సెమీఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లకు రిజర్వ్ డే ఉన్నాయి. భారత్ తమ తొలి మ్యాచ్‌ను అక్టోబర్ 8న చెన్నైలో ఆస్ట్రేలియాతో ఆడుతుంది. హైదరాబాద్ మినహా మిగతా తొమ్మిది వేదికల్లో భారత్ మ్యాచ్‌లు ఉండటం విశేషం.

12లో



న్యూస్‌రీల్

నాలుగేళ్లలోనే డిగ్రీ ప్లస్ బీఈడీ



సమీకృత బీఈడీ కోర్సులు ఈ ఏడాది నుంచి ప్రారంభం కానున్నాయి. ఇంటర్ తర్వాత నాలుగేళ్లలోనే డిగ్రీతో పాటు బీఈడీ పూర్తి చేయవచ్చు. ఈ కోర్సుల్లో ప్రవేశానికి ఎన్‌టీఏ దేశ వ్యాప్తంగా 178 పట్టణాల్లో 13 మాధ్యమాల్లో టెస్ట్ నిర్వహిస్తోంది. దీని నోటిఫికేషన్‌ను సోమవారం విడుదల చేసింది.
వివరాలు 14లో ▸

కేజీహెచ్‌లో సోలార్ పవర్ ప్లాంట్



విశాఖలోని కేజీహెచ్‌లో రూ.50 లక్షలతో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ ముందుకొచ్చింది. మంగళవారం విశాఖలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని సమక్షంలో సౌర విద్యుత్‌ను ఇన్‌స్టాలేషన్ చేయడానికి ఎంవోయూ జరిగింది.
వివరాలు 5లో ▸

వేగంగా ఏపీ ఆర్థిక వ్యవస్థ వృద్ధి



దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థిక వ్యవస్థగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తోందని సీఐఐ ఏపీ చాప్టర్ చైర్మన్ లక్ష్మీ ప్రసాద్ చెప్పారు. జీడీపీలో అత్యధికంగా దక్షిణాది రాష్ట్రాల వాటా 30శాతంగా ఉంటే అందులో ఏపీ వాటా 4.85 శాతం ఉందన్నారు.
వివరాలు 2లో ▸

మూడు రోజులు అక్కడక్కడ వర్షాలు!



సాక్షి, విశాఖపట్నం: ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాల్లో ఉన్న అల్పపీడనం మంగళవారం తీవ్ర అల్పపీడనంగా బలపడి ఈశాన్య మధ్యప్రదేశ్‌పై ఆవరించి ఉంది. ఇది రానున్న 2 రోజులు వాయవ్య మధ్యప్రదేశ్ వైపు పయనించనుంది. ఫలితంగా రానున్న 3 రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో వర్షాలకు అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది.

వారికి ఓటేస్తే ఆ కుటుంబాలే బాగుపడతాయి

కుటుంబ పార్టీలపై ప్రధాని నరేంద్ర మోదీ ధ్వజం



- మీ కుటుంబాల సంక్షేమం కోరుకుంటే బీజేపీకే ఓటేయండి
- ప్రతిపక్ష పార్టీలది లక్షల కుంభకోణాల చరిత్ర.. ఉమ్మడి పౌరస్మృతి అవసరం ఎంతో ఉంది
- రెండు చట్టాలతో దేశం ఎలా నడుస్తుంది?.. ప్రతిపక్షాలు ముస్లింలను రెచ్చగొడ్తున్నాయి
- ప్రతిపక్ష పార్టీ నేతల భేటీని ఫొటో షూట్‌తో పోల్చిన మోదీ

6లో



బంగ్లాదేశ్ డిప్యూటీ హై కమిషనర్ (చెన్నై, సౌత్ ఇండియా) షెల్లి సలేహిన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్

2లో

నాలుగో ఏడాదీ 'జగనన్న అమ్మ ఒడి'

1వ తరగతి నుంచి ఇంటర్ దాకా 83,15,341 మందికి లబ్ధి

- 42,61,965 మంది తల్లుల ఖాతాల్లో రూ.6,392.94 కోట్లు జమ
- పది రోజుల పాటు పండుగ వాతావరణంలో కార్యక్రమం
- నేడు కురుపాం బహిరంగ సభలో ప్రారంభించనున్న సీఎం జగన్
- తాజాగా అందించే మొత్తంతో కలిపితే అమ్మఒడితో ఇప్పటి వరకు రూ.26,067.28 కోట్ల మేర లబ్ధి

2లో



అమరావతిలో ఆప్షన్ 3 ఆవాసాలే!



జూలై 8వ తేదీన వైఎస్సార్ జయంతి రోజున ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు

3లో

సీఆర్‌డీఏ పరిధిలో ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలకు చెందిన నిరుపేదల సొంతింటి కల సాకారం దిశగా సీఎం జగన్ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. సీఆర్‌డీఏ పరిధిలో 50,793 మంది అక్కచెల్లెమ్మలకు 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకం కింద ఇంటి స్థలాలను ఇప్పటికే ఉచితంగా పంపిణీ చేసింది. ఈ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించేలా గృహ నిర్మాణ శాఖ చర్యలు చేపట్టింది. మొత్తం లబ్ధిదారుల్లో 88.79 శాతం మంది ఆప్షన్-3కి మొగ్గు చూపారు.

కూరగాయల ధరల నియంత్రణకు చర్యలు



సీఎం యాప్ ద్వారా రోజువారీ సమీక్ష

టమాటా, ఉల్లి ధరలకు కళ్లెం

10లో

పెరుగుతున్న కూరగాయల ధరల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సీఎం యాప్ ద్వారా రోజూ క్షేత్రస్థాయిలో కూరగాయల ధరల హెచ్చు తగ్గులను పరిశీలిస్తోంది. ఉల్లి, ఇతర కూరగాయల ధరల్లో పెద్దగా మార్పులు లేకపోయినా.. టమాటా ధర పెరుగుతోంది. ప్రధానంగా రాయలసీమ, కృష్ణా, విశాఖ, తూర్పు గోదావరి జిల్లాల్లోనే టమాట ధరలు పెరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు.

వృత్తి నిపుణుల జాబితాలోకి కౌలు రైతులు

'అగ్రికల్చర్ ప్రొఫెషనల్స్'గా గుర్తింపు

అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కొత్త ప్రయోగం

- ఇకపై వైద్యులు, ఇంజినీర్లు, ఉద్యోగులు, వ్యాపారుల తరహాలోనే కౌలు రైతులకు వ్యక్తిగత రుణాలు
- కొత్తపేట మండలం అవిడిలో లాంఛనంగా ప్రారంభం
- తొలి విడతగా 323 మంది కౌలుదారులకు రుణాల పంపిణీ
- మరో 22 మండలాల్లో రుణాల మంజూరుకు చర్యలు

14లో



ఇదం జగత్



ప్రధాని పదవిపై చర్చ జరిగేదాకా విపక్ష భేటీలు జరుగుతూనే ఉంటాయి సార్..!!



బాబు, రామోజీలపైనే ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టాలి

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున



సాక్షి, అమరావతి: రాష్ట్ర రాజకీయాల్లో ఆదినుంచి ఎస్సీ, ఎస్టీ కులాలను అపహాస్యం చేస్తూ, సందర్భానుసారం తీవ్రంగా అవమానించిన వ్యక్తి చంద్రబాబు అని, ఈ విషయం రాష్ట్రంలో ప్రతీ ఒక్క దళిత సోదరునికీ తెలుసునని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని అమలుచేయాలనుకుంటే.. ముందుగా చంద్రబాబు, రామోజీరావుపైనే ఈ కేసులు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. 'దళితుల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా?' అని వారిని అవమానించినప్పుడే చంద్రబాబు మీద కేసు పెట్టాల్సిందన్నారు. అదేవిధంగా రామోజీ ఫిల్మ్ సిటీ కోసం దళితుల భూముల్ని దౌర్జన్యంగా లాక్కున్న రామోజీరావుపై కూడా ఖచ్చితంగా ఆ కేసును నమోదు చేయవచ్చన్నారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మంగళవారం నాగార్జున మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

దళితులపై దాడులకు పేటెంట్ బాబే

బాబు హయాంలో దళితులపై జరిగిన దాడులు అన్నీఇన్నీ కావు. అసలు, వాటికి పేటెంట్ చంద్రబాబేనని చెప్పాలి. బాబు హయాంలో దళితులపై దాడుల్లో ఏపీ నంబర్ వన్‌గా కీర్తి గడించింది. ఆయన హయాంలో దళితులపై జరిగిన దాడులకు సంబంధించి నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) సంస్థ ఒక నివేదిక ఇచ్చింది. రాష్ట్రంలో దళిత కుటుంబాలన్నీ తమను ఆదరించే నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపంలో వచ్చారని సంతోషిస్తుంటే, చంద్రబాబుకు, రామోజీరావుకు నిద్రపట్టడంలేదు. ఈనాడు మంగళవారం సంచికలో ప్రచురించిన కథనంలో రాసిన దళిత దాడుల లెక్కలన్నీ తప్పుల తడకలే. అనేక ఘటనల్లో బాధితులకు ప్రభుత్వం అండగా ఉన్నది.

టీడీపీ మాలల ఆత్మీయ సమావేశానికి చంద్రబాబు డుమ్మా

- గతంలో మాదిగల సమావేశానికీ దూరంగా ఉన్న చంద్రబాబు
- దళితుల పట్ల ఆయనకు మొదటి నుంచి చిన్నచూపేనంటున్న విశ్లేషకులు

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ మాల నేతలు నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి చంద్రబాబు దూరంగా ఉండడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీలోని మాల నేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. దీనికి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చంద్రబాబు ఈ సమావేశానికి ఎందుకురాలేదనే దానిపై టీడీపీ వర్గాలు సమాధానాన్ని దాటవేస్తున్నాయి. ఈ నెల 13న టీడీపీ నిర్వహించిన మాదిగ నేతల సమావేశంలోనూ చంద్రబాబు పాల్గొనలేదు. దీంతో మాల, మాదిగ వర్గాలకు ఆ పార్టీ ఇస్తున్న ప్రాధాన్యం ఏమిటో స్పష్టమవుతోందని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. సాధారణంగా టీడీపీ నిర్వహించే సమావేశాలకు చంద్రబాబు తప్పనిసరిగా హాజరవుతారు. ఆయన షెడ్యూల్ ప్రకారమే సమావేశాల తేదీలు నిర్ణయిస్తారు. కానీ ఈ సమావేశాలకు చంద్రబాబు రాకపోవడంపై ఆ పార్టీ నేతల్లోనే అసంతృప్తి నెలకొంది. కావాలనే ఈ సమావేశానికి చంద్రబాబు హాజరుకాలేదనే ప్రచారం జరుగుతోంది. ఆయన హైదరాబాద్‌లో ఉండడం వల్ల ఈ సమావేశానికి రాలేదని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఆయన లేకుండా ఈ సమావేశం ఎందుకు నిర్వహించారనే దానికి టీడీపీ ముఖ్యుల వద్ద సమాధానం లేదు. ఆ వర్గాల పట్ల చంద్రబాబు నాయుడుకు మొదటి నుంచి చిన్నచూపు ఉందనే విషయాన్ని టీడీపీ నాయకులే చర్చించుకుంటున్నారు. ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? అని వ్యాఖ్యానించిన ముఖ్యమంత్రి దేశంలో చంద్రబాబు ఒక్కరే. సమావేశాల్లో దళితులను పొగడటం తప్ప వారికి టీడీపీలో ఎటువంటి విలువా లేదని తాజా సమావేశాలను బట్టి స్పష్టమైందని విశ్లేషకులు చెబుతున్నారు. మంగళవారం జరిగిన మాలల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న అచ్చెన్నాయుడు, ఇతర నేతలు మాట్లాడుతూ మాలలు గత ఎన్నికల్లో గంపగుత్తగా వైఎస్సార్‌సీపీకి ఓటేశారని, ఈసారి అలా జరక్కూడదని పదేపదే చెప్పారు.

దళిత సంక్షేమంపై చర్చకు వచ్చే దమ్ము ఉందా?

చంద్రబాబు, రామోజీ, లోకేశ్, పవన్‌లకు ఎంపీ సురేష్ సవాల్



సాక్షి, అమరావతి: 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో దళితులకు జరుగుతున్న మేలు, చంద్రబాబు హయాంలో జరిగిన కీడుపై చర్చకు చంద్రబాబు, లోకేశ్, పవన్‌కళ్యాణ్, రామోజీరావు, ఏబీఎన్ రాధాకృష్ణ, ఎల్లో మీడియా ముఠా ఎవరు వచ్చినా సరే చర్చకు నేను సిద్ధం. సీఎం వైఎస్ జగన్ మేలు చేశారని నిరూపిస్తా.. లేదు చంద్రబాబు మేలు చేశారని వారు నిరూపించే దమ్ముంటే చర్చకు రండి' అని వైఎస్సార్‌సీపీ ఎంపీ నందిగం సురేష్ సవాల్ విసిరారు. అమరావతిలో సీఆర్‌డీఏ పరిధిలో ఎస్సీలను చంద్రబాబు ఎంతగా అవమానించాడో తాను నిరూపిస్తానన్నారు. రామోజీరావుకు సిగ్గుంటే, ఎస్సీల మీద ప్రేమ ఉంటే రామోజీ ఫిల్మ్ సిటీలో అసైన్డ్ భూముల లెక్క బయటకు తీసి పంచాలన్నారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే..

సీఎం జగన్, బాబుకు ఇదీ తేడా

చంద్రబాబు ఓ పక్క ఎస్సీలుగా పుట్టాలని ఎవరు కోరుకుంటారని మాట్లాడుతుంటే, సీఎం జగన్ మాత్రం నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనార్టీలు అని మాట్లాడుతున్నారు. కుల వివక్ష ఎవరి దగ్గర ఉందో ప్రజలకు అర్థమవుతుంది. చంద్రబాబును నమ్ముకున్న దళితులు ఇవాళ ఫలానా స్థాయిలో ఉన్నారని చెప్పగలరా? ఈ రాష్ట్ర ప్రజలతో సహా సీఎం వైఎస్ జగన్‌ను నమ్ముకొని మోసపోయిన ఒక్క వ్యక్తినైనా చూపించగలరా? గతంలో సీఆర్‌డీఏ ప్రాంతంలో అసైన్డ్ భూములు చంద్రబాబు ఏ విధంగా తీసుకున్నారో చర్చకు నేను సిద్ధం .. చంద్రబాబు నాతో చర్చకు వస్తే ఇదే సీఆర్‌డీఏ ప్రాంతంలో ఎస్సీలను ఏ విధంగా అవమానించారో చెబుతా.

క్లుప్తంగా...

బాబు కోసం రామోజీ ఏ రాతలైనా రాస్తారు

ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయేల్ పెదపాటి అమ్మాజీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో దళితులపై దాడులు ఎవరి హయాంలో అధికంగా జరిగాయో ప్రజలందరికీ తెలుసని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయేల్ అన్నారు. మంగళవారం తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబును దళిత ద్రోహిగా దళిత సమాజం ఏనాడో గుర్తించిందన్నారు. శ్రీకాకుళం జిల్లాలో కల్యాణి అనే మహిళను అచ్చెన్నాయుడు బూటుకాలితో తన్నినప్పుడు రామోజీ ఎందుకు రాయలేదని ప్రశ్నించారు. ఇంకా ఎన్నో ఘటనలు జరిగినా నాటి ప్రభుత్వంపై ఎందుకు ఈనాడులో కథనాలు రాయలేదని ప్రశ్నించారు. కాగా, చంద్రబాబు, రామోజీరావు సిగ్గు, శరం అన్నీ వదిలేసి బతుకుతున్నారని ఎస్సీ కార్పొరేషన్ (మాల) చైర్‌పర్సన్ పెదపాటి అమ్మాజీ మంగళవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. కుల వివక్ష అనేది ఒక్క చంద్రబాబు వద్దే ఉందన్నారు.

మాలలు బాబు బుట్టలో పడొద్దు : నత్తా యోనారాజు

సాక్షి, అమరావతి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి నేటి వరకు మాలలకు తీరని ద్రోహం చేసింది చంద్రబాబేనని, వాస్తవాలు గమనించకుండా మాలలు ఎవరూ బాబు బుట్టలో పడొద్దని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు నత్తా యోనారాజు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఏనాడు మాలలను పట్టించుకోని టీడీపీ.. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మాలల ఆత్మీయ సమావేశం నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. పీవీ రావు 1997లో ఛలో అసెంబ్లీకి పిలుపునిస్తే మాలలను గుర్రాలతో తొక్కించి ఐదుగురు చనిపోవడానికి కారణం చంద్రబాబు అనే విషయాన్ని మాలలు మరిచిపోకూడదని తెలిపారు.

సీఎం జగన్‌తో బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషనర్ భేటీ

వ్యవసాయం, విద్య, వైద్యం మౌలిక సదుపాయాల కల్పన, టెక్నాలజీ అంశాలపై చర్చ

సాక్షి, అమరావతి: బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషనర్ (చెన్నై, సౌత్ ఇండియా) షెల్లి సలేహిన్ మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయం, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పన, టెక్నాలజీ వంటి కీలక అంశాలపై ముఖ్యమంత్రితో ఆయన చర్చించారు. షెల్లి సలేహిన్‌ను సీఎం జగన్ సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. ఈ సమావేశంలో సీఎం స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య, బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషనర్ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

కృతజ్ఞతలు తెలిపిన న్యాయవాదులు



హైకోర్టు వద్ద సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న న్యాయవాదులు

సాక్షి, అమరావతి/అల్లిపురం (విశాఖ దక్షిణం): యువ న్యాయవాదులకు అండగా నిలుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పలుచోట్ల న్యాయవాదులు కృతజ్ఞతలు తెలియజేశారు. తాజాగా లా నేస్తం కింద యువ న్యాయవాదులకు రూ.6 కోట్ల మేర నిధులు విడుదల చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా మంగళవారం అమరావతిలోని ఏపీ హైకోర్టు, విశాఖ జిల్లా కోర్టు ప్రాంగణాల్లో సీఎం వైఎస్ జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో హైకోర్టులో, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్ జి.మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో విశాఖ జిల్లా కోర్టులో క్షీరాభిషేకాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున న్యాయవాదులు పాల్గొన్నారు.

దారుణాలకు కేరాఫ్ చంద్రబాబే!

- అప్పట్లో వారిపై యథేచ్ఛగా దాడులు, కేసులు పెట్టకుండా బెదిరింపులు..

కవల పిల్లల్లాంటి రామోజీరావు, చంద్రబాబు నాయుడు ఎంత నిరాశా, నిస్పృహల్లో ఉన్నారంటే... తామేం చేస్తున్నామో తమకే తెలియనంత!. ఇది మనకు తెలియడానికి మంగళవారం నాటి 'ఈనాడు' పత్రిక మొదటిపేజీ చూస్తే చాలు. ఎందుకంటే 'జగన్ ఏలుబడిలో ఎస్సీ, ఎస్టీలపై అఘాయిత్యాలు' అంటూ ఓ బ్యానర్ కథనాన్ని వండిన 'ఈనాడు'... ఆ విషయాన్ని ముందే చంద్రబాబుకు చెప్పటంతో బాబు హడావిడిగా ఓ వీడియో చేసి ట్విటర్లో పెట్టేశారు. 'ఇది రాష్ట్రమా? రావణ కాష్టమా?' అన్న చంద్రబాబు ట్విటర్ ప్రసంగాన్ని కూడా 'ఈనాడు' తన వార్త పక్కనే పెట్టింది. కాకపోతే రాజధాని ప్రాంతంలో బలహీనవర్గాలకు ఇళ్లు రాకుండా అడ్డుకుంటూ తామెన్ని కుట్రలు చేసినా పారలేదన్న ఉక్రోషం ఈ కవలలిద్దరినీ కుదిపేస్తోంది. ఆ దుగ్ధతో.. 'ఆర్5 జోన్లో ఇళ్ల నిర్మాణానికి ఆగమేఘాలపై ఆమోదం' అనే వార్తను కూడా అక్కడే వేయాల్సి వచ్చింది. ఇదిగో... ఇక్కడే ఈ 'నారామోజీ' కుట్ర పచ్చగా బయటపడింది. రాజధాని ప్రాంతంలో ఎస్సీ, ఎస్టీలకు ఇళ్లిస్తే సామాజిక సమతుల్యత దెబ్బ తింటుందని ఏకంగా కోర్టులకు వెళ్లింది ఈ నారా వారి ముఠానే. అంటే.. అక్కడ దళితులు ఉండకూడదని కోర్టులకెక్కి న్యాయపోరాటం చేసింది వీరే. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ దృఢ సంకల్పంతో వారి కుట్రల్ని అడ్డుకున్నారు. కింది నుంచి పైవరకూ కోర్టుల్లో పోరాడి మరీ... పేదలకు అనుకూలంగా ప్రభుత్వం గెలవగలిగింది. 51వేల మందికిపైగా పేదలకు 'ఆర్–5' జోన్లో ఇళ్ళ స్థలాలు కేటాయించింది. వాటిలో ఇళ్ల నిర్మాణానికి సీఎం జగన్ చొరవ తీసుకుని నేరుగా కేంద్ర పెద్దలను అభ్యర్థించి నిధులు సాధించారు. నిధులను అడ్డుకోవటానికి టీడీపీ, ఎంపీ రఘు రామకృష్ణరాజు కేంద్రానికి లేఖలు కూడా రాసినా... అవేవీ పనిచేయలేదు. సోమవారం కేంద్రం వీటికి ఆమోదం తెలియజేసింది. ఎస్సీ, ఎస్టీల విషయంలో ఇది ప్రభుత్వ విజయం కాబట్టి... దాని ప్రాధాన్యాన్ని తగ్గించడానికి 'ఎస్సీ, ఎస్టీలపై అఘాయిత్యాలు' అంటూ రామోజీరావు తన పైత్యానికి పనిచెప్పారు. విధిలేక... తన అక్కసునంతా బయటపెట్టుకుంటూ... 'ఆర్5 జోన్లో ఇళ్ల నిర్మాణానికి ఆగమేఘాలపై ఆమోదం' అనే కథనాన్ని కూడా వేశారు. కాకపోతే ఆ కథనంలో కూడా... కేంద్రం ఇంత త్వరగా ఎందుకు అనుమతిచ్చింది? అసలు ఎందుకివ్వాలి? అనే రీతిలో తన బాధనంతా వ్యక్తంచేసింది. ఇది చాలు కదా.. దళితులు, పేదలు, బలహీనవర్గాలపై నిజంగా ఎవరికి మమకారం ఉందో చెప్పటానికి? ఎవరి హయాంలో ఎస్సీ, ఎస్టీలకు మేలు జరిగిందో తెలియటానికి?

బాబు జమానా... భయంభయం

మాటల్లో అబద్ధాలుండొచ్చు. రామోజీ రాతల్లోనైతే ఇక చెప్పక్కర్లేదు. కానీ అంకెలు అబద్ధాలు చెప్పవు కదా!. చంద్రబాబు ప్రభుత్వ హయాంను తలచుకుంటే రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలు ఎందుకు ఉలిక్కి పడతారో అప్పటి అఘాయిత్యాల గణాంకాలను చూస్తే తెలిసిపోతుంది. 2014-19 మధ్య దేశంలో ఎస్సీ, ఎస్టీలపై అత్యధికంగా దాడులు జరిగిన టాప్-10 రాష్ట్రాల జాబితాలో ఆంధ్ర ప్రదేశ్ ఒకటి. ఎస్సీలపై దాడుల్లో ఏపీ 9వ స్థానమైతే... ఎస్టీలపై దాడుల్లో ఐదో స్థానం. దక్షిణాది రాష్ట్రాలను పరిగణలోకి తీసుకుంటే ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరిగిన రాష్ట్రాల్లో ఏపీది 3వ స్థానం. అదీ.. 'ఈనాడు' రాయని చంద్రబాబు పాలన.



తిరుపతి ఆటోనగర్‌లో రామోజీరావు దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరె అజయ్‌కుమార్, కార్పొరేటర్లు, స్థానిక ప్రజలు



దున్నపోతుకు ఈనాడు పత్రికను తినిపిస్తున్న నేతలు

ఏది నిజం?

ఏడాది	దేశంలో నమోదైన కేసులు	ఏపీలో నమోదైన కేసులు
2016	47,369	2,740
2017	50,328	2,310
2018	49,231	2,166

పెరిగిన భద్రత... తగ్గిన కేసులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై దాడుల కేసులు గణనీయంగా తగ్గాయి. ఐపీసీ కేసులతో పోలిస్తే ఎస్సీ, ఎస్టీలపై కేసుల (పీఓఏ) శాతం తగ్గడం ప్రభుత్వ సమర్థతకు నిదర్శనమనే చెప్పాలి. 2019లో మొత్తం ఐపీసీ కేసుల్లో పీఓఏ కేసులు 1.7 శాతమే ఉండగా... 2020లో ఆ కేసులు మరింతగా తగ్గి కేవలం 1.1 శాతానికే పరిమితమయ్యాయి. జనాభా ప్రాతిపదికన తీసుకుంటే ఎస్సీ, ఎస్టీలపై దాడుల కేసులు సగటున ప్రస్తుత ప్రభుత్వ హయాంలో బాగా తగ్గాయి.

కాలం	ఏడాదికి సగటున నమోదైన ఎస్సీ, ఎస్టీలపై వేధింపుల కేసులు	లక్షమంది ఎస్సీ,ఎస్టీ జనాభాకు నమోదైన కేసులు
టీడీపీ ప్రభుత్వంలో.. 2014-18	3,418	30.9
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో.. 2019-22	2,349	21.2

మార్గదర్శి అక్రమాలు వెలికి తీస్తున్నారనే సంజయ్‌పై అక్కసు

దళితులంటే తనకు ఎంతటి ద్వేషమో రామోజీరావు మరోసారి బయటపెట్టుకున్నారు. సీఐడీ అదనపు డీజీ హోదాలో ఉన్న దళిత అధికారి సంజయ్‌ను లక్ష్యంగా చేసుకుని 'ఈనాడు' కొన్ని రోజులుగా అవాకులు చెవాకులు రాస్తూనే ఉంది. కారణం... ఆయన మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలను వెలికి తీస్తుండటమే. దశాబ్దాలుగా తాము నిర్మించుకున్న ఆర్థిక అక్రమ సామ్రాజ్యం సీఐడీ దర్యాప్తుతో కుప్పకూలుతుండటంతో రామోజీకి దిక్కు తోచక... దళిత అధికారి సంజయ్‌ని పత్రికాముఖంగా బెదిరించడానికి దిగారు. ఆయన అధికారి హోదాలో నిర్వహించిన మీడియా సమావేశ వివరాలను కూడా యథాతథంగా కాకుండా వక్రీకరించి ప్రచురించడం ద్వారా తన దిగజారుడు పాత్రికేయాన్ని బయటపెట్టుకున్నారు.

మీడియా ట్రయల్స్‌పై 'ఈనాడు' గురివింద నీతి

మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలు ఆధారాలతో సహా బట్టబయలు కావటంతో బెంబేలెత్తుతున్న రామోజీ... గురివింద నీతిని ప్రదర్శిస్తుండటం హాస్యాస్పదమే. మార్గదర్శి అక్రమాలపై మీడియాలో కథనాలు వస్తున్నాయని... మీడియానే విచారణ చేసేస్తోందని శైలజా కిరణ్ న్యాయస్థానాన్ని ఆశ్రయించడం విడ్డూరం కాక మరేమిటి? దశాబ్దాలుగా ఎన్నెన్నో వ్యవహారాల్లో 'ఈనాడు' దర్యాప్తు చేసి... తీర్పులిచ్చేసి... నిర్దోషుల్ని సైతం బజారుకీడ్చిన సంఘటనలు ఎన్ని ఉన్నాయో తెలియదా? ఎందరి బతుకుల్ని బుగ్గి చేశారో మరిచిపోయారా రామోజీ? పత్రిక ద్వారా మీ ప్రత్యర్థులను వేధించిన తీరు తెలియనిదెవరికి? చంద్రబాబును అడ్డదారిలో సీఎంను చేసేందుకు అనాటి సీఎం ఎన్టీ రామారావు, ఆయన సతీమణి లక్ష్మీపార్వతికి వ్యతిరేకంగా ఈనాడు సాగించిన దుష్ప్రచారం, వ్యక్తిత్వ హననం గురించి ఎంత చెప్పినా తక్కువే. వ్యక్తిత్వాన్ని కించపరిచేలా అవహేళన, మహిళలను అవమానించేలా ఈనాడు వేసిన కార్టూన్లు, రాసిన కథనాలు పాత్రికేయ విలువలకు మాయని మచ్చలాంటివే. ఇక వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎం కాగానే రామోజీరావులోని వికృత పాత్రికేయం మరోసారి జడలు విప్పింది. పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేయడం గుర్తు లేనిదెవరికి? ఇప్పుడు మార్గదర్శి చిట్స్ అక్రమాలు బట్టబయలవుతుంటే మాత్రంమీడియాలో వార్తలు రాయకూడదన్నట్టు బెదరింపులేల?

నాడు: ఫిర్యాదు చేయాలంటేనే హడల్...

'ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా అనుకుంటారా?' అని సభాముఖంగా వ్యాఖ్యానించిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. మరి అలాంటి వ్యక్తి హయాంలో ఎస్సీ, ఎస్టీల భద్రత బాగుంటుందని అనుకోగలమా? ఎస్సీ, ఎస్టీల పిల్లలకు ఇంగ్లిష్ మీడియం చదువులు వద్దంటూ కోర్టులకెళ్లిన వ్యక్తి పాలనలో వారికి న్యాయం జరిగిందనగలమా? 'ఎస్సీలకు పరిశుభ్రంగా ఉండడం రాదు, వారు స్నానాలు చేయరు' అంటూ నీచంగా మాట్లాడిన ఆదినారాయణ రెడ్డిని నెత్తిన పెట్టుకుని పదవిలో కొనసాగించిన బాబు హయాంలో... తమపై అఘాయిత్యాలు జరిగినపుడు ఫిర్యాదు చేసే ధైర్యం ఎస్సీ, ఎస్టీలకు ఉందనుకోగలమా? పైపెచ్చు కేసుల సంఖ్య తక్కువగా చూపించేందుకు టీడీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల ఫిర్యాదులను అసలు స్వీకరించేది కాదు. ధైర్యంచేసి బాధితులు ఎవరైనా ఫిర్యాదు చేసేందుకు వస్తే వారిని బెదిరించి వెనక్కి పంపేసేవారు. కేసులే నమోదు చేయరు కనక దోషులకు శిక్షలు అన్న ప్రసక్తే ఉండేది కాదు.

నేడు: ఆ వర్గాల చేతిలోనే హోంమంత్రి పదవి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి మంత్రివర్గంలోను, తరవాత మార్చిన మంత్రివర్గంలోను రెండుసార్లూ హోంమంత్రి పదవి ఎస్సీ వర్గీయులకే ఇచ్చారు సీఎం జగన్. అది కూడా.. మహిళలకు. ఆ చిత్త శుద్ధి వల్లే... ఎస్సీ, ఎస్టీలపై దాడుల నియంత్రణ సాధ్యమైంది. పైపెచ్చు బాధితులకు ప్రభుత్వం అండగా ఉందన్న నమ్మకం కలిగింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో మహిళా పోలీసులు, దిశ పోలీసింగ్ వ్యవస్థ... తదితర సంస్కరణలతో సమూల మార్పులు సంభవించాయి. దాడులు, వేధింపులకు గురైన ఎస్సీ, ఎస్టీలు ధైర్యంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసే సానుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. కేసుల సంఖ్య పెరిగినట్టు కనిపించినా పర్వా లేదు... బాధితులకు న్యాయం జరగాలి...దోషులకు శిక్షలు పడాలి అనే విధానాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తోంది ఈ ప్రభుత్వం.

సకాలంలో ఛార్జిషీట్లు...

కేంద్ర హోం శాఖ మార్గదర్శకాల మేరకు కేవలం 60 రోజుల్లోనే దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్లు దాఖలు వేయడంలో దేశంలోనే ఆంధ్ర ప్రదేశ్ మొదటిస్థానంలో నిలిచింది. 2020లో 691 కేసులు, 2021లో 1,172 కేసులు, 2022లో 1,173 కేసులు మొత్తం 3,036 కేసుల్లో 60 రోజుల్లోనే చార్జిషీట్లు దాఖలు చేయడం రికార్డు. 2014-19 మధ్య ఒక కేసు దర్యాప్తుకు సగటున 206 రోజులు పడితే ఈ ప్రభుత్వ హయాంలో సగటున 86 రోజుల్లోనే దర్యాప్తు పూర్తి చేస్తున్నారు. 2014-19 మధ్యలో కేవలం 44 శాతం కేసుల్లోనే సకాలంలో ఛార్జిషీట్లు దాఖలు చేస్తే ఈ ప్రభుత్వ హయాంలో 73 శాతం కేసుల్లో సకాలంలో ఛార్జిషీట్లు వేశారు. ఇవీ... ఈనాడు రాయని నిజాలు. ఎస్సీ, ఎస్టీల కేసుల్లో టీడీపీ హయాంలో శిక్ష పడ్డ వారి శాతం 2018లో 5.7 శాతం ఉండగా... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక 2019లో ఇది 6.8శాతానికి పెరిగింది.

ఏడాది	శిక్షల శాతం
టీడీపీ ప్రభుత్వంలో	
2014	5.4
2015	5.5
2016	3.2
2017	5.5
2018	5.7
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో	
2019	6.8
2020	10

పెండింగు కేసులపై ఈనాడు వక్రభాష్యం

ఎస్సీ, ఎస్టీలపై దాడులకు సంబంధించి 66.25 శాతం కేసుల్లో దర్యాప్తు పెండింగులో ఉందని 'ఈనాడు' పేర్కొనటం పచ్చి అబద్ధం. దర్యాప్తు పూర్తయి న్యాయస్థానంలో విచారణ కోసం ఉన్న కేసుల్ని పెండింగ్ కేసులంటే ఎలా? న్యాయస్థానాల్లో వివిధ సమస్యల కారణంగా సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి రామోజీరావుకు తెలియదా? వాటిని పెండింగ్ కేసులని వక్రీకరించడం దుర్బుద్ధి కాదా? జనవరి 2021 నుంచి ఏప్రిల్ 2023 వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టి 3989 కేసుల్లో ఛార్జిషీట్లు వేయగా ఇప్పటికి 1384 కేసులు పరిష్కారమయ్యాయనే వాస్తవాన్ని ఎందుకు చెప్పరు రామోజీ?

వేగంగా ఏపీ ఆర్థిక వ్యవస్థ వృద్ధి

- దేశ జీడీపీలో 30 శాతం దక్షిణాది రాష్ట్రాలదే
- ఇందులో ఏపీ వాటా 4.85 శాతం
- 'పోటీ-సుస్థిర ఆంధ్రప్రదేశ్ 2023–24' నినాదంతో సీఐఐ-ఏపీ కార్యాచరణ
- మీడియాతో సీఐఐ ఏపీ చాప్టర్ చైర్మన్ లక్ష్మీప్రసాద్

సాక్షి, అమరావతి: దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థిక వ్యవస్థగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తోందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్(సీఐఐ) ఏపీ చాప్టర్ చైర్మన్ లక్ష్మీప్రసాద్ చెప్పారు. దేశ స్థూల జాతీయ ఉత్పత్తి (జీడీపీ)లో అత్యధికంగా దక్షిణాది రాష్ట్రాల వాటా 30 శాతంగా ఉంటే అందులో ఏపీ వాటా 4.85 శాతం ఉందని తెలిపారు. మంగళవారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 'పోటీ-సుస్థిర ఆంధ్రప్రదేశ్ 2023–24' నినాదంతో సీఐఐ ఏపీ చాప్టర్ పారిశ్రామిక అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. ఏపీ సులభతర వాణిజ్యంలో ప్రథమ స్థానంలో ఉండటం, సముద్ర ఆధారిత ఎగుమతులతో వేగంగా వృద్ధిని సాధిస్తోందన్నారు. ప్రపంచంలో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ 2025 నాటికి మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడానికి సిద్ధంగా ఉందని అన్నారు. ఈ ఏడాది జీడీపీ 6.5%-6.7%కి వృద్ధి చెందుతుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ఇండస్ట్రీ 4.0లో భాగంగా పరిశ్రమల్లో యాంత్రీకరణ, టెక్నాలజీని పెంపొందించాలని సూచించారు. జాతీయ స్థాయి నుంచి ప్రాంతీయ స్థాయి వరకు 9 అంశాల ప్రధాన అజెండాగా సీఐఐ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దేశంలో స్టార్టప్‌కు మంచి అవకాశాలు ఉన్నాయని, సమృద్ధి వనరులు, నైపుణ్యం కలిగిన శ్రామికశక్తితో చైనా తర్వాత భారత్ తయారీ కేంద్రంగా ఉద్భవించిందన్నారు. నైపుణ్యం, తక్కువ ఖర్చుతో కూడిన మానవ వనరులను ఉపయోగించుకుని తయారీ రంగంపై దృష్టి సారించాలని సూచించారు. పారిశ్రామిక రాయితీలు, తక్కువ రేటుకే విద్యుత్ వంటి అంశాలపై ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించాలని ప్రభుత్వాలను కోరారు. గ్రీన్ బిజినెస్, గ్రీన్ ఎకానమీని సీఐఐ ప్రోత్సహిస్తోందని, పారిశ్రామిక సంస్థలు పర్యావరణ రక్షణను బాధ్యతగా తీసుకోవాలని కోరారు. సీఐఐ ఏపీ మాజీ చైర్మన్ డి.రామకృష్ణ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, చాట్ జీపీటీ, ఆటోమేషన్, డిజిటలైజేషన్‌తో ఇండస్ట్రీలో ఉత్పాదకత, నాణ్యత పెరుగుతుందన్నారు. సీఐఐ ఏపీ వైస్ చైర్మన్ మురళీకృష్ణ మాట్లాడుతూ భారత్‌లో మెడికల్ టూరిజానికి ఎక్కువ అవకాశం ఉందన్నారు. సీఐఐ విజయవాడ జోన్ వైస్ చైర్మన్ డీపీ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

నాలుగో ఏడాదీ 'జగనన్న అమ్మ ఒడి'

- 1వ తరగతి నుంచి ఇంటర్ దాకా 83,15,341 మంది విద్యార్థులకు లబ్ధి
- నేడు కురుపాం బహిరంగ సభలో ప్రారంభించనున్న సీఎం జగన్



సాక్షి, అమరావతి: వరుసగా నాలుగో ఏడాదీ 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి 'జగనన్న అమ్మ ఒడి' అమలు కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు శ్రీకారం చుట్టనున్నారు. పది రోజులపాటు పండుగ వాతావరణంలో రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమం నిర్వహించి 42,61,965 మంది తల్లుల ఖాతాల్లో రూ.6,392.94 కోట్లు జమ చేయనున్నారు. తద్వారా 1వ తరగతి నుంచి ఇంటర్ చదివే 83,15,341 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. బుధవారం పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్ బటన్ నొక్కి అమ్మ ఒడి నిధులు జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. తాజాగా అందచేసే డబ్బులతో కలిపితే ఇప్పటివరకు ఒక్క జగనన్న అమ్మఒడి ద్వారానే రూ. 26,067.28 కోట్ల మేర ప్రయోజనాన్ని చేకూరుస్తున్నారు.

నాలుగేళ్లలో విద్యా రంగానికి రూ.66,722.36 కోట్లు

విద్యార్థుల చదువులకు అత్యంత ప్రాధాన్యమిస్తూ కీలక సంస్కరణలు చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లలో విద్యా రంగంపై రూ.66,722.36 కోట్లను వెచ్చించారు. జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, విద్యాకానుకతో అడుగడుగునా పిల్లల చదువులకు అండగా నిలుస్తున్నారు. పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థీ చదువులకు దూరం కారాదనే సంకల్పంతో విద్యారంగంపై పెద్ద ఎత్తున నిధులను వెచ్చిస్తూ అది భావి తరాల ఉజ్వల భవిష్యత్తుకు పెట్టుబడిగా భావిస్తున్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను సర్వాంగ సుందరంగా మార్చి ప్రైవేట్ స్కూళ్లే సర్కారు విద్యాసంస్థలతో పోటీ పడే పరిస్థితిని కల్పించారు. పేద విద్యార్థులను గ్లోబల్ స్టూడెంట్లుగా తీర్చిదిద్దుతూ ప్రాథమిక స్థాయి నుంచి ఇంగ్లిషు మీడియం, సీబీఎస్ఈ విధానంలో బోధన నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. ఇంగ్లిష్ ల్యాబ్స్ ఏర్పాటు చేసి బైలింగ్యువల్ టెక్ట్స్ బుక్స్ ఉచితంగా అందిస్తున్నారు. పిల్లల శారీరక, మానసిక వికాసం కోసం 3వ తరగతి నుంచే సబ్జెక్టు టీచర్లను ప్రత్యేకంగా అందుబాటులోకి తెచ్చారు. నాడు-నేడు తొలిదశ పనులు పూర్తైన స్కూళ్లలో ఆరు, ఆపై తరగతుల నుంచి డిజిటల్ తరగతి గదులను తీసుకొచ్చారు. ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్‌లో కూడా పనిచేసేలా బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను విద్యార్థులకు అందించి ప్రపంచంతో పోటీ పడేలా వెన్ను తడుతున్నారు. మన విద్యార్థులు విదేశాల్లో సైతం ఉన్నత చదువులు చదివేలా జగనన్న విదేశీ విద్యా దీవెనతో తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడకుండా ఆదుకుంటున్నారు. స్పోకెన్ ఇంగ్లీషులో నైపుణ్యాలను సాధించేలా పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను 'టోఫెల్' పరీక్షలకు సన్నద్ధం చేసి సర్టిఫికెట్లు అందించేలా తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు అమెరికా సంస్థ ఎడ్యుకేషన్ టెస్టింగ్ సర్వీసెస్ (ఈటీఎస్)తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. కాగా విద్యార్థుల చేరికలను ప్రోత్సహిస్తూ జీఈఆర్ శాతాన్ని మరింత మెరుగుపర్చేందుకు టెన్త్, ఇంటర్‌లో ఉత్తీర్ణులు కాకపోయినా తిరిగి తరగతులకు హాజరైతే వారికి కూడా అమ్మ ఒడిని వర్తింపచేయాలని నిర్ణయించారు.

అమరావతిలో ఆప్షన్ 3 ఆవాసాలే!

8న వైఎస్సార్ జయంతి రోజు ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు

- సీఆర్‌డీఏ పరిధిలో 50,793 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ
- ప్రభుత్వమే నిర్మించి ఇచ్చే ఆప్షన్ 3 ఇళ్ల వైపు 45,101 మంది మొగ్గు



సాక్షి, అమరావతి: సీఆర్‌డీఏ పరిధిలో ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలకు చెందిన నిరుపేదల సొంతింటి కల సాకారం దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. సీఆర్‌డీఏ పరిధిలో 50,793 మంది అక్కచెల్లెమ్మలకు 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం కింద ఇంటి స్థలాలను ఇప్పటికే ఉచితంగా పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఈ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించేలా గృహ నిర్మాణ శాఖ చర్యలు చేపట్టింది. సీఆర్‌డీఏ పరిధిలో మొత్తం 25 లేఅవుట్లలో పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. గుంటూరు జిల్లాకు చెందిన 22,125 మంది లబ్ధిదారులు, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన 22,976 మంది ప్రభుత్వమే ఇళ్లను నిర్మించి ఇచ్చే ఆప్షన్–3ని ఎంపిక చేసుకున్నారు. మొత్తం లబ్ధిదారుల్లో 88.79 శాతం మంది ఆప్షన్–3కి మొగ్గు చూపారు.

వైఎస్సార్ జయంతి రోజు శంకుస్థాపన

దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా జూలై 8వ తేదీన సీఆర్‌డీఏ పరిధిలో పేదల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఏడాది మే 26వ తేదీన పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ సందర్భంగా శంకుస్థాపన తేదీని కూడా సీఎం జగన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇళ్ల నిర్మాణం జోరందుకోనుంది.

ఉచితంగా ఇసుక.. రాయితీపై 14 రకాల సామగ్రి

విలువైన ఇళ్ల స్థలాలను ఉచితంగా నిరుపేదలకు పంపిణీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి కూడా అండగా నిలుస్తున్న విషయం తెలిసిందే. ఒక్కో యూనిట్‌కు బిల్లుల రూపంలో రూ.1.80 లక్షలు, పావలా వడ్డీకి రూ.35 వేలు బ్యాంకు రుణంగా సమకూరుస్తూ రూ.2.15 లక్షలు చొప్పున అందిస్తోంది. దీనికి అదనంగా ఉచితంగా ఇసుకతోపాటు సబ్సిడీపై స్టీల్, సిమెంట్ లాంటి 14 రకాల నిర్మాణ సామగ్రిని ప్రభుత్వమే సరఫరా చేస్తోంది. వీటి విలువ రూ.54,518 వరకు ఉంటుంది. ఇదే తరహాలో సీఆర్‌డీఏ పరిధిలో ఇళ్ల లబ్ధిదారులకు కూడా ప్రభుత్వం అండగా నిలవనుంది.

అక్కచెల్లెమ్మలకు విలువైన స్థిరాస్తి

నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకూ 31 లక్షల మందికిపైగా పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేసింది. రెండు విడతల్లో 21.25 లక్షల ఇళ్ల (సాధారణ ఇళ్లు 18.63 లక్షలు + టిడ్కో ఇళ్లు 2.62 లక్షల ఇళ్లు) నిర్మాణాలకు అనుమతులు ఇవ్వగా నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. సాధారణ ఇళ్లలో సుమారు నాలుగు లక్షల ఇళ్ల నిర్మాణాలు ఇప్పటికే పూర్తి అయ్యాయి. ఇళ్ల పథకం ద్వారా ఒక్కో పేదింటి మహిళకు సగటున రూ.15 లక్షల స్థిరాస్తిని సమకూర్చడం ద్వారా మొత్తం రూ. 3 వేల కోట్ల మేర సంపదను ప్రభుత్వం సృష్టిస్తోంది.

కొనసాగుతున్న లబ్ధిదారుల ట్యాగింగ్..



సీఆర్‌డీఏ పరిధిలో మెజారిటీ లబ్ధిదారులు ఆప్షన్–3 ఎంచుకున్నారు. లబ్ధిదారులను గ్రూపులుగా చేసి ట్యాగ్ చేసే పనులు రెండు జిల్లాల్లో కొనసాగుతున్నాయి. 47 వేల ఇళ్లకు సెంట్రల్ శాంక్షనింగ్ అండ్ మానిటరింగ్ కమిటీ (సీఎస్ఎంసీ) అనుమతులు వచ్చాయి. మిగిలిన ఇళ్లకు కూడా అనుమతులు వస్తాయి. గృహ నిర్మాణాలకు జూలై 8న శంకుస్థాపన నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

– అజయ్‌జైన్, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి



కేంద్రమంత్రి నిర్మలతో సాయిరెడ్డి భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తిరుమల శ్రీవారి ప్రతిమను నిర్మలా సీతారామన్‌కు బహూకరించినట్లు మంగళవారం విజయసాయిరెడ్డి ట్వీట్ చేశారు. పోలవరం సహా రాష్ట్రానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులపై చర్చించారు.

నేడు సిటీస్ ప్రాజెక్టు పనులకు శ్రీకారం

సాక్షి, అమరావతి: ఏపీ సీఆర్డీఏ పరిధిలోని కృష్ణాయపాలెం, నవులూరు, కురగల్లు, బేతపూడి ప్రాంతాలలో పాఠశాల భవనాలు, ఈ–హెల్త్ సెంటర్ల నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించనున్నట్టు సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ సీఆర్డీఏ, ఫ్రెంచ్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ నిధులతో సిటీస్ ప్రాజెక్టులో భాగంగా రూ.7.74 కోట్లతో ఈ పనులు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. ఆరు నెలల వ్యవధిలో పనులు చేస్తామని ఆయన తెలిపారు.

సచివాలయాల ఉద్యోగ సంఘాలతో స్పెషల్ సీఎస్ భేటీ

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సమస్యలపై చర్చించేందుకు మంగళవారం గ్రామ, వార్డు సచివాలయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఆయా ఉద్యోగుల సంఘాలతో సమావేశమయ్యారు. గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులకు డీడీవో అధికారాలు అప్పగించడం, మున్సిపాలిటీ నగరాల్లో శానిటేషన్ విధులకు తెల్లవారుజామున హాజరయ్యే వార్డు శానిటేషన్ సెక్రటరీలకు నిర్ణీత విధి నిర్వహణ సమయం కేటాయింపుల నుంచి మినహాయింపు ఇవ్వడం, సచివాలయాల ఉద్యోగుల సెలవు మంజూరు ప్రక్రియ సులభతరం చేసేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ విధానం అమలు తదితర సమస్యలను ఉద్యోగ సంఘాల ప్రతినిధులు అజయ్ జైన్ దృష్టికి తీసుకొచ్చారు.

4ఏళ్లలో రూ.450 కోట్లతో ఆలయాల పునరుద్ధరణ

సాక్షి, అమరావతి: గడిచిన నాలుగేళ్ల కాలంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రూ.450 కోట్లతో కామన్‌గుడ్ ఫండ్స్ (సీజీఎఫ్) ద్వారా రాష్ట్రంలో పురాతన ఆలయాల పునరుద్ధరణతోపాటు కొత్త ఆలయాలు నిర్మించినట్లు ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. ఆయన మంగళవారం రాష్ట్ర సచివాలయంలోని తన చాంబరులో దేవదాయశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను దేవదాయశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినరోజు నుంచి ఇప్పటివరకు రూ.270 కోట్లు ఆలయాల నిర్మాణాలకు ఖర్చుచేసినట్టు చెప్పారు. రానున్న రోజుల్లో మరికొన్ని ఆలయ నిర్మాణాలకు అనుమతి ఇచ్చే అవకాశం ఉందన్నారు. ఇవిగాకుండా రూ. 195 కోట్లతో విజయవాడ శ్రీకనకదుర్గామల్లేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులు చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే మునుపెన్నడు లేని రీతిలో విజయవాడ దుర్గగుడి అభివృద్ధి కోసం దేవదాయశాఖకు ప్రభుత్వం తరుపున రూ.70 కోట్ల గ్రాంట్‌ను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారని గుర్తుచేశారు. ప్రభుత్వ నిధులు రూ.70 కోట్లు కాగా మిగిలిన రూ.125 కోట్లు ఆలయ నిధులతో మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా పనులు చేపడుతున్నట్టు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.70 కోట్లలో ఇప్పటికే మొత్తం రూ.14.70 కోట్లతో కొండచరియలు విరిగిపడకుండా మెష్ ఏర్పాటు తదితర పనులు చేసినట్లు చెప్పారు. మిగిలిన నిధులతో ప్రసాదం పోటు, అన్నదానం భవనాలను నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రసాదం పోటు భవన నిర్మాణానికి ఈ వారంలోను, అన్నదాన భవనానికి జూలై రెండోవారంలోను టెండర్లను పిలుస్తామన్నారు. రూ.125 కోట్ల దేవాలయ నిధులతో మల్టీ లెవల్ క్యూ కాంప్లెక్సు, క్యూ కాంప్లెక్సు నుంచి అన్నదాన భవనానికి వెళ్లేందుకు బ్రిడ్జి తదితర నిర్మాణాలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

శ్రీశైలంలో త్వరలో ప్రాతఃకాల సేవ ప్రారంభం

శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ చక్రపాణిరెడ్డి



శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం వారి అభ్యర్థన మేరకు రూ.25వేలతో ప్రాతఃకాల సేవను త్వరలో ప్రవేశపెట్టనున్నట్లు శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి తెలిపారు. మంగళవారం శ్రీశైల దేవస్థాన పరిపాలన భవనంలోని సమీక్షా సమావేశ మందిరంలో 16వ ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించారు. 37 అంశాలు ప్రవేశపెట్టగా, 27అంశాలకు ట్రస్టుబోర్డు ఆమోదం తెలిపింది. నాలుగు అంశాలు వాయిదా పడగా, ఆరు అంశాలను తిరస్కరించారు. సమావేశంలోని అంశాలను చైర్మన్ వెల్లడించారు. గోశాల సమీపంలో 10లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్‌హెడ్ సంప్ రిజర్వాయర్ నిర్మాణానికి రూ.2.60కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణం, ఫిల్టర్‌బెడ్ వద్ద ఐదు లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్‌హెడ్ సంప్ రిజర్వాయర్ రూ.1.60కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణం, గంటామఠం ప్రాంగణంలో రూ.24.50లక్షల అంచనాలతో కొమారిదేవి ఆలయ నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. క్షేత్ర రక్షణ కోసం జిల్లా ఎస్పీ నేతృత్వంలో చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌ను నియమిస్తామని వివరించారు.

9 ప్రభుత్వాస్పత్రుల స్థాయి పెంపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు చేస్తున్న క్రమంలో తొమ్మిది ప్రభుత్వాస్పత్రుల స్థాయి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు వైద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. పార్వతీపురం, మార్కాపురం, మదనపల్లె జిల్లా ఆస్పత్రులు, నర్సీపట్నం, అమలాపురం, బాపట్ల, పాలకొల్లు ఏరియా ఆస్పత్రులు, పిడుగురాళ్ల సీహెచ్‌సీ, పెనుకొండ సీహెచ్‌సీ ఆస్పత్రులను 330 పడకల జిల్లా ఆస్పత్రులుగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ తొమ్మిది ఆస్పత్రులు కొత్తగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వైద్య కళాశాలల అకడమిక్ కార్యకలాపాలు 2025–26 నుంచి ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఎన్ఎంసీ నిబంధనలకు అనుగుణంగా ఆయా ఆస్పత్రులను బోధనాస్పత్రులుగా అభివృద్ధి చేయడానికి వీలుగా పడకల సంఖ్యను పెంచుతున్నారు. సీఎం జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్తగా 17 వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే మచిలీపట్నం, నంద్యాల, ఏలూరు, రాజమండ్రి, విజయనగరం వైద్య కళాశాలలకు అనుమతులు వచ్చాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి ఈ కళాశాలల్లో 750 ఎంబీబీఎస్ సీట్లలో అడ్మిషన్లు చేపట్టనున్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి పాడేరు, పులివెందుల, ఆదోని వైద్య కళాశాలలు ప్రారంభించడానికి వీలుగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

'కళ్యాణదుర్గం' టీడీపీలో డిష్యుం డిష్యుం

- బస్సుయాత్రలో తన్నుకున్న రెండువర్గాలు



గొడవకు దిగిన ఇరువర్గాలను చెదరగొడుతున్న పోలీసులు

కళ్యాణదుర్గం: అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గంలో మంగళవారం తెలుగుదేశం పార్టీలో రెండువర్గాలు తన్నుకున్నాయి. భవిష్యత్తుకు భరోసా పేరుతో టీడీపీ చేపట్టిన బస్సుయాత్ర ఆద్యంతం రెండువర్గాల బాహాబాహీతో సాగింది. కుందుర్పి మండలం శీగలపల్లి వద్ద యాత్ర మొదలైనప్పటి నుంచి కళ్యాణదుర్గంలో రాత్రి సభ ముగిసే వరకు ఇదే పరిస్థితి. ఉదయం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి ఉమామహేశ్వరనాయుడు, మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి వర్గీయులు పోటాపోటీగా నినాదాలు చేస్తూ బస్సు వద్దకు వెళ్లారు. వర్గాలను ప్రోత్సహిస్తూ నేతలు మాట్లాడితే సహించేది లేదని కొందరు కార్యకర్తలు స్పష్టం చేశారు. ఏ ఒక్క వర్గాన్ని ప్రోత్సహిస్తూ మాట్లాడినా పరిస్థితి వేరుగా ఉంటుందని ఓ యువకుడు అనడంతో ఇరువర్గాల మధ్య గొడవ మొదలైంది. బండమీదపల్లి, కుందుర్పిలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. కుందుర్పిలో ఓ యువకుడు ఏకంగా బైకును బస్సుముందు కింద పడేసి యాత్రను అడ్డుకున్నాడు. ఉన్నం, ఉమా వర్గీయులు బస్సు ముందే తన్నుకున్నారు. భోజన ప్రదేశం వద్ద ఓ వర్గం యువకుడు మరో వర్గం వైపు రాళ్లు రువ్వాడు. పోలీసులు వచ్చి ఇరువర్గాలను చెదరగొట్టారు.

అమెరికాలో కనుల పండువగా శ్రీనివాసుని కల్యాణం



ర్యాలీలో శ్రీవారి కల్యాణానికి హాజరైన భక్తులు

సాక్షి, అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో అమెరికాలో శ్రీనివాస కల్యాణం కనుల పండువగా జరిగింది. ర్యాలీ(నార్త్ కరోలినా), జాక్సన్ విల్(ఫ్లోరిడా), డెట్రాయిట్, చికాగో నగరాల్లో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెలుగు, భారతీయ ధార్మిక సంస్థల నుంచి ఏపీఎన్‌ఆర్‌టీసొసైటీకి వచ్చిన అభ్యర్థనల మేరకు ఏపీ ప్రభుత్వం, టీటీడీ స్వామి వారి కల్యాణ మహోత్సవాలను వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహించింది. తెలుగు భక్తులే కాకుండా తమిళనాడు, కేరళ, కర్ణాటక తదితర రాష్ట్రాలకు చెందిన దాదాపు 12 వేలకుపైగా ఎన్ఆర్ఐలు స్వామివారి కల్యాణ ఘట్టాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. ఆయా ప్రాంగణాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. భక్తులందరికీ తిరుమల నుంచి తెచ్చిన లడ్డూ ప్రసాదం అందించారు. ఏపీఎన్‌ఆర్‌టీఎస్ అధ్యక్షుడు వెంకట్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో నార్త్ అమెరికాలోని 14 నగరాల్లో చేపట్టిన శ్రీనివాస కల్యాణోత్సవాలను టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పర్యవేక్షణలో కెనడాలో మూడు, అమెరికాలోని నాలుగు నగరాల్లో దిగ్విజయంగా నిర్వహించామన్నారు. జూలై 1వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఏడు నగరాల్లో కల్యాణోత్సవాలను జరిపించనున్నట్టు తెలిపారు. ర్యాలీ కల్యాణోత్సవంలో ఈశ్వర్ రెడ్డి, మహిపాల్ మాలే, జాక్సన్ విల్‌లో మల్లికార్జున, ప్రభుత్వ సలహాదారు వాసుదేవ రెడ్డి, డెట్రాయిట్‌లో మహేష్, బాలాజీ, నరేన్, చికాగోలో శరత్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఎగుమతులకు ప్రోత్సాహం..!

ఎక్స్‌పోర్ట్‌ను మరింత విస్తృతం చేసే దిశగా కేంద్రం అడుగులు

- దేశ వ్యాప్తంగా 75 జిల్లాల్లో ఉత్పత్తుల ఎంపిక
- తూర్పుగోదావరికి స్థానం
- కొబ్బరి పీచు, జీడిపప్పు, కడియం నర్సరీ ఉత్పత్తులకు ప్రాధాన్యం
- రూ.40 కోట్లతో జిల్లాలో ఎక్స్‌పోర్ట్ హబ్ నిర్మాణానికి సుముఖం
- 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించేలా నిర్ణయం
- ప్రణాళికలు కేంద్రానికి సమర్పించిన జిల్లా అధికారులు



కడియం నర్సరీలో మొక్కలు

సాక్షి, రాజమహేంద్రవరం: తూర్పుగోదావరి జిల్లాలో తయారయ్యే ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసే అంశంలో మరింతగా ప్రోత్సహించే దిశగా అడుగులు పడుతున్నాయి. ఎక్స్‌పోర్ట్స్‌ను 10 శాతం పెంచి తయారీ రంగాన్ని బలోపేతం చేసి ఉద్యోగాలు కల్పించాలన్న తలంపుతో కేంద్రం ×డిస్ట్రిక్ట్ ఎక్స్‌పోర్ట్ హబ్× లాంటి బృహత్తర పథకానికి నాంది పలికింది. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా దేశ వ్యాప్తంగా 75 జిల్లాలను ఎంపిక చేయగా, ఆంధ్రప్రదేశ్ నుంచి తూర్పుగోదావరి జిల్లా స్థానం దక్కించుకుంది. ఇప్పటికే జిల్లాకు చెందిన ఎగుమతులు ప్రోత్సాహక కార్యాచరణ ప్రణాళికను జిల్లా అధికారులు కేంద్రానికి పంపగా.. పరిశీలించిన కేంద్రం ఆమోదం తెలిపింది. పథకానికి ఎంపికైన తర్వాత మళ్లీ జిల్లాకు మూడు ఉత్పత్తుల చొప్పున మూడు జిల్లాలకు సంబంధించి 9 రకాల ఉత్పత్తులను ఎంపిక చేసి పంపారు. వీటికి కేంద్ర ప్రభుత్వం ఆమోద ముద్ర పడాల్సి ఉంది. ఆమోదం లభించిన వెంటనే ఎగుమతులు ఊపందుకోనున్నాయి. అవసరమైన వసతుల కల్పనకు నిధులు సైతం మంజూరు కానున్నాయి.

'తూర్పు'లో మూడు ఉత్పత్తులు..

తూర్పుగోదావరి జిల్లాలో స్థానికంగా తయారయ్యే మూడు ఉత్పత్తులను ఎంపిక చేశారు. అందులో ప్రధానంగా కొబ్బరి పీచు ఆధారిత ఉత్పత్తులు, జీడిపప్పు ప్రాసెసింగ్, కడియం నర్సరీ ఉత్పత్తులను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన ఉత్పత్తుల ఎగుమతులను ఏటా 10 శాతం పెంచాలన్నది డిస్ట్రిక్ట్ ఎక్స్‌పోర్ట్ హబ్ లక్ష్యం. ఇందు కోసం ప్రతి జిల్లాలో ఎగుమతులు ప్రోత్సహించేలా రూ.40 కోట్లతో ఎక్స్‌పోర్ట్ హబ్‌ను అభివృద్ధి చేస్తారు. ఇందులో 60 శాతం కేంద్ర ప్రభుత్వం గ్రాంటుగా ఇస్తుంది. మిగిలిన మొత్తం రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంది.

మొక్కలకు మరింత ఊపు..

కడియం నర్సరీలంటే ప్రపంచంలోనే ప్రత్యేక స్థానం. ఇక్కడ లభించని మొక్కలు ఉండవంటే అతిశయోక్తి కాదు. అంతటి ప్రాధాన్యత సంతరించుకున్న నర్సరీల్లో మొక్కల ఎగుమతులు సైతం అదే స్థాయిలో ఉంటున్నాయి. కడియంలో 1336 నర్సరీలు ఉండగా.. ప్రత్యక్షంగా, పరోక్షంగా 30 వేలకు పైగా బతుకుబండి లాగుతున్నారు. ఏడాదిలో నాలుగు మాసాల పాటు (జూన్ 15 నుంచి అక్టోబర్ నెలాఖరుకు) వ్యాపారం ఊపందుకుంటుంది. రోజుకు 100 లారీల సరుకు ఎగుమతి అవుతుండగా రోజుకు సుమారు రూ.100 కోట్ల టర్నోవర్ అవుతోంది. అంతేగాక కోనసీమ జిల్లా వ్యాప్తంగా కొబ్బరి సాగు అత్యధికం. ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు జరుగుతుంటాయి. కొబ్బరి, కొబ్బరి పీచు ఉత్పత్తులను సైతం ప్రోత్సహించేందుకు జిల్లా అధికారులు ప్రణాళికలు రూపొందించి కేంద్రానికి నివేదించారు.

ప్రతిపాదనలు పంపాం



కేంద్రం ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని మూడు ఉత్పత్తులను ఎంపిక చేసి కేంద్రానికి ప్రతిపాదనలు పంపాం. అందులో ప్రధానంగా జీడిపప్పు, నర్సరీ, పీచు ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇచ్చాం. ఉత్పత్తులకు కేంద్రం నుంచి ఆమోదం లభించిన వెంటనే సదుపాయాల కల్పనకు నిధులు విడుదలవుతాయి. కేంద్రం 60, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు వెచ్చించి రూ.40 కోట్లతో డిస్ట్రిక్ట్ ఎక్స్‌పోర్ట్ హబ్‌ల నిర్మాణం చేపడతాం.

– డాక్టర్ కే మాధవీలత, కలెక్టర్, తూర్పుగోదావరి జిల్లా

జీడిపప్పుకు కేరాఫ్ రాష్ట్రం..

దేశ, విదేశాల్లో హాట్ కేక్‌లా విక్రయించే ఉత్పత్తి ఏదైనా ఉందంటే అది జీడిపప్పు ఒక్కటే. దేశం నుంచి విదేశాలకు ఎగుమతయ్యే జీడిపప్పులో సింహభాగం రాష్ట్రం నుంచే ఉండటం విశేషం. తూర్పుగోదావరి జిల్లాలో సుమారుగా 40 ప్రాసెసింగ్ యూనిట్లు నడుస్తున్నాయి. ఇక్కడ తయారైన జీడిపప్పును ఇండోనేషియా, ఈస్ట్, అండ్ వెస్ట్ సెంట్రల్ ఆఫ్రికా, సౌత్ ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. మంచి సీజన్‌లో ప్రతి ఏటా రూ.4000 కోట్ల మేర టర్నోవర్ అవుతోంది. 4,200 మంది ఉపాధి పొందుతున్నారు.



జీడిపప్పు ప్రాసెసింగ్ చేస్తున్న మహిళలు

రాష్ట్రంలో క్రైం రేట్ తగ్గింది



మాట్లాడుతున్న డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి

శాంతిభద్రతలపై చేస్తున్న ఆరోపణల్లో వాస్తవంలేదు

- డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి వెల్లడి

కర్నూలు (టౌన్) : ''రాష్ట్రంలో క్రైమ్ రేట్ తగ్గింది. 2014 నుంచి 2019 వరకు క్రైమ్ రేట్‌తో పోలిస్తే 2020 నుంచి 2023 మే వరకు రాష్ట్రంలో నేరాలు గణనీయంగా తగ్గాయి. క్రిమినల్స్‌ను కంట్రోల్ చేయడంతోనే క్రైమ్ కంట్రోల్‌లో ఉంది. హత్యలు, హత్యా యత్నాలు తగ్గాయి. శాంతిభద్రతల విషయంలో ఇతరులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవం. అలా చేసిన వారికి ఆధారాలతో సమాధానం ఇస్తాం''.. అని రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి స్పష్టంచేశారు. కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఉమ్మడి జిల్లాస్థాయి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం డీజీపీ మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది నేరాలు గణనీయంగా తగ్గాయి. మహిళా పోలీసుల సేవలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. మహిళా పోలీసులవల్ల గుర్తుతెలియని మృతదేహాలను గుర్తిస్తున్నాం. బాల్య వివాహాలు తగ్గాయి. మహిళలు, చిన్న పిల్లలపై అత్యాచారాలు వంటి తీవ్రమైన కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ కేసుల్లో ఎస్పీ, డీఎస్పీ స్థాయి అధికారుల పర్యవేక్షణలో అనేక కేసుల్లో జీవిత ఖైదు, అంతకంటే ఎక్కువ శిక్షలు పడేలా పోలీసు శాఖ చిత్తశుద్ధితో పనిచేస్తూ తక్కువ వ్యవధిలో కేసులను పరిష్కరిస్తోంది. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్‌లు గుర్తించి వాటిని అరికడుతున్నాం. వాహనాల తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్, అవగాహన సదస్సులు, ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంటు పెంచుతూ రోడ్డు ప్రమాదాలను అరికడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర పోలీసులు, గ్రామీణ మహిళా పోలీసులు, వార్డు మహిళా పోలీసులు అందరూ కలిసికట్టుగా గ్రామాల్లో తిరుగుతూ ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. దీనివల్ల గ్రామాల్లో గొడవలు, దొమ్మీ కేసులు, కుటుంబ కలహాల కేసులు బాగా తగ్గాయి.

మహిళలకు రక్షణగా దిశ..

ఇక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన దిశ యాప్‌ను రాష్ట్రవ్యాప్తంగా మహిళల మొబైల్ ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసి అవగాహన కల్పిస్తున్నాం. పోలీసులు సైతం మహిళల రక్షణకు నిరంతరం కృషిచేస్తున్నారు. మహిళలకు, మైనర్ బాలికలకు దిశ యాప్ రక్షణగా నిలుస్తోంది.

డ్రగ్ ఫ్రీ స్టేట్‌గా తీర్చిదిద్దుతాం

యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా పోలీసుశాఖ తయారీదారులు, అమ్మకందారులపై కఠిన చర్యలు తీసుకుంటోంది. సదరు వ్యక్తులపై పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేస్తున్నారు. మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పించడంతో పాటు డ్రగ్ ఫ్రీ స్టేట్‌గా తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తున్నారు. రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచి వారిపై పీడీ యాక్టులు పెడుతూ అవసరమైతే నగర బహిష్కరణకు గురిచేస్తున్నారు.

ఈ సమావేశంలో కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, నంద్యాల ఎస్పీ కె. రఘువీరారెడ్డి, సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ పాల్గొన్నారు.

ప్రాణదాతకు ప్రణామం

- రోడ్డు ప్రమాదంలో దువ్వాడ యువకుడి బ్రెయిన్ డెడ్
- అవయవదానం చేసిన తల్లిదండ్రులు



అనిల్ భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఆస్పత్రి సిబ్బంది (ఇన్‌సెట్‌లో) అనిల్ కుమార్

అక్కిరెడ్డిపాలెం: తాను మరణించినా.. ఇద్దరికి పునర్జన్మనిచ్చాడు ఓ యువకుడు. మరో ఇద్దరి ప్రాణాలకు భరోసా కల్పించాడు. మరోవైపు అందివచ్చిన కొడుకు అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నాడని తల్లడిల్లుతూనే అతని తల్లిదండ్రులు సమాజానికి ఆదర్శంగా నిలిచారు. బ్రెయిన్‌డెడ్ అయిన కుమారుడి అవయవాలు దానం చేసి పెద్ద మనసును చాటుకున్నారు. దువ్వాడకు చెందిన అప్పకొండ గోవింద్, రాములమ్మ దంపతులకు కుమారుడు అనిల్‌కుమార్(27), కుమార్తె రమ్య ఉన్నారు. అనిల్ దువ్వాడ సెక్టార్–1లో వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. అతను అసిస్టెంట్ మణికంఠతో కలిసి ఆదివారం స్కూటీపై దేవీపురం వద్ద గల పాపయ్యపాలెం వైపు వెళుతుండగా, ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీకొంది. వెనుక కూర్చున్న అనిల్ తలకు తీవ్ర గాయం కావడంతో షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు తెలిపారు. స్కూటీని నడుపుతున్న మణికంఠ తలకు, ఛాతీకి తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో బ్రెయిన్‌డెడ్ అయిన అనిల్ అవయవాలను దానం చేయాలని కోరుతూ అతని తల్లిదండ్రులకు జీవన్‌దాన్ ట్రస్ట్ ప్రతినిధులు కౌన్సెలింగ్ నిర్వహించారు. దీంతో అవయవదానానికి వారు అంగీకరించారు. అనిల్ అవయవాలను ఆస్పత్రి సిబ్బంది సేకరించి గ్రీన్ చానల్ ద్వారా ఊపిరితిత్తులను హైదరాబాదులోని కిమ్స్‌కు, ఒక కిడ్నీని విశాఖలోని పినాకిల్ ఆస్పత్రికి తరలించారు. మరో కిడ్నీ, లివర్‌ను షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో భద్రపరిచామని, వాటికి కూడా అవసరమైనవారికి పంపిస్తామని జీవన్‌దాన్ ప్రతినిధులు తెలిపారు. ఆస్పత్రి అధికార లాంఛనాలతో సెక్యూరిటీ సిబ్బంది గౌరవ వందనం సమర్పించిన అనంతరం అనిల్ పార్థివదేహాన్ని అతని బంధువులకు అప్పగించారు. కాగా, ఒక దశలో అనిల్ అవయవాలను ఎవరికి అమర్చుతున్నారో తెలియజేయాలంటూ అతని స్నేహితులు జీవన్‌దాన్ ప్రతినిధులతో వాగ్వాదానికి దిగారు. గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు, ఎస్ఐ కొల్లి సతీష్ వచ్చి వారికి సర్ది చెప్పి పంపించారు.



“ శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడం ఒక బాధ్యత. లేదంటే మన మనసును స్థిరంగా, స్పష్టంగా ఉంచుకోవడం సాధ్యం కాదు.

– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 28 జూన్ 2023

కలసి సాగుదాం... ప్రగతి బాట!

సారూప్యం, సాన్నిహిత్యం రెండూ ఉన్న దేశాల మధ్య స్నేహగీతాలాపన సహజమే. చిరకాలం తర్వాత ఇరు ప్రభుత్వాల పెద్దలు మరోసారి పల్లవి అందుకున్నారంటే సంబంధాల పునరుద్ధరణతో పాటు బంధం మళ్ళీ బలపడుతోందని అర్థం. గత వారాంతంలో ఈజిప్టులో భారత ప్రధాని మోదీ జరిపిన పర్యటన అందుకు సాక్ష్యం. ఉభయ దేశాలూ తమ ద్వైపాక్షిక బంధాన్ని వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి పెంచుకోవడం విశేషమే. ఆ మేరకు ‘చరిత్రాత్మక’ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఈజిప్టులో ప్రాథమిక వసతుల కల్పనలో, ముఖ్యంగా సూయజ్ కాలువ అథారిటీలో భారత పెట్టుబడులు సహా ఆర్థిక సహకారం పెంపుపై ఇరుపక్షాలూ చర్చించాయి. వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణలో ఒప్పందాలపై చేవ్రాలు చేశాయి. వెరసి, ఆఫ్రికా, పశ్చిమాసియాలలో భాగమైన జన సంఖ్యాక అరబ్బు దేశం ఈ ప్రాంతంలో భారత్‌కు కీలక భాగస్వామి కానుంది. ప్రతిగా దాని అవసరాలు తీర్చేందుకు భారత్ ముందుకు రావడంతో ఈ పర్యటన ఫలాలు ఉభయ తారకమే!

భారత ప్రధాని తాజా ఈజిప్ట్ పర్యటన అదాటునో, ఆలోచనా రహితంగానో జరిగింది కాదు. దాదాపు ఏడాది పైచిలుకుగా ఎన్నో లెక్కలతో చేపట్టిన వరుస చర్యల్లో ఇది ఒక భాగమనాలి. ద్వైపాక్షిక బంధాలున్నా అవి ఆశించినంతగా సత్తా చాటని వేళ గడచిన ఏడాది కాలంలో మన రక్షణ, విదేశాంగ మంత్రులు కైరో చుట్టివచ్చారు. ఈ ఏటి గణతంత్ర దినోత్సవ కవాతుకు ఈజిప్ట్ అధ్యక్షుడు భారత ప్రభుత్వ ముఖ్యఅతిథిగా ఢిల్లీకి విచ్చేశారు. దానికి కొనసాగింపు ఇప్పుడు మన ప్రధాని పర్యటన. గమనిస్తే– ఈజిప్టులో భారత ప్రధాని ఆఖరుసారిగా పర్యటించింది 1997లో. ఆ తర్వాత ఈ పాతికేళ్ళలో ప్రపంచం చాలా మారింది. ప్రచ్ఛన్న యుద్ధం కాలం నుంచి భౌగోళిక రాజకీయాలు కీలకంగా మారిన రోజులకు వచ్చాం. ఈ సమయంలో ఢిల్లీ, కైరోల భాగస్వామ్యం ఉభయులకూ లాభదాయకం. ప్రపంచంలో అయిదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ భారత్, భారీస్థాయిలో అప్పుల్లో ఉన్న ఈజిప్టుకు ఎంతో అవసరమైన భాగస్వామి. మరోపక్క వాణిజ్యానికీ, భౌగోళికంగానూ కీలకమైన సూయజ్ కాలువను శాసించే ఈజిప్టుతో బంధం భారత్‌కూ లాభదాయకం.

క్రీస్తుపూర్వం నుంచే అతి ప్రాచీన నాగరకతల మధ్య ముడిపడిన బంధమిది. అప్పట్లోనే భారత ద్వీపకల్పానికి ఈజిప్టు ఓడలు వస్తే, ఈజిప్టు మమ్మీలను చుట్టడానికి వాడిన వస్త్రం, ఆ వస్త్రానికి అద్దిన నీలిమందు భారతదేశానివి అన్నది చరిత్ర. గడచిన శతాబ్దకాలంలోనూ మన మైత్రి బలమైనది. వలస పాలన అనంతరం స్వాతంత్ర్యం వచ్చిన మూడు రోజులకే ఈజిప్టుతో దౌత్య సంబంధాలు పెట్టుకున్న చరిత మనది. ఇక్కడ ప్రధాని నెహ్రూ, అక్కడ అధ్యక్షుడు నాజర్‌లతో మన స్నేహలత మరింత అల్లుకుంది. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో అటు అమెరికా, ఇటు రష్యా కూటములు దేనిలోనూ చేరకుండా మనగలగవచ్చంటూ 1961లో అలీనోద్యమాన్ని నిర్మించి, మూడోప్రపంచ దేశాల్లో ఉత్సాహం ప్రోది చేసిన భారత, ఈజిప్టుల సామీప్యమూ గమనార్హం. ఈ చిరకాల స్నేహం ఇప్పుడు ద్వైపాక్షిక బంధం నుంచి బలమైన భాగస్వామ్యంగా కాంతులీనడం సంతోషదాయకం.

ప్రధాని మోదీ, ఈజిప్టు అధ్యక్షుడి మధ్య ఆంతరంగిక ముఖాముఖి సంభాషణ, మోదీకి ఈజిప్టు అత్యున్నత పురస్కారం ‘ఆర్డర్ ఆఫ్ ది నైల్’ బహూకరణ, అంతర్జాతీయంగానూ మీద పడుతున్న మైనారిటీల ప్రతికూల ముద్రను చెరుపుకొనేలా 11వ శతాబ్దం నాటి చారిత్రక అల్ హకీం మసీదుకు మోదీ వెళ్ళడం, ప్రపంచపు ఏడు వింతల్లో ఒకటైన గాజా పిరమిడ్ల సందర్శన, ఈజిప్టు – పాలస్తీనాల్లో ఉంటూ మొదటి ప్రపంచ యుద్ధంలో పోరాడి కన్నుమూసిన భారతీయ సైనికుల స్మారకం వద్ద నివాళులు అర్పించడం... అలా ఈ పర్యటనలో ఆకర్షణీయ అంశాలు అనేకం. కొన్ని కైరోతో స్నేహం పంచేవి. గుజరాతీ దావూదీ బోహ్రాలు పునరుద్ధరించిన మసీదు సందర్శన లాంటి మరికొన్ని సొంతగడ్డపై మోదీకి ఓట్లు పెంచేవి. మొత్తానికి అధినేతలిరువురూ ప్రతిదీ ఉపయోగించుకున్నారు.

నిజానికి, ఈ ఏటి జీ–20 సదస్సుకు మనం 9 దేశాలను అతిథులుగా ఆహ్వానించగా, అందులో ఈజిప్ట్ ఒకటి. కానీ, మేలో శ్రీనగర్‌లో జరిగిన పర్యాటక అధికారుల సమావేశానికి కైరో దూరంగా ఉంది. ఫలితంగా పొరపొచ్చాలుంటే, అవన్నీ తాజా బంధాల పునరుద్ధరణతో సమసిపోతాయి. రక్షణ, ఆర్థిక సహకారం, విద్యా – వైజ్ఞానిక ఆదాన ప్రదానాలు, సాంస్కృతిక సంబంధాలనే నాలుగు స్తంభాలపై నిర్మించాల్సిన భాగస్వామ్యమిది. ఈజిప్టులోని భారతీయుల సంఖ్య 5 వేల లోపే కావచ్చు. అయితేనేం, మన హిందీ సినిమాలంటే కళ్ళింత చేసుకొని చూసే ఈజిప్ట్ వాసులు, వారి ఈజిప్షియన్ సంగీతాన్ని స్వరాల్లో జొప్పించే భారతీయ సంగీత దర్శకుల బంధం అవిస్మరణీయం.

ఈజిప్టుకు ఆరో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి భారత్. కరోనా, ఉక్రెయిన్‌లో యుద్ధంతో ఆర్థిక వ్యవస్థ తలకిందులై, వసతుల పెంపులో కైరో నిదానించింది. ఇప్పుడిది మనకు సదవకాశం. సూయజ్ కాలువ ఆర్థిక మండలిని ఆసరాగా చేసుకుంటే ఆఫ్రికా, పశ్చిమాసియా, ఐరోపా విపణులకు చేరాలన్న భారత ప్రయత్నాలూ నెరవేరతాయి. చమురు, సహజవాయువు, రసాయన ఎరువుల్ని కైరో నుంచి దిగుమతి చేసుకుంటున్న మనం, గత జూన్‌లో తీవ్రకొరతలో పడ్డ ఆ దేశానికి గోధుమలు పంపినట్టే ఇకపైనా అవసరంలో అండగా నిలవాలి. భౌగోళిక రాజకీయాల్లో ‘దక్షిణ ప్రపంచ’ దేశాలవాణిగా మారాలన్న మన ఆకాంక్ష నెరవేరాలంటే, ప్రస్తుతం చైనా ఆర్థిక ప్రభావంలో ఉన్న ఈజిప్టును కలుపుకొని నడవడమే తెలివైన పని. తాజా పర్యటన అందుకు ఉత్ప్రేరకం.

రాజకీయ గాలివాటం మారనుందా?

విశ్లేషణ



రాహుల్ వర్మ

ఇటీవల దేశంలోని పదిహేను ప్రతిపక్ష పార్టీలు పట్నాలో సమావేశమై, రానున్న ఎన్నికల్లో అధికార బీజేపీని అడ్డుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టాయి. సార్వత్రిక ఎన్నికలకు ఏడాది కంటే తక్కువ సమయం ఉన్న నేపథ్యంలో థర్డ్ ఫ్రంట్ లేదా కాంగ్రెసేతర పక్షాలతో ప్రాంతీయ పార్టీల కూటమి ఏర్పడే అవకాశాలు దాదాపుగా లేవు. ‘సహజ నేత’ విషయంలో పట్టుబట్టబోమని ఇప్పటికే కాంగ్రెస్ సూచనప్రాయంగా స్పష్టం చేసింది. అయితే అధికార పక్షాన్ని ఎదుర్కొనేందుకు నమ్మదగ్గ సైద్ధాంతిక ఆలోచన మాత్రం ప్రతిపక్షాల వద్ద కరవైంది. పరిపాలన విషయంలోనూ ప్రత్యామ్నాయాన్ని చూపించాల్సి ఉంటుంది. బలమైన ప్రత్యర్థిగా ఎదగాలంటే భాగస్వామ్య పక్షాలన్నీ తమ బలాలు, బలహీనతలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

బిహార్ రాజధాని పట్నా వేదికగా జరిగిన పదిహేను ప్రతిపక్ష పార్టీల సమావేశానికి వర్తమాన రాజకీయ పరిస్థితుల్లో ప్రాముఖ్యత ఏర్పడింది. ఆమ్ ఆద్మీ పార్టీ వ్యక్తం చేసిన భిన్నాభిప్రాయాన్ని పక్కనపెడితే, ప్రతిపక్షాల సమావేశం సరైన దిశలోనే సాగిందని చెప్పాలి. అలాగే ఈ సమావేశంతో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీల మధ్య వచ్చే ఎన్నికల్లో రాజకీయ అవగాహన, పొత్తు ఉండే అవకాశాలూ సన్నగిల్లాయి. అయితే పట్నా మీటింగ్‌తో మూడు విషయాలైతే స్పష్టమయ్యాయి. మొదటిది... సార్వత్రిక ఎన్నికలకు ఏడాది కంటే తక్కువ సమయం ఉన్న నేపథ్యంలో థర్డ్ ఫ్రంట్ లేదా కాంగ్రెసేతర పక్షాలతో ప్రాంతీయ పార్టీల కూటమి ఏర్పడే అవకాశాలు దాదాపుగా లేవు. ప్రతిపక్ష కూటమి ఏదైనా ఏర్పడాలంటే కాంగ్రెస్ పార్టీ కేంద్రంగానే జరగాలి. అప్పుడే భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని కూటమితో ధీటైన పోటీ సాధ్యం. రానున్న కొన్ని నెలల్లో రాజకీయ శక్తుల పునరేకీకరణ జరగనుంది.

రెండోది... పట్నా సమావేశానికి హాజరు కాని పార్టీలు ఒక దగ్గర చేరే అవకాశాలు లేకపోవడం. తెలుగుదేశం, అకాలీదళ్, ఆలిండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం వంటివి బీజేపీ వైపు మొగ్గుతూంటే... వైఎస్ఆర్ కాంగ్రెస్, బిజూ జనతాదళ్ ఏ కూటమిలోనూ చేరే అవకాశాలు లేవు. భారత రాష్ట్ర సమితి కూడా ఈ ఏడాది చివరిలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యేంతవరకూ తాము ఏ పక్షమన్నది స్పష్టం చేయకపోవచ్చు. ప్రతిపక్ష కూటమి తమ భాగస్వాముల విషయంలో కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. దీనికి బహుజన్ సమాజ్ మంచి ఉదాహరణ. ప్రతిపక్ష కూటమిలో చేరతామంటూనే గతంలో ఈ పార్టీ పార్లమెంటులో బీజేపీకి మద్దతిచ్చిన విషయం ప్రస్తావనార్హం.మధ్యప్రదేశ్, రాజస్థాన్ లలో బీఎస్పీ మద్దతును కాంగ్రెస్ ఆశిస్తోంది. ఈ రెండు రాష్ట్రాల్లోనూ 2018లో బీఎస్పీ చెప్పుకోదగ్గ స్థాయిలో సీట్లు గెలుపొందింది. ఆమ్ ఆద్మీ పార్టీ సంగతి ఏమిటన్నది కూడా ప్రతిపక్ష కూటమి నిర్ణయించుకోవాలి.

ముచ్చటగా మూడో అంశం... భాగస్వాముల విషయంలో కాంగ్రెస్ గతం కంటే ఎక్కువగా కొంత పట్టువిడుపుల ధోరణితో వ్యవహరిస్తుందనేందుకు కొన్ని తార్కాణాలు కనిపిస్తున్నాయి. ‘సహజ నేత’ విషయంలో పట్టుబట్టబోమని ఇప్పటికే కాంగ్రెస్ సూచనప్రాయంగా స్పష్టం చేసింది. ప్రాంతీయ పార్టీలు ఆయా రాష్ట్రాల్లో ఒత్తిడికి గురి చేసి లోకసభ స్థానాలు తక్కువగా కేటాయించినా ఆ పార్టీ ఇదే విషయానికి కట్టుబడి ఉంటుందా అన్నది చూడాలి.

బీజేపీని ఎదుర్కొనే విషయంలో ఇంకా ఏమేం చేయాలన్న విషయంపై చర్చించేందుకు ప్రతిపక్ష పార్టీలు జూలై నెలలో సిమ్లాలో మరోసారి సమావేశం కానున్నాయి. బహుశా ఈ కూటమి తమ బలాలు, బలహీనతలు, అవకాశాలు, భయాల విశ్లేషణ (స్వాట్



అనాలసిస్) చేసుకుంటుందేమో!

బలాలు: కూటమి ఒక రూపం సంతరించుకుంటే మహారాష్ట్ర, బిహార్, జార్ఖండ్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లలోని సామాజిక సమీకరణలు కచ్చితంగా బీజేపీని దెబ్బతీయగల సామర్థ్యం కలిగి ఉంటాయి. ఎంతమేరకన్నది ప్రస్తుతానికి అస్పష్టం. 2019లో ఉత్తర ప్రదేశ్‌లో జరిగినట్లుగానే చాలా స్వల్పమైన మార్పే ఉండవచ్చు. మూడేళ్ల క్రితం అక్కడ సమాజ్‌వాదీ పార్టీ, బీఎస్పీలు రెండూ జట్టు కట్టినా అట్టడుగు స్థాయిలోని వైరుధ్యం తగిన లాభాలు ఇవ్వలేకపోయింది. బీజేపీ వేసిన సామాజిక సమీకరణలు, ప్రధాని నరేంద్ర మోదీ పలుకుబడి ముందు నిలవలేకపోయాయి. ఒక్కటైతే వాస్తవం. ప్రతిపక్షాలు విడివిడిగా కంటే ఉమ్మడిగా పోటీచేస్తేనే బీజేపీకి ధీటైన సవాలు విసరగలవు.

బలహీనతలు: ‘మోదీ హటావో’ వంటి ఊకదంపుడు పిలుపులతో ప్రయోజనం ఉండదు. అధికార పక్షాన్ని ఎదుర్కొనేందుకు నమ్మదగ్గ సైద్ధాంతిక ఆలోచన ప్రతిపక్షాల వద్ద కరవైంది. పరిపాలన విషయంలోనూ ప్రత్యామ్నాయాన్ని చూపించాల్సి ఉంటుంది. ప్రజాస్వామ్య విలువల పతనం, క్రోనీ కేపిటలిజమ్ అంటూ ఎంత గోలపెట్టినా వచ్చే లాభం అంతంతే. ఇదే సమయంలో దేశవ్యాప్తంగా మోదీ మాదిరిగా అందరినీ మెప్పించగల నాయకుడు కూడా ప్రతిపక్ష కూటమిలో కనిపించరు. ఇది ఒకరకమైన విచిత్రమైన పరిస్థితి కల్పిస్తుంది. కూటమి తరఫున ఒక నేతను ప్రతిపాదిస్తే, అధ్యక్ష తరహా ఎన్నికల రూపు సంతరించుకుంటుంది. గతంలో ఇది బీజేపీకి లాభం చేకూర్చింది. పేరు చెప్పకుండానే ఎన్నికలకు వెళితే బీజేపీ కాస్తా ప్రతిపక్ష కూటమి అవకాశవాద రాజకీయాలు చేస్తోందని ఆరోపించవచ్చు. వచ్చే ఎన్నికలు వారసత్వ రాజకీయాలకూ, ఈ దేశపు మట్టి మనిషికీ మధ్య జరిగేవని ప్రధాని మోదీ ఇప్పటికే ప్రతిపక్ష కూటమి ఏర్పాటును తక్కువ చేసే ప్రయత్నం చేశారు. మోదీ ఇంకో వ్యాఖ్య కూడా చేశారు. వచ్చే ఎన్నికలు కష్టపడి రోజంతా పనిచేసే రాజకీయ నేతకూ, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికీ మధ్య జరిగేవన్నారు.

అవకాశాలు: గత పన్నెండు నెలల్లో జరిగిన అనేక ఒపీనియన్ పోల్స్, సర్వేలు దేశంలో ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైందన్న విషయాన్ని స్పష్టం చేశాయి. చాలామంది భారతీయులు ఆర్థిక వ్యవస్థపై ఆందోళన వ్యక్తం చేశారు. 2019, 2014లలో బీజేపీ వెంట నిలిచిన యువ ఓటర్లు ఇప్పుడు అంత ప్రేమగా ఏమీ లేరు. 2022లో జరిగిన ‘ది ఆక్సిస్–మై ఇండియా’ ఎగ్జిట్ పోల్‌లో 18 – 25 ఏళ్ల వారు వేసిన ఓట్లలో బీజేపీ, ఎస్పీల మధ్య అంతరం ఒక్క శాతమే. 25 ఏళ్ల పైబడ్డ వారిలో రెండు పార్టీల మధ్య అంతరం ఎక్కువ. ఈ ఏడాది ‘ఇండియా టుడే, సీ ఓటర్’ నిర్వహించిన మూడ్ ఆఫ్ ద నేషన్ సర్వేలోనూ చాలామంది ఉద్యోగాల విషయంలో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అసంతృప్తి 18–34 మధ్య వయస్కుల్లో ఎక్కువగా ఉండటం గమనార్హం. చాలా రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాల పనితీరు అంత గొప్పగా ఏమీ లేదు. 2014 నుంచి ఇప్పటి వరకూ 57సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే బీజేపీ 29 ఎన్నికల్లో ఓటమి పాలైంది. ఇటీవలి కర్ణాటక ఎన్నికలు మారుతున్న పరిస్థితులకు ప్రబల తార్కాణం. వీటి వల్లనే ప్రతిపక్షాలు రానున్న ఎన్నికలను వీలైనంత వరకూ స్థానికాంశాలపై జరిగేలా చూడాల్సి ఉంటుంది.

ముప్పు: 2024 లోక్‌సభ ఎన్నికలు ప్రాంతీయ స్థాయిలో కాకుండా, జాతీయ స్థాయి అంశాలపై జరిగితే బీజేపీకి కొంత మెరుగైన అవకాశాలు ఏర్పడతాయి. మత, జాతీయవాద రాజకీయాలతో బీజేపీ జనాలను తనవైపు తిప్పుకోగలగడం దీనికి కారణం. 2019లో ముఖాముఖి పోరులో కాంగ్రెస్ నుంచి తొంభై శాతం సీట్లను బీజేపీ లాక్కోగలిగింది. యూపీలో బీజేపీ మును పటి స్థాయిలో సీట్లు సాధించగలిగితే, మిగిలిన చోట్ల ఫలితాలు ఎలా ఉన్నా కేంద్రంలో మెజారిటీకి కూతవేటు దూరంలోకి వచ్చేస్తుంది.

పట్నాలో జరిగిన ప్రతిపక్ష పార్టీల సమావేశం 2024 ఎన్నికల హంగామాకు శ్రీకారం చుట్టింది. సిమ్లా సమావేశం నాటికి కూటమి... ప్రజలకు ఏ రకమైన సందేశం ఇవ్వాలి అన్న విషయంతో పాటు దాన్ని నియోజకవర్గాల వారీగా చేరవేసేది ఎవరు? ప్రణాళికలు, వ్యవస్థాగతమైన యంత్రాంగం వంటి వాటిని నిర్ధారించుకోవాలి. లోక్‌సభ ఎన్నికల సినిమా అనేది ఇప్పుడు రాష్ట్రాల్లో మాత్రమే నడవడం లేదని ప్రతిపక్ష కూటమి గుర్తించాలి. జాతీయ రాజకీయాల్లో మారుతున్న పరిస్థితులను కూడా ప్రతిపక్ష కూటమి గుర్తించి మరీ తాము చెప్పదలచుకున్న విషయాలను చెప్పాల్సి ఉంటుంది. లేదంటే ప్రతిపక్ష పార్టీల సమావేశాలు మంచి ఫొటోలు తీసుకునేందుకు మాత్రమే ఉపయోగపడతాయి.

వ్యాసకర్త ఫెలో, సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్, న్యూఢిల్లీ
(‘ది హిందుస్తాన్ టైమ్స్’ సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

ఇదేం తర్కం?



కొట్లాటలు జరుగుతున్నప్పుడు సంగీతం సరిహద్దులు దాట కూడదు కాబట్టి గాయకులు అలీ సేథీ, శాయె గిల్ భారత్‌లో ప్రదర్శన ఇవ్వకూడదు; వారిని పూర్తిగా సర్వ నాశనం చేయొచ్చు; కానీ పాకిస్తానీ పాటల హక్కులు కొని వాటిని ఇక్కడి సినిమాల్లో వ్యాపారం కోసం వాడటం మాత్రం పూర్తిగా సబబు.

– రజత్ దత్తా, కామెంటేటర్

ఎంతలో?



మరణం విచిత్రమైనది. నాన్నతో హాస్పిటల్‌లో ఉన్నాను. అదే వార్డులో ఒకాయన్ని పొద్దున చూశాను. చూడ్డానికి బాగా కనబడ్డారు. నావైపు చూసి నవ్వారు. కానీ సాయంత్రానికల్లా వెళ్లిపోయారు. వాళ్ల కుటుంబం కుప్పకూలిపోయింది.

– సేవియో రోడ్రిగ్స్, సంపాదకుడు

అది చాలా?



ఒక ప్రభుత్వాధినేత పనితీరును అంచనా గట్టడానికి వారి సెకండ్ లాంగ్వేజీ (భారతీయులు, బంగ్లా దేశీయులకు ఆంగ్లం లాగా) దక్షత ఒక ప్రమాణం కాబోదు. నేను ఇంగ్లిష్‌లో బాగా రాస్తాను, మాట్లాడుతాను. కానీ అది నన్ను ప్రధాని అభ్యర్థిని చేస్తుందని అనుకోలేను.

– షా అలీ ఫర్హాద్,
బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు అడ్వకేట్

ఎత్తు?



షీ జిన్‌పింగ్‌ను చికాకు పెట్టడానికి మోదీని బైడెన్ జూన్‌లో వాషింగ్టన్ డి.సి.కి ఆహ్వానించారు. బైడెన్‌ను చికాకు పెట్టడానికి నెతన్యాహూను జూలైలో బీజింగ్‌కు ఆహ్వానిస్తున్నారు షీ జిన్‌పింగ్.

– అశోక్ స్వైన్, ప్రొఫెసర్

ఎఫెక్ట్



ప్రొడక్టివిటీ పెరగడానికి రోజూ గంటసేపు ధ్యానం చేయడంలో నా భయం ఏమిటంటే, ఇదేదీ ప్రాధాన్యం కలిగినది కాదన్న జ్ఞానోదయం కలిగి నేను మొత్తంగానే ప్రొడక్టివిటీకి దూరం అవుతానేమోనని!


– దేవయ్య బోపన్న, కంటెంట్ క్రియేటర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

దేశాన్ని గట్టెక్కించిన పాలనాదక్షుడు

భారత దేశ చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానం కలిగిన మేధావీ, పరిపాలనాదక్షుడూ పాములపర్తి వెంకట నరసింహారావు. ఎవరి జీవితం, ఎట్లా మలుపు తిరుగుతుందో ఎవరికీ తెలియదు. తమిళనాడు శ్రీపెరుంబుదూర్‌లో ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న రాజీవ్ గాంధీని 1991 మే 21న ఎల్‌టీటీఈ ఆత్మాహుతి దాడితో హత్య చేసింది. అత్యధిక మెజా రిటీతో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారు. భారత పదవ ప్రధానమంత్రిగా బాధ్యత చేపట్టారు పీవీ.

ఆ సమయంలో భారతదేశం అంతర్జాతీయ చెల్లింపులపై డిఫాల్ట్ అయ్యి రెండు వారాలు కావస్తోంది. విదేశీ మారక నిల్వలు కేవలం రెండు వారాల దిగుమతులకు మాత్రమే సరిపోయేంతగా ఉన్నాయి. అంతకు నెలరోజుల క్రితం మొత్తం 55 టన్నుల బంగారాన్ని రిజర్వ్ బ్యాంక్ తనఖా పెట్టింది. పెద్ద మొత్తంలో చెల్లింపులు తగ్గుముఖం పట్టాయి. భారతదేశానికి రుణం ఇవ్వడానికి ఎవరూ సిద్ధంగా లేరు.



పీవీ నరసింహారావు

ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్‌ను ఆర్థిక మంత్రిగా నియమించారు పీవీ. దేశ ఆర్థిక వ్యవస్థ గాడిలో పడడానికి ఎటువంటి నిర్ణయం తీసుకోవడానికైనా ఆయనకు స్వేచ్ఛ నిచ్చారు. అప్పటివరకూ ఉన్న కఠిన నిబంధనలను సడలించి సరళీకరణకు ద్వారాలు తెరచింది పీవీ ప్రభుత్వం. దాని ఫలితాలనే ఇప్పుడు మనమంతా అనుభవిస్తున్నాం. అంతర్జాతీయ సమాజంలో భారత్ పట్ల సన్నగిల్లిన విశ్వాసాన్ని తిరిగి పాదుకొల్పారు పీవీ. ఫలితంగా అంతర్జాతీయ ద్రవ్య సంస్థల సహాయం మళ్లీ ప్రారంభమయ్యింది. అలా దేశాన్ని తిరిగి అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చారు.

ప్రస్తుత తెలంగాణలోని హనుమకొండ జిల్లాలోని ‘వంగర’ గ్రామంలో 1921లో పీవీ జన్మించారు. అంచెలంచెలుగా రాష్ట్ర, కేంద్ర రాజకీయాల్లో ఎదిగారు. ఆయన ప్రధానమంత్రిగా ఉన్నప్పుడే బాబ్రీ మసీద్ కూల్చివేత జరిగింది. ఆ సమయంలో ఆయన తీవ్ర మైన విమర్శలను ఎదుర్కొన్నారు. దక్షిణ భారత్‌కు చెందిన పీవీకి వ్యతిరేకంగా ఆయన సొంత పార్టీ ప్రముఖులే పనిచేసి ఆయనను పదవి నుంచి లాగి వేయడానికి ప్రయత్నించారు. కానీ ఇటు ప్రతి పక్షాలు, అటు అసంతృప్తులైన సొంత పార్టీ వారి ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ ఆయన విజయవంతంగా తన ఐదేళ్ల పదవీకాలాన్ని దిగ్విజయంగా ముగించారు. ఆయన మరణించి 18 ఏళ్లు గడిచాయి. ఈ తరుణంలో దేశానికి పీవీ చేసిన సేవను అన్ని వర్గాలూ మరచిపోవడం బాధాకరం. ఆయన శత జయంతి సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు శత జయంతి ఉత్సవాలను ఏడాది పాటు ఘనంగా నిర్వహించి ఆయన కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింప చేశారు.

ఇంతటి మహా మేధావినీ, పరిపాలనా దక్షుణ్ణీ నేను నా జీవితంలో ఆరుసార్లు అతి దగ్గర నుండి చూశాను. ఆయనతో కొంత సమయం గడిపాను. నా జీవితంలో మరపు రాని సందర్భాలివి. 1977లో పెద్దపల్లి జిల్లా మా కొలనూరు పక్క ఊరైన ‘పెగడపల్లి’లో మా చుట్టాల ఇంటిలో పెళ్లి సందర్భంగా ఆయనతో కలిసి బంతి భోజనం చేశాను. మరొకసారి ఒక దినపత్రిక విలేక రిగా పెద్దపల్లి విశ్రాంత భవనంలో ఆయన పక్క కూర్చుని ముచ్చటించడం అరుదైన ఘటన.

– దండంరాజు రాంచందర్ రావు, రిటైర్డ్ డిప్యూటీ సూపరింటెండెంట్, సింగరేణి భవన్, హైదరాబాద్
(నేడు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి)

విద్యారంగానికి ఇది నవ శకం!

సందర్భం



వి.వి. రమణ

విద్య ప్రధాన ఉద్దేశం ‘శీల నిర్మాణమే’ అన్నారు గాంధీజీ. భారత దేశానికి ‘వ్యక్తులను నిర్మించే విద్య’ కావాలన్నారు స్వామి వివేకానంద. అందుకేనేమో ఈ గడిచిన నాలుగేళ్లలో వైఎస్ జగన్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో ‘విద్య’పై తన దృష్టి సారించింది. విద్యార్థులనూ, వారి తల్లిదండ్రులనూ ఆర్థికంగా ఆదుకోవడం; నాడు నేడు వంటి పథకాల ద్వారా మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపట్టడం, విద్యా విధానంలో సమూల సంస్కరణలు తేవడం వంటి చర్యల ద్వారా ఏపీ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తోంది.

‘అమ్మ ఒడి’, ‘జగనన్న విద్యా కానుక’, ‘జగనన్న గోరుముద్ద’, ‘వైఎస్సార్ సంపూర్ణ పోషణ’, ‘స్వేచ్ఛ’ (సానిటరీ నాప్కిన్స్), ‘జగనన్న విద్యా దీవెన’, ‘జగనన్న విద్యా వసతి దీవెన’, ‘జగనన్న విదేశీ దీవెన’, ‘జగనన్న ఆణిముత్యాలు’ వంటి పథకాల ద్వారా విద్యార్థుల తల్లులను, విద్యార్థులను ఆర్థికంగా, వస్తుపరంగా ప్రభుత్వం ఆదుకుంటోంది.

ఏపీ ప్రభుత్వం చేపట్టిన అత్యున్నత పథకం ‘నాడు–నేడు’. దీని ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించి పాఠశాల విద్యా వ్యవస్థ రూపురేఖలను మార్చివేసింది. కనీస వసతులు లేని స్థితి నుండి అన్ని సకల వసతులు ఉన్న పరిస్థితికి ఈరోజు ప్రభుత్వ పాఠశాలలు చేరుకున్నాయి. ‘నాడు–నేడు’ కార్యక్రమంలో భాగంగా అనేక సదుపాయాలు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అందుబాటులోకి వచ్చాయి. నీటి వసతితో కూడిన టాయిలెట్స్, తాగునీటి సదుపాయం, మరమ్మతులు, విద్యుత్ సదుపాయం, బెంచీలు, కుర్చీలు, బీరువాలు, టేబుళ్లు, గ్రీన్ చాట్ బోర్డులు, పెయింటింగ్, ఇంగ్లిష్ ల్యాబ్, కాంపౌండ్ వాల్, కిచెన్ షెడ్, అదనపు తరగతి గదులు, డిజిటల్ క్లాస్ రూమ్, ఉభయ భాషల్లో పాఠ్యపుస్తకాలు... వంటి



సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. అందుకనే మన రాష్ట్రంలో డ్రాప్ ఔట్లు 2 శాతం కంటే తక్కువే అని ‘నీతి ఆయోగ్’ తన నివేదికలో పేర్కొంది. ఈ విద్యాసంవత్సరానికి వంద శాతం విద్యార్థులు పాఠశాలలో ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖకు దిశా నిర్దేశం చేసింది.

‘ప్రపంచాన్ని మార్చడానికి మీరు ఉపయోగించగల అత్యంత శక్తిమంతమైన ఆయుధం విద్య’ అని నెల్సన్ మండేలా అన్నారు. అందుకనే నేడు పోటీ ప్రపంచంలో గ్లోబలైజేషన్ కారణంగా ఇంగ్లిష్ ప్రాముఖ్యం పెరుగుతున్న ఈ తరుణంలో మారుమూల పాఠశాలల్లో సైతం ఇంగ్లిష్ మీడియం తీసుకొచ్చింది రాష్ట్ర ప్రభుత్వం. అంతేకాకుండా విద్యార్థులకు, టీచర్లకు అర్థం అయ్యేట్లుగా టెక్స్ట్‌బుక్‌లో ఒకపక్క ఇంగ్లీషు, మరోపక్క తెలుగులో పాఠాలు ముద్రించి అందుబాటులో పెట్టింది.

అలానే సీబీఎస్ఈ సిలబస్‌ను సైతం విద్యార్థులకు అందుబాటులో తీసుకొచ్చింది ప్రభుత్వం. వాటి ద్వారా జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ప్రిపేర్ చేసే సామర్థ్యం మెరుగు పరుస్తున్నారు మన ఉపాధ్యాయులు. ప్రాథమిక స్థాయి నుండి స్పోకెన్ ఇంగ్లిష్‌లో తర్ఫీదు ఇచ్చి అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశా లకు వెళ్లేందుకు విద్యార్థులను సంసిద్ధులను చేసేందుకు టోఫెల్ విధానం రాబోతోంది. హైస్కూల్లో చదువుతున్న వారికి ఆన్‌లైన్ ద్వారా కూడా తరగతులు నిర్వహించాలనే ఉద్దేశంతో 8వ తరగతి విద్యార్థులకూ వారికి బోధించే ఉపాధ్యాయులకూ బైజూస్ కంటెంట్‌తో కూడిన ఉచిత ట్యాబ్‌లను ప్రభుత్వం అందించింది.

ఈ నాలుగేళ్లలో శాటిలైట్ ఫౌండేషన్, ఫౌండేషన్, ఫౌండేషన్ ప్లస్, ప్రీ హైస్కూల్, హై స్కూల్, హై స్కూల్ ప్లస్ అనే అంశాలతో కూడిన నూతన విధానం అమలులోకి వచ్చింది. 3, 4, 5 తరగతులను సమీప హైస్కూల్లో విలీనం చేసి వారికి సబ్జెక్ట్ టీచర్లతో బోధన అందిస్తున్నారు. ఇది మంచి ఫలితాలు సాధించడానికి సోపానం లాంటిది. మొత్తంగా ఇది ప్రభుత్వ పాఠశాల విద్యకు నవశకం!

వ్యాసకర్త ప్రభుత్వ ఉపాధ్యాయులు
(నేడు ఏపీ ప్రభుత్వం నాలుగో ఏడాది ‘అమ్మ ఒడి’ నిధుల విడుదల సందర్భంగా)

అనిత్యత్వపు ఎరుక

త్రిపిటకాల్లో మూడవదీ, అర్థం చేసుకోవడానికి అతి కష్టమైనదీ అభిధమ్మ పిటకం. ఇందులో బుద్ధుడు ఉపదేశించిన ప్రవచనాలు అన్నింటినీ ఒక నిర్దిష్ట పద్ధతి ప్రకారం పేర్చి, పట్టిక రూపంలో పొందుపర్చి విషయపరంగా వర్గీకరించారు. అభిధమ్మమంటే ఉన్నతమైన ధర్మం. ఇది బుద్ధుని బోధనల సారాంశం. సమస్త విషయాలను విశ్లేషణాత్మకంగా విమర్శించి వాటి విశిష్టతలను నిరూపించటంలో ఈ పిటకం చాలా ప్రత్యేకతను కలిగివుంది.

బుద్ధుడి ఉపదేశాల అన్నింటి లక్ష్యం మానవుడిని దుఃఖ విముక్తుణ్ణి చేయటం, నిర్వాణ స్థితికి జేర్చటం. సుత్త పిటకంలో బుద్ధుడు శ్రోతల మేధోస్థాయికి తగ్గట్టుగా ఉపదేశించాడు. నీవు, నేను, పురుషుడు, స్త్రీ, ఆవు, చెట్టు – ఇట్లాంటి వ్యావహారిక పదాల్ని ఉపయోగించాడు. అభిదమ్మ పిటకంలో బుద్ధుడు అలాంటి మాటల్ని కాకుండా, పారమార్థిక సత్యం వెలుగులో వాటి మూలక పదార్థాలు అన్నింటినీ విశ్లేషించి, అవి ఎలా అనిత్యమో, దుఃఖ కారకమో నిరూపిస్తాడు.



జ్యోతిర్మయం

ఈ పిటకంలో ఏడు గ్రంథాలు ఉన్నాయి. అవి 1. ధర్మసంగణి: భిక్షువుల కొరకు రూపొందించిన నీతి సూత్రాలు. 2. విభంగ: విభజన, వర్గీకరణ. ఇది ధర్మసంగణికి అనుబంధ రచన. 3. ధాతుకథా: పారమార్థిక సత్యాల గురించిన చర్చ. 4. పగ్గలపుణ్ణత్తి: నిర్వాణ స్థితికి చేరుకొనే మార్గంలో సాధకుని లక్షణాల వర్గీకరణ. 5. కథావత్తు: అశోకుని కాలంలో క్రీ. పూ. 3వ శతాబ్దంలో జరిగిన మూడవ బౌద్ధ సంగీతి (సభ)కి అధ్యక్షత వహించిన మొగ్గలిపుత్త తిస్స రచన. బుద్ధ ధర్మం గురించి తలెత్తిన వివాదాల చర్చ ఇందులో ప్రధానాంశం. 6. యమక: మానసిక దృగ్విషయాల చర్చ. 7. పఠాన: మానసిక, భౌతిక విషయాల మధ్య సంబంధం గురించిన చర్చ.

అభిదమ్మ పిటకం గురించి సంగ్రహంగా ఇలా చెప్పొచ్చు. ఈ పిటకం, మానసిక లక్షణాలు, పదార్థ లక్షణాలు, దృగ్విషయాల మధ్య సంబంధాలు, ధ్యాన వ్యాయామాల గురించి వివరిస్తుంది. అన్ని విషయాల అనిత్యత్వాన్ని మానవుడు గ్రహించి, జ్ఞానోదయం పొంది, విముక్తిని సిద్ధింపజేసుకోవటం దీని లక్ష్యం.

అభిదమ్మ పిటకం ఆధారంగా అనురుద్ధాచార్యులు 11–12 శతాబ్దాల్లో పాళీ భాషలో సంగ్రహంగా ‘అభిదమ్మత్థ సంగహో’ రచించారు. దీని తెలుగు అనువాదం ‘అభిధర్మ అర్థసంగ్రహము’ అనే పేరుతో లభిస్తోంది.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** శు.దశమి రా.10.45 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** చిత్త ప.12.23 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** సా.6.11 నుండి 7.48 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.35 నుండి 12.27 వరకు, **అమృతఘడియలు:** తె.4.06 నుండి 5.43 వరకు (తెల్లవారితే గురువారం); **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.31, **సూర్యాస్తమయం:** 6.34.

క్లుప్తంగా...

'శేషాచలం'లో పెద్దపులి సంచారం లేదు

- పీసీసీఎఫ్ మధుసూదన్‌రెడ్డి



తిరుమల: శేషాచలం కొండల్లో ప్రస్తుతం పెద్దపులి సంచారం లేదని, తిరుమల నడక మార్గంలో చిరుత కనిపిస్తే ట్రాప్ చేసి ఇతర ప్రాంతంలో వదిలిపెడతామని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) మధుసూదన్‌రెడ్డి చెప్పారు. ఆయన మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ తిరుమల నడకమార్గంలో భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో ఉన్న పెద్ద పులుల కోసం బద్వేల్ మీదుగా శేషాచలం కొండలకు కారిడార్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. చిరుతల గణన చేపట్టామని, ప్రస్తుతం వాటి సంఖ్య నిర్దిష్టంగా చెప్పలేమన్నారు. భక్తులు ఆహార పదార్థాలను అటవీప్రాంతంలో వేయకుండా ఉంటే చిరుతల సంచారాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు.

'ఇన్ఫ్లూఫయెన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో తెనాలి సాదిక్‌కు స్థానం



రికార్డు ధ్రువీకరణను స్వీకరిస్తున్న షేక్ సాదిక్

తెనాలి: ప్రతిష్టాత్మక ఇన్ఫ్లూఫయెన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో తెనాలికి చెందిన 'యంగ్ జనరేషన్ వెల్ఫేర్ సొసైటీ' వ్యవస్థాపకుడు షేక్ సాదిక్‌కు స్థానం లభించింది. విద్య, వైద్యం, వృద్ధులు, అనాథలు, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి కోసం మూడేళ్లలో 750 కార్యక్రమాల నిర్వహణతో ఈ గుర్తింపు లభించింది. రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో ఆదివారం రాత్రి జరిగిన ప్రత్యేక సభలో ఇన్ఫ్లూఫయెన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ చీఫ్ ఎడిటర్లు జయిూష్ భట్, మహిమా జైన్ చేతులమీదుగా రికార్డు ధ్రువీకరణ పత్రం, జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని సాదిక్‌కు బహూకరించారు. భారతదేశంలో వివిధ రంగాల్లో విశిష్ట ప్రతిభ ప్రదర్శించిన వందమంది వ్యక్తులతోపాటు తనకు కూడా స్థానం కల్పించటం సంతోషకరమని మంగళవారం స్థానిక విలేకరులతో అన్నారు. తన సేవలకు లభించిన గుర్తింపుతో బాధ్యత మరింత పెరిగిందనీ, దాతల సహకారంతో సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని వివరించారు.

కాళంగి బ్రిడ్జిపై ఆగిన హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్

- చైన్‌లాగిన గుర్తుతెలియని వ్యక్తులు
- 22 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరిన రైలు

సూళ్లూరుపేట: హైదరాబాద్ నుంచి చెన్నైకి వెళుతున్న హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ రైలులోని ఒక బోగీలో గుర్తుతెలియని వ్యక్తులు చైన్ లాగడంతో సూళ్లూరుపేట-అక్కంపేట రైల్వేస్టేషన్‌ల మధ్య గల కాళంగినది బ్రిడ్జిపై ఆగిపోయింది. మంగళవారం ఉదయం 5.50 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. రైలు బ్రిడ్జిపై ఆగిపోవడంతో చైన్ లాగిన బోగీలోకి వెళ్లి బాగుచేసేందుకు సిబ్బందికి సాధ్యం కాలేదు. పక్కనే బ్రిడ్జి పనులు చేస్తున్న ప్రత్యేక వాహనాన్ని తీసుకువచ్చి దాని ద్వారా సిబ్బందిని రైలు బోగీలోకి పంపించారు. సిబ్బంది ఆ బోగీలోని చైన్‌ను రీసెట్ చేయడంతో 22 నిమిషాల తర్వాత రైలు బయలుదేరి వెళ్లింది. రైలు బ్రిడ్జిపై ఆగిపోవడంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. ఈ ఘటనతో చెన్నై వైపు వెళ్లాల్సిన రైళ్లన్నీ కొంత ఆలస్యంగా నడిచాయి.

కేజీహెచ్‌లో సోలార్ పవర్ ప్లాంట్

- రూ.50 లక్షలతో నిర్మించనున్న 'ఆర్సెలార్ మిట్టల్'
- మంత్రి విడదల రజిని సమక్షంలో ఎంవోయూ

మహారాణిపేట (విశాఖ దక్షిణ)/గాజువాక: కింగ్ జార్జి హాస్పిటల్ (కేజీహెచ్)లో రూ.50 లక్షలతో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ ముందుకొచ్చింది. ఈ మేరకు మంగళవారం విశాఖలో జరిగిన ఓ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని సమక్షంలో కేజీహెచ్‌లోని సీఎస్ఆర్ బ్లాక్ రూఫ్ టాప్‌లో సౌర విద్యుత్‌ను ఇన్‌స్టాలేషన్ చేయడానికి ఎంవోయూ జరిగింది. ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ వైజాగ్ అసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.రవీంద్రనాథ్, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ ఎంవోయూపై సంతకాలు చేశారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద వైజాగ్ అసెట్‌కు చెందిన ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ చేపట్టిన ఈ సోలార్ పవర్ ఇన్‌స్టాలేషన్ ద్వారా కేజీహెచ్‌లో విద్యుత్ ఖర్చును తగ్గించడంలో సహాయపడుతుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ గొలగాని హరి వెంకట్ కుమారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఏఎంఎన్ఎస్ ఇండియా లిమిటెడ్ హెడ్, హెచ్ఆర్ అడ్మిన్ డి.ఎస్.వర్మ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి విడదల రజిని సమక్షంలో ఎంవోయూ పత్రాలు మార్చుకుంటున్న ఇరుపక్షాలు

రూ.670 కోట్లతో 1,125 పీహెచ్‌సీల ఆధునికీకరణ

రాష్ట్రంలోని 1,125 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను రూ.670 కోట్లతో ఆధునికీకరించామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. రూ.1.75 కోట్లతో నిర్మించిన కణితి పీహెచ్‌సీ భవనాన్ని ఆమె మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక గ్రామస్థాయి నుంచి టీచింగ్ ఆస్పత్రి వరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వాస్పత్రులను అద్భుతంగా తీర్చిదిద్దామన్నారు. రాష్ట్రంలో రూ.1,692 కోట్లతో 10,032 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను నిర్మిస్తున్నామన్నారు. 121 సీహెచ్‌సీలు, 42 ఏరియా ఆస్పత్రుల ఆధునికీకరణ కోసం జగనన్న ప్రభుత్వం రూ.1,223 కోట్లను కేటాయించిందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 వైద్య కళాశాలల నిర్మాణం కోసం ముఖ్యమంత్రి రూ.8,500 కోట్లను ఖర్చు చేస్తున్నారన్నారు. టీచింగ్ ఆస్పత్రుల ఆధునికీకరణ కోసం రూ.3,820 కోట్లు కేటాయించామని తెలిపారు.

ఆక్రమణలు తొలగించినా సీఎం పైనే నెపం

- రోడ్డుకు ఇరువైపులా వెలసిన దుకాణాలు
- తొలగించాలని కోరిన అధికారులు
- స్వచ్ఛందంగా తొలగించిన వ్యాపారులు
- దీనినీ వక్రీకరిస్తూ ఈనాడులో తప్పుడు రాతలు

సాక్షి, చిత్తూరు: రాష్ట్రంలో ఏ చిన్న ఘటన జరిగినా దాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆపాదించడం ఈనాడు పత్రికకు అలవాటుగా మారింది. రోడ్డుపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని ఆక్రమణదారులకు మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు చెబితే 'సీఎం వస్తున్నారు.. దుకాణాలు తొలగించాల్సిందే' అంటూ ఈనాడులో వార్త ప్రచురించారు. చిత్తూరు - వేలూరు రోడ్డులో విజయా డెయిరీని ఆనుకుని పది దుకాణాలు వెలిసాయి. నగర సుందరీకరణకు అడ్డుగా ఉన్నాయని, రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించాలని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ నిర్ణయించారు. ఇదే విషయాన్ని వ్యాపారులకు చెప్పారు. ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. వ్యాపారులు కూడా ఆ దుకాణాలను స్వచ్ఛందంగా తొలగించారు. దీనిని వక్రీకరిస్తూ ఈనాడులో తప్పుడు కథనాన్ని అచ్చేశారు. సీఎం వైఎస్ జగన్ జిల్లా పర్యటనకు వస్తుండడంతో అధికారులు బలవంతంగా దుకాణాలను తీసేయిస్తున్నారని రాసుకొచ్చారు. రోడ్డుపై ఆక్రమణలు తొలగిస్తే దాన్ని సీఎం పర్యటనకు ఆపాదిస్తూ రాయడం మంచిదికాదని మునిసిపల్ కమిషనర్ అరుణ అన్నారు.



ఆక్రమణల తొలగింపు తర్వాత విశాలంగా మారిన చిత్తూరు-వేలూరు రహదారి

మామిడి మరింత ప్రియం

- అమాంతం పెరిగిన బంగినపల్లి ధర
- టన్ను రూ.40 వేల నుంచి రూ.50 వేలు
- చివరి దశకు సీజన్



ఎగుమతులకు ప్యాకింగ్ చేస్తున్న కూలీలు

ఉలవపాడు: మామిడికాయ మరింత ప్రియమైంది. రెండు రోజులుగా మామిడి కాయల రేట్లు అమాంతం పెరిగాయి. మామిడి సీజన్ చివరి దశకు చేరుకోవడంతో రేట్లు ఆకాశాన్నంటుతున్నాయి. నెల్లూరు జిల్లా ఉలవపాడు పరిసర ప్రాంతాల్లోని తోటల్లో కాయలు తక్కువ కావడంతో ఎక్కువ రేటుకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఏడాది అత్యధికంగా బంగినపల్లి రకం మామిడి టన్ను కాయ నాణ్యతను బట్టి రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు పలికింది. ప్రస్తుతం ఉలవపాడు ప్రాంతం నుంచి హైదరాబాద్, బెంగళూరు, ముంబై, కలకత్తాకు కాయలు ఎగుమతి చేస్తున్నారు.

చివరి దశకు సీజన్..

వేసవిలో అందరికీ నోరూరించే ఉలవపాడు మామిడి సీజన్ చివరి దశకు వచ్చేసింది. మరో పది రోజుల్లో ఈ ప్రాంతంలోని తోటల్లో కాయలు పూర్తిస్థాయిలో అయిపోయే పరిస్థితి వచ్చింది. దీనివలన ఎగుమతుల్లో టన్ను రూ.50 వేలు పలుకగా, స్థానికంగా మార్కెట్‌లో కొనుగోళ్లకు బంగినపల్లి కేజీ రూ.80 నుంచి రూ.100 వరకు అమ్ముతున్నారు. హైవే వెంబడి దుకాణాల్లో సైతం కాయల రేట్లు అధికంగా ఉన్నాయి. రసాలు కూడా కేజీ రూ.80 వరకు అమ్ముతున్నారు. మామిడి అధిక రేటు పలకడంతో తోటల యజమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కాస్ట్ మెయింటెనెన్స్ అవార్డు

ఉక్కునగరం: జాతీయ స్థాయి కాస్ట్ మెయింటెనెన్స్ అవార్డుల్లో విశాఖ స్టీల్ ప్లాంట్ మొదటి స్థానంలో నిలిచింది. నేషనల్ అవార్డ్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ కాస్ట్ మేనేజ్‌మెంట్ (ఐకాయ్) ఏటా సమర్థవంతమైన, వినూత్న వ్యయ నిర్వహణ పద్ధతులను అమలు చేసిన సంస్థలను గుర్తించి గౌరవిస్తుంది. 2003 నుంచి ఇప్పటి వరకు ఏటా ఈ అవార్డులను అందజేస్తోంది. 2022లో తయారీ-పబ్లిక్-మెగా విభాగంలో విశాఖ స్టీల్ ప్లాంట్ మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ నెల 23న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో భారత కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సీఈఆర్‌టీ) డైరెక్టర్ డాక్టర్ సంజయ్ బహ్ల చేతుల మీదుగా స్టీల్ ప్లాంట్ ఫైనాన్స్ సీజీఎం వి.శాంతకుమార్, డీజీఎం డి.చిన్నారావు అవార్డు అందుకున్నారు. మంగళవారం ఉక్కు పరిపాలన భవనంలో జరిగిన కార్యక్రమంలో సీఎండీ అతుల్ భట్ అవార్డు గ్రహీతలను అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు డి.కె.మొహంతి, అరుణ్ బాగ్చీ, ఎస్.సి.పాండే పాల్గొన్నారు.



అవార్డుతో స్టీల్‌ప్లాంట్ సీఎండీ భట్, డైరెక్టర్లు

తాడిపత్రిలో రెచ్చిపోయిన 'పచ్చ మూక'

- వైఎస్సార్‌సీపీ వర్గీయులు, జగనన్న ఇళ్ల లబ్ధిదారులపై దాడి
- ఐదుగురికి తీవ్ర గాయాలు

తాడిపత్రి: అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోతున్నారు. నిత్యం ఏదో ఒకచోట దౌర్జన్యానికి దిగుతున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం తాడిపత్రి మండలం గంగాదేవిపల్లిలో వైఎస్సార్‌సీపీ వర్గీయులతో పాటు జగనన్న ఇళ్ల లబ్ధిదారుల కుటుంబీకులపై కర్రలు, రాళ్లతో దాడులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలు కాగా.. చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆసుపత్రికి చేరుకుని, గాయపడిన వారిని పరామర్శించారు. దాడి ఘటనపై ఆరా తీశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. డీఎస్పీ సీఎం గంగయ్య.. రూరల్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి, సిబ్బందితో కలసి గంగాదేవిపల్లికి వెళ్లి ఘటనపై విచారణ చేపట్టారు. గాయపడిన వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. గ్రామంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేశారు.



గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

ప్రణాళిక ప్రకారమే దాడి!

గ్రామంలో 68 నిరుపేద కుటుంబాలకు ఇంటి స్థలాలు కేటాయించిన ప్రదేశంలో ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు వీలుగా సర్పంచ్ హనుమంతరెడ్డి, సచివాలయ వీఆర్వో, సర్వేయర్, ఇంజినీర్లతో పాటు లబ్ధిదారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం జేసీబీతో కంపచెట్ల తొలగింపు చేపట్టారు. కాగా, గ్రామంలోని టీడీపీకి చెందిన వెన్నపూస ప్రతాప్‌రెడ్డి పేదలకు కేటాయించిన స్థలాన్ని ఆక్రమించి, ఒక షెడ్డు కూడా నిర్మించుకున్నాడు. ఆ షెడ్‌ను రెవెన్యూ సిబ్బంది కూల్చేస్తారేమో అనే అనుమానంతో కొందరు టీడీపీ కార్యకర్తలతో కలసి కర్రలు, రాళ్లతో దాడులకు తెగబడ్డారు. దీంతో భయభ్రాంతులకు గురైన సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పరుగులు తీశారు. దాడిలో వైఎస్సార్‌సీపీకి చెందిన ఆలూరు ప్రతాప్‌రెడ్డి, ఆలూరు నాగరత్నమ్మ, తలారి రత్నమయ్య, ఆలూరు గంగిరెడ్డి, తలారి భాస్కర్ తీవ్రంగా గాయపడ్డారు.

చంద్రబాబు, లోకేశ్‌లను రాజకీయాల నుంచి తరిమికొట్టాలి

- తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి



నెల్లూరు(బృందావనం): టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్‌ను రాజకీయాల నుంచి తరిమికొట్టాలని తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు. ఆమె మంగళవారం నెల్లూరులో విలేకరులతో మాట్లాడుతూ యువగళం పేరుతో లోకేశ్ చేస్తున్న పాదయాత్ర చూస్తుంటే ఒకవైపు అసహ్యం కలుగుతోందని, మరోవైపు నవ్వొస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంక్షేమమే ధ్యేయంగా జనరంజక పాలన సాగిస్తున్నారని ప్రశంసించారు. చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనలో ఏ ఒక్క శాశ్వత అభివృద్ధి పని చేయలేక ప్రజల మదిలో చరిత్రహీనుడిగా నిలిచిపోయారని విమర్శించారు. కుట్రలు, కుయుక్తులతో దుర్మార్గుడైన చంద్రబాబు తన పుత్రుడు లోకేశ్, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్‌తో కలసి సీఎం వైఎస్ జగన్ పాలనపై విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబుకు బానిసగా ఉండకుండా పవన్‌కళ్యాణ్ ఇండిపెండెంట్‌గా రాజకీయాలు చేయాలని లక్ష్మీపార్వతి హితవుపలికారు.

చెన్నైలో బ్రైడల్ మేకప్‌తో వరల్డ్ రికార్డు

- 25 నిమిషాల్లో 493 మంది మేకప్ ఆర్టిస్టులతో బ్రైడల్ మేకప్



వరల్డ్ రికార్డు సర్టిఫికెట్‌తో బ్యూటీషియన్ శ్రీదేవి, రికార్డు ప్రతినిధులు

కొరుక్కుపేట(చెన్నై): చెన్నైలో బ్రైడల్ మేకప్‌తో బ్యూటీషియన్ శ్రీదేవి వరల్డ్ రికార్డు సాధించింది. ప్రపంచ బ్యూటీషియన్స్ డే సందర్భంగా తమ వృత్తిని పురస్కరించుకుని 493 మంది మేకప్ ఆర్టిస్టులతో కేవలం 25 నిమిషాల్లో బ్రైడల్ మేకప్ లుక్‌ను రూపొందించినందుకు శ్రీదేవి కాంటూర్ సంస్థ సీఈఓ, మోస్ట్ సెన్సేషన్ మేకప్ ఆర్టిస్ శ్రీదేవికి ఈ రికార్డు దక్కింది. దీంతో లయన్సైజ్ ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు వరల్డ్ రికార్డు సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. ప్రముఖ మేకప్ ఆర్టిస్ట్, కేఆర్ బ్యూటీ సీఈఓ కణ్ణన్ రాజమాణిక్యం హాజరై శ్రీదేవిని సత్కరించారు. ప్రముఖ దక్షిణ భారత మేకప్ ఆర్టిస్టులు పద్మప్రియ వరదరాజ్, వెట్రివేందన్, విజిల్ ఆమెను అభినందించారు.

భర్తపై ఎలుగుబంటి దాడి.. నరికిచంపిన మహిళా రైతు



సబీనా, హతమైన ఎలుగుబంటి

యశవంతపుర: ఓ రైతు కుటుంబం పొలంలో పనిచేస్తుండగా భర్త, మరిదిపై దాడి చేసిన ఎలుగుబంటిని ఓ మహిళ హతమార్చింది. ఈ ఘటన కర్ణాటకలోని హావేరి జిల్లా శిగ్గాంవి తాలూకా బసవనకట్ట గ్రామంలో ఆదివారం జరగ్గా ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలు.. ఉదయం సబీనా (35), ఆమె భర్త బసీరసాబ్ (45), అతని తమ్ముడు రజాక్ (25) పొలంలో పనిచేసుకుంటున్నారు. ఇంతలో ఒక ఎలుగుబంటి వచ్చి బసీరసాబ్, రజాక్‌పై దాడి చేయసాగింది. కొంచెం దూరంలో పనిచేసుకుంటున్న సబీనా ఈ దృశ్యం చూసి ఒక్కక్షణం నివ్వెరపోయినా.. తరువాత తేరుకుని చేతిలోని కొడవలితో ఎలుగుబంటి మీదకు లంఘించింది. ఆమె కొట్టిన దెబ్బలకు ఎలుగుబంటి వారిద్దరినీ వదిలివేసి కొంతదూరం పరిగెత్తి కొడవలి వేట్ల వల్ల మృత్యువాత పడింది. గాయాలపాలైన బసీరసాబ్, రజాక్ హుబ్లీలోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మహిళ సాహసాన్ని పలువురు అభినందిస్తున్నారు.

ఇళ్ల నిర్మాణానికి కేంద్రం అంగీకరించడం హర్షణీయం

తాడికొండ: రాజధాని ప్రాంతంలోని ఆర్-5 జోన్‌లో పేదల ఇళ్ల నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం అనుమతులివ్వడం హర్షణీయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 1003వ రోజుకు చేరాయి. రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని పలువురు ముఖ్యులు సందర్శించి, మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ ప్రాంతంలో పేదల ప్రజా రాజధాని రాబోతుందని తెలిసి కులవాదులంతా ఎల్లో మీడియా వేదికగా అక్కసు వెళ్లగక్కడం సిగ్గుచేటన్నారు. ఇళ్ల నిర్మాణాలకు ఇంత త్వరగా అనుమతులు మంజూరు చేసి ప్రజా రాజధాని నిర్మాణానికి సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జూలై 8న మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా పెద్దఎత్తున పేదల పండుగ జరుగనుందని, శరవేగంగా శాటిలైట్ సిటీ నిర్మాణం జరుగనుండడం చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోతుందని చెప్పారు. పేదల గుండెల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిరస్మరణీయంగా నిలిచిపోతున్నారనే అక్కసుతోనే కులవాదులు ఎల్లో మీడియా సాక్షిగా దుష్ప్రచారాలకు దిగుతున్నారని విమర్శించారు. కులవాదాన్ని రెచ్చగొడుతూ వారాహి వాహనంపై తిరుగుతున్న పవన్‌కళ్యాణ్ తనసీటు తను గెలవడం ఈసారి కూడా కష్టమేనని చెప్పారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, పులి దాసు, కారుమూరి పుష్పరాజ్, ఈపూరి ఆదాం, బొలిమేర శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత కారణాలతోనే మణికంఠ ఆత్మహత్య

- ఉద్యోగం రాలేదనే దిగులుతో బలవన్మరణం
- పోలీసుల దర్యాప్తులో వెల్లడి
- టీడీపీ శవ రాజకీయం దారుణం



మణికంఠ (ఫైల్)


కొత్తపేట/రావులపాలెం: జూనియర్ ఎన్టీఆర్ అభిమాని మేడిశెట్టి శ్యామ్ మణికంఠ రాంప్రసాద్ (21) వ్యక్తిగత కారణాలతోనే ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. వైఎస్సార్‌సీపీ నేతల బెదిరింపులంటూ దుష్ప్రచారంతో టీడీపీ శవ రాజకీయం చేయడం తప్పని తేలింది. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మోడేకుర్రులో ఈ నెల 25న ఈ ఘటన చోటుచేసుకోగా, మంగళవారం వెలుగులోకి వచ్చింది. కాట్రేనికోన మండలం కుప్పిగుంట గ్రామానికి చెందిన మేడిశెట్టి శ్రీను బతుకుతెరువు కోసం కొన్నేళ్ల క్రితం కుటుంబంతో తిరుపతికి వలస వెళ్లాడు. అతడి కుమారుడు మణికంఠ రాంప్రసాద్ హోటల్ మేనేజ్‌మెంట్ చేశాడు. ఉద్యోగం రావడం లేదని మథనపడేవాడు. ఈ నేపథ్యంలో రెండు నెలల క్రితం కొత్తపేట మండలం కండ్రిగ గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. కండ్రిగకు సమీపంలోనే గల మోడేకుర్రులో ఉండే పెద్దమ్మ తిరుపతి వెళ్లడంతో.. రాంప్రసాద్ రాత్రివేళ ఆ ఇంట్లో పడుకునేవాడు. ఈ క్రమంలో ఈ నెల 25న ఉదయం రాంప్రసాద్ ఆ ఇంట్లోనే ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని వేలాడుతుండగా స్థానికులు గుర్తించారు. అమ్మమ్మకు, తిరుపతిలో ఉంటున్న అతడి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. కాగా, పోలీసుల ప్రాథమిక విచారణలో 24వ తేదీ రాత్రి మణికంఠ ఎడమ చేతి మణికట్టు వద్ద బ్లేడుతో కోసుకుని, ఉరి వేసుకున్నట్టు తేలింది. 26వ తేదీన తల్లిదండ్రులు రాగా.. పోస్టుమార్టం జరిపిన అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగించారు. రాంప్రసాద్ వ్యక్తిగత కారణాలతోనే ఆత్మహత్యకు పాల్పడినట్టు తమ దర్యాప్తులో తేలిందని కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ మీడియాకు తెలిపారు. ఇతడి మృతిపై తల్లిదండ్రులకు, వారి బంధువులకు ఎలాంటి అనుమానాలు లేవని చెప్పారు.

చంద్రబాబు శవ రాజకీయాలు మానుకోవాలి

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు శవ రాజకీయాలు చేయడం ఇకనైనా మానుకోవాలని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడ ఏం జరిగినా దానిని వైఎస్సార్‌సీపీకి అంటగట్టి లబ్ధి పొందేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాంప్రసాద్ మరణం బాధాకరమని, అలాంటి ఘటనను అడ్డం పెట్టుకుని విద్వేషాలు రెచ్చగొట్టేందుకు చంద్రబాబు ప్రయత్నించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎగుమతులకు ప్రోత్సాహం..!

- ఎక్స్‌పోర్ట్‌ను మరింత విస్తృతం చేసే దిశగా కేంద్రం అడుగులు
- దేశ వ్యాప్తంగా 75 జిల్లాల్లో ఉత్పత్తుల ఎంపిక
- తూర్పుగోదావరికి స్థానం
- కొబ్బరి పీచు, జీడిపప్పు, కడియం నర్సరీ ఉత్పత్తులకు ప్రాధాన్యం
- రూ.40 కోట్లతో జిల్లాలో ఎక్స్‌పోర్ట్ హబ్ నిర్మాణానికి సుముఖం
- 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించేలా నిర్ణయం
- ప్రణాళికలు కేంద్రానికి సమర్పించిన జిల్లా అధికారులు



సాక్షి, రాజమహేంద్రవరం: తూర్పుగోదావరి జిల్లాలో తయారయ్యే ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసే అంశంలో మరింతగా ప్రోత్సహించే దిశగా అడుగులు పడుతున్నాయి. ఎక్స్‌పోర్ట్స్‌ను 10 శాతం పెంచి తయారీ రంగాన్ని బలోపేతం చేసి ఉద్యోగాలు కల్పించాలన్న తలంపుతో కేంద్రం ×డిస్ట్రిక్ట్ ఎక్స్‌పోర్ట్ హబ్¥ లాంటి బృహత్తర పథకానికి నాంది పలికింది. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా దేశ వ్యాప్తంగా 75 జిల్లాలను ఎంపిక చేయగా, ఆంధ్రప్రదేశ్ నుంచి తూర్పుగోదావరి జిల్లా స్థానం దక్కించుకుంది. ఇప్పటికే జిల్లాకు చెందిన ఎగుమతులు ప్రోత్సాహక కార్యాచరణ ప్రణాళికను జిల్లా అధికారులు కేంద్రానికి పంపగా.. పరిశీలించిన కేంద్రం ఆమోదం తెలిపింది. పథకానికి ఎంపికైన తర్వాత మళ్లీ జిల్లాకు మూడు ఉత్పత్తుల చొప్పున మూడు జిల్లాలకు సంబంధించి 9 రకాల ఉత్పత్తులను ఎంపిక చేసి పంపారు. వీటికి కేంద్ర ప్రభుత్వం ఆమోద ముద్ర పడాల్సి ఉంది. ఆమోదం లభించిన వెంటనే ఎగుమతులు ఊపందుకోనున్నాయి. అవసరమైన వసతుల కల్పనకు నిధులు సైతం మంజూరు కానున్నాయి.

'తూర్పు'లో మూడు ఉత్పత్తులు..

తూర్పుగోదావరి జిల్లాలో స్థానికంగా తయారయ్యే మూడు ఉత్పత్తులను ఎంపిక చేశారు. అందులో ప్రధానంగా కొబ్బరి పీచు ఆధారిత ఉత్పత్తులు, జీడిపప్పు ప్రాసెసింగ్, కడియం నర్సరీ ఉత్పత్తులను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన ఉత్పత్తుల ఎగుమతులను ఏటా 10 శాతం పెంచాలన్నది డిస్ట్రిక్ట్ ఎక్స్‌పోర్ట్ హబ్ లక్ష్యం. ఇందు కోసం ప్రతి జిల్లాలో ఎగుమతులు ప్రోత్సహించేలా రూ.40 కోట్లతో ఎక్స్‌పోర్ట్ హబ్‌ను అభివృద్ధి చేస్తారు. ఇందులో 60 శాతం కేంద్ర ప్రభుత్వం గ్రాంటుగా ఇస్తుంది. మిగిలిన మొత్తం రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంది.

మొక్కలకు మరింత ఊపు..

కడియం నర్సరీలంటే ప్రపంచంలోనే ప్రత్యేక స్థానం. ఇక్కడ లభించని మొక్కలు ఉండవంటే అతిశయోక్తి కాదు. అంతటి ప్రాధాన్యత సంతరించుకున్న నర్సరీల్లో మొక్కల ఎగుమతులు సైతం అదే స్థాయిలో ఉంటున్నాయి. కడియంలో 1336 నర్సరీలు ఉండగా.. ప్రత్యక్షంగా, పరోక్షంగా 30 వేలకు పైగా బతుకుబండి లాగుతున్నారు. ఏడాదిలో నాలుగు మాసాల పాటు (జూన్ 15 నుంచి అక్టోబర్ నెలాఖరుకు) వ్యాపారం ఊపందుకుంటుంది. రోజుకు 100 లారీల సరుకు ఎగుమతి అవుతుండగా రోజుకు సుమారు రూ.100 కోట్ల టర్నోవర్ అవుతోంది. అంతేగాక కోనసీమ జిల్లా వ్యాప్తంగా కొబ్బరి సాగు అత్యధికం. ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు జరుగుతుంటాయి. కొబ్బరి, కొబ్బరి పీచు ఉత్పత్తులను సైతం ప్రోత్సహించేందుకు జిల్లా అధికారులు ప్రణాళికలు రూపొందించి కేంద్రానికి నివేదించారు.

ప్రతిపాదనలు పంపాం



కేంద్రం ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని మూడు ఉత్పత్తులను ఎంపిక చేసి కేంద్రానికి ప్రతిపాదనలు పంపాం. అందులో ప్రధానంగా జీడిపప్పు, నర్సరీ, పీచు ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇచ్చాం. ఉత్పత్తులకు కేంద్రం నుంచి ఆమోదం లభించిన వెంటనే సదుపాయాల కల్పనకు నిధులు విడుదలవుతాయి. కేంద్రం 60, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు వెచ్చించి రూ.40 కోట్లతో డిస్ట్రిక్ట్ ఎక్స్‌పోర్ట్ హబ్‌ల నిర్మాణం చేపడతాం. తద్వారా వందల మందికి ఉపాధి అవకాశాలు దక్కుతాయి.

– డాక్టర్ కే మాధవీలత, కలెక్టర్, తూర్పుగోదావరి జిల్లా

జీడిపప్పుకు కేరాఫ్ రాష్ట్రం..

దేశ, విదేశాల్లో హాట్ కేక్‌లా విక్రయించే ఉత్పత్తి ఏదైనా ఉందంటే అది జీడిపప్పు ఒక్కటే. దేశం నుంచి విదేశాలకు ఎగుమతయ్యే జీడిపప్పులో సింహభాగం రాష్ట్రం నుంచే ఉండటం విశేషం. తూర్పుగోదావరి జిల్లాలో సుమారుగా 40 ప్రాసెసింగ్ యూనిట్లు నడుస్తున్నాయి. ఇక్కడ తయారైన జీడిపప్పును ఇండోనేషియా, ఈస్ట్, అండ్ వెస్ట్ సెంట్రల్ ఆఫ్రికా, సౌత్ ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. మంచి సీజన్‌లో ప్రతి ఏటా రూ.4000 కోట్ల మేర టర్నోవర్ అవుతోంది. 4,200 మంది ఉపాధి పొందుతున్నారు.

జీడిపప్పు తయారీ సామర్థ్యం	తయారయ్యే సరుకు	ఏడాదికి టర్నోవర్ (రూ.లక్షల్లో)	యూనిట్ల సంఖ్య
4 బ్యాగులు (రోజుకు)	100 కేజీలు (రోజుకు)	180	100
8–24 బ్యాగులు	420 కేజీలు	750	35
50–100	2.62 టన్నులు	3500	15



క్లుప్తంగా...

29, 30 తేదీల్లో మణిపూర్‌కు రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ జాతుల ఘర్షణలతో అట్టుడుకుతున్న మణిపూర్‌ను సందర్శించనున్నారు. ఈ నెల 29, 30వ తేదీల్లో ఆయన మణిపూర్ వెళ్తారని కాంగ్రెస్ తెలిపింది. చురాచంద్‌పూర్, ఇంఫాల్‌ల్లోని సహాయక శిబిరాల్లో తలదాచుకున్న వారితోపాటు పలువురు సామాజిక కార్యకర్తలతో రాహుల్ మాట్లాడతారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. దాదాపు రెండు నెలలుగా రాష్ట్రంలో కొనసాగుతున్న హింసాత్మక ఘటనల్లో వందమందికి పైగా చనిపోయిన విషయం తెలిసిందే.

కశ్మీర్‌లో ఉగ్రవాది హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో మంగళవారం భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో అల్ బద్ర్ సంస్థకు చెందిన ఒక ఉగ్రవాది హతమయ్యాడు. ఈ సందర్భంగా ఒక పోలీసు గాయపడ్డారు. నిఘా వర్గాల సమాచారం మేరకు బలగాలు సోమవారం రాత్రి హవూరా ప్రాంతంలో గాలింపు చేపట్టాయి. మాటువేసి ఉన్న ఓ ఉగ్రవాది వారిపైకి యథేచ్ఛగా కాల్పులకు దిగాడు. బలగాలు జరిపిన కాల్పుల్లో అతడు హతమయ్యాడు. ఈ సందర్భంగా గాయపడిన పోలీసును అధికారులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. హతమైన ఉగ్రవాదిని హవూరా ప్రాంతం అక్బరాబాద్‌కు చెందిన అదిల్ మజీద్ లోన్‌గా గుర్తించారు. ఘటనకు కొద్ది సేపటి ముందు అతడు సోషల్ మీడియాలో ఒక వీడియో పోస్ట్ చేశాడు. తనను తాను అల్‌బద్ర్ సంస్థలో చాలా కాలంగా పని చేస్తున్నట్లు చెప్పుకున్నాడు.

తాలిబన్ హయాంలో వెయ్యి మంది పౌరులు మృతి: ఐరాస

ఇస్లామాబాద్: అఫ్గానిస్తాన్‌లో తాలిబన్లు 2021 ఆగస్ట్‌లో అధికారం చేజిక్కించుకున్న నాటి నుంచి గత మే నెల వరకు జరిగిన దాడుల్లో 1,095 మంది పౌరులు చనిపోయారని ఐక్యరాజ్యసమితి అఫ్గాన్ విభాగం తెలిపింది. ఇందులో చాలా వరకు జనసమ్మర్దం ఉండే స్కూళ్లు, మార్కెట్లు, ప్రార్థనాస్థలాల్లో బాంబులు పేలడంతోనే జరిగాయని పేర్కొంది. మొత్తం 1,095 మృతుల్లో 92 మంది మహిళలు, 287 మంది చిన్నారులు ఉన్నారంది. ఈ దాడులకు ఐఎస్ గ్రూపే ముఖ్య కారణమని పేర్కొంది. కొన్ని దాడుల వెనుక ఎవరున్నారో కూడా తెలియడం లేదని వ్యాఖ్యానించింది. అంతకు ముందు అంతర్యుద్ధ కాలంతో పోలిస్తే చాలా తక్కువే అయినప్పటికీ, పౌరుల మరణాలు ఆందోళనకరమైన విషయమని తెలిపింది. దాడులను వెంటనే ఆపేయాలని డిమాండ్ చేసింది. పౌరుల రక్షణ బాధ్యత తాలిబన్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేసింది.

ఒకే దేశం.. ఒకే చట్టం సాధ్యమేనా!

ఉమ్మడి పౌరస్మృతిపై దేశంలో మళ్లీ చర్చ ఊపందుకుంది.
ఒక దేశానికి రెండు చట్టాలు కావాలా అంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూటిగానే ప్రశ్నించారు. ఒకే కుటుంబంలో ఉండే ఇద్దరు వ్యక్తులకి రెండు నిబంధనలు పెడితే దేశం ఎలా ముందుకు వెళుతుందని నిలదీశారు. ఇప్పటికే 22వ లా కమిషన్‌ను ఏర్పాటు చేసి దేశ ప్రజలు, మత సంస్థల అభిప్రాయాలను 30 రోజుల్లోగా తీసుకోవాలని గడువు విధించారు. **ఈ పరిణామాలతో అసలు ఉమ్మడి పౌరస్మృతి అంటే ఏమిటి ? అది అమలు చేయడం వల్ల ఏమవుతుంది ? అనుకూల వర్గం ఏమంటోంది? ప్రతికూలుర వాదనలు ఏంటి ?** వంటి ప్రశ్నలు చర్చనీయాంశంగా మారాయి.

ఒకే దేశం.. ఒకే చట్టం.. ఇదే ఇప్పుడు కేంద్రంలో బీజేపీ ముందున్న లక్ష్యం. బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టోలో కూడా యూనిఫామ్ సివిల్ కోడ్ (యూసీసీ) తీసుకువస్తామని హామీ ఇచ్చింది. అయోధ్య రామ మందిర నిర్మాణం, కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత బీజేపీ ఉమ్మడి పౌరస్మృతి పైనే దృష్టి సారించింది. ఉమ్మడి పౌరస్మృతి అంటే దేశవ్యాప్తంగా ఒకే పౌర చట్టం అమల్లోకి వస్తుంది. ప్రస్తుతం మన దేశంలో వివాహం, విడాకులు, దత్తత, భరణం, సంరక్షణ, వారసత్వం తదితర వ్యక్తిగత అంశాల్లో మతాలవారీగా చట్టాలు అమల్లో ఉన్నాయి. హిందువులు, ముస్లింలు, క్యాథలిక్ క్రిస్టియన్లు, పార్సీలు ఎవరికి వారు తమ మత చట్టాలనే అనుసరిస్తారు. ఇప్పుడు ఉమ్మడి పౌరస్మృతిని అమల్లోకి తీసుకువస్తే ఈ వ్యక్తిగత చట్టాలన్నీ రద్దయి అందరికీ ఒకే చట్టం అమలవుతుంది. ఇప్పటికే బీజేపీ పాలిత రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, గుజరాత్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్‌లు యూసీసీని తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నాయి.

రాజ్యాంగ హక్కులు వర్సెస్ ఆదేశిక సూత్రాలు

రాజ్యాంగంలోని ఆర్టికల్ 44 భారత పౌరులందరికీ ఒకే చట్టం వర్తించేలా యూసీసీ రూపొందించడానికి ప్రభుత్వం ప్రయత్నించాలని పేర్కొంది. రాజ్యాంగంలో ఆర్టికల్ 37 ప్రకారం ఆదేశిక సూత్రాలలో ఉన్న నిబంధనలు దేశ పరిపాలనలో ప్రాథమికమైనవి. ఈ సూత్రాలను వర్తింప జేయడం ప్రభుత్వ విధి అని స్పష్టం చేసింది. అయితే యూసీసీ అనేది ఆదేశిక సూత్రాల్లో ఒకటిగా ఉంది తప్ప రాజ్యాంగం ఇచ్చిన హక్కు కాదు. అందుకే స్వాతంత్ర్యానంతరం యూసీసీ అమలు చేయడానికి కొన్ని ప్రయత్నాలు జరిగినా అమల్లోకి రాలేదు. పర్సనల్ లా అనేది మత సంప్రదాయాలు, విశ్వాసాలకు సంబంధించినది కావడంతో వారి మనోభావాలు దెబ్బ తీసేలా యూసీసీ తీసుకురావడం అంత సులభం కాదన్న వాదనలు ఉన్నాయి.



షాబానో కేసుతో మలుపు

రాజ్యాంగాన్ని రచించిన సమయంలోనే ఉమ్మడి పౌరస్మృతి ఉండాలని అప్పటి నాయకులు గుర్తించారు. భవిష్యత్‌లోనైనా దేశవ్యాప్తంగా ఒకే చట్టం తీసుకురావాలని అయితే ఇది నిర్బంధంగా కాకుండా స్వచ్ఛందంగా అమల్లోకి వస్తే బాగుంటుందని భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ అభిప్రాయపడ్డారు. మైనార్టీలు తిరుగుబాటు చేసే విధంగా ప్రభుత్వాలు ఎలాంటి నిర్ణయాలు తీసుకోకూడదు అని ఆయన అప్పట్లోనే వ్యాఖ్యానించారు. ఆ తర్వాత యూసీసీని తీసుకురావాలని ప్రభుత్వం పెద్దగా ప్రయత్నాలు చేయలేదు. 1985లో షా బానో కేసుతో యూసీసీ ఆవశ్యకత ఉందన్న అభిప్రాయం బలంగా వచ్చింది. మధ్యప్రదేశ్‌కు చెందిన షాబానో అనే ముస్లిం మహిళ 40 ఏళ్ల వైవాహిక జీవితం తర్వాత మూడు సార్లు తలాక్ చెప్పి తనకు విడాకులిచ్చిన భర్త నుంచి భరణం కోరుతూ కోర్టుకెక్కారు. సుప్రీం కోర్టు కూడా ఆమెకు జీవనభృతి చెల్లించాలని తీర్పు చెప్పింది. అయితే అప్పట్లో కేంద్రంలో అధికారంలో ఉన్న రాజీవ్ గాంధీ సర్కార్ ముస్లిం మహిళల చట్టాన్ని పార్లమెంటులో ఆమోదించింది. ఈ చట్టం ప్రకారం ముస్లిం మహిళలకు విడాకులు ఇచ్చినా భర్త భరణం ఇవ్వక్కర్లేదు. ఇలా పర్సనల్ చట్టాల్లోని సంక్లిష్టత, వివక్షను ఆయుధాలుగా చేసుకొని బీజేపీ ఉమ్మడి పౌరస్మృతి అమల్లోకి తీసుకురావాలని గట్టి పట్టుదలతో ఉంది. మన దేశంలో గోవాలో మాత్రమే ఒకే చట్టం అమలవుతోంది. 1867లో పోర్చుగల్ సివిల్ కోడ్ అమల్లోకి వచ్చింది. అది ఇప్పటికీ కొనసాగుతోంది. ఆ రాష్ట్రంలో మాత్రమే అన్ని మతాలకు ఒకే చట్టం అమల్లో ఉంది.



ఉమ్మడి పౌరస్మృతి అమల్లోకి తేవడంలో ఎన్ని అనుకూలతలు ఉన్నాయో అన్నే ప్రతికూలతలు కూడా ఉన్నాయి. దేశంలో ముస్లింలలో అభద్రతా భావం పెరిగిపోతుందన్నది ప్రధాన ఆందోళన. అటు హిందువుల్లో కూడా వ్యతిరేకత వచ్చే అవకాశాలున్నాయనే అనుమానాలున్నాయి. ఎందుకంటే నాగాలాండ్, మేఘాలయ, మిజోరం వంటి ఈశాన్య రాష్ట్రాల్లో హిందూ చట్టాల్లో కూడా తేడాలున్నాయి. 200కి పైగా ఆదివాసీ తెగలు తమ సొంత సంప్రదాయ చట్టాలనే అనుసరిస్తాయి.

అనుకూలం

రాజ్యాంగంలోని లౌకిక స్ఫూర్తికి అనుకూలంగా కులం, మతం, ప్రాంతం, వర్గం లింగ భేదాలు లేకుండా దేశవ్యాప్తంగా పౌరులందరికీ ఒకే చట్టం అమలై జాతి సమగ్రతకు దోహదపడుతుంది.

ప్రస్తుతం దేశంలో అమల్లో ఉన్న మతపరమైన పర్సనల్ చట్టాలు కాలం చెల్లిపోయినవి. ఉమ్మడి పౌర స్మృతి వస్తే అవన్నీ రద్దవుతాయి

పర్సనల్ చట్టాల్లో స్త్రీ, పురుష వివక్ష ఎక్కువగా ఉంది. ముస్లిం పర్సనల్ లా ప్రకారం పురుషులు నాలుగు పెళ్లిళ్లు చేసుకోవచ్చు. యూసీసీ వస్తే ఇలాంటి వివక్ష పోయి స్త్రీ, పురుష సమానత్వం సాధ్యపడుతుంది.

చైనాను దాటేసి ప్రపంచ జనాభాలో నంబర్ వన్ స్థానానికి చేరుకున్నాం. జనాభా పెరుగుదల వల్ల కలిగే దుష్ప్రభావాలను అరికట్టడానికి, అన్ని మతాల్లోనూ చిన్న కుటుంబాలను ప్రోత్సహించడానికి వీలవుతుంది

సుప్రీం కోర్టులో తీర్పులు చెప్పడం సులభమవుతుంది. భిన్న మతాచారాలకు సంబంధించిన కేసులు వస్తున్నప్పుడు తీర్పుల్లో విపరీతమైన గందరగోళం నెలకొంటోందని అత్యున్నత న్యాయస్థానం ఎన్నో సందర్భాల్లో స్పష్టం చేసింది. యూసీసీ ఆవశ్యకత గురించి పలు మార్లు వ్యాఖ్యలు చేసింది. దీనిని వీలైనంత తర్వగా తీసుకురావాలని కేంద్రానికి పలు కేసుల సందర్భంగా సూచించింది.

ప్రతికూలం

ఉమ్మడి పౌరస్మృతిని ముస్లిం సమాజం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. తమ మీద జరిగే మత, సాంస్కృతిక దాడిగా భావిస్తోంది. బీజేపీ మైనార్టీ వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందన్న భావన ఇప్పటికే ఉంది. యూసీసీని కూడా తీసుకువస్తే దేశంలో ఘర్షణలకు దారి తీసే అవకాశాలున్నాయి

ఉమ్మడి పౌరస్మృతిని రూపొందించడంలో సవాళ్లు ఎదురయ్యే అవకాశాలున్నాయి. పెళ్లి, విడాకులు, ఆస్తి, హక్కులు, భరణాలు వంటి వాటిపై ఏ మత ప్రాతిపదికన నిర్ణయాలు తీసుకుంటారన్నది అతి పెద్ద సమస్యగా మేధోవర్గం భావిస్తోంది.

యూనిఫామ్ సివిల్ కోడ్‌ని తీసుకురావడం కోసం 2016లో మోదీ ప్రభుత్వం ప్రయత్నాలు చేసింది. అప్పట్లో ఏర్పాటు చేసిన 21వ లా కమిషన్ దీనిని తీసుకురావడం ఏ మాత్రం వాంఛనీయం కాదని నివేదిక ఇచ్చింది. అప్పుడున్న పరిస్థితులకి, ఇప్పటికి పెద్ద తేడా ఏమీ రాలేదు.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ద్వారా సంక్రమించే మత స్వేచ్ఛ, మైనార్టీ హక్కుల్ని పరిరక్షించే ఆర్టికల్ 29కి యూసీసీ అడ్డంకిగా మారుతుంది

బ్రిటిష్ పాలకుల్ని కూడా అబ్బురపరిచిన భిన్నత్వంలో ఏకత్వం మన దేశం సొంతం. యూసీసీని తీసుకువస్తే సమాజంలో ఆ వైవిధ్యం దెబ్బ తింటుందన్న ఆందోళనలు ఉన్నాయి.

సాక్షి, నేషనల్ డెస్క్

వాగ్నర్ సేనకు రష్యా క్షమాభిక్ష

మాస్కో: వాగ్నర్ సైన్యం తిరుగుబాటును నిలిపేయడంతో ఆ సైన్యం చీఫ్ ప్రిగోజిన్, అతని బలగాలకు రష్యా ప్రభుత్వం క్షమాభిక్ష ప్రసాదించింది. వారిపై ఎలాంటి క్రిమినల్ విచారణ ఉండదని ప్రకటించింది. 24 గంటల్లోపే వారు తమ కార్యకలాపాలను ఆపేయడంతో ఈ కేసును నిలిపివేస్తున్నట్టు ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ తెలిపింది. ఉక్రెయిన్‌తో 16 నెలలుగా యుద్ధం సాగుతున్న నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ అధికారానికి ముప్పుగా పరిణమించిన సంఘటనల వరుసలో ఇది తాజా మలుపు. ప్రస్తుత సంక్షోభాన్ని నివారించే లక్ష్యంతో ప్రిగోజిన్‌కు పుతిన్ కొన్ని వాగ్దానాలు చేశారని, మరికొన్ని హామీలు ఇచ్చారని క్రెమ్లిన్ ప్రతినిధి చెప్పారు. వాగ్నర్ గ్రూప్‌కు ఏడాదిలో రూ.8 వేల కోట్లకు పైగా చెల్లించినట్లు అధ్యక్షుడు పుతిన్ వెల్లడించారు. ఆ గ్రూపు బలగాలకు జీతాలు, అలవెన్సులను సమకూర్చామన్నారు. ఆ డబ్బును ఎలా ఖర్చు చేశారన్న విషయమై అధికారులు దర్యాప్తు చేస్తారని పుతిన్ చెప్పారు. ఇలా ఉండగా, ప్రిగోజిన్ తమ దేశంలోనే ఉన్నారని బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకషెంకో ప్రకటించారు. అతని బలగాలు కూడా కొంతకాలం పాటు బెలారస్‌లోనే ఉంటాయని వెల్లడించారు. రష్యా మిలిటరీ ఆధీనంలో పనిచేయడానికి ఒప్పందాలపై సంతకం చేయడానికి జూలై 1 గడువు కంటే ముందే తన దళాలు తమ ఆయుధాలను మార్చుకోవడానికి సిద్ధమవుతున్నాయని ప్రిగోజిన్ తెలిపారు.

యూపీలో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ హతం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో కౌశంబి జిల్లాలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ హతమయ్యాడు. ప్రతాప్‌గఢ్ జిల్లాకు చెందిన గుఫ్రాన్‌పై 12కిపైగా క్రిమినల్ కేసులున్నాయి. సందా గ్రామం దగ్గర ఉత్తరప్రదేశ్ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ జరిగిన ఎదురు కాల్పుల్లో గుఫ్రాన్ గాయపడ్డాడు. వెంటనే అతనిని జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతను మరణించినట్టు వైద్యులు ప్రకటించారు. గుఫ్రాన్‌పై 13 హత్య కేసులతో పాటు హత్యాయత్నం, దోపిడీ, లూటీ వంటి కేసులున్నాయి. అతని తలపై రూ.1.25 లక్షల రివార్డు కూడా ఉంది.

10 రాజ్యసభ స్థానాలకు జూలై 24న ఎన్నికలు

న్యూఢిల్లీ: పది రాజ్యసభ స్థానాలకు జూలై 24న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం (ఈసీ) మంగళవారం వెల్లడించింది. ఈ పది స్థానాల్లో ఎంపీల పదవీకాలం జూలై, ఆగస్టుల్లో ముగియనుంది. వినయ్ టెండూల్కర్ (బీజేపీ-గోవా), విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్, దినేశ్‌చంద్ర అనవదియా, జుగల్‌సిన్హ్ లోఖండ్‌వాలా (గుజరాత్)ల రాజ్యసభ పదవీకాలం ముగియనుంది. అలాగే బెంగాల్ నుంచి డెరెక్ ఒబ్రియాన్, డోలా సేన్, సుస్మితా దేవ్, శాంత చెత్రి, సుఖేందు శేఖర్ రాయ్, ప్రదీప్ భట్టాచార్యల స్థానాలు కూడా ఖాళీ కానున్నాయి. ఈ పది స్థానాలకు జూలై 24న ఎన్నికలు నిర్వహిస్తామని, అదేరోజు కౌంటింగ్ ఉటుందని ఈసీ తెలిపింది.

కుటుంబ పార్టీలపై మోదీ ధ్వజం

వారికి ఓటేస్తే ఆ కుటుంబాలే బాగుపడతాయి
- మీ కుటుంబాల సంక్షేమం కోరుకుంటే బీజేపీకే ఓటేయండి
- ప్రతిపక్ష పార్టీలది లక్షల కుంభకోణాల చరిత్ర
- ఉమ్మడి పౌరస్మృతి అవసరం ఎంతో ఉంది
- రెండు చట్టాలతో దేశం ఎలా నడుస్తుంది?
- భోపాల్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యలు



భోపాల్: దేశంలోని కుటుంబ పార్టీలపై ప్రధాని మోదీ నిప్పులు చెరిగారు. ఆయా పార్టీలకు ఓటేస్తే కొన్ని కుటుంబాలు బాగుపడతాయే తప్ప, ప్రజలకు ఒరిగేదే ఉండదన్నారు. తమ బీజేపీకి ఓటేస్తే అన్ని కుటుంబాలకు మంచి జరుగుతుందని చెప్పారు. పట్నాలో ఇటీవల జరిగిన ప్రతిపక్ష నేతల సమావేశాన్ని ఆయన ఫొటో షూట్‌గా అభివర్ణించారు. ఆయా పార్టీలన్నిటికీ కుంభకోణాల చరిత్ర ఉందంటూ నిప్పులు చెరిగారు. దేశంలో ఉమ్మడి పౌరస్మృతి అవసరం ఎంతో ఉందని పేర్కొన్న మోదీ..ఈ విషయంలో ప్రతిపక్షాలు ముస్లింలను తప్పుదోవ పట్టిస్తున్నాయంటూ విమర్శలు గుప్పించారు. 2024 ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కొనే ఏకైక లక్ష్యంతో ఏకతాటిపైకి వచ్చేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నాలు వేగవంతం చేసిన సమయంలో ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మంగళవారం మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో బీజేపీ చేపట్టిన 'మేరా బూత్ సబ్ సే మజ్ బూత్'కార్యక్రమంలో కార్యకర్తలనుద్దేశించి ప్రధాని మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణలోని బీఆర్ఎస్ సహా దేశంలోని కుటుంబ పార్టీల తీరును ఎండగట్టారు. ఆయన ఏమన్నారంటే.. 'తెలంగాణ సీఎం కె.చంద్రశేఖర్ రావు కూతురు సంక్షేమం కోరుకుంటున్న వారయితే బీఆర్ఎస్‌కు ఓటేయండి. గాంధీల కుటుంబం అభివృద్ధిని మీరు కోరుకుంటే కాంగ్రెస్‌కు ఓటేయండి. ములాయం సింగ్ కొడుకు కుటుంబం సంక్షేమం కోరుకున్నట్లయితే సమాజ్‌వాదీ పార్టీ(ఎస్‌పీ)కి ఓటేయండి. లాలూ ప్రసాద్ యాదవ్ కొడుకులు, కూతుళ్ల సంక్షేమం కావాలనుకుంటే ఆర్‌జేడీకి, శరద్ పవార్ కూతురు అభివృద్ధి చెందాలంటే ఎన్సీపీకి ఓటేయండి. అబ్దుల్లా కుటుంబం బాగుండాలని భావిస్తే నేషనల్ కాన్ఫరెన్స్‌కు, కరుణానిధి కుటుంబం సంక్షేమం కోరుకుంటున్నట్లయితే డీఎంకేకు ఓటేయండి. 'మీరు ఇంట్లో మీ కొడుకులు, కూతుళ్లు, మనవల సంక్షేమం కోరుకుంటున్న వారయితే కుటుంబపార్టీలను వదిలేసి, బీజేపీకే ఓటేయండి'అని ఆయన పిలుపునిచ్చారు.

రాజ్యాంగం కూడా చెప్పింది

దేశంలో ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ)అవసరం ఎంతో ఉందని ప్రధాని మోదీ నొక్కిచెప్పారు. పౌరులందరికీ సమాన హక్కులుండాలన్న విషయాన్ని రాజ్యాంగం ప్రస్తావించిందని ఆయన పేర్కొన్నారు. సుప్రీంకోర్టు కూడా యూసీసీకి మద్దతు తెలిపింది..అయితే ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్న వాళ్లు దానిని వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు. బుజ్జగింపు, ఓటు బ్యాంకు రాజకీయాల విధానాలకు బదులుగా, సంతృప్తికర విధానాలను అనుసరించాలని పార్టీ నిర్ణయించిందని ఆయన వెల్లడించారు. యూసీసీతో వివాహం, విడాకులు, అనువంశికత, భరణం, ఆస్తి వారసత్వం వంటి వాటిలో ఒకే చట్టం అమలవుతుందని చెప్పారు. ముస్లింలను తప్పుదోవ పట్టించేందుకు, రెచ్చగొట్టేందుకు ప్రతిపక్షాలు ఈ అంశాన్ని వాడుకుంటున్నాయన్నారు. 'ఒకే ఇంట్లో ఒకరికి ఒక న్యాయం, ఇంకొకరికి ఇంకో రకమైన న్యాయం ఉంటే ఎలా ఉంటుందో మీరే చెప్పండి? అలా ఆ ఇంటిని నడపటం సాధ్యమేనా? ఇలాగే రెండు రకాలైన వ్యవస్థలతో దేశం ఎలా పనిచేయగలదు? అందరికీ సమాన హక్కులుండాలన్న విషయాన్ని రాజ్యాంగం కూడా ప్రస్తావించిందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి'ప్రధాని అన్నారు. బుజ్జగింపు విధానాల కారణంగానే యూపీ, బిహార్, కేరళ, తెలంగాణ, తమిళనాడు సహా పలు రాష్ట్రాల్లోని చాలా కులాల వారు వెనుకబాటుకు గురవుతున్నారన్నారు.

ట్రిపుల్ తలాక్‌తో బిడ్డలకు అన్యాయం

'ట్రిపుల్ తలాక్ పద్ధతికి మద్దతిచ్చే వారు ముస్లిం ఆడబిడ్డలను తీవ్ర అన్యాయానికి గురిచేస్తున్నారు. ఈ పద్ధతి ఈజిప్టులో 80-90 ఏళ్ల క్రితమే రద్దయింది. ఇది అవసరమే అయితే పాకిస్తాన్, ఖతర్, ఇతర ముస్లిం మెజారిటీ దేశాలు ఎందుకు నిషేధించాయి? ట్రిపుల్ తలాక్‌తో ముస్లిం కుటుంబాలకు నష్టం జరుగుతుంది. అది ఇస్లాంలో అత్యవసర భాగమే అయితే, ఖతర్, జోర్డాన్, ఇండోనేసియాలు ఎందుకు నిషేధించాయి'అని ప్రధాని మోదీ ప్రశ్నించారు.

వారిది ఫొటో షూట్

ఈ నెల 23న బిహార్ రాజధాని పట్నాలో ప్రతిపక్ష పార్టీల నేతల భేటీపై ప్రధాని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అది డజనుకుపైగా పార్టీల ఫొటో షూట్ అని వ్యాఖ్యానించారు. 'సమావేశంలో పాల్గొన్న పార్టీలన్నిటిదీ రూ.20 లక్షల కోట్ల కుంభకోణాల చరిత్ర. ఒక్క కాంగ్రెస్ పార్టీ కుంభకోణాల విలువే లక్షల కోట్లలో ఉంటుంది. కాంగ్రెస్ పార్టీకి బొగ్గు, 2జీ, కామన్ వెల్త్ తదితర స్కాంలతో సంబంధముంది. ఆర్‌జేడీ, డీఎంకే, టీఎంసీ, ఎన్సీపీలకూ కుంభకోణాల చరిత్ర ఉంది'అని ఆరోపించారు. ఒకప్పుడు ఒకరినొకరు తీవ్రంగా విమర్శించుకున్న ఈ పార్టీలే నేడు అధికారం కోసం ఒక చోటికి చేరాయని చెప్పారు. బీజేపీకి వ్యతిరేకంగా ఏకమైన వీరిపై కోపం కాదు, సానుభూతి చూపాలని కార్యకర్తలను కోరారు.

2024లోనూ మనదే గెలుపు

2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీ విజయం వైపు దూసుకుపోతుందని ప్రధాని విశ్వాసం వ్యక్తం చేశారు. గత ఏడాది యూపీలోని ముస్లిం మెజారిటీ లోక్‌సభ స్థానాలైన అజంగఢ్, రాంపూర్‌లలో లభించిన గెలుపుతో ఉత్సాహంతో ఉన్నామన్నారు. 2024 ఎన్నికల్లో మరోసారి బీజేపీకే అధికారం అప్పగించాలని ప్రజలు ఇప్పటికే నిర్ణయానికి వచ్చారని చెప్పారు. ప్రస్తుతం గ్యారెంటీలతో రాజకీయాలు నడుస్తున్నాయని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలు ఇస్తున్న ఈ హామీలతో లక్షల కోట్ల కుంభకోణాలు గ్యారెంటీ అని ప్రధాని ఎద్దేవా చేశారు. ఈ స్కాములతో సంబంధాలున్న వారిపై తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రకటించారు. ఈ విషయాన్ని ప్రజల్లో ప్రచారం చేయాలని కార్యకర్తలకు సూచించారు. 'మనం ఏసీ కార్యాలయాల్లో కూర్చుని, ఆదేశాలివ్వం. కఠినమైన వాతావరణ పరిస్థితులను సైతం ఎదుర్కొంటూ ప్రజల వెంటే ఉంటాం'అని ఆయన అన్నారు.

ఒకేరోజు 5 వందే భారత్ రైళ్లు

ముఖ్య నగరాలకు కనెక్టివిటీ పెరుగుతుందన్న ప్రధాని మోదీ



భోపాల్‌లో తను గీచిన చిత్రాన్ని ప్రధానికి ఇస్తున్న విద్యార్థిని

భోపాల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం ఒకేరోజు అయిదు వందే భారత్ రైళ్లకు పచ్చజెండా ఊపారు. ఆయన మంగళవారం మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని రాణి కమలాపతి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి ఆయన రెండు రైళ్లను ప్రారంభించారు. వర్చువల్‌గా మరో మూడింటికి పచ్చజెండా ఊపారు. ఈ సందర్భంగా ప్రధాని వందే భారత్ రైలులోని విద్యార్థులు, సిబ్బందితో ముచ్చటించారు. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, మధ్యప్రదేశ్ గవర్నర్ మంగుభాయ్ పటేల, సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర మంత్రులు నరేంద్ర సింగ్ తోమర్, జ్యోతిరాదిత్య సింధియా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ అయిదు రైళ్లు మధ్యప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, గోవా, బిహార్, జార్ఖండ్‌ల్లో కనెక్టివిటీని మెరుగుపరుస్తాయని అనంతరం ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. వందే భారత్ రైళ్లు అయిదింటిని ఒకే రోజు ప్రారంభించడం ఇదే తొలిసారి. ఈ సెమీ హైస్పీడ్ రైళ్లు ఏవంటే..రాణి కమలాపతి(భోపాల్)-జబల్పూర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్, ఖజురహో-భోపాల్-ఇండోర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్, మడ్గావ్(గోవా)-ముంబై వందేభారత్ ఎక్స్‌ప్రెస్, ధార్వాడ్-బెంగళూరు వందే భారత్ ఎక్స్‌ప్రెస్, హతియా- పట్నా వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఉన్నాయని పీఎంవో ఒక ప్రకటనలో వివరించింది. రాణి కమలాపతి- జబల్పూర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు మహాకౌశల్ ప్రాంతంతో భోపాల్ సెంట్రల్ రీజియన్‌ను కలుపుతుంది. ఈ మార్గంలో అనేక ప్రముఖ పర్యాటక ప్రాంతాలున్నాయని తెలిపింది. ఈ మార్గంలో అత్యధిక వేగంతో ప్రయాణించే రైలు కంటే వందే భారత్ రైలు అరగంట వేగంగా వెళ్తుందని వివరించింది. హతియా- పట్నా రైలు ప్రయాణంతో గంటన్నర సమయం ఆదా అవుతుందని తెలిపింది. మిగతా రైళ్లు కూడా పర్యాటక ప్రాంతాలను అనుసంధానిస్తాయని పేర్కొంది. విద్యార్థులు, వ్యాపారులకు కూడా ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని పీఎంవో తెలిపింది.

ఎయిరిండియా విమానంలో ప్రయాణికుడి అసహ్యకర ప్రవర్తన

న్యూఢిల్లీ: ఈ నెల 24న ఢిల్లీ-ముంబై ఎయిరిండియా విమానంలో ఓ ప్రయాణికుడు అసహ్యకరంగా ప్రవర్తించాడు. విమానంలోనే మల, మూత్ర విసర్జన చేశాడు. ఢిల్లీ ఎయిర్‌పోర్టులో విమానం ల్యాండయ్యాక సదరు వ్యక్తిని భద్రతా సిబ్బందికి అప్పగించినట్లు ఎయిరిండియా ఒక ప్రకటనలో తెలిపింది. ఘటనపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ)కి తెలిపి, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించింది. విమానం లోపల తొమ్మిదో వరుసలో రాంసింగ్ అనే వ్యక్తి మల, మూత్ర విసర్జన జరపడంతోపాటు ఉమ్మి వేశాడు. అనుచిత ప్రవర్తన గమనించిన సిబ్బంది అతడిని హెచ్చరించి, మిగతా ప్రయాణికులకు దూరంగా ఉంచామని ఎయిరిండియా పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. రాం సింగ్‌పై ఐపీసీ సెక్షన్లు-294(అసభ్య చేష్టలు), 510(మద్యం మత్తులో అనుచిత ప్రవర్తన) కింద కేసు నమోదు చేశామని ఢిల్లీ పోలీసులు తెలిపారు. విమానాల్లో ప్రయాణికులు అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఘటనలు ఇటీవలి కాలంలో ఎక్కువయ్యాయి.

మణిపూర్‌కు సాయం చేసేందుకు అవకాశమివ్వండి

ఇంఫాల్: ఈశాన్య రాష్ట్రాల్లో శాంతిని పునరుద్ధరించేందుకు ప్రజలు తమకు సహాయం చేయాలనిఆర్మీ కోరింది. సహాయక చర్యలందించడానికి తాము వెళ్లకుండా మహిళా ఉద్యమకారులు రోడ్లపై అడ్డంకులు సృష్టిస్తున్నారని, తమ కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తున్నారని ఆర్మీ తెలిపింది. ఇలాంటి అనవసర జోక్యం వల్ల భద్రతా బలగాలు సరైన సమయానికి చేరుకోలేకపోతున్నాయని ఆర్మీ ట్విట్టర్‌లో సోమవారం ఓ వీడియో విడుదల చేసింది. ''శాంతి పునరుద్ధరణకోసం కార్యక్రమాలకు మద్దతు ఇవ్వాలని అన్ని వర్గాల ప్రజలను ఇండియన్ ఆర్మీ కోరుతోంది. మణిపూర్‌కు సాయం చేసేందుకు మాకు సాయం చేయండి'' అంటూ ట్వీట్ చేసింది. తూర్పు ఇంఫాల్‌లోని ఇథం గ్రామంలో ఆర్మీ, మహిళల నేతృత్వంలోని ఓ సమూహం మధ్య శనివారం రోజంతా ప్రతిష్టంభన నెలకొంది. దీంతో ఆర్మీ 12 మంది ఉగ్రవాదులను వదిలిపెట్టింది. ఈ ఘటన జరిగిన రెండు రోజుల తరువాత ఆర్మీ ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. 2015లో 6 డోగ్రా యూనిట్‌పై ఆకస్మిక దాడితో సహా అనేక దాడుల్లో పాల్గొన్న మైతీ మిలిటెంట్ గ్రూప్ అయిన కంగ్లీ యావోల్ కన్న లుప్ (కేవైకేఎల్)కు చెందిన 12 మంది సభ్యులు గ్రామంలో దాగి ఉన్నారని వారు తెలిపారు. భద్రతా సిబ్బంది ఆయుధాలు, మందుగుండు సామగ్రిని కూడా వారు స్వాధీనం చేసుకున్నారు. షెడ్యూల్డ్ తెగ (ఎస్టీ) హోదా కోసం మైతీ కమ్యూనిటీ డిమాండ్‌కు వ్యతిరేకంగా కొండ జిల్లాల్లో మే 3న 'ఆదివాసి సంఘీభావ యాత్ర' నిర్వహించిన తర్వాత మొదట ఘర్షణలు చెలరేగడం, ఈశాన్య రాష్ట్రంలో మైతీ, కుకీ కమ్యూనిటీల మధ్య చెలరేగిన హింసలో ఇప్పటివరకు 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో తమ కార్యకలాపాలకు సహకరించండంటూ ఆర్మీ విజ్ఞప్తి చేస్తోంది.

మమతకు గాయాలు

హెలికాప్టర్ ఎమర్జెన్సీ ల్యాండింగ్‌తో ప్రమాదం

కోల్‌కతా: ప్రతికూల వాతావరణ పరిస్థితుల మధ్య పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ మంగళవారం సెవోక్ వైమానిక స్థావరంలో అత్యవసరంగా ల్యాండింగ్ అయింది. ఆకాశంలో దట్టంగా మబ్బులు కమ్ముకొని భారీగా వర్షాలు కురుస్తూ ఉండడంతో ముందున్నది కనిపించక హెలికాప్టర్‌ను అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సి వచ్చింది. ల్యాండింగ్ సమయంలో మమత మోకాళ్లకి, వీపుకి గాయాలయ్యాయి. దీంతో చికిత్స కోసం ఆమెను కోల్‌కతాలో ఎస్ఎస్‌కేఎం ఆస్పత్రికి తరలించారు. జల్పాయ్‌గురిలోని క్రాంతి బహిరంగ సభలో మాట్లాడి బాగ్‌డోగ్రాకు వెళుతుండగా ఈ ఘటన జరిగింది. రానున్న పంచాయతీ ఎన్నికల కోసం మమత రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

ఫిబ్రవరిలో లోక్‌సభ ఎన్నికలు

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మరో ఆరునెలలు మాత్రమే ఉంటుందని మమతా బెనర్జీ అన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చిలో లోక్‌సభ ఎన్నికలు జరుగుతాయని అందులో అధికార బీజేపీకి ఓటమి ఖాయమన్నారు. జల్పాయ్‌గురి జిల్లాలో జరిగిన ఒక ర్యాలీలో మమత మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోవడం ఖాయమన్నారు. సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) నిష్పాక్షికంగా పని చేయాలన్నారు. ఇటీవల బీఎస్ఎఫ్ కాల్పుల్లో మరణించిన వారి కుటుంబాలకు 2 లక్షల నష్టపరిహారం, ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామన్నారు.



ఇంటెలిజెన్స్ ఏడీజీపీ బదిలీ

సాక్షి, చెన్నై : రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం ఏడీజీపీ ఎస్.డేవిడ్సన్ దేవాశీర్వాదంను బదిలీ చేశారు. ఈ మేరకు మంగళవారం రాత్రి హోంశాఖ ప్రధాన కార్యదర్శి టి.అముద ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన్ను చెన్నై పోలీసు హెడ్‌క్వార్టర్స్ ఏడీజీపీగా నియమించారు. రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం బాధ్యతలను ఐజీగా ఉన్న ఎ.సెంథిల్‌వేలన్‌కు అదనంగా అప్పగించారు. అలాగే రాష్ట్ర శాంతిభద్రతల విభాగం అదనపు డీజీపీగా ఆవడి పోలీసు కమిషనర్ ఎ.అరుణ్‌ను నియమించారు. ఈ పోస్టులో ఉన్న కె.ఎ.శంకర్‌ను ఆవడి పోలీసు కమిషనర్‌గా బదిలీ చేశారు.

న్యూస్‌రీల్

అధ్యక్షుడు ఎవరైనా ఓకే!

– కేఎస్ అళగిరి



కేఎస్ అళగిరి

సాక్షి, చెన్నై: రాష్ట్ర అధ్యక్షుడిగా ఎవరిని నియమించినా కలిసి పనిచేయడానికి తాను సిద్ధంగానే ఉన్నట్టు టీఎన్‌సీసీ ప్రస్తుత అధ్యక్షుడు కేఎస్ అళగిరి వ్యాఖ్యానించారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఆయన ఐదేళ్లుగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన్ను తప్పించి, కొత్త వారికి అవకాశం ఇచ్చేందుకు కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించింది. దీంతో ఈ పదవి కోసం ఐదుగురు నేతలు తీవ్ర ప్రయత్నాల్లో ఉన్నారు. ఈ పరిస్థితులలో ఢిల్లీ నుంచి వచ్చిన పిలుపుతో అధిష్టానం పెద్దలను మంగళవారం కేఎస్ అళగిరి కలిశారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ నేతల రాహుల్‌గాంధీని కలిసినానంతరం మీడియాతో కేఎస్ అళగిరి మాట్లాడారు. ప్రస్తుత తమిళ రాజకీయ పరిస్థితులు, పార్టీ గురించి ఖర్గేతో మాట్లాడినట్టు తెలిపారు. 25 ఏళ్లలో ఎన్నడూ లేనివిధంగా ప్రస్తుతం తమిళనాడులో కాంగ్రెస్ బలపడి ఉందని, 72 శాతం విజయాన్ని సాధించి ఉన్నామన్న విషయాన్ని పెద్దలకు వివరించినట్టు పేర్కొన్నారు. అధ్యక్షుడిగా ఎవరిని నియమించినా వారితో కలిసి పని చేయడానికి తాను సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ఈ పదవి రేసులో నేను ఉన్నానా లేదా అన్నది పక్కన పెడితే, ఇది వరకు పార్టీ తనను గుర్తించి, ఎంతో నమ్మకంతో ఇచ్చిన పదవికి న్యాయం చేశానని తెలిపారు. పదవిలో ఉన్నా, లేకున్నా, పార్టీ తనకు గుర్తింపు ఇస్తుందని, ఇప్పటివరకు ఎంతో ప్రోత్సాహాన్ని అందజేసిందని గుర్తుచేశారు. మళ్లీ అధ్యక్ష పదవికి తనకు ఇస్తారని ఎదురు చూడబోనన్నారు. ఎవరిని నియమించినా తనకు సమ్మతం అని, పార్టీలో ఏ పదవి ఇచ్చినా అందుకు న్యాయం చేయడానికి సిద్ధంగానే ఉన్నట్టు స్పష్టం చేశారు.

టీఎంబీలో ఐటీ సోదాలు

సాక్షి, చెన్నై: తూత్తుకుడిలోని టీఎంబీ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో ఐటీ అధికారులు సోదాలలో మంగళవారం నిమగ్నమయ్యారు. తూత్తుకుడి కేంద్రంగా రాష్ట్రంలో తమిళనాడు మార్కంటైల్ బ్యాంక్ సేవలు జరుగుతున్న విషయం తెలిసిందే. రూ.2 వేల నోట్ల రద్దు ప్రకటన తర్వాత ఈ బ్యాంక్ ద్వారా పెద్ద ఎత్తున ఆ నోట్ల మార్పిడి జరిగినట్టు ఐటీ పరిశోధనలో తేలినట్టు సమాచారం. కొందరు రాజకీయ ప్రముఖులు, వ్యాపార వేత్తలకు సంబంధించిన నగదుగా వాటిని భావిస్తున్నారు. ఈ బ్యాంక్ ద్వారా జరిగిన ఈ లావాదేవీల గుట్టును రట్టు చేసేందుకు 16 మందితో కూడిన ఐటీ అధికారులు మంగళవారం రంగంలోకి దిగారు. తూత్తుకుడిలోని ఆ బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని సోదాలు చేస్తున్నారు. బ్యాంక్ లావాదేవీలు, అక్కడి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇదిలాఉండగా పుదుకోట్టై జిల్లా అరంతాంగిలోని సహకార బ్యాంక్‌లో ఐదేళ్లుగా నగదు లావాదేవీల రికార్డులు సరిగ్గా నమోదు కానట్టు ఐటీ దృష్టికి చేరింది. దీంతో ఆ బ్యాంక్‌లోనూ సోదాలు చేశారు. ఐదు సంవత్సరాల రికార్డులను సమర్పించాలని సహకార బ్యాంక్ వర్గాలను ఐటీ అధికారులు ఆదేశించారు.

నల్లదుస్తులు వద్దు

– విద్యార్థులకు డ్రెస్ కోడ్



పెరియార్ వర్సిటీ

సాక్షి, చెన్నై: గవర్నర్ ఆర్ఎన్ రవి రాకను దృష్టిలో ఉంచుకుని పెరియార్ వర్సిటీ వర్గాలు తమ విద్యార్థులకు డ్రెస్ కోడ్ నిబంధనలను అమలు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థులు ఎవ్వరూ నల్ల దుస్తులు ధరించి స్నాతకోత్సవానికి హాజరయ్యేందుకు వీలు లేదని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వానికి, గవర్నర్ ఆర్ఎన్ రవికి మధ్య జరుగుతున్న వివాదం గురించి తెలిసిందే. ఈ వివాదం కారణంగా ప్రభుత్వ విద్యా సంస్థలలో స్నాతకోత్సవాల నిర్వహణలో జాప్యం నెలకొంది. సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు ఎదురు చూడాల్సిన పరిస్థితి. ఈ వివాదాల నడుమ ఎట్టకేలకు పెరియార్ వర్సిటీ స్నాతకోత్సవానికి గవర్నర్ అనుమతి ఇచ్చారు. బుధవారం సేలంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ స్నాతకోత్సవానికి హాజరయ్యే విద్యార్థులకు డ్రెస్ కోడ్ విధించారు. నల్ల దుస్తులు ధరించి వచ్చేందుకు వీలు లేదని ఆదేశించారు. కార్యక్రమానికి గంటన్నర ముందే ఆడిటోరియంలోకి విద్యార్థులు రావాలని సూచించారు. అయితే, ఈ డ్రెస్ కోడ్‌ను సర్వత్రా వ్యతిరేకిస్తున్నారు. నల్లదుస్తులు ధరించకూడదని పెరియార్ వర్సిటీ వర్గాలు ప్రకటించడాన్ని మదురై ఎంపీ వెంకటేషన్ ఖండించారు. అయితే, గవర్నర్‌కు వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలు నిరసనకు నిర్ణయించిన సమాచారంతో పోలీసుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆ వర్సిటీ వర్గాలు పేర్కొంటున్నాయి.



బన్రూటిలో జీడిపప్పు ప్రాసెసింగ్ గ్రూపును ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్

పారిశ్రామిక రంగంలో నంబర్‌వన్ లక్ష్యం

- సీఎం స్టాలిన్
- ఘనంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల దినోత్సవం
- రూ.1,723 కోట్ల పెట్టుబడి ఒప్పందాలు
- 30 వేల మందికి ఉపాధి మార్గం

సాక్షి, చెన్నై: దేశంలోని తమిళనాడును పారిశ్రామిక రంగంలో మొదటి స్థానంలో నిలబెట్టడం లక్ష్యంగా ముందుకెళ్దామని సీఎం స్టాలిన్ వ్యాఖ్యానించారు. మంగళవారం జరిగిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల దినోత్సవంలో రూ.1,723 కోట్ల పెట్టుబడి ఒప్పందాలు జరిగాయి. 30 వేల మందికి ఉపాధి మార్గం దిశగా నిర్ణయాలు తీసుకున్నారు. అంతర్జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల దినోత్సవం మంగళవారం నందంబాక్కం ట్రేడ్ సెంటర్‌లో ఘనంగా జరిగింది. ఇందులో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, దేశ ఆర్థికాభివృద్ధి, ఉపాధికి దోహదపడే నిర్ణయాలు తీసుకున్నారు. సీఎం స్టాలిన్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సామాజిక న్యాయం, పారిశ్రామిక రంగంలో రాణిస్తున్న వారిని ఈ సందర్భంగా సత్కరించారు. 'అంబేడ్కర్ ఇండస్ట్రియల్ స్కీమ్' మేరకు రూ.57.55 కోట్ల ప్రాజెక్ట్ మేరకు 100 మంది లబ్ధిదారులకు వ్యాపార ప్రారంభ మూలధనం అందజేశారు. ఈ పథకం కింద పరిశ్రమలకు స్థలాలు, భవన నిర్మాణాలకు 35 శాతం సబ్సిడీతో రుణాలు అందజేయనున్నట్టు ప్రకటించారు. అలాగే, మూడు నెలల వ్యవధిలో ఇప్పటివరకు 127 ఆది ద్రావిడ, గిరిజన పారిశ్రామికవేత్తలకు రూ. 24.26 కోట్లు అందజేశామని సీఎం గుర్తుచేశారు.



ఒప్పందాలు చేసుకుంటున్న సీఎం స్టాలిన్

కొత్తగా పారిశ్రామిక వాడలు..

చెంగల్పట్టు, తిరుచ్చి, మదురైలలో 262.03 ఎకరాలలో రూ.153 కోట్లతో పారిశ్రామిక వాడలను ఈసందర్భంగా ప్రారంభించారు. ఇక్కడ 21,500 మందికి ఉపాధి లక్ష్యంగా నిర్ణయాలు తీసుకున్నారు. కడలూరు జిల్లా బన్రూటిలో రూ. 2 కోట్లతో జీడిపప్పు ప్రాసెసింగ్ గ్రూపును ఏర్పాటు చేశారు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు మార్కెట్‌ల అభివృద్ధి, స్కూల్ ఇన్నోవేషన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు చర్యలు తీసుకున్నారు. ఈ వేడుకలో భాగంగా ఆటో స్పేర్‌పార్ట్‌లకు ఎంట్రప్రెన్యూర్ అవార్డులను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల తరఫున రూ.1723.05 కోట్ల పెట్టుబడులు నిర్ధారణ అయ్యాయి. దీని ద్వారా 30 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నామని సీఎం స్టాలిన్ ప్రకటించారు. అలాగే, తమిళనాడులో ఆరు కొత్త పారిశ్రామిక వాడలను ఏర్పాటు చేయనున్నామని ప్రకటించారు. పారిశ్రామిక రంగంలో దేశంలోనే తమిళనాడును ముందంజలో నిలబెడదామని వ్యాఖ్యలు చేశారు. ప్రతి ఏటా పారిశ్రామిక రంగానికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తున్నదని గుర్తుచేశారు. కార్యక్రమంలో మంత్రులు అన్బరసన్, అన్బిల్ మహేశ్ పాల్గొన్నారు.

టమాట ధర కట్టడికి చర్యలు

సాక్షి, చెన్నై: టమాట ధర కట్టడికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మంగళవారం మంత్రి పెరియకరుప్పన్ నేతృత్వంలో అధికారులు సమావేశమయ్యారు. కిలో టమాట ధర రాష్ట్రంలో రూ.100 దాటిన విషయం తెలిసిందే. ధర అమాంతంగా పెరుగుతుండడంతో ప్రభుత్వం స్పందించింది. అధికారులతో జరిగిన సమావేశానంతరం టమాట ధర కట్టడి చర్యలపై దృష్టి పెట్టామని మంత్రి తెలిపారు. అలాగే, ఎవరైనా టమాటాను నిల్వ ఉంచుకుని ధరల పెంపుపై దృష్టిపెడితే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈవీఎంలు సిద్ధం

- ఈసీ సత్యప్రద సాహు



సత్యప్రదసాహు

సాక్షి, చెన్నై: లోక్‌సభ ఎన్నికల కోసం రాష్ట్రంలో ఈవీఎంలు, కంట్రోల్ ప్యానల్, వీవీ పాడ్‌లను సిద్ధం చేసి ఉంచామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన కమిషనర్(ఈసీ) సత్యప్రద సాహు తెలిపారు. 2024 లోక్‌సభ ఎన్నికల ఏర్పాట్లు, ఈవీఎంల గురించి శిక్షణ కార్యక్రమం మంగళవారం ఓ హోటల్‌లో జరిగింది. ఇందులో కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రతినిధులు సమగ్ర వివరాలను అధికారులకు తెలియజేశారు. సత్యప్రద సాహు మీడియాతో మాట్లాడుతూ తమిళనాడులో 98 వేల పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని గుర్తు చేశారు. ఒక్కో పోలింగ్ బూత్‌కు 1,500 మంది ఓటర్లను కేటాయించే విధంగా ఏర్పాటు చేశామన్నారు. ఓటర్ల సంఖ్య పెరిగిన పక్షంలో అదనంగా పోలింగ్ బూత్‌ల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఎన్నికలలో ఉపయోగించేందుకుగాను లక్షా 78 వేల 357 ఈవీఎంలు, లక్షా 2,581 కంట్రోల్ ప్యానల్‌లు, లక్షా 8 వేల 732 వీవీ పాడ్‌లను సిద్ధం చేశామన్నారు. కొత్త ఓటర్ల చేరికకు మరో మూడు నెలలు అవకాశం కల్పించామని గుర్తు చేశారు. జూలై 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు నెల రోజుల పాటు ఇంటింటా ఓటరు పరిశీలన కార్యక్రమాలకు సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు పేర్కొన్నారు.

చెన్నైలో ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్

- భద్రతా పర్యవేక్షణలో మరో అడుగు
- మ్యాపింగ్ ద్వారా క్రైమ్ జోన్స్ గుర్తింపు
- గస్తీకి 110 వాహనాలు



ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ శంకర్‌జివ్వాల్

సాక్షి, చెన్నై: చెన్నైలో భద్రతా పరంగా కట్టుదిట్టమైన చర్యల్లో భాగంగా పోలీసు యంత్రాంగం మరో అడుగు ముందుకు వేసింది. ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. క్రైమ్ ఏరియాలను జీపీఎస్, క్రైమ్ జోన్స్‌ను ఏఐ మ్యాపింగ్ ద్వారా గుర్తించే విధంగా ఈ సెంటర్‌లో ప్రత్యేకచర్యలు తీసుకున్నారు. చెన్నై సేఫ్ సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశామని పోలీసు కమిషనర్ శంకర్ జివ్వాల్ తెలిపారు. మంగళవారం ఈ సెంటర్‌ను ఆయన పనితీరును పరిశీలించారు. కంట్రోల్ రూమ్‌లో నేర ప్రాంతాల భౌగోళిక సమాచార వ్యవస్థతో మ్యాపింగ్ సిద్ధం చేశారు. మెట్రోపాలిటన్ పరిధిలో నేరాలను నిరోధించడానికి, తక్షణం లోకేషన్లను గుర్తించి సిబ్బందిని అప్రమత్తం చేయడానికి వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇక్కడ సహాయక కేంద్రాలు, క్రైమ్ డేటా వివరాలతో ప్రత్యే ఏర్పాట్లు, కంప్యూటర్ల ద్వారా అత్యవసర పరిస్థితుల నిర్వహణ, బ్యాంకింగ్‌తో పాటు ఇతర దొంగతనాల కట్టడి, మహిళలు, పిల్లలకు రక్షణ, సమస్యాత్మక ప్రాంతాలలో నిఘా వ్యవహారాలను ఇక్కడి నుంచే పర్యవేక్షించేందుకు సమగ్ర ఏర్పాట్లు చేశారు. అదనపు కమిషనర్లు ప్రేమానంద్ సిన్హా, లోకనాథన్, కపిల్‌కుమార్, పాల్గొన్నారు.

గస్తీకి 110 వాహనాలు..

చెన్నై నగరంలో గస్తీని ముమ్మరం చేసే విధంగా అదనపు వాహనాలు కొనుగోలు చేశారు. అన్ని రకాల భద్రతా ఉపకరణాలతో కూడిన ఈ గస్తీ వాహనాలను ఎగ్మూర్ రాజరత్నం స్టేడియానికి తీసుకొచ్చారు. వీటిని కమిషనర్ శంకర్ జివ్వాల్ జెండా ఊపి ప్రారంభించారు.

డీఎంకే ఎంపీపై కేసులు

- పార్టీ షోకాజ్ నోటీసు
- వివాదంగా సీఎస్ఐ వ్యవహారం



ఎంపీ జ్ఞాన ద్రవ్యం


సాక్షి, చెన్నై: సీఎస్ఐ పరిధిలోని పాఠశాల నిర్వహణ వ్యవహారంలో వివాదం డీఎంకే ఎంపీ జ్ఞానద్రవ్యంపై కేసుల నమోదు పరిస్థితులు దారి తీశాయి. ఆయనపై ఏకంగా ఐదు సెక్షన్లతో కేసు నమోదు చేయడంతో పార్టీ ప్రధాన కార్యదర్శి దురై మురుగన్ షోకాజ్ నోటీసు ఇచ్చారు. సీఎస్ఐ క్రైస్తవ మత సంస్థ పరిధిలో ఉన్న విద్యా సంస్థలు, ఆస్పత్రులు, వీటి నిర్వహణ అంశాల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దక్షిణ తమిళనాడులో సీఎస్ఐ పరిధిలో అధికశాతం సభ్యులు ఉన్నారు. గత ఏడాది తిరునల్వేలిలో జరిగిన సీఎస్ఐ నిర్వహణ ఎన్నికలు తీవ్ర ఉద్రిక్తత మధ్యజరిగాయి. ఇందులో జయసింగ్ గెలిచారు. ఆయన సిఫారసుల మేరకు సీఎస్ఐ జరుగుతున్న వ్యవహారాలను బిషప్ తీవ్రంగా పరిగణించారు. నెల రోజులుగా ఈ వివాదం జరుగుతున్న సమయంలో తిరునల్వేలి డీఎంకే ఎంపీ జ్ఞాన ద్రవ్యం నిర్వహణలో ఉన్న కొన్ని పాఠశాలలపై బిషప్ దృష్టిపెట్టారు. ఆయన్ను తప్పించి మరొకరికి నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆగ్రహించిన ఎంపీ జ్ఞాన ద్రవ్యం సోమవారం తన ఆగ్రహాన్ని ప్రదర్శించారు. ఆయన వర్గీయులు పలువురిపై పాఠశాల ఆవరణలో దాడి చేసినట్టుగా వీడియోలు సామాజిక మాధ్యమాలలో వైరల్ అయ్యాయి. తనపై ఎంపీ వర్గీయులు జరిపిన దాడి గురించి న్యాయవాది అరుల్ మాణిక్యంతో పాటు మత బోధకుడు కార్పర్ నోబల్ ఇచ్చిన ఫిర్యాదుతో తిరునల్వేలి పోలీసులు ఎంపీతో పాటు ఆయన వర్గీయులపై ఐదు సెక్షన్లతో కేసు నమోదు చేశారు. అరెస్టుకు ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. ఈ వ్యవహారాన్ని డీఎంకే అధిష్టానం తీవ్రంగా పరిగణించింది. పార్టీ పేరుకు కలంకం తెచ్చే విధంగా బాధ్యత గల పదవిలో ఉంటూ వ్యవహరించిన జ్ఞానద్రవ్యంపై కన్నెర్ర చేస్తూ డీఎంకే ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ మంగళవారం నోటీసులు ఇచ్చారు. వారం రోజులలో వివరణ ఇవ్వని పక్షంలో క్రమశిక్షణ చర్య తప్పదని హెచ్చరించారు.

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, చెన్నై: ఎంబీబీఎస్, బీడీఎస్ వైద్య కోర్సుల కౌన్సెలింగ్ నిమిత్తం దరఖాస్తుల ప్రక్రియ బుధవారం నుంచి ఆన్‌లైన్ ద్వారా జరగనున్నది. ఇందుకు సంబంధించిన ప్రకటనను రాష్ట్ర వైద్య విద్యా డైరెక్టరేట్ వర్గాలు మంగళవారం విడుదల చేశారు. నీట్ ఫలితాలు వెల్లడైనా కౌన్సెలింగ్ తేదీ ఇంతవరకు ప్రకటించలేదు. దీంతో వైద్యకోర్సుల కౌన్సెలింగ్ జాప్యం కావచ్చునని సర్వత్రా భావించారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలోని 38 ప్రభుత్వ వైద్య కళాశాలలు, రెండు దంత వైద్య కళాశాలలు, ప్రైవేటు కళాశాలలోని సీట్ల భర్తీకి చర్యలు చేపట్టారు. రాష్ట్రంలో 10,885 సీట్లు ఉన్నాయి. కేంద్రం కోటా సీట్లు పోగా 7 వేల సీట్లు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నాయి. నీట్ ఫలితాల ఆధారంగా ఈ సీట్ల భర్తీ జరగనుంది. ఈ ఏడాది రాష్ట్రం నుంచి నీట్ ఉత్తీర్ణత శాతం అధికంగా ఉండడంతో వైద్య సీట్లకు డిమాండ్ పెరిగింది. వైద్య సీట్లను దక్కించుకునే ఎదురుచూపుల్లో ఉన్న విద్యార్థుల వద్ద బుధవారం నుంచి జూలై 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. త్వరితగతిన కటాఫ్ మార్కుల వివరాలు, ర్యాంకుల జాబితాను ప్రకటించి జూలై మూడో వారంలో కౌన్సెలింగ్‌కు శ్రీకారం చుట్టేందుకు తగ్గ కసరత్తులపై వైద్య విద్యా డైరెక్టరేట్ దృష్టి పెట్టింది.

ఏమీ చేయలేక కుర్చీలో ఉన్నా!

- సీఎం రంగస్వామి ఆవేదన



రంగస్వామి

సాక్షి, చెన్నై : తాను ఏమీ చేయలేని పరిస్థితులలో ఈ కుర్చీలో ఉన్నానని పుదుచ్చేరి సీఎం రంగస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. కరోనాకాలంలో నియమితులైన నర్సులు తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కొంతకాలంగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మంగళవారం సీఎం రంగస్వామిని కలిసేందుకు వచ్చిన నర్సులను పోలీసులు అడ్డుకున్నారు. సచివాలయం వద్ద వీరు ఆందోళనకు దిగారు. అదే సమయంలో అటు వైపుగా వచ్చిన డీఎంకే ఎమ్మెల్యేలు వారికి మద్దతు ఇచ్చారు. సీఎం రంగస్వామిని కలిసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈసందర్భంగా నర్సులతో రంగస్వామి మాట్లాడుతూ తన ఆవేదనను వెళ్లగక్కడం గమనార్హం. గతంలో ఉన్న పాలన వేరు, ప్రస్తుతం ఉన్న పాలన వేరని వ్యాఖ్యలు చేశారు. కరోనా కాలంలో నియమించిన నర్సులను తొలగించాలని అధికారులు తనకు సూచించారని గుర్తుచేశారు. అయితే, తానే మూడు నెలలకు ఒక పర్యాయం కాంట్రాక్టు కాలాన్ని పొడిగిస్తూ వచ్చానని వివరించారు. ఇక్కడున్న వారి ముందు చెప్పడంలో సంకటంగా ఉందంటూ, సీఎం కుర్చీలో ఎందుకు ఉన్నానో అని అసహనం వ్యక్తం చేశారు. సీఎం చెబితే గతంలో అధికారులు చేసే వారని, ఇప్పుడు అలా చేయడం లేదన్నారు. ప్రభుత్వ కార్యాక్రమాలకు వెళ్లినా, శిలాఫలకంలో తన పేరు ఉందా అని చూసుకోవాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు అధికారులు అయితే, వీఆర్ఎస్ ఇవ్వాలని కోరుతున్నారని వివరించారు. విద్యుత్ శాఖలో సెలవులపై అనేక మంది అధికారులు వెళ్లిపోయారని గుర్తు చేశారు. తన చేతిలో అధికారం ఉంటే, కరోనా కాలంలో సేవలు అందించిన నర్సుల కాంట్రాక్టు ఐదేళ్లకు పొడిగించేందుకు సిద్ధంగా ఉన్నానని, తన చేతిలో ఏమీ లేదని, అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేయడం గమనార్హం.

వాడివేడిగా వాదనలు

సాక్షి, చెన్నై: మంత్రి సెంథిల్ బాలాజీ అరెస్టు వ్యవహారంపై హైకోర్టులో మంగళవారం వాడివేడిగా వాదనలు జరిగాయి. మనీలాండరింగ్ కేసులో సెంథిల్ అరెస్టయిన విషయం తెలిసిందే. చట్టవిరుద్ధంగా తన భర్తను అరెస్టు చేశారని పేర్కొంటూ మంత్రి సతీమణి మేఘల దాఖలు చేసిన పిటిషన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తరఫున కోర్టులో వాదనలు జరిగాయి. వాద, ప్రతివాదనలు కోర్టులో జరిగాయి. అనంతరం తీర్పును తేదీ ప్రకటించకుండా కోర్టు వాయిదా వేసింది.

నటుడు సురేష్‌కు బిగిసిన ఉచ్చు

సాక్షి,చెన్నై: ఆరుద్రా గోల్డ్ పేరిట జరిగిన అక్రమాలలో సినీ నటుడు ఆర్‌కే సురేష్ మెడకు మరింతగా ఉచ్చు బిగిసింది. రూ.15 కోట్ల ఆయన ఖాతాలో వేసుకున్నట్టు ఆర్థిక నేర విభాగం విచారణలో తేలింది. ఆరుద్రా గోల్డ్ పేరిట రాష్ట్రవ్యాప్తంగా జరిగిన రూ. 2,438 కోట్ల మోసం కేసును ఆర్థిక నేర విభాగం విచారిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ కేసులో 11 మంది అరెస్టు అయ్యారు. ఇందులో ఆ సంస్థ డైరెక్టర్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు కావడం గమనార్హం. అలాగే, సినీ నటుడు, బీజేపీ నాయకుడైన ఆర్‌కే సురేష్ పేరు కూడా ఈ వ్యవహారంలో వెలుగులోకి వచ్చింది. ఆయన్ను విచారించేందుకు పలుమార్లు సమన్లు జారీ చేసినా ఫలితం శూన్యం. షూటింగ్ నిమిత్తం విదేశాలకు వెళ్లిన ఆయన మళ్లీ తిరిగి రాకుండా అక్కడే తిష్ట వేసి ఉన్నారు. ఈ పరిస్థితులలో ఈ వ్యవహారంలో సురేష్‌కు రూ.15 కోట్లుముట్టినట్టు విచారణలో తేలింది. ఆర్థిక నేర విభాగం సిద్ధం చేసి కోర్టుకు సమర్పించిన చార్జ్‌షీట్‌లో ఈ వివరాలను పొందుపరిచారు. దీంతో సురేష్ మెడకు ఆరుద్రా గోల్డ్ వ్యవహారం మరింత ఉచ్చుగా మారింది.

వళ్లువర్‌కోట్టం మార్గంలో భారీ వంతెన

- రూ.195 కోట్లతో పనులు
- ఫోర్‌వేగా నిర్మాణాలు
- ప్రభుత్వం ఉత్తర్వులు



వళ్లువర్ కోట్టం జంక్షన్

సాక్షి, చెన్నై: వళ్లువర్ కోట్టం మార్గంలో భారీ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రూ.195కోట్లతో పనులకు నిర్ణయిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. చెన్నై నుంగంబాక్కంలోని వళ్లువర్‌కోట్టం తమిళ సంస్కృతి, సంప్రదాయాలు, పురాతనతకు అద్దం పట్టే కళాఖండాల సమూహారంతో నిండిన పర్యాటక ప్రదేశంగా బాసిల్లుతున్న విషయం తెలిసిందే. తమిళ కవి తిరువళ్లువర్ పేరిట ప్రత్యేక ఆకర్షణతో కూడిన రథంతో పాటు ఈ వళ్లువర్‌కోట్టంను ఒకప్పుడు డీఎంకే పాలకులు నిర్మించారు. అన్నాడీఎంకే హయాంలో దీనిని తుంగలో తొక్కారు. మళ్లీ డీఎంకే అధికారంలోకి రావడంతో సొబగులు దిద్దారు. ఇక్కడకు సందర్శకులు తరలి రావడమే కాకుండా, పరిసరాలలో ఎగ్జిబిషన్ వంటి ఏర్పాట్లు చేశారు. అలాగే, ఈ పరిసరాలు నిత్యం ట్రాఫిక్ రద్దీతో ఉంటాయి. కోడంబాక్కం, టీ నగర్, నుంగంబాక్కం, జెమిని వంతెన వైపుగా వెళ్లే వాహనాలన్నీ వళ్లువర్‌కోట్టం కూడలి దాటాల్సిందే. ఇక్కడే ప్రజా సంఘాలు, పార్టీల నిరసనల నిర్వహణ వేదిక కూడా ఉంది. నిరసనల సమయంలో ఇక్కడ ట్రాఫిక్ రద్దీ మరీ ఎక్కువే. వాహనాల దారులు ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని ఛేదించాలంటే చెమటోడ్చక తప్పదు. ఈ కూడలిలో బ్రహ్మాండ వంతెన నిర్మించాలని ఎప్పటి నుంచో నినాదం తెరపై ఉంది. దీనిని ప్రస్తుతం కార్యరూపంలోకి తెచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.

భారీ వంతెనకు రూ.195 కోట్లు..

వళ్లువర్‌కోట్టం కూడలిలో ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరించేందుకు బ్రహ్మాండ వంతెన నిర్మాణానికి సంబంధించిన ఉత్తర్వులను అధికారులు జారీ చేశారు. రూ.195 కోట్లతో పనులకు అనుమతి ఇచ్చారు. ఇందులో రూ.67 కోట్ల వంతెన నిర్మాణానికి, రూ.113 కోట్ల స్థలసేకరణకు కేటాయించారు. ఇక్కడ వంతెన నిర్మాణానికి స్థల సేకరణ కీలకంగా ఉండడంతో అధిక నిధులు కేటాయించి ఉండడం గమనార్హం. కోడంబాక్కం హైరోడ్డు నుంచి వళ్లువర్ కోట్టం కూడలిని కలుపుతూ జెమినీ వంతెన వైపు మార్గంలోని పామ్‌గ్రో హోటల్ వరకు ఈ వంతెనను నిర్మించనున్నారు. 570 మీటర్లతో ఫోర్‌వేగా ఈ వంతెన నిర్మాణానికి సంబంధించిన సమగ్ర కార్యాచరణను ఉత్తర్వుల రూపంలో పేర్కొన్నారు.

క్లుప్తంగా

విస్తృతంగా మొక్కలు నాటాలి



అరణ్‌వాయల్ ప్రాంతంలోని పరిశ్రమలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించిన అదనపు కలెక్టర్ రిషబ్

తిరువళ్లూరు: చిన్న అడవుల సృష్టి పేరిట జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా మొక్కలను నాటాలని నిర్ణయించినట్టు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి అదనపు కలెక్టర్ రిషబ్ తెలిపారు. మాజీముఖ్యమంత్రి కరుణానిధి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా తిరువళ్లూరు జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో చిన్నఅడవుల సృష్టి కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం అరణ్ వాయల్ ప్రాంతంలోని చెన్నై బ్రేవరీ పరిశ్రమ ఆవరణలో జరిగింది. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ రిషబ్ హాజరై చిన్న అడవుల సృష్టి కార్యక్రమంలో భాగంగా ఎకరా స్థలంలో 4 వేల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్మికులు, ఉద్యోగులు కలిసి తమ పరిసర ప్రాంతాల్లో మొక్కలను విస్తృతంగా నాటాలని అదనపు కలెక్టర్ రిషబ్ పిలుపునిచ్చారు. అనంతరం ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, పసుపు సంచులను మళ్లీ వాడాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా చిన్న అడవుల సృష్టించి తద్వారా విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రణాళికబద్ధంగా చేపడుతామన్నారు. జిల్లా పర్యావరణశాఖ ఇంజినీర్ రవిచంద్రన్, తమిళనాడు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ మణిమేఘల, అసిస్టెంట్ ఇంజినీర్లు రఘుకుమార్, సబరినాథన్, బ్రేవరీ ఫ్యాక్టరీ చీఫ్ మహేష్ పాల్గొన్నారు.

బాల్యవివాహం అడ్డగింత

తిరువొత్తియూరు: వేలచ్చేరి సమీపంలో బాలికల భద్రత విభాగం అధికారులు బాల్య వివాహాన్ని అడ్డుకుని నిలుపుదల చేశారు. వేలచ్చేరి సమీపం మేడవాక్కంకు చెందిన 15 ఏళ్ల బాలిక పదవ తరగతి చదివి ఇంటి వద్ద ఉంటోంది. ఈమెకు తల్లిదండ్రులు చెన్నై తురయూరుకు చెందిన బంధువు మనివేల్ (26)తో పెళ్లి చేసేందుకు నిశ్చయించారు. ఈ క్రమంలో ఈ సంఘటన సంబంధించి చైల్డ్‌లైన్ నిర్వాహకులకు సోమవారం రహస్య సమాచారం అందింది. దీంతో చెంగల్పట్టు చిన్నారుల భద్రత అధికారులు పవిత్ర, కార్యాలయ ఉద్యోగులు సంఘటన స్థలాన్ని చేరుకుని బాలికను రక్షించి పల్లికరనై పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారణ చేశారు. చిన్నారిని చెంగల్పట్టు చిన్నారుల శరణాలయానికి అప్పగించారు.

ముగిసిన ఆషాఢ నవరాత్రి ఉత్సవాలు



యాగపూజలు చేస్తున్న భక్తులు



స్వామివారికి అభిషేకం

వేలూరు: రాణిపేట జిల్లా వాలాజలోని ధన్వంతరి ఆరోగ్యపీఠంలో పీఠాధిపతి మురళీధర స్వామిజీ ఆధ్వర్యంలో ఆషాఢ నవరాత్రి ఉత్సవాలు ఈనెల 18న ప్రారంభమై మంగళవారం సాయంత్రం నవమి తిథిన సంపూర్ణంగా ముగిసింది. తొమ్మిది రోజుల పాటు పీఠంలో పంచముగి యాగం, సూళిని, కాళీ, భగులముఖి, త్రిపుర భైరవి, వరగిత అనే పంచముఖ వరగి అమ్మవారికి ప్రతిరోజూ, పూజలు, అభిషేకాలు, వివిధ రకాలైన పుష్పాలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అదేవిధంగా ప్రతిరోజూ నవధాన్యాలు, ప్రత్యేక వనమూలికలతో కూడిన హోమం, నవలక్ష్మి హోమం, నవగ్రహ హోమం, శూలిని దుర్గహోమం, కాళీ హోమం, చండి హోమం వంటి వాటిని నిర్వహించారు. ప్రతిరోజూ ప్రత్యేక ద్రవ్యాలతో కూడిన పాలు, గంధం, పసుపు, పన్నీరు వంటి వాటితో అమ్మవారికి అభిషేకం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పీఠాధిపతి మాట్లాడుతూ బుధవారం ఉదయం పీఠంలో నాలుగు అడుగుల ఎత్తు 16 అడుగుల ఎత్తుతో కూడిన సుదర్శన పెరుమాళ్‌కు మహాసుదర్శన హోమంతో నవకలశ తిరుమంజనం నిర్వహించనున్నట్లు వీటిలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వీఐటీలో స్థిరమైన శీతలీకరణపై సదస్సు

వేలూరు: వేలూరు వీఐటీ యూనివర్సిటీ, వివిధ పరిశ్రమల సహకారంతో వీఐటీ యూనివర్సిటీలో స్థిరమైన శీతలీకరణపై సదస్సు వీఐటీ ఉపాధ్యక్షుడు శంకర్ విశ్వనాథన్ అధ్యక్షతన మంగళవారం ఉదయం ప్రారంభమైంది. ఈ సదస్సులో అన్నా యూనివర్సిటీ ప్రొఫెసర్, ఇండియన్ ఆర్గనైజేషన్ ఆఫ్ హీటింగ్, కూలింగ్ ఎయిర్ కండిషనింగ్ కార్యదర్శి శరవణన్ హాజరై ప్రసంగించారు.

సదస్సులో దేశ వ్యాప్తంగా ఉన్న వివిధ పారిశ్రామిక సంస్థల కార్యదర్శులు, అధికారులు, డైరెక్టర్‌లతో పాటు వీఐటీ వైస్ చాన్స్‌లర్ రిజిస్ట్రార్ జయ భారతి, ప్రొఫెసర్‌లు పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న అన్నా యూనివర్సిటీ ప్రొఫెసర్ శరవణన్

కలెక్టరేట్‌ను ముట్టడించిన గిరిజన సంఘాలు

తిరువళ్లూరు: రాష్ట్ర వ్యాప్తంగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న గిరిజన ఆదివాసీ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తమిళనాడు ఆదివాసీ ప్రజల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన నిర్వహించారు. ఆందోళనకు సంఘం జిల్లా కార్యదర్శి తమిళరసు అధ్యక్షత వహించి ప్రసంగించారు. తమిళరసు మాట్లాడుతూ 1980 వనసంరక్షణ చట్టంలో తీసుకొచ్చిన సవరణలను వెంటనే వెనక్కితీసుకోవాలని, 2006లో వనహక్కుల చట్టంలోని అంశాలను సంపూర్ణంగా అమలు చేయాలని, గిరిజనులకు కేటాయించిన సబ్‌ప్లాన్ నిధులను వారి సంక్షేమం కోసమే అమలు చేయాలని, గిరిజన ఆదివాసీ ప్రజలకు పట్టా, పక్కాగృహాలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే తాము కలెక్టరేట్‌ను ముట్టడించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, తమకు స్పష్టమైన హామీ లభించే వరకు తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. కాగా గిరిజనుల ఆందోళనతో కలెక్టరేట్ వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చలు జరిపారు. అనంతరం కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ వద్దకు వెళ్లి వినతి పత్రం సమర్పించారు. తమ సమస్యలను నెలరోజుల్లో పరిష్కరించాలని లేనిపక్షంలో తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. సంఘం నేతలు గంగాధరన్, షణ్ముగం, ప్రకాష్, సీపీఎం జిల్లా కార్యదర్శి గోపాల్ వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి సంపత్, జిల్లా అధ్యక్షుడు చిన్నదురై పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న గిరిజన సంఘాలు

నేడు రామసముద్రం
సమత్తువపురం ప్రారంభోత్సవం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న గృహాలు

పళ్లిపట్టు : పన్నెండేళ్ల నిరీక్షణకు ముగింపు పలికి రామసముద్రం పెరియార్ సమత్తువపురం నేడు సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించనున్నారు. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. పళ్లిపట్టు యూనియన్ రామసముద్రం గ్రామ పంచాయతీ పరిధిలో గత 2011లో డీఎంకే ప్రభుత్వంలో కరుణానిధి ముఖ్యమంత్రిగా వున్న సమయంలో పళ్లిపట్టు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రామన్ కృషితో పెరియార్ సమత్తువపురానికి బీజం పడింది. ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి కావస్తున్న క్రమంలో ప్రభుత్వ మార్పు చోటుచేసుకుని పదేళ్లుగా అన్నాడీఎంకే అధికారంలో సమత్తువపురం పథకానికి ఫుల్‌స్టాప్ పెట్టడంతో నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగి నిర్మాణ ఇళ్లు ధ్వంసం కావడంతో పాటు రోడ్లు, పార్కు, వాటర్ పైప్‌లైన్ పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో లబ్ధిదారులు ఆవేదన చెందారు. ఈ క్రమంలో అధికారం చేపట్టిన డీఎంకే రూ.1.50 కోట్ల వ్యయంతో సమత్తువపురం నిర్మాణ పనులు ప్రారంభించి దెబ్బతిన్న ఇళ్లకు మరమ్మతులు చేపట్టి రోడ్లు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు కల్పించారు. రెండు నెలల కిందట సీఎం చేతుల మీదుగా సమత్తువపురం ప్రారంభించి లబ్ధిదారులకు అందజేసేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా జరిగాయి.చివరి నిమషంలో ముఖ్యమంత్రి కార్యక్రమం రద్దు కావడంతో లబ్ధిదారులు తీవ్ర నిరాశ చెందారు. ఈ క్రమంలో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం సమత్తువపురం ప్రారంభించనున్నారు. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

రూ.34 లక్షలతో పశువైద్యశాల నిర్మాణం



జ్యోతిప్రజల్వన చేసి పశువైద్యశాలను ప్రారంభిస్తున్న వీజీ రాజేంద్రన్, ఆర్డీఓ జయరాజ్ బౌలిన్

- ప్రారంభించిన ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్

తిరువళ్లూరు: తిరువళ్లూరు జిల్లా తోమూరు వద్ద రూ.34 లక్షల వ్యయంతో నిర్మించిన పశువైద్యశాలను తిరువళ్లూరు ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్ మంగళవారం ఉదయం ప్రారంభించారు. తిరువళ్లూరు జిల్లా పూండి యూనియన్‌లోని తోమూరు గ్రామంలో రూ.34 లక్షలతో పశువైద్యశాలను నిర్మించారు. పనులు పూర్తయిన నేపథ్యంలో మంగళవారం ఉదయం ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి పాలన సాగుతోందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేస్తూ రాష్ట్రం అభివృద్ధి వైపు దూసుకెళుతోందని వివరించారు. కాగా పశువైద్యశాల అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో సెంద్రాన్‌పాళ్యం, మేట్టుపాళ్యం, తోమూరు, రామంజేరి, వళ్లిమాపేట గ్రామాలకు చెందిన పాడి రైతులకు ఉపయోగకరంగా మారనుంది. ఆర్డీఓ జయరాజ్‌బౌలిన్, తహసీల్దార్ మదియళగన్, పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసన్, రాజేంద్రన్, వీఏఓ శేఖర్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సుధ, యూనియన్ చైర్మన్ వెంకట్రమణ, వైస్‌చైర్‌పర్సన్ మహాలక్ష్మి పంచాయతీ అధ్యక్షురాలు శివశక్తి, యూనియన్ కౌన్సిలర్లు షణ్ముగం, విజీ పాల్గొన్నారు.

కంగువా కోసం పాట చిత్రీకరణ

తమిళసినిమా: సూర్య కథానాయకుడిగా నటిస్తున్న భారీ చారిత్రాత్మక కథాచిత్రం కంగువా. శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్ జ్ఞానవేల్ రాజా యూవీ.క్రియేషన్స్ సంస్థతో కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. బాలీవుడ్ బ్యూటీ దిశాపటాని నాయకిగా నటిస్తున్న ఈ చిత్రంలో యోగిబాబు, కోవై సరళ, కింగ్స్ లీ, ఆనంద్‌రాజ ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందిస్తున్నారు. చెన్నై, కొడైక్కెనాల్ ప్రాంతాలలో చిత్రీకరణ జరుపుకుంటున్న చిత్ర షూటింగ్ ఇప్పటికే 50 శాతం పైగా పూర్తి చేసుకుంది. సూర్య నటిస్తున్న ఈ చిత్రాన్ని 10 భాషలకు పైగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ఇప్పటికే వెల్లడించారు. అదేవిధంగా కంగువా చిత్రాన్ని 3డీ ఫార్మెట్లో రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇకపోతే ఈ చిత్రంలో ఆర్‌ఆర్‌ఆర్ చిత్ర నృత్యదర్శకుడు ప్రేమ్ రక్షిత్ పనిచేస్తున్నారన్నది తాజా వార్త. ఇందులోని ఒక పాటకు ఆయన నృత్య దర్శకత్వం వహించారు. ఈ పాట చిత్రీకరణ సోమవారంతో పూర్తయినట్లు తెలిసింది. కాగా కంగువా చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రథమార్థంలో తెరపైకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను, టైటిల్ పోస్టర్‌ను విడుదల చేయగా చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. దీంతో సూర్య అభిమానులు పండుగ చేసుకుంటున్నారు. కంగువా చిత్ర విడుదల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



కంగువా చిత్రంలో సూర్య

ఎంజీఆర్ వీరాభిమానిగా..

తమిళసినిమా: వరుస విజయాలతో మంచి జోరు మీద ఉన్న నటుడు కార్తీ. ఇంతకుముందు నటించిన ఇరుమన్, సర్దార్, పొన్నియిన్ సెల్వన్ చిత్రాలు ఒకదాని మించి ఒకటి విజయం సాధించాయి. తాజాగా జపాన్ చిత్రాన్ని పూర్తిచేశారు. జాతీయ ఉత్తమ దర్శకుడు అవార్డు గ్రహీత రాజు మురుగన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. చిత్రాన్ని దీపావళికి విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ఇప్పటికే ప్రకటించారు. కాగా కార్తీ ప్రస్తుతం నూతన చిత్రంలో నటిస్తున్నారు. స్టూడియో గ్రీన్ పతాకంపై జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. నలన్ కుమారసామి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నటి కృతిశెట్టి నాయకిగా నటిస్తున్నారు. తమిళంలో ఈమె నటిస్తున్న మూడవ చిత్రం ఇది. ఇంతకు ముందు ది వారియర్, కస్టడీ చిత్రాల్లో నటించారన్నది గమనార్హంకాగా సంతోష్ నారాయణన్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రంలో కార్తీ మక్కల్ తిలకం ఎంజీఆర్ వీరాభిమానిగా నటిస్తున్నట్లు సమాచారం. కథ, కథనాలు చాలా ఇంట్రస్టింగ్‌గా ఉంటాయని చిత్ర వర్గాలు పేర్కొన్నారు. కాగా ఈ చిత్రానికి రత్తత్తిన్ రత్తం (రక్తంలో రక్తము) లేదా వా వాద్ది యారే పేరును నిర్ణయించాలని భావించినట్లు తెలిసింది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది.



కార్తీ

కోలీవుడ్ టాక్స్

చంద్రముఖి -2 తేదీ ఖరారు



కంగనా రనౌత్

తమిళసినిమా: కోలీవుడ్‌లో ఆసక్తిని, అంచనాలు నెలకొన్న చిత్రాలలో చంద్రముఖి-2. గతంలో సంచలన విజయం సాధించిన చంద్రముఖి చిత్రానికి సీక్వెల్ ఇది. ఆ చిత్ర దర్శకుడు పి.వాసునే ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. అయితే చంద్రముఖి చిత్రంలో రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తే ఇందులో నృత్య దర్శకుడు, నటుడు, లారెన్స్ హీరోగా నటించడం, జ్యోతిక పాత్రలో బాలీవుడ్ సంచలన నటి కంగనారనౌత్ నటించడం విశేషం. నటుడు వడివేలు ముఖ్యపాత్రలు పోషించిన ఈ చిత్రానికి ఎంఎం కీరవాణి సంగీతాన్ని, ఆర్‌డీ రాజశేఖర్ ఛాయాగ్రహణం అందిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ఇటీవలే పూర్తిచేసుకుంది. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలను జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ సంస్థ భారీ ఎత్తున నిర్మిస్తున్నారు. ఇలా రేర్ కాంబినేషన్లో రూపొందుతున్న చిత్రం ఎలా ఉంటుందో అన్న ఆసక్తి నెలకొనడం సహజమే. మరో విషయం ఏమిటంటే చంద్రముఖి-2 చిత్రం ప్రోగ్రెస్ గురించి ప్రచారం జరుగుతుందే కానీ కథ గురించి కానీ, హైలెట్స్ గురించి కానీ వివరాలు ఇప్పటివరకు బయటకు రాలేదు. ఇది కూడా చిత్రంపై ఉత్సుకతకు ఒక కారణం కావచ్చు. కాగా చంద్రముఖి-2 చిత్రాన్ని సెప్టెంబర్ 15న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తాజా సమాచారం. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశముంది.



నయనతార

సంపాదనే ధ్యేయంగా నయన

తమిళసినిమా: దక్షిణాదిలో అగ్రకథానాయకిగా రాణిస్తున్న నటి నయనతార. ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా మధ్యతరగతి కుటుంబం నుంచి నటిగా రంగ ప్రవేశం చేసిన ఈమె అంచెలంచెలుగా ఎదిగి ఇప్పుడు సౌత్ ఇండియన్ వెండితెరపై లేడీ సూపర్‌స్టార్‌గా వెలిగిపోతున్నారు. తాజాగా జవాన్ చిత్రం ద్వారా బాలీవుడ్‌లోకి ప్రవేశించారు. ప్రేమ, పెళ్లి, పిల్లలు అంటూ ఒక పక్క వ్యక్తిగతంగా పరిపూర్ణ జీవితాన్ని అనుభవిస్తున్న నయనతార నటిగా నేటికీ బిజీగానే ఉండడం విశేషం. కథానాయకిగా 75 చిత్రాల మైలురాయిని అధిగమించిన ఈ కేరళ భామ ఇతర రంగాలలోనూ పెట్టుబడులు పెడుతూ ఆ విధంగానూ ధనార్జన చేస్తున్నారు. ఆమధ్య సొంతంగా చిత్ర నిర్మాణ సంస్థను ప్రారంభించిన నయనతార ఇతర నటీనటులకు, దర్శకులకు అవకాశం కల్పిస్తూ చిత్రాలు నిర్మిస్తున్నారు. అదేవిధంగా ఇతర చిత్రాలను తమ సంస్థ ద్వారా పంపిణీ చేస్తున్నారు. అదేవిధంగా నయనతార ఉత్తర చెన్నైలోని ప్రాచీన సినీ థియేటర్ అయిన అగస్తీయన్‌ను కొనుగోలు చేసి దానిని ఆధునీకరణతో సినీ కాంప్లెక్స్‌గా తీర్చిదిద్దబోతున్నట్లు సమీప కాలంలో సామాజిక మాధ్యమాల్లో వార్తలు వైరల్ అయ్యాయి. అయితే ఆ ప్రచారాన్ని థియేటర్ నిర్వాహకం ఖండించారు. లేకపోతే నయనతార నటిగా సంపాదించిన డబ్బును రియల్ ఎస్టేట్ వంటి ఇతర రంగాల్లో పెట్టుబడిగా పెడుతున్నారు. ఇప్పటికే లిప్‌బామ్ సౌందర్య సాధనాలు, గృహఅలంకార వస్తువుల విక్రయాల వ్యాపారంలో రాణిస్తున్న నయనతార తాజాగా కొత్తగా ఆదాయం కోసం ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలలో పలు ప్రాంతాల్లో స్థలాలు కొనుగోలు చేశారు. కాగా ఇప్పుడు కేరళలోని ప్రధాన నగరాల్లో ఉన్న స్థలాల్లో బహుళ అంతస్తు ప్లాట్ల నిర్మాణం చేపట్టడానికి సిద్ధమయ్యారని సమాచారం. ఈ ప్లాన్ ఆమె భర్త, దర్శకుడు విఘ్నేష్ శివన్ ఇవ్వగా నయనతార సూపర్‌గా ఉంది అంటూ ఏ ప్లాన్ అమలు చేద్దాం అని చెప్పారట. ఈ వార్త ఇప్పుడు సామాజిక మాధ్యమాలలో హల్‌చల్ చేస్తోంది.

విజయానికి వీరందరూ సాక్షులే!

తమిళసినిమా: గతంలో సుందర్ సి స్వీయదర్శకత్వంలో హీరోగా నటించిన తలైనగరం చిత్రం మంచి విజయాన్ని సాధించింది. దీంతో తాజాగా దానికి సీక్వెల్‌గా తెరకెక్కిన చిత్రం తలైనగరం-2. సుందర్ సీ కథానాయకుడిగా వీజడ్‌దురై దర్శకత్వం వహించి రైట్ ఐ థియేటర్స్ పతాకంపై ప్రభాకరన్‌తో కలిసి నిర్మించిన చిత్రం తలైనగరం-2. ఈ నెల 23న విడుదలైన ఈ చిత్రం విజయవంతంగా ప్రదర్శించబడుతోంది. ఈ సందర్భంగా సోమవారం స్థానిక సాలిగామంలోని ప్రసాద్ ల్యాబ్ థ్యాంక్స్ గివింగ్ సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న సుందర్ సీ మాట్లాడుతూ ఇప్పుడు ఇలాంటి కార్యక్రమాలు జరగడం అరుదైపోయిందన్నారు. తగైనగరం-2 చిత్రాన్ని ఎన్ని థియేటర్లలో విడుదల చేశారని దర్శకుడు వీజడ్‌దురైను అడగా 350 థియేటర్లకు పైనే అనిచెప్పడంతో కాస్త భయపడ్డానన్నారు. కారణ చిత్రాలు విడుదలైన రోజే థియేటర్లో జనాలు ఉండడం లేదన్నారు. పెద్ద చిత్రాల్లే 300 థియటర్ లలో విడుదలవుతున్నాయన్నారు. అందుకే భయపడ్డానని అన్నారు. అయితే తలైనగరం -2 చిత్రం సక్సెస్‌ఫుల్‌గా ప్రదర్శింపబడడం సంతోషంగా ఉందన్నారు. ఈ చిత్రంలో ప్రతి యాక్షన్ సన్నివేశం వెనుక ఒక ఎమోషన్ ఉంటుందన్నారు. హీరో నలుగురితో ఫైట్ చేసినా అందులో నమ్మదగిన కారణం ఉండేలా దర్శకుడు చిత్రాన్ని తెరకెక్కించినట్లు చెప్పారు. థియేటర్లలో చిత్రాన్ని చూసిన వారందరూ తనను అభినందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన డిస్ట్రిబ్యూటర్లే ఈ చిత్రం విజయానికి సాక్ష్యం అని సుందర్ సీ పేర్కొన్నారు.



తలైనగరం-2 చిత్ర యూనిట్

క్లుప్తంగా

బడుల్లో ప్రత్యేక తరగతులు

సాక్షి, చెన్నై: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత, మహోన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం సాయంత్రం వేళలో ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఆదేశాలు మంగళవారం జారీ అయ్యాయి. 10, 11, 12 తరగతుల విద్యార్థులకు ఈ తరగతులు తప్పనిసరి చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖ పరంగా చర్యలు తప్పవని పాఠశాలల ఉపాధ్యాయులకు హెచ్చరికలు జారీ అయ్యాయి.

ఆధునిక సాంకేతికతతో నీటి శుద్ధీకరణ

సాక్షి, చెన్నై: నీటి శుద్ధీకరణలో ఎదురయ్యే సమస్యలను అధిగమించేందుకు అత్యాధునిక సాంకేతిక త పరిజ్ఞానాన్ని ఉపయోగించనున్నామని తోషిబా వాటర్ చైర్మన్ హిరోకి కొబయాషి తెలిపారు. తోషి బా వాటర్ సొల్యూషన్స్ కార్పొరేషన్ (టీఐఎస్ఎస్) నేతృత్వంలో చేపట్టనున్న వాటర్ ప్రాజెక్టులను గురించి మంగళవారం స్థానికంగా ఆయన వివరించారు. భారత దేశంలో 3 మురుగునీటి శుద్ధికర్మాగారాలు(ఎస్‌టీపీ), నీటి సామర్థ్యం పెంపు, ఆపరేషన్, నిర్వహణ సేవలతో పాటు మరో 5 అప్ గ్రేడేషన్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టామని వివరించారు. బెంగళూరులో 5 ఎస్‌టీపీ ప్రాజెక్టుల విస్తృతం చేశామన్నారు. నీటి శుద్ధీకరణలో ఎదురయ్యే సమస్యలను అధిగమించడం, పరిష్కార మార్గాల కోసం అత్యాధునిక సాంకేతికతలను ఉపయోగిస్తున్నామని వివరించారు. ఇది స్థిరమైన, సురక్షితమైన నీటితో పాటు రీసైక్లింగ్ వ్యవస్థలకు దోహదకరంగా ఉంటాయని పేర్కొన్నారు.

పట్టభద్రులకు ఉద్యోగ అవకాశాల కల్పన

సాక్షి, చెన్నై: పట్టభద్రులైన యువతకు ఉద్యోగ అవకాశాల కల్పన దిశగా కొత్త మార్గాన్ని సైట్ స్పెక్ట్రమ్ డేటా అనలిటిక్స్ పరిచయం చేసిందని ఎస్ఐఎంఏటీఎస్ చాన్స్‌లర్ ఎం వీరయ్యన్ తెలిపారు. ఇంజినీరింగ్‌లో పట్టభద్రులకు ఉద్యోగ కల్పనలో భాగంగా మంగళవారం స్థానికంగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమం జరిగింది. ఇందులో వీరయ్యన్ మాట్లాడుతూ సైట్ స్పెక్ట్రమ్ నుంచి జరిగిన ప్లేస్ మెంట్‌కు విద్యార్థులు ఉత్సాహంగా తరలిరావడం శుభ పరిణామంగా పేర్కొన్నారు. గ్రాడ్యుయేట్లు వారి ప్రతిభను, సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించడం, గ్రూప్ డిస్కషన్‌లతో సామర్థ్యాలను పెంచుకుని ఉద్యోగ అవకాశాలు చేజిక్కించుకోవాలని సూచించారు. ఇంజినీరింగ్ నేపథ్యం, విశ్లేషణాత్మకంతో పాటు అసాధారణమైన డేటాను అందించడం ఈ కార్యక్రమంలో కీలకం అని వివరించారు. ఈసందర్భంగా ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో వివిధ కేటగిరిలలో అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగ ఆఫర్‌లను అందజేశారు.

గేటు పడి వాచ్‌మన్ మృతి

• కుటుంబసభ్యులు రాస్తారోకో



రక్తపు మడుగులో వాచ్‌మన్



రామమూర్తి(ఫైల్)

వేలూరు: ప్రైవేటు పాఠశాల గేటు పడి వాచ్‌మన్ మృతిచెందాడు. వేలూరు జిల్లా పాత కాటాప్పడిలో ప్రైవేటు కార్పొరేట్ పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో రాత్రి వాచ్‌మన్‌గా బ్రహ్మపురానికి చెందిన రామమూర్తి(65) పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి యథావిధిగా విధులకు వచ్చిన రామమూర్తి పాఠశాల ముఖ ద్వారం వద్ద ఉండగా హఠాత్తుగా ఇనుపగేటు తలపై పడింది. ఈ ప్రమాదంలో రామమూర్తి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలిసి బ్రహ్మపురం గ్రామస్తులు మంగళవారం ఉదయం పాఠశాల వద్దకు చేరుకుని రాస్తారోకో చేశారు. వాచ్‌మన్ మృతికి పాఠశాల యాజమాన్యమే బాధ్యత వహించాలని నినాదాలు చేశారు. విషయం తెలిసి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని స్థానికులతో చర్చలు జరిపి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వాచ్‌మన్ మృతిపై అనుమానం ఉందని ఆరోపిస్తూ బంధువులు కాట్పాడి పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. పోలీసులు చర్చలు జరిపి ఆందోళన విరమింపజేశారు.

రైలు కిందపడి విద్యార్థిని ఆత్మహత్య

తిరువొత్తియూరు: కన్యాకుమారి జిల్లాలో రైలు కిందపడి పదవ తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన కన్యాకుమారి జిల్లాలో చోటుచేసుకుంది. కొల్లంకోడు ప్రాంతానికి చెందిన సురేష్ పెయింటర్. ఇతనికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు 12వ తరగతి చదువుతున్నాడు. కుమార్తె విలియమ్ జాయ్ పదవ తరగతి చదువుతోంది. వీరిద్దరూ రోజూ బస్సులో పాఠశాలకు వెళ్లి వస్తుంటారు. ఈ క్రమంలో మంగళవారం పాఠశాలలో స్పెషల్ క్లాసులు ఉన్నట్లు చెప్పి జాయ్ ఒంటరిగా పాఠశాలకు వెళ్లింది. పాఠశాలకు వెళ్లిన సహోదరుడికి చెల్లెలు పాఠశాలకు రాలేదని తెలిసింది. అదే సమయంలో పాఠశాల నిర్వాహకులకు రైల్వే పోలీసుల నుంచి సమాచారం అందింది. పాఠశాల దుస్తులతో ఉన్న విద్యార్థిని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడికి వెళ్లి చూడగా ఆత్మహత్యకు పాల్పడింది విలియమ్ జాయ్ అని తెలిసింది. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

3.50 లక్షల గృహాల జప్తునకు కసరత్తు

• పన్ను చెల్లించని యజమానులపై కన్నెర్ర



చెన్నై కార్పొరేషన్ భవనం

సాక్షి, చెన్నై: చెన్నై కార్పొరేషన్ పరిధిలో కొన్నేళ్లుగా సక్రమంగా పన్ను చెల్లించని గృహ యజమానులపై కన్నెర్ర చేయడానికి రెవెన్యూ అధికారులు సిద్ధమయ్యారు. అవసరం అయితే, వారి ఆస్తులను జప్తు చేయడానికి కసరత్తులు చేస్తున్నారు. చెన్నై కార్పొరేషన్ పరిధిలో 13 లక్షల మేరకు గృహ యజమానులు ఉన్నారు. వీరి నుంచి ఆరు నెలలకు ఒక పర్యాయం ఆస్తి పన్ను వసూళ్లు చేస్తున్నారు. సంవత్సరానికి రూ.1,500 కోట్లఆస్తి పన్ను ద్వారా వసూళ్లు అవుతోంది. అయితే, 3.50 లక్షల గృహయజమానులు ఆస్తి వివరాలను సక్రమంగా సమర్పించకపోగా, పన్ను చెల్లింపులలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం జరుగుతోంది. వీరి కారణంగా రెండేళ్లకు పైగా ఆస్తి పన్ను రూ. 200 కోట్లు బకాయిలో ఉంది. ఇవే కాకుండా మొండి బకాయిలు మరెన్నో కోట్లు ఉన్నాయి. ఈ వ్యవహారాలు అనేకం కోర్టులో ఉన్నాయి. అయితే, 3.50 లక్షల గృహ యజమానుల ఆస్తుల వివరాలను పునర్‌లెక్కింపునకు కార్పొరేషన్ చర్యలు తీసుకుంది. ఇకనైనా వీరు పాత బకాయిలతో పాటు పునర్ లెక్కింపు ద్వారా వచ్చిన పన్ను మొత్తాలను చెల్లించని పక్షంలో కఠినంగా వ్యవహరించేందుకు సిద్ధమయ్యారు. చట్ట నిబంధనలకు అనుగుణంగా బకాయిపై ప్రత్యేక వడ్డీ విధించేందుకు సిద్ధమయ్యారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను మంగళవారం విడుదల చేశారు. అప్పటికీ స్పందన లేని పక్షంలో వారి ఆస్తులను జప్తు చేసి వేలం వేసేందుకు తగిన కార్యాచరణతో చెన్నై కార్పొరేషన్ రెవెన్యూ అధికారులు ముందుకెళ్తున్నారు.

నడిరోడ్డులో దారుణ హత్య

• పంచాయతీ అధ్యక్షురాలి భర్తను హతమార్చిన దుండగులు



మృతుడు మది అళగన్ (ఫైల్)

సాక్షి, చెన్నై : కడలూరులో మంగళవారం ఉదయం పట్ట పగలే జనసంచారంతో కూడిన ప్రదేశంలో పంచాయతీ అధ్యక్షురాలి భర్తను ఓ ముఠా కిరాతకంగా హతమార్చింది. ముఖాన్ని మరీ దారుణంగా ఛిద్రంచేసి తల భాగంలో ఓ కత్తిని సైతం పెట్టి మరీ వెళ్లడం స్థానికంగా కలకలం రేపింది. కడలూరు జిల్లా ఉప్పల వాడి పంచాయతీ అధ్యక్షురాలుగా శాంతి వ్యవహరిస్తున్నారు. ఈమె భర్త మది అళగన్ మంగళవారం ఉదయం కడలూరు మంజాకుప్పం షణ్ముగ పిళ్లై వీధిలో ఉండగా, అటు వైపుగా వచ్చిన ముఠా కత్తులతో దాడిచేసింది. జనం చూస్తుండగానే అతి కిరాతకంగా హతమార్చింది. ముఖాన్ని దారుణంగా చిద్రం చేశారు. తల భాగంలో ఓ కత్తిని సైతం ఉంచి వెళ్లారు. ఆ పరిసరాలలోని సీసీ కెమెరాలలో ఈ దృశ్యాలు నమోదయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమారాటనికి తరలించారు. ఈ ఘటనతో ఆ పరిసరాలలో ఉద్రిక్తత నెలకొంది. సీసీ కెమెరాలలోని దృశ్యాల ఆధారంగా పది మందిని అరెస్టు చేసి విచారిస్తున్నారు. ఈ ఘటనతో ఉప్పల వాడి, తాలంకుడా గ్రామాలలో భద్రతను కట్టుదిట్టం చేశారు. కడలూరు ఎస్పీ రాజారాం భద్రతను పర్యవేక్షిస్తున్నారు.

ఇసుక లారీ ఢీకొని తాపీమేస్త్రీ మృతి



నిరసనలో గ్రామస్తులు, ఇన్‌సెట్‌లో అయ్యనార్

కొరుక్కుపేట: ఇసుక లారీ ఢీకొని ఓ తాపీమేస్త్రీ మృతిచెందాడు. ఈ ఘటన తిరువెన్నైనల్లూరు సమీపంలో చోటుచేసుకుంది. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు, కుటుంబసభ్యులు రాస్తారోకోకు చేశారు. విల్లుపురం జిల్లా, తిరువెన్నైనల్లూరు అలంగుప్పం రైల్వే బ్రిడ్జి సమీపంలోని మైదానంలో 500 నుంచి 1000 వరకు ట్రక్కులు పార్కింగ్ చేస్తుంటారు. ఈ లారీలన్నీ సమీపంలో నిర్వహిస్తున్న ఇసుక క్వారీకి వెళ్లేందుకు ఆగుతాయి. ఈ క్రమంలో అలంగుప్పం గ్రామానికి చెందిన తాపీమేస్త్రి అయ్యనార్ (37) సోమవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో బహిర్భూమికి వెళ్లాడు. ఆ సమయంలో వేగంగా వచ్చిన ఇసుక లారీ అతడిని ఢీకొంది. ఈ ఘటనలో అక్కడికక్కడే మృతిచెందాడు. తిరువెన్నైనల్లూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విల్లుపురం ముండియంబాక్కం మెడికల్ కళాశాల ఆస్పత్రికి తరలించారు. మంగళవారం ఇసుక క్వారీని నిరసిస్తూ బాధిత గ్రామస్తులు బాధితకుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ అలంగుప్పం తిరువెన్నైనల్లూరు – బన్రూటి రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని చర్చలు జరిపి ఆందోళన విరమింపజేశారు.

విషం తాగి ఆరుగురు ఆత్మహత్యాయత్నం

కొరుక్కుపేట: ధర్మపురి సమీపంలోని ఆలయ సమస్యలో ఐదుగురు మహిళలు సహా ఆరుగురు విషం తాగారు. ధర్మపురి జిల్లా బొమ్మిడి వేపమరాథూరు గ్రామంలో మరియమ్మన్ దేవాలయం ఉంది. ఈ ఆలయ కుంభాభిషేక కార్యక్రమం 2011లో జరిగింది. దీంతో పట్టణంలోని ఓ కుటుంబంలో గొడవ జరిగింది. కుటుంబసభ్యులు బొమ్మిడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం కేసు కోర్టులో ఉంది. ఇందుకోసం ఆ ఊరికి చెందిన 24 కుటుంబాలు కోర్టుకు వెళ్తున్నాయి. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ ఈ ఏడాది దేవాలయంలో కుంభాభిషేకం నిర్వహించుకోవచ్చని తెలిపారు. ఆ సమయంలో కోర్టుకు వెళ్లిన 24 కుటుంబాలు ఫిర్యాదు చేసిన ఒక్క కుటుంబం ఆలయ వేడుకలు నిర్వహించేందుకు పన్ను వసూలు చేయరాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఆ వ్యక్తి మళ్లీ బొమ్మిడి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయం తెలిసి 24 కుటుంబాలకు చెందిన ఐదుగురు మహిళలు సహా ఆరుగురు సోమవారం విషం తాగారు. చుట్టుపక్కల వారు వారిని రక్షించి ధర్మపురి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బొమ్మిడి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గ్రామానికి వెళ్లి విచారణ చేస్తున్నారు. అలాగే పశ్చిమ జిల్లా డీఎంకే కార్యదర్శి, మాజీ మంత్రి పళనియప్పన్, పేపర్ తిప్పట్టి అసెంబ్లీ సభ్యుడు గోవింద స్వామి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు.

• ప్రమాదమని తెలిసినా..



ఫుట్‌బోర్డు ప్రయాణంతో ప్రమాదం పట్ల విద్యార్థులకు ఎంత అవగాహన కల్పించినా ఏమాత్రం మార్పు రావడం లేదు. తాజాగా తిరుత్తణి నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే టౌన్ బస్సులో విద్యార్థులు ప్రమాదమని తెలిసినా ఫుట్‌బోర్డు ప్రయాణంతో ప్రయాణికులను ఆందోళనకు గురి చేస్తున్నారు. -తిరుత్తణి

దశకంఠుడిపై పరాశరేశ్వరస్వామి



రావణ వాహనంపై పరాశరేశ్వరస్వామి

నారాయణవనం: టీటీడీ అనుబంధ శ్రీచంపకవల్లీ సమేత పరాశరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం సాయంత్రం రావణ వాహనంపై విహరిస్తూ శివపార్వతులు భక్తులను కటాక్షించారు. ఉద యం నిత్యపూజా కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి శివగామీ సమేత నటరాజ స్వామి ఉత్సవమూర్తులను తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. అనంతరం చంపకవల్లి, పరాశరేశ్వరస్వామికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం రావణ వాహనంపై ఊరేగింపు నయనానందకరంగా సాగింది. స్థానిక ఆలయాల ఏఈవో పార్థసారథి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో తొమ్మిది కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 73,156 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,175 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.29 కోట్లు భక్తులు సమర్పించారు. టైం స్లాట్ భక్తులకు సకాలంలో దర్శనం అవుతోంది. దర్శనం టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్ల భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

లారీ ఢీకొని ఇద్దరు దుర్మరణం

తిరువొత్తియూరు: దిండివనంలో లారీ ఢీకొని ఇద్దరు మృతిచెందారు. విల్లుపురం జిల్లా దిండివనం రోషనై ప్రాంతానికి చెందిన గణేష్ కుమారుడు భువనేష్ (23). ఇతని స్నేహితుడు పూందోటం ప్రాంతానికి చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు మహాపుల్ కుమారుడు సయ్యద్ ముబారక్ (22). వీరిద్దరూ మంగళవారం ఉదయం ద్విచక్రవాహనంలో బయలుదేరారు. ఆ సమయంలో దిండివనం నుంచి వస్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఇద్దరిని పుదుచ్చేరి జిప్మర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరు మృతిచెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిద్రలోకి జారుకున్న రైల్వే గేట్‌మన్

కొరుక్కుపేట: అచ్చరపాక్కం నుంచి వెంకటేశపురం మీదుగా పెరుకారునై, కాయపాక్కం, పుత్తూరు గ్రామాలకు వెళ్లే రహదారిలో తూర్పు జాతీయ రహదారిపై రైల్వే గేటు ఉంది. ఈ రైల్వే గేట్ క్రాసింగ్ వద్ద ఆనంద గేట్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఈ స్థితిలో మంగళవారం ఉదయం 6.46 గంటలకు చెన్నై వెళ్లే రైలు కోసం ఉద్యోగి ఆనంద్ రైల్వే గేటు వేశాడు. అనంతరం అక్కడే ఉన్న విశ్రాంతి గదిలోకి వెళ్లి తలుపు గడియపెట్టి పడుకున్నాడు. ఉదయం 7 గంటలు దాటినా రైల్వే గేటు తెరవకపోవడంతో వాహనదారులకు అనుమానం వచ్చింది. అక్కడి రైల్వేగేట్ కీపర్ గదిలోకి వెళ్లి చూడగా, నిద్రపోతున్న ఉద్యోగి ఆనందను చూసి అవాక్కయ్యారు. తర్వాత తలుపుకొట్టి ఆనంద్‌ని నిద్ర లేపారు. రైల్వే గేటు తెరవడం మరిచిపోయి నిద్రలోకి జారుకున్నట్లు తెలిసింది. అయితే ఆగ్రహించిన వాహనదారులు వాగ్వాదానికి దిగి ఉద్యోగి ఆనంద్‌పై గొడవకు దిగారు. రైలు వెళ్లిన 20 నిమిషాల పాటు ఉద్యోగి ఆనంద రైల్వే గేటు తెరవలేదని తెలిసింది. రైల్వే అధికారులు విచారణ చేపట్టారు.

హత్య కేసులో అన్న అరెస్ట్

తిరువొత్తియూరు: తిరువారూర్ సమీపంలో తల్లిని దూసించాడని ఏర్పడిన గొడవలో తమ్ముడిని కత్తితో పొడిచి హత్య చేసిన అన్నను పోలీసులు అరెస్టు చేశారు. తిరువారూరు జిల్లా కోటచేరి కొరడాచేరి సమీపము వెన్న వాసల్ మెట్టు వీధికి చెందిన శేఖర్. ఇతనికి ఇద్దరు కుమారులు శక్తివేలు (35), కార్తీక్ (26) కార్మికులు. వీరిద్దరూ వివాహమై ఒకే వీధిలో నివాసం ఉంటున్నారు. కార్తీక్ భార్య పునిత గర్భిణి. దీంతో కార్తీక్ తల్లి లలిత (60) అతని ఇంట్లో ఉంటోంది. సోమవారం మధ్యాహ్నం పునీత, లలిత గొడవ పడ్డారు. శక్తివేలుకు లలిత చెప్పడంతో సోమవారం రాత్రి కార్తీక్ ఇంటికి వెళ్లిన శక్తివేలు అమ్మతో ఎందుకు గొడవ చేశావని ప్రశ్నించాడు. దీంతో శక్తివేలుకు కార్తీక్ మధ్య గొడవ ఏర్పడింది. ఆగ్రహించిన కత్తితో కార్తీక్‌పై శక్తివేల్ దాడి చేశాడు. తీవ్రంగా గాయపడ్డ కార్తీక్‌ను ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కార్తీక్ మృతి చెందాడు. కోటాచేరి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శవ పరీక్ష కోసం తరలించారు.

మోకాళ్లపై నిలబెట్టాడని హత్య చేశాం

తిరువొత్తియూరు: నడి రోడ్డులో కొట్టి మోకాళ్లపై నిలబెట్టడం వల్లే హత్య చేశామని అంబత్తూర్‌లో ఆటోడ్రైవర్ హత్య కేసులో అరెస్ట్ అయిన ముగ్గురు యువకులు వాంగ్మూలం ఇచ్చారు. అంబత్తూరు మంగళాపురం ప్రాంతానికి చెందిన విడియల్ (30) ఆటోడ్రైవర్. ఇతను గత సంవత్సరం సతీష్‌ను హత్య చేసిన కేసులో జైలుకు వెళ్లాడు. ఈ క్రమంలో బెయిల్‌పై వచ్చాడు. సోమవారం రాత్రి విడియల్ ఆటోలో ఇంటి సమీపంలో వెళుతున్నాడు. ఆ సమయంలో మోటార్ సైకిల్‌పై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేసి విడియల్‌ను హత్య చేశారు. దీనికి సంబంధించి అదే ప్రాంతానికి చెందిన ఋషి, సుర్జిత్, కపిల్ అనే ముగ్గురుని పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో ఆదివారం ఆటో డ్రైవర్ విడియల్ తమకు గొడవ ఏర్పడిందని, అతను తమపై దాడి చేసి మోకాళ్లపై నిలబెట్టాడని, అందువల్లే ఆగ్రహంతో హత్య చేసినట్లు నిందితులు వాంగ్మూలం ఇచ్చారు.

భవన నిర్మాణ కార్మికుడు హత్య

తిరువొత్తియూరు: తరమణిలో భవన నిర్మాణ కార్మికుడు హత్య కేసులో సహ కార్మికుడిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై తరమణి 100 అడుగుల రోడ్డులో విజయనగర్ వద్ద వంతెన నిర్మించేపనులు జరుగుతున్నాయి. ఇక్కడ సేలం జిల్లా ఆత్తూర్ తాలూకా ఉన్నతూరు గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు కొలింజియం (45) పనిచేస్తున్నాడు. ఇతనితో తెన్‌కాశి జిల్లా అలంగులం తాలూకా కలినీరు కులం గ్రామానికి చెందిన అవినాష్ (22) కూడా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం అవినాష్ తరమణి లింక్ రోడ్డు సమీపంలో కత్తితో నిలబడి ఉన్నాడు. వేలచ్చేరి పోలీసులు అక్కడ చేరుకుని అవినాష్‌ను అరెస్టు చేశారు. పోలీసులు జరిపిన విచారణలో కొలింజియంను హత్య చేశానని అతను లైంగికంగా తనను వేధించడంతో కత్తితో పొడిచి హత్య చేసినట్లు తెలిసింది. పోలీసులు అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి పుళల్ జైలుకు తరలించారు.

120 కిలోల గంజాయి స్వాధీనం



అరెస్టయిన రాజేష్, రాజ్, రంజిత్ , స్వాధీనం చేసుకున్న కారు

• ముగ్గురు అరెస్ట్

తిరువళ్లూరు: కారులో గంజాయిని అక్రమంగా తరలించడానికి యత్నించిన ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు వారి నుంచి రూ.35 లక్షలు విలువ చేసే గంజాయితో పాటు కారును సీజ్ చేశారు. గుమ్మిడిపూండి, మనలి ప్రాంతాల్లో గంజాయిని కారులో తరలించి విక్రయిస్తున్నట్టు మనలి పోలీసులకు సమాచారం అందింది. సమాచారం అందుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిఘా పెట్టారు. మంగళవారం ఉదయం మనలి ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న మహేంద్రకారును వెంబడించి తనిఖీ చేయగా కారులో రూ.35 లక్షల విలువ చేసే 120 కిలోల గంజాయితో పాటు ముగ్గురు యువకులు ఉన్నట్టు గుర్తించి వారిని అరెస్టు చేశారు. కారును సీజ్ చేసి విచారణ చేపట్టారు. విచారణలో ముగ్గురు యువకులు చెన్నైకు చెందిన రాజేష్, రాజ్, రంజిత్‌గా గుర్తించారు. వీరు నాలుగు నెలల నుంచి కారులో గంజాయిని తరలించి విక్రయిస్తున్నట్టు నిర్ధారించారు. అనంతరం వీరిని పూందమల్లి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. కాగా 2023 జనవరి 1 నుంచి గంజాయి అక్రమ తరలింపుపై ఆవడి పోలీసు కమిషనరేట్ పరిధిలో 213 కేసులు నమోదు చేసి 736 కిలోల గంజాయిని సీజ్ చేసినట్టు కమిషనర్ అరుణ్ విడుదల చేసిన ప్రకటనలో వివరించారు. ఈ కేసుల్లో 340 మందిని అరెస్టు చేయగా, 21 మంది బ్యాంకు ఖాతాలను సీజ్ చేసి 50 మందిని గూండా చట్టం కింద అరెస్టు చేసినట్టు తెలిపారు.

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాసెసింగ్ ప్లాంట్‌పై అవగాహన

కొరుక్కుపేట: చెన్నై కార్పొరేషన్ పరిధిలోని ప్రాంతాల్లో సేకరించిన చెత్తను కొడుంగైయూర్ చెత్త డంప్ కాంప్లెక్స్‌లో రోజూ డంప్ చేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో చెత్త పెద్దఎత్తున పేరుకుపోయింది. అలాగే కొందరు సంఘ వ్యతిరేకులు చెత్తకు నిప్పంటించడం వల్ల వాయుకాలుష్యం ఏర్పడి ఆ ప్రాంతంలో నివసించే ప్రజలకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇది భూగర్భ జలాల కాలుష్యానికి కూడా కారణమవుతుంది. దీనిని అరికట్టాలని ప్రభుత్వానికి విన్నవించారు.

కార్పొరేషన్ తరపున కొడుంగైయూర్ చెత్త డంపింగ్ కాంప్లెక్స్:

సమీకృత ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి నిర్వాసితుల సంఘం ప్రతినిధులు, ప్రజాప్రతినిధుల సంప్రదింపుల సమావేశం మంగళవారం ఉదయం తండయార్‌పేట కలరా ఆస్పత్రి ఆడిటోరియంలో జరిగింది. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విభాగం చీఫ్ ఇంజినీర్ మహేశ్వరన్ అధ్యక్షత వహించారు. సమావేశంలో ఆర్కే నగర్ అసెంబ్లీ సభ్యుడు ఎబినేజర్, జోనల్ కమిటీ చైర్మన్ నేతాజీ గణేశన్, చెన్నై మున్సిపల్ కార్పొరేషన్ నార్త్ జోన్ డిప్యూటీ కమిషనర్ శివగురు ప్రభాకరన్, 4వ జోన్ ఇన్‌చార్జి అధికారి రాధాకృష్ణన్ అధ్యక్షత వహించారు. ఇందులో కొడుంగైయూర్, ఆర్కేనగర్ ప్రాంత వాసులు, సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రాజెక్టుపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యుత్, గ్యాస్ ప్రదానంగా చెత్త పారవేయడం నుంచి కంపోస్టు తయారీ వల్ల ప్రజలకు ఎలాంటి నష్టం ఉండదన్నారు.

సినీ పక్కీలో దొంగల పట్టివేత



నిందితులను తీసుకెళుతున్న పోలీసులు

వేలూరు: చోరీకి పాల్పడి కారులో పరారవుతున్న దొంగలను సినీ పక్కీలో వెంబడించి పట్టుకున్నారు. చెన్నై కొలత్తూరుకు చెందిన యువరాజ్, బాలాజి మంగళవారం ఉదయం వేకువజామున కడలూరు జిల్లా బన్రూట్టిలోని ఒక ఇంట్లో చోరీ చేశారు. అనంతరం ఇంటి ముందు నిలిచి ఉన్న కారులో తప్పించుకుని పరారయ్యారు. గమనించిన స్థానికులు వెంటనే కడలూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో చోరీ చేసిన వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని నియమించడంతో పోలీసులు దొంగలను పట్టుకునేందుకు కారును వెంబడించారు. తిరువణ్ణామలై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు తిరువణ్ణామలై గిరివలయం రోడ్డులోని అగ్నిలింగం ఆలయం వద్ద సిద్ధంగా ఉన్నారు. ఆ సమయంలో కారు అతివేగంగా రావడంతో పోలీసులు సినీ ఫక్కీలో వారిని వెంబడించి పట్టుకున్నారు. అనంతరం వారి నుంచి 50 సవర్ల బంగారంతో పాటు నగదు, కారు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కడలూరు పోలీసులను రప్పించి తిరువణ్ణామలై పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు, నగదు, కారును అప్పగించారు.

విగ్రహాలను పగులగొట్టిన వ్యక్తి అరెస్ట్



పగులగొట్టిన విగ్రహాలు

కొరుక్కుపేట: పెరంబలూరు సమీపంలోని సెన్నూరులోని ఏకాంబరేశ్వర ఆలయంలో స్వామి విగ్రహాలను పగులగొట్టిన సంఘటనలో ఒకరిని అరెస్టు చేశారు. పెరంబలూరు జిల్లాలో సెన్నూరులోని ఏకాంబరేశ్వర ఆలయం ఉంది. ఈ ఆలయంలో సోమవారం రాత్రి పూజలు ముగించుకుని అర్చకులు, సిబ్బంది ఆలయానికి తాళం వేసి వెళ్లిపోయారు. మంగళవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరవడానికి సిబ్బంది వచ్చారు. పెద్ద తలుపు తాళం పగులగొట్టి ఉండడాన్ని చూసి అవాక్కయ్యారు. లోపలికి వెళ్లి చూడగా మురుగన్ గుడిలో ఉన్న మూడున్నర అడుగుల ఎత్తున్న మురుగన్ శిలా విగ్రహం, కాలభైరవ శిలావిగ్రహం విరిగి ఉన్నాయి. అలాగే ఉత్సవాల్లో స్వామివారి నిష్క్రమణకు ఉపయోగించే సింహవాహన విగ్రహం తోక భాగం. గరుడాళ్వార్ చెక్కతో చేసిన శిల్పాలను ధ్వంసం చేశారు. పత్రాల గదిలో ఆలయ పుస్తకాలు దగ్ధమయ్యాయి. షాక్ తిన్న సిబ్బంది, ఆలయ కార్యనిర్వహణాధికారి. జాయింట్ కమిషనర్‌కు సమాచారం అందించారు. చూసేందుకు పరుగెత్తారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ఆలయంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. సోమవారం రాత్రి 11.38 గంటల సమయంలో 40 ఏళ్ల వ్యక్తి ఆలయంలోకి ప్రవేశించి ధ్వజస్తంభం ముందు నిలబడి స్వామివారిని దూషించినట్లు రికార్డు అయ్యింది. సన్నిధానానికి వెళ్లి విగ్రహాన్ని ధ్వంసం చేసి, పత్రాలను తగులబెట్టారు. ఆ వ్యక్తి గంటసేపు వేచి ఉన్న తర్వాత ఆలయం నుంచి వెళ్లిపోయినట్లు రికార్డయ్యింది. విచారణలో ఆ వ్యక్తి పెరంబలూరు జిల్లా అలదూర్ తాలూకా మావిలింగ నివాసి నల్లుసామి కుమారుడు సెల్వరాజ్ అని తేలింది. అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మానసిక స్థితి బాగాలేదని తెలిసింది. ఇప్పటికే గ్రామంలోని స్వామివారి విగ్రహాలను పగులగొట్టి ధ్వంసం చేసినట్లు తెలిసింది.


వైభవం.. పార్వేట ఉత్సవం



బల్లెం ప్రయోగిస్తున్న అర్చకులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి పార్వేట ఉత్సవం శ్రీవారి మెట్టు సమీపంలో మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా శ్రీవారిమెట్టు సమీపంలోని పార్వేట మండపానికి వేంచేపు చేశారు. అక్కడ క్షేమతలిగ నివేదన చేసి పార్వేట ఉత్సవం నిర్వహించారు. ఇందులో దుష్టశిక్షణ కోసం స్వామివారు మూడు సార్లు బల్లెంను ప్రయోగించే ఘట్టాన్ని అర్చకులు నిర్వహించారు. ఆస్థానం అనంతరం సాయంత్రానికి స్వామివారి ఉత్సవమూర్తులను తిరిగి ఆలయానికి వేంచేపు చేశారు. ఈ సందర్భంగా టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు భక్తి సంకీర్తనలు ఆలపించారు. కోలాటాలు, భజన బృందాల ప్రదర్శనలు జరిగాయి. భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్ చెంగల్రాయలు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

కూరగాయల ధరల నియంత్రణకు చర్యలు



టమాటా, ఉల్లి ధరలు బహిరంగ మార్కెట్, రైతుబజార్లలో ఇలా (కిలోకి రూపాయల్లో..)

జిల్లా	(టమాటా) బహిరంగ మార్కెట్	(టమాటా) రైతుబజారు	(ఉల్లి) బహిరంగ మార్కెట్	(ఉల్లి) రైతుబజారు
కృష్ణా	65	61	21	19
విశాఖపట్నం	90	75	20	17
తూ.గోదావరి	65	60	20	16
కర్నూలు	84	80	25	20
అనంతపురం	32	30	25	22

సాక్షి, అమరావతి: పెరుగుతున్న కూరగాయల ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సీఎం యాప్ ద్వారా రోజూ క్షేత్రస్థాయిలో కూరగాయల ధరల హెచ్చుతగ్గులను పరిశీలిస్తోంది. ఉల్లి, ఇతర కూరగాయల ధరల్లో పెద్దగా మార్పులు లేకపోయినా.. టమాటా ధర పెరుగుతోంది. ముఖ్యంగా రాయలసీమ, కృష్ణా, విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల్లోనే టమాట ధర పెరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. అయినప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా టమాటాతో పాటు ముందస్తు చర్యల్లో భాగంగా ఉల్లి, బంగాళదుంపలు, మిరప వంటి ఇతర కూరగాయల ధరలను సమీక్షిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం మార్కెటింగ్ శాఖను రంగంలోకి దింపింది. ధరల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. కర్నూలు మినహా మిగిలిన జిల్లాల్లో టమాటా ధర బహిరంగ మార్కెట్‌లో కిలో రూ. 32 నుంచి రూ. 65 మధ్యలో, ఉల్లిపాయలు కిలో రూ.20 నుంచి 25 మధ్య ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా రైతు బజార్లలో ఈ రెండింటి ధరలు బహిరంగ మార్కెట్‌కంటే తక్కువగా ఉండేలా చర్యలు చేపట్టారు. టమాటా కిలో రూ.100 దాటితే మార్కెట్‌లో జోక్యం చేసుకొని రైతుల నుంచి కొనుగోలు చేసి సబ్సిడీపై వినియోగదారులకు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం రైతుబజార్ల ఎస్టేట్ ఆఫీసర్లతో రైతుబజార్ల సీఈవో నందకిషోర్ సమీక్షించనున్నారు. సీఎం యాప్ ద్వారా రోజూ జిల్లాలవారీగా కూరగాయల ధరలను సమీక్షిస్తున్నామని, ప్రస్తుతం ధరలు నియంత్రణలోనే ఉన్నాయని మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే 'సాక్షి'కి తెలిపారు. అవసరమైతే మార్కెట్‌లో జోక్యం చేసుకుంటామని చెప్పారు.

మిర్చి రైతుకు పండగే

కంకిపాడు: రాష్ట్రంలో మిర్చి రైతుకు పండగొచ్చింది. సంవత్సర కాలంగా కిలో రూ.50 కి మించని పచ్చి మిర్చి ప్రస్తుతం రూ. 100 దాటింది. వారం, పది రోజులుగా మిర్చి ధర రూ 35 నుంచి క్రమేపీ పెరిగింది. వేసవి కారణంగా మిర్చి సాగు తగ్గింది. డిమాండ్‌కు సరిపడా దిగుబడి లేకపోవడంతో ధర పెరిగింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'బాలల సంరక్షణ కేంద్రాలకు అనుమతి తప్పనిసరి'

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బాలల కోసం నిర్వహిస్తున్న పునరావాస, సంరక్షణ కేంద్రాలు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు స్పష్టంచేశారు. మంగళగిరిలోని కమిషన్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కొన్ని సంస్థలు, సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు బాలల సంరక్షణ కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు కమిషన్ దృష్టికి వచ్చిందన్నారు. బాలల న్యాయ చట్టం ప్రకారం వాటికి ఖచ్చితంగా ప్రభుత్వ అనుమతి ఉండాలని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించి చట్ట విరుద్ధంగా కేంద్రాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశం అనంతరం ఇదే విషయమై మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్,, కార్యదర్శి జి.జయలక్ష్మి, సంచాలకురాలు విజయ సునీతకు వినతిపత్రం సమర్పించారు.

క్లుప్తంగా...

కాపులకు మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్

కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో కాపులకు నవరత్నాలతోపాటు కాపునేస్తం కింద మరింత మేలు చేస్తున్నారని కాపు సంక్షేమ, అభివృద్ధి సంస్థ(కార్పొరేషన్) చైర్మన్ అడపా శేషగిరి చెప్పారు. కాపు నేస్తం కింద ఇప్పటివరకు మూడు విడతల్లో రూ.1,500కోట్లు లబ్ధి చేకూర్చారని తెలిపారు. కాపు కార్పొరేషన్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశం మంగళవారం తాడేపల్లిలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. అడపా శేషు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలో కాపుల సంక్షేమం కోసం అమలుచేస్తున్న కార్యక్రమాలను పెద్ద ఎత్తున ప్రచారం చేసి మరింతమంది వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తామన్నారు. కాపుల సామాజిక అవసరాల కోసం కాపు భవన్‌లు నిర్మిస్తున్నామన్నారు. కాపు ఉద్యమం నేపథ్యంలో తుని ఘటనలో 42 కేసులను ఎత్తివేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో కాపు కార్పొరేషన్‌లో జరిగిన అవినీతిపై చేపట్టిన విచారణ 15 రోజుల్లో పూర్తవుతుందని చెప్పా రు. కాపు కార్పొరేషన్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

నేనెందుకు పార్టీ మారతాను?

మంత్రి విశ్వరూప్



అమలాపురం రూరల్: పార్టీ మారే ఉద్దేశం తనకు లేదని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ స్పష్టం చేశారు. అసలు పార్టీ మారాల్సిన అవసరం ఏముందన్నారు. 'ప్రజాస్వామ్యంలో ఎవరైనా ముఖ్యమంత్రి కావచ్చు. పవన్‌కళ్యాణ్ ముఖ్యమంత్రి అయితే నాకు సంతోషమే..' అని తాను అన్నానంటూ మీడియా, సోషల్ మీడియాలో కొన్ని రోజులుగా చక్కర్లు కొడుతున్న వార్తలపై మంత్రి విశ్వరూప్ స్పందించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా భట్నవిల్లిలోని తన నివాసంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. తాను వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి వచ్చానని, ఆయన శిష్యుడిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు తెలపాల్సిన బాధ్యత ఉంది కాబట్టి.. మంత్రి పదవికి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరానని చెప్పారు. తనను సీఎం జగన్ కేబినెట్‌లోకి తీసుకున్నారని, రెండున్నరేళ్ల అనంతరం రాష్ట్ర రవాణాశాఖ మంత్రిగా ప్రమోషన్ ఇచ్చారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన.. దొందూ.. దొందే

రాజమహేంద్రవరం ఎంపీ భరత్



రాజమహేంద్రవరం రూరల్: టీడీపీ, జనసేనకు నీతి, నిబద్ధత, సిద్ధాంతం ఏమీ లేవని, ఆ రెండూ దొందుకు దొందేనని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ విమర్శించారు. రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకోవడమే వారి లక్ష్యమన్నారు. ఆయన మంగళవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చూసినా, వైఎస్సార్‌సీపీ అనే మాట విన్నా వారికి బీపీ తన్నుకు వస్తోందన్నారు. 'బీ' అంటే బాబు అని, 'పీ' అంటే పవన్ అని అన్నారు. పవన్ ఒకవైపు బీజేపీతో పొత్తు అంటారు.. మరోవైపు టీడీపీతోనే ఉంటానంటారని, ఆయన ఆలోచనలేమిటో, ఏ క్షణంలో ఎలా మాట్లాడతారో అర్థం కాదని అన్నారు. ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తారో స్పష్టమైన ఆలోచనే లేదన్నారు. బీజేపీతో అంటకాగిన చంద్రబాబు ప్రత్యేక హోదా ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. ఎప్పటికైనా ఈ రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకురాగల దమ్ము సీఎం జగనన్నకే ఉందని చెప్పారు.

కల్తీల నివారణకు ప్రత్యేక బృందాలు

- వచ్చే నెల నుంచి ఫోర్టిఫైడ్ గోధుమ పిండి పంపిణీ
- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

విజయనగరం అర్బన్: ఆహార పదార్థాలను కల్తీచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. కల్తీల నివారణకు ప్రత్యేక తనిఖీ బృందాలను నియమిస్తున్నామని వెల్లడించారు. మంగళవారం విజయనగరం వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టీ పొడి, నిత్యావసర సరుకులు, వంటనూనె, పాలు వంటి వివిధ రకాల ఆహార పదార్థాలను కల్తీ చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. కల్తీ నిరోధానికి ఫుడ్ సేఫ్టీ, విజిలెన్స్, తూనికలు–కొలతల శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని మెరుగు పర్చేందుకు రేషన్‌షాపుల ద్వారా జొన్నలు, రాగులను సరఫరా చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారని తెలిపారు. పైలట్ ప్రాజెక్టుగా ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాల్లో గోధుమ పిండి పంపిణీ ప్రక్రియ విజయవంతమైందని మంత్రి నాగేశ్వరరావు చెప్పారు. వచ్చే నెల 1నుంచి రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లో ఫోర్టిఫైడ్ గోధుమ పిండిని కార్డుకు కిలో రూ.16కే సరఫరా చేస్తామని ప్రకటించారు. రేషన్ డిపోల ద్వారా పంపిణీ చేస్తున్న సరుకులన్నింటినీ కలిపి ఒక కిట్ రూపంలో అందజేయాలని సీఎం యోచిస్తున్నారని తెలిపారు.

రాష్ట్రంలో పవన్ ఒక్కచోటా గెలవలేరు

- చంద్రబాబును సీఎం చేయటమే పవన్ లక్ష్యం
- అందుకే కులాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్న పవన్
- స్వార్థపూరిత ఆలోచనతో పవన్ వారాహి యాత్ర
- జనసేన ఉభయ గోదావరి జిల్లాల పార్టీనా?
- మాజీ మంత్రి ఆళ్ల నాని



సాక్షి, అమరావతి/దొండపర్తి (విశాఖ దక్షిణ)/మొగల్తూరు: స్వార్థపూరిత ఆలోచనతో పవన్‌కళ్యాణ్ వారాహి యాత్ర చేస్తున్నారని, అడుగడుగున సీఎం వైఎస్ జగన్‌పైన అసభ్య పదజాలం ఉపయోగిస్తున్నారని మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) మండిపడ్డారు. ఇటువంటి పవన్ ఉభయగోదావరి జిల్లాల్లోనే కాదు.. రాష్ట్రంలో ఒక్కచోట కూడా గెలవలేరని చెప్పారు. పవన్‌కు ఒక అజెండా లేదని, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే ఆయన లక్ష్యమని పేర్కొన్నారు. నరసాపురం సభలో పవన్ చేసిన వ్యాఖ్యలను ఆళ్ల నాని తీవ్రంగా ఖండించారు. రాయలసీమ రౌడీలు, గూండాలంటూ పవన్ ప్రజల్లో భయానక పరిస్థితులు నెలకొల్పేలా వ్యాఖ్యలు చేస్తున్నారని తప్పుబట్టారు. సీమ గూండాలంటూ ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. ఆయన మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పవన్ మాటలను బట్టి చూస్తే జనసేన ఉభయ గోదావరి జిల్లాల పార్టీనా? రాష్ట్రవ్యాప్త పార్టీనా? అని సందేహం కలుగుతోందన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. 'చంద్రబాబు, పవన్‌లది ఒకటే గొంతుక, నాలుక. తనకు కులం లేదంటూనే పదేపదే కులాల ప్రస్తావన చేస్తున్నారు. పవన్ వ్యక్తిగత దూషణలు చేస్తున్నా వైఎస్సార్‌సీపీ నేతలు సహనంతో ఉంటున్నారు. అది మా సంస్కారమే తప్ప.. చేతగానితనం మాత్రం కాదు. ఉభయ గోదావరి జిల్లాల్లోని ఈ 34 సీట్లలో వైఎస్సార్‌సీపీని గెలవనివ్వను.. అంటే రాష్ట్రంలో మిగిలిన సీట్లలో జనసేన ఏమైనా ఫర్లేదా? ఉద్దేశపూర్వకంగానే వ్యక్తిగత ద్వేషంతో రాష్ట్ర ప్రయోజనాలను పవన్ దెబ్బతీస్తున్నారు. వారాహి యాత్రలో తిట్ల పురాణం తప్ప ప్రజల అజెండా ఏముంది? పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసేది కేవలం సీఎం వైఎస్ జగన్ మాత్రమే. వారాహి యాత్ర చూస్తే పవన్‌కళ్యాణ్, చంద్రబాబు ఒక ప్రణాళిక ప్రకారం కుట్ర చేస్తున్నారని అర్థమవుతోంది'అని అన్నారు.

ఉత్తరకుమార ప్రగల్భాలు మానుకో..



పవన్‌కళ్యాణ్.. ఉభయ గోదావరి జిల్లాల్లోని 34 అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్ సీపీని గెలవనివ్వబోనని నువ్వు చెప్పడం విడ్డూరంగా ఉంది. 2019లో పోటీచేసిన రెండు స్థానాల్లోను ఓడిపోయిన నువ్వు ఉత్తరకుమార ప్రగల్భాలు మానుకోవాలి. సినీహీరోలు, కామెడీ నటులు గతంలో చాలాచోట్ల పోటీచేసి గెలిచారు. వారిస్థాయి కూడా నీకు లేదు. నరసాపురం నియోజకవర్గంలో ఏ పార్టీ తరఫున గెలిచినా అందరినీ సమానంగా చూస్తున్న విషయం ప్రజలకు తెలుసు. కులమతాలకు అతీతంగా సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించేస్థాయి నీకు లేదు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతులకు గిట్టుబాటు ధర కల్పించలేదనే విషయం, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించలేదనే విషయం, మహిళలపై జరిగిన దాడుల విషయం నీకు జ్ఞాపకం లేవా? ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పదవి చేపట్టిన తరువాత మేనిఫెస్టోను 99 శాతం అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుంది.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

ఇది సినిమా కాదు.. వాస్తవంలోకి రా..



పవన్.. ఇష్టానుసారంగా మాట్లాడడానికి ఇది సినిమా కాదు. వాస్తవంలోకి రా. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, కాపు ఎమ్మెల్యేలను తన్నేస్తావా? తాటతీస్తావా? కులాల కోసం పట్టించుకోనంటూనే.. ప్రతి సభలోను కుల ప్రస్తావన తీసుకొస్తున్నావు. ముఖ్యమంత్రిని కాలేనని, చంద్రబాబును సీఎం చేయాలని చెప్పడం విడ్డూరంగా ఉంది. కాపుజాతి ముద్దుబిడ్డ ముద్రగడ పద్మనాభం ఇంటికి చంద్రబాబు పోలీసులను పంపించి ఆయన భార్యను దూషించి, కొడుకుని కొట్టి, ముద్రగడను చిత్రహింసలకు గురిచేసి, కేసులు పెట్టినా మాట్లాడని నువ్వు ఇంకెవరికి సాయం చేస్తావు. జగన్ ప్రతి కుటుంబంలో ఒక వ్యక్తిగా పెనవేసుకున్నారు. ఎవరు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ఆ బంధాన్ని విడదీయలేరు. టీడీపీ యువగళం పేరుతో చేపట్టిన యాత్రలో యువత లేరు. రైతు పోరు బాటలో రైతులు లేరు. బస్సుయాత్ర చేస్తే స్టేజీలు కూలిపోతున్నాయి. తెలుగుదేశంపై ఆ పార్టీ నాయకులకే నమ్మకం లేదు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు పార్టీ లేదు.. బొక్కా లేదు.. అన్న విషయం ఆ పార్టీ నేతల్లో బలంగా నాటుకుపోయింది.

– కారుమూరి వెంకటనాగేశ్వరరావు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి

ఉన్మాదంతో పవన్ ప్రసంగాలు



రాష్ట్రం సుభిక్షంగా, సురక్షితంగా ఉండాలంటే చంద్రబాబు రహిత రాజకీయాలు రావాలి. లేకపోతే, ఏదోరకంగా కుట్రలు పన్నుతూ రాష్ట్రాన్ని అస్థిర పరచడానికి పనిచేస్తుంటారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, వారి అనుకూల మీడియా వారు రాష్ట్రాన్ని ప్రశాంతంగా ఉండనీయరు. రాష్ట్ర ప్రజలు ఈ దుర్మార్గులు లేని రాజకీయాలను కోరుకుంటున్నారు. చంద్రబాబు లాంటి చండాలుడు రాష్ట్రానికి అవసరం లేదని ప్రజల అనుకుంటున్నారు. చంద్రబాబుగానీ, ఆయన అసలు కొడుకు లోకేశ్‌గానీ, దత్తపుత్రుడు పవన్‌గానీ ప్రజల్లోకి వెళ్లి గత ఐదేళ్ల చంద్రబాబు పాలనను చూసి ఓట్లు వేయండి అని అడగగలరా? మా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, మేము ఇంటింటికీ వెళ్లి మా పాలన నచ్చితేనే ఓటు వేయమని అడుగుతున్నాం. ఉభయ గోదావరి జిల్లాల్లో పవన్‌కళ్యాణ్ వారాహి యాత్ర అట్టర్‌ప్లాప్ అయింది. పవన్ ప్రసంగాలు ఉన్మాదానికి ఎక్కువ, పిచ్చికి తక్కువ. వంగవీటి రంగా చనిపోవడానికి బాధ్యులైన వారితో చేతులు కలిపి, ఆ రంగా చనిపోవడానికి కాపులే కారణమని బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు.

– కొట్టు సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రి

ఆక్వారంగం గురించి మాట్లాడే నైతిక అర్హత లేదు



ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు బటన్ నొక్కుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురించి మాట్లాడే నైతిక అర్హత పవన్‌కళ్యాణ్‌కు, ఆయన దత్తతండ్రి చంద్రబాబుకు లేదు. పవన్.. నీ బటన్ ఎవరి చేతుల్లో ఉందో ? ఎవరి కోసం రోడ్డెక్కి ఆడుతున్నావో రాష్ట్రప్రజలందరికీ తెలుసు. బాబు రిమోట్ బటన్ నొక్కగానే షూటింగ్ గ్యాప్‌లో రోడ్డు మీదకొచ్చి నాలుగు కారుకూతలు కూసి, ఆర్నెల్లు కనిపించకుండా పోయే నీకు సీఎం వైఎస్ జగన్‌ను విమర్శించే అర్హత ఎక్కడుంది? ఆక్వా సబ్సిడీ కోసం ఎందుకు బటన్ నొక్కడం లేదని విమర్శిస్తున్న నీకు ఆక్వారంగం ఏం తెలుసు? 2018లో ఆక్వాజోన్, నాన్ ఆక్వాజోన్ అంటూ ఆక్వారైతుల జీవితాలతో చంద్రబాబు చెలగాటమాడినప్పుడు నువ్వు ఎందుకు ప్రశ్నించలేదు? ఆక్వారంగాన్ని నిర్వీర్యం చేసింది, ఆక్వా రైతులను నిలువునా ముంచింది చంద్రబాబే. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆక్వా రైతుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తుంటే నోటికొచ్చినట్టు విమర్శించడం సరికాదు. చంద్రబాబు రాసిన స్క్రిప్టును చదవడం మానుకో.

– వడ్డి రఘురాం, ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) వైస్ చైర్మన్

నేను సీఎం అయినా అద్భుతాలు జరగవు

- ప్రజలు నిలదీసే పరిస్థితి వస్తేనే సమాజంలో మార్పు
- చట్టం పనిచేయకపోతే జనం కులాల వైపు చూస్తారు
- జనసేన అధినేత పవన్ కళ్యాణ్



సాక్షి, భీమవరం: తాను ముఖ్యమంత్రి అయినా అద్భుతాలేవీ జరగవని జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యానించారు. తనను ముఖ్యమంత్రిని చేస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానంటూ ఇంతకుముందు ఉపన్యాసాలిచ్చిన పవన్ కళ్యాణ్ మంగళవారం సీఎం పదవి పట్ల నిర్వేదంతో మాట్లాడారు. సీఎం పదవి మంత్రదండం కాదంటూ.. ఒకవేళ తాను సీఎం అయినా తనవల్ల ఏమీ కాదని చేతులెత్తేశారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో వారాహి విజయ యాత్రలో భాగంగా మంగళవారం తూర్పు కాపు సంఘం నాయకులతో సమావేశమయ్యారు. ఒకవేళ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టినా తాను చేయాలనుకున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు అధికారులు లేదా నాయకులు అడ్డుపడతారని ఆవేదన వ్యక్తం చేశారు. "తాను సీఎం అయినా ప్రజలు నిలదీసే పరిస్థితి రావాలని, చైతన్యంగా ఉన్న సమాజమే మంత్రదండం అవుతుందని చెప్పారు. జనసేన అధికారంలోకి వస్తే తూర్పు కాపుల జనగణన చేపడతామని చెప్పారు.

చట్టం పనిచేస్తే కులాలతో సంబంధం ఉండదు

చట్టపరంగా అందరికీ న్యాయం జరిగితే కులాలతో సంబంధం ఉండదని.. చట్టం పనిచేయనపుడే ప్రజలు కులాల వైపు చూస్తారని పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో తూర్పు కాపు మంత్రులు, ఎమ్మెల్యేలు ఉన్నారని, వారు తిన్న తరువాత అయినా కులం కోసం ఆలోచించాలన్నారు. తెలంగాణలో బీసీల జాబితా నుంచి తూర్పు కాపులను తొలగించినా నాయకులు పట్టించుకోలేదన్నారు. అనంతరం తూర్పు కాపుల సంఘం జాతీయ అధ్యక్షుడు పిశినే చంద్రమోహన్, గడి లక్ష్మి, పళ్లా వెంకట్రావు, ధనికొండ లక్ష్మణ నాయుడును పవన్‌కళ్యాణ్ జనసేన కండువాలు మెడలో వేసి పార్టీలో చేర్చుకున్నారు. నేతలు నాదెండ్ల మనోహర్, కొటికలపూడి గోవిందరావు పాల్గొన్నారు. ఈ నెల 30 సాయంత్రం 5 గంటలకు భీమవరంలో అంబేడ్కర్ సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

ఓటర్ల జాబితా సవరణపై ప్రత్యేక దృష్టి పెట్టండి

- 2014–19లో అధికారాన్ని అడ్డుపెట్టుకుని దాదాపు 68 లక్షల దొంగ ఓట్లు చేర్పించిన టీడీపీ నేతలు
- దొంగ ఓట్లను గుర్తించి.. వాటి తొలగింపునకు కృషి చేయండి
- అర్హులైన వారిని ఓటర్ల జాబితాలో చేర్పించేలా చూడండి
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గాల పరిశీలకులకు పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి దిశానిర్దేశం



సాక్షి, అమరావతి: మరో తొమ్మిది నెలల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణపై ప్రత్యేకదృష్టి పెట్టాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గాల పరిశీలకులను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో 2014–19 మధ్య అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీ నేతలు అరాచకాలకు పాల్పడి దొంగ ఓట్లను చేర్పించారని గుర్తుచేశారు. దాదాపు 68 లక్షల దొంగ ఓట్లు ఉన్నాయని తేలిందని ఎత్తిచూపారు. ఆ దొంగ ఓట్లను గుర్తించి, వాటి తొలగింపునకు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా అర్హులైన వారిని ఓటర్లుగా చేర్పించాలని సూచించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి మంగళవారం 175 నియోజకవర్గాల పార్టీ పరిశీలకులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకుడు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ పరిశీలకులు మరింత కీలకంగా, బాధ్యతగా పని చేయాలని సూచించారు. సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం చేసిన మేరకు 175 నియోజకవర్గాలకు 175 గెల్చుకోవడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. నియోజకవర్గాలపై అవగాహన పెంచుకోవాలని, స్థానిక సమస్యలు, వాటి పరిష్కారం, అక్కడి ప్రతిపక్షాల పాత్ర వంటి వాటిపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. వారంలో కనీసం రెండురోజులు నియోజకవర్గాల్లో ఉండి పార్టీని మరింత బలోపేతం చేసేదిశగా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే లేదా పార్టీ సమన్వయకర్తకు తలలో నాలుకలాగా మెలుగుతూ కీలకంగా ఉండాలని కోరారు. ఏవైనా సమస్యలుంటే సమన్వయంతో పరిష్కరించడానికి కృషిచేయాలని సూచించారు. స్థానిక నేతల అభిప్రాయాలు విభిన్నంగా ఉంటే వాటిని పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ల దృష్టికి, పార్టీ కేంద్ర కార్యాలయం దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. జగనన్న సురక్ష పథకం నియోజకవర్గాల్లో ఏ విధంగా జరుగుతోంది.. ప్రజలకు సంబంధించి అన్ని సమస్యల పరిష్కారం, పథకాలను లబ్ధిదారులకు అందించేలా సమన్వయం చేయడం వంటి వాటిపైన కూడా దృష్టిపెట్టాలని కోరారు. గృహసారథులు, గ్రామ, వార్డు సచివాలయాల కన్వీనర్లు.. మండల, డివిజన్ పార్టీ నేతలతో సమన్వయం చేసుకుని పని చేయాలని సూచించారు. సీఎం వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీ పట్ల ప్రజలు అత్యంత విశ్వాసంతో ఉన్నారని.. రానున్న ఎన్నికలలో పార్టీ విజయం తథ్యమని చెప్పారు. అయినప్పటికి నియోజకవర్గాలలో పార్టీ స్థితిగతులను ఎప్పటికప్పుడు బేరీజు వేసుకుంటూ పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

సూర్యనారాయణ అవినీతికి పక్కా ఆధారాలున్నాయి

- వ్యాపారులతో కుమ్మక్కై ఖజానాకు రూ. కోట్లలో నష్టం కలిగించారు
- హైకోర్టుకు నివేదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగిరెడ్డి
- ఏసీబీ కోర్టుకెళ్లేందుకు సూర్యనారాయణకు వెసులుబాటునిస్తాం
- విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి: వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగి, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ అవినీతికి పక్కా ఆధారాలున్నాయని పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) యర్రంరెడ్డి నాగిరెడ్డి హైకోర్టుకు నివేదించారు. ఆయన వ్యాపారులతో కుమ్మక్కై ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయల మేర నష్టం కలిగించారని చెప్పారు. ఆయన ఆదేశాల ప్రకారం మిగిలిన నిందితులు వ్యవహరించారని తెలిపారు. వ్యాపారులు, సూర్యనారాయణ మధ్య సంభాషణలపై పూర్తి ఆధారాలున్నాయన్నారు. ఆయన లబ్ధి చేకూర్చిన విధానం, ఖజానాకు నష్టం తీరును వాంగ్మూలాల్లో వ్యాపారులు వివరించారని చెప్పారు. ఈ సమయంలో హైకోర్టు స్పందిస్తూ.. సూర్యనారాయణ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపే పరిధి లేదని తేల్చిన విజయవాడ 12వ అదనపు జిల్లా జడ్జి కోర్టు కేసు పూర్వాపరాల్లోకి ఎలా వెళుతుందని ప్రశ్నించింది. ఆ కోర్టు కేసు పూర్వాపరాల్లోకి వెళ్లి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేసిన నేపథ్యంలో, ఆ ఉత్తర్వులను రద్దు చేస్తామంది. ఈ కేసును విచారించే పరిధి ఉన్న అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలుకు సూర్యనారాయణకు వెసులుబాటునిస్తామని తెలిపింది. ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోకుండా పోలీసులను ఆదేశించాలని సూర్యనారాయణ తరఫు న్యాయవాది కోరగా.. ముందస్తు బెయిల్ పిటిషన్‌పై వారంలో నిర్ణయం వెలువరించాలని ఏసీబీ కోర్టును ఆదేశిస్తామని, అప్పటి వరకు పోలీసులు ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇస్తామని ప్రతిపాదించింది. దీనిపై వైఖరి ఏమిటో తెలియచేయాలని పీపీ నాగిరెడ్డిని ఆదేశించింది. తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కింది కోర్టులో కేసు పూర్వాపరాల్లోకి వెళ్లిన సూర్యనారాయణ న్యాయవాదులు

విజయవాడ పటమట పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ సూర్యనారాయణ ఇటీవల విజయవాడ 12వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సూర్యనారాయణపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినందున ఈ పిటిషన్‌పై విచారణ జరిపే పరిధి ఈ కోర్టుకు లేదని, ఏసీబీ ప్రత్యేక కోర్టుకు మాత్రమే ఉందని విచారణ సందర్భంగా రాష్ట్ర అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శెట్టిపల్లి దుష్యంత్‌రెడ్డి చెప్పారు. అయితే సూర్యనారాయణ తరఫు న్యాయవాదులు కేసు పూర్వాపరాల్లోకి వెళ్లి వాదనలు వినిపించారు. వాదనలు విన్న కోర్టు.. సూర్యనారాయణ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేసింది. దీనిపై ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం జస్టిస్ సురేష్‌రెడ్డి విచారణ జరిపారు.

సెప్టెంబర్ నెలాఖరుకు వెలిగొండ పూర్తి

- మూడు జిల్లాలకు పుష్కలంగా జలాలు
- నిర్వాసితులకు పరిహారం చెల్లించాకే నల్లమల సాగర్‌కు నీరు
- నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- సొరంగంలో మంత్రులు అంబటి, ఆదిమూలపు సురేష్ సాహసయాత్ర
- కొల్లంవాగు నుంచి కొత్తూరు వరకు 19 కి.మీ సొరంగంలోనే ప్రయాణం



కొల్లంవాగు వద్ద పనులను పరిశీలిస్తున్న మంత్రులు

పెద్దదోర్నాల /శ్రీశైలం టెంపుల్: పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని, సెప్టెంబర్ నెలాఖరుకి నిర్మాణం పూర్తి చేసి నీటిని విడుదల చేస్తామని నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. ఆయన మంగళవారం రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌తో కలిసి కొల్లంవాగు వద్ద, మండల పరిధిలోని కొత్తూరు వద్ద జరుగుతున్న సొరంగం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టుతో ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు పుష్కలంగా జలాలు వస్తాయని తెలిపారు. ఈ జిల్లాల్లోని 4.50 లక్షల ఎకరాలకు సాగు నీరు, లక్షలాది మందికి తాగు నీరు అందుతుందని తెలిపారు. ప్రకాశం జిల్లాలో స్టేజ్–1 కింద 1.20 లక్షల ఎకరాలకు, స్టేజ్–2 కింద 2.55 లక్షల ఎకరాలకు సాగు నీరందుతుందని వివరించారు. సుంకేశుల నుంచి తీగలేరు కెనాల్‌కు నీరు తరలించడం ద్వారా యర్రగొండపాలెం నియోజకవర్గంలో 62 వేల ఎకరాల బీడు భూములు సాగులోకి వస్తాయన్నారు. ఈ ప్రాజెక్టు మొదటి సొరంగం నిర్మాణం ఇప్పటికే పూర్తయిందని, రెండో సొరంగం పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. మరో కిలోమీటరు మేర పనులు జరగాల్సి ఉందన్నారు. ఈ పనులన్నీ మూడు నాలుగు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. ప్రాజెక్టు పరిధిలోని నిర్వాసితులకు నష్టపరిహారాన్ని అందించిన తర్వాతే నల్లమల సాగర్‌లో దశలవారీగా నీటిని నింపుతామని చెప్పారు. ఎంతో ఉన్నత లక్ష్యంతో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన ఈ ప్రాజెక్టును ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి త్వరితగతిన పూర్తి చేస్తున్నారని అన్నారు. సాధ్యమైనంత త్వరలో నల్లమల సాగర్‌ను నింపి ప్రజలకు నీరందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి ఉన్నారన్నారు.

19 కిలోమీటర్లు సొరంగ మార్గంలో ప్రయాణించిన మంత్రులు

మంత్రులు అంబటి రాంబాబు, ఆదిమూలపు సురేష్ వెలిగొండ సొరంగంలో సాహస యాత్ర చేశారు. కొల్లంవాగు నుంచి మండల పరిధిలో వెలిగొండ ప్రాజెక్టు సొరంగం పనులు జరుగుతున్న కొత్తూరు వరకు దాదాపు 19 కిలోమీటర్లు సొరంగ మార్గంలోనే ప్రయాణించారు. మంగళవారం శ్రీశైలం శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం మంత్రులు రోప్‌వే ద్వారా పాతాళగంగకు చేరుకున్నారు. అనంతరం బోట్‌లో కృష్ణా నదిలో ప్రయాణించి కొల్లంవాగుకు చేరుకున్నారు. అక్కడ హెడ్ రెగ్యులేటర్, ఇతర పనులను పరిశీలించారు. అక్కడి నుంచి బొలెరో వాహనాల్లో మొదటి సొరంగం గుండా 13 కిలోమీటర్లు ప్రయాణించారు. అనంతరం 6 కిలోమీటర్లు రెండో సొరంగం గుండా ప్రయాణించి కొత్తూరు చేరుకున్నారు. గాలి కూడా ఉండని ఇరుకు సొరంగ మార్గాల గుండా మంత్రులు ప్రయాణించటం సాహసమేనని పలువురు అధికారులు పేర్కొన్నారు. మంత్రుల వెంట మంత్రి సురేష్ తనయుడు విశాల్, ఈఎన్‌సీ నారాయణరెడ్డి, సీఈ మురళీనాథ్‌రెడ్డి ఉన్నారు.



సొరంగ మార్గం నుంచి బయటకు వస్తున్న మంత్రుల వాహనం

సాక్షి ఫ్యామిలీ
చెన్నై
బుధవారం ॥ 28-6-2023

పర్యావరణంపై మమత

డ్యూటీ సమయంలో బుద్ధిగా కూర్చుని తమ పని తాము చేసుకుని సమయం అయిపోగానే ఇంటికి వెళ్లిపోయే అధికారులు కొందరయితే, ఆఫీసు పని వేళల తరవాత కూడా పని గురించి ఆలోచించి వినూత్న నిర్ణయాలతో అందరికి ఆదర్శంగా నిలుస్తుంటారు మరికొందరు. ఈ రెండో కోవకు చెందిన వ్యక్తే జార్ఖండ్ ఫారెస్ట్ అధికారి మమతా ప్రియదర్శి. పర్యావరణం గురించి అవగాహన కల్పించడంతోపాటు జంతువులకు మనుషులకు మధ్యన సంధి కుదురుస్తూ అందరికీ ప్రేరణగా నిలుస్తోంది.



● మమతా ప్రియదర్శి

జంషెడ్‌పూర్ డివిజినల్ ఫారెస్ట్ అధికారిగా పని చేస్తోంది మమతా ప్రియదర్శి. ఫారెస్ట్ అధికారిగా అడవులను సంరక్షించడంతోపాటు పర్యావరణం దెబ్బతినకుండా ఉండేందుకు శాయశక్తులా కృషిచేస్తోంది. ప్రకృతి ప్రాముఖ్యత, కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెబుతూ రేపటి పౌరులకు అవగాహన కల్పిస్తున్నారు. వాతావరణంలో చోటు చేసుకుంటోన్న మార్పులు, నీటి సంరక్షణ, మనుషులు– జంతువుల మధ్య ఏర్పడే సంఘర్షణలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు వివిధ రకాల డాక్యుమెంటరీలను ప్రదర్శన ఏర్పాటు చేసింది. ఇప్పటిదాకా 347 గ్రామాలు, వివిధ స్కూళ్లలో ప్రదర్శించిన డాక్యుమెంటరీలతో రెండున్నర లక్షలమందికిపైగా అవగాహన కల్పించింది. వ్యాన్‌కు పెద్ద ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణ గురించి వివరించి చెబుతున్నారు. ఈ కార్యక్రమం గురించి ఆమె మాటల్లోనే...



''ఈ మధ్యకాలంలో తరచూ అడవుల్లో మంటలు రేగి చాలా వృక్షాలు కాలిపోతున్నాయి. దీనివల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతింటోంది. అసలు అడవులు ఎందుకు తగలబడుతున్నాయో కూడా ఈ చుట్టుపక్కల నివసిస్తోన్న చాలామందికి తెలీదు. ఏనుగులకు, మనుషులకు మధ్య తరచూ సమస్యలు ఏర్పడుతున్నాయి. ఇలాంటి వాటన్నింటిని అధిగమించడానికి తీసుకొచ్చిందే ఈ కార్యక్రమం.

అందుకే ఆడియో–వీడియో

జంతువులకు ఎలాగూ అర్థం చేయించలేము. మనమే అర్థం చేసుకుని వాటికి అడ్డు తగలకుండా, మూగజీవాలు మనకి ఇబ్బంది కలిగించకుండా మనమే సర్దుకుపోవాలి. అందుకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో ... కూర్చోబెట్టి చెపితే ఎవరూ వినరు. అందుకే ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి వారి ఆసక్తిని ఇటు మళ్లిస్తున్నాం. కొంతవరకైనా గుర్తుపెట్టుకుని పాటిస్తారు. ఈ డాక్యుమెంటరీలలో నాలుగు విభిన్న అంశాలపై వీడియోలు ప్లే చేస్తున్నాం. మనుష్యులు– జంతువుల సంఘర్షణ మొదటిది, రెండో వీడియోలో అడవులు తగలబడినప్పుడు ఏం చేయాలి... మూడో అంశంగా కర్బన ఉద్గారాలు విడుదలవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఉంటాయి. నాలుగో అంశం మొక్కల పెంపకం, మొక్కలను ఎలా కాపాడాలి, నీటిసంరక్షణ గురించి సరళమైన భాషలో చెబుతున్నాం. వీటివల్ల విద్యార్థులు, గ్రామస్థులకు సులభంగా అర్థమవుతుంది.

స్కూళ్లు, పబ్లిక్ ప్లేసుల్లో..

ఇప్పటిదాకా స్కూళ్ళతోపాటు, గ్రామాల్లోని పబ్లిక్ ప్లేసుల్లో వ్యాన్ వీడియోలు ప్లేచేసి వీలైనంత అవగాహన కల్పించాం. పాఠ్యపుస్తకాల్లో సిలబస్ కాకుండా కొత్త విషయాలు తెలుసుకున్నందుకు వాళ్లు చాలా సంతోషపడుతున్నారు.

పట్టుదారంతో జీవితాన్ని అల్లుకుంది

**నేనేంటి? నాకంటూ చెప్పకోవడానికి ఏమీ లేదా?
ఈ ప్రశ్నలు పావనిని వెంటాడాయి... వేధించాయి.
చదువుంది... పెద్ద ఉద్యోగం చేయాలనే ఆకాంక్ష ఉంది.
అబ్దుల్ కలామ్ చెప్పినట్లు పెద్ద కలలు కన్నదామె.
ఆ కలలను నిజం చేసుకోవడానికి తగినట్లు శ్రమించింది కూడా.
జీవితం మాత్రం... ఆమె చదవని సిలబస్‌తో పరీక్ష పెట్టింది.
ఆ పరీక్షను సహనంతో ఎదుర్కొన్నది... ఉత్తీర్ణత సాధించింది.
ఇక... తనను తాను నిరూపించుకోవాలనుంది.
క్రియేటివిటీ ఆమెకు తోడుగా వచ్చి వెంట నిలిచింది.
ఆమె ఇప్పుడు పట్టుదారంతో చక్కటి ఆభరణాలల్లుతోంది.**



● పావని కోరెం

పావని కోరెం... వరంగల్ జిల్లా, హన్మకొండలో పుట్టింది. బయో టెక్నాలజీలో గ్రాడ్యుయేషన్ చేసింది. ఇంకా చదవాలని, మంచి ఉద్యోగం తెచ్చుకోవాలని అనుకుంది. ఆమె ఆలోచనలకు భర్త అండగా నిలిచారు. పెళ్లి తర్వాత హైదరాబాద్‌లో కాపురం, ఉస్మానియాలో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో చేరింది. బయో ఇన్‌ఫర్మాటిక్స్‌లో పీజీ పూర్తయింది. పోటీ పరీక్షల కోసం భార్యాభర్తలిద్దరూ కలిసి కోచింగ్‌కెళ్లారు. పరీక్షలకు సిద్ధమయ్యేలోపు జీవితం మరో పరీక్ష పెట్టింది. కడుపులో పెరుగుతున్న బిడ్డ గురించి చిన్న సందేహం. ఆ సందేహాన్ని నిజం చేయడానికా అన్నట్టు పుట్టగానే బిడ్డ ఏడవలేదు. నెలరోజులు హాస్పిటల్‌లోనే ఉంచి చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చారు. స్పెషల్ కిడ్ కావచ్చనే మరో సందేహం. క్షణక్షణం బిడ్డ సంరక్షణలోనే గడిచిపోయింది. అనుక్షణం బిడ్డ ఎదుగుదల కోసం శ్రమించింది. తల్లిగా కఠోరయజ్ఞమే చేసింది. ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీలతో బాబుని మెయిన్‌స్ట్రీమ్‌లోకి తీసుకు రాగలిగింది. ఈ ఒత్తిడి నుంచి బయటపడడానికి తాను ఆశ్రయించిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ నుంచి తనను తాను తీర్చిదిద్దుకుంది. తనను తాను నిరూపించుకోవాలనే తపనతో పని చేసింది. ఇప్పుడామె తన సృజనాత్మకతతో గుర్తింపు పొందుతోంది. తన జీవితంలో దశాబ్దంపాటు సాగిన కీలక పరిణామాలను ఆమె సాక్షితో పంచుకున్నారు.

ఊహించని శరాఘాతం!

''మా పెళ్లి 2009లో జరిగింది. బాబు ఏడీహెచ్‌డీ (అటెన్షన్ డెఫిసిట్ హైపర్ యాక్టివిటీ డిజార్డర్) సమస్య ఉందని తెలిసింది. బోర్లా పడడం, పాకడం, కూర్చోవడం, నడవడం వంటివన్నీ కొంత ఆలస్యంగా చేశాడు. నార్మల్ కిడ్ చేయాల్సిన సమయానికంటే ఎంత ఆలస్యమవుతోందా అని క్యాలెండర్ చెక్ చేసుకుంటూ... కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చాను. ఇప్పుడు దాదాపుగా నార్మల్ కిడ్ అయ్యాడు. కానీ చిన్నప్పుడు రోజూ ఆందోళనే. బరువు తక్కువగా పుట్టడంతో ఇమ్యూనిటీ తక్కువగా ఉండేది. తరచూ జలుబు, జ్వరం వస్తుండేవి. అప్పట్లో మా వారికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ మైసూరులో ఉద్యోగం. కర్నాటకలో ఓ చిన్న గ్రామంలో పోస్టింగ్. అక్కడ వైద్య సదుపాయాలు తక్కువ. ప్రతినిత్యం భయంభయంగా గడిచేది. రెండున్నరేళ్లకే బాబుకి హెర్నియా ఆపరేషన్ చేయించాల్సి వచ్చింది. స్టేట్ బ్యాంకుకు అనేక అనుబంధ బ్యాంకుల్ని అనుసంధానం చేయడం కూడా అప్పుడే జరిగింది. ఎస్‌బీఐకి మారి హైదరాబాద్‌కి వచ్చేశాం. మన ప్రాంతానికి వచ్చిన తర్వాత నన్ను వెంటాడిన భయం వదిలిపోయింది. బాబుకి మంచి వైద్యం చేయించగలమనే ధైర్యం వచ్చింది. ట్రీట్‌మెంట్ థెరపీలు జరిగేకొద్దీ బాబులో మెరుగుదల స్పష్టంగా కనిపిస్తుండేది. డిప్రెషన్ నుంచి మెల్లగా బయటపడ్డాను. రోజులు ఆశాజనకంగా గడుస్తున్నప్పటికీ నాలో ఏదో వెలితి ఉండేది.

సృజనతో సాంత్వన

నన్ను నేను ఏదో ఒక వ్యాపకంలో నిమగ్నం చేసుకోవడానికి ప్రయత్నం చేస్తూ ఉండేదాన్ని. యూ ట్యూబ్ చూసి నేర్చుకున్న పేపర్ క్విల్లింగ్ మంచి సాంత్వననిచ్చింది. బాబుకి ఫిజియోథెరపీ చేయించే ట్రైనర్ నేను క్విల్లింగ్‌లో చేసిన పూలు, బొమ్మలను చూసి, చాలా బాగున్నాయని తీసుకెళ్లారు. వాటిని ఆ రోజే వాళ్ల హాస్టల్ స్టూడెంట్స్ కొనుక్కున్నారు. అప్పుడే మా ఫ్రెండ్ పట్టు దారంతో ఆభరణాలు తయారు చేయమని చెప్పింది. అలా నా లైఫ్ కొత్త మలుపు తీసుకుంది. హాబీగా మొదలు పెట్టిన యాక్టివిటీ కాస్తా నాకు ఒక ప్రత్యేకమైన గుర్తింపునిచ్చింది. తెలిసిన వాళ్ల నుంచి నా సృజనాత్మకత ఎల్లలు దాటింది. దుబాయ్, యూఎస్, యూకే, చైనా ల నుంచి ఆర్డర్‌లు వస్తున్నాయి. ఫేస్‌బుక్ బిజినెస్ పేజ్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, జస్ట్ డయల్, మీ షోలలో నా అల్లికలు విపరీతంగా అమ్ముడవుతున్నాయి. రిటర్న్ గిఫ్ట్‌లు ఇవ్వడానికి బల్క్ ఆర్డర్‌లు వస్తుంటాయి. అలాంటప్పుడు రాత్రంతా పని చేస్తుంటాను. ముగ్గురు అమ్మాయిలకు ఎంప్లాయ్‌మెంట్ ఇచ్చాను. మేము తయారు చేసిన ఉత్పత్తులను పికప్ బాయ్స్ వచ్చి తీసుకెళ్తారు. బాబును చూసుకుంటూ నా యాక్టివిటీని కొనసాగిస్తున్నాను. మొదట్లో అయితే మెటీరియల్ కోసం వెతుక్కుంటూ బాబును బండి మీద కూర్చోబెట్టుకుని బేగం పేట నుంచి బేగం బజార్‌కు వెళ్లేదాన్ని. ఇప్పుడైనా ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తే వస్తుంది. కానీ బాబుకు ఇంకా నా అవసరం ఉంది. నేను దగ్గరుండి చూసుకుంటే మెరుగ్గా ఉంటుందనే ఉద్దేశంతో ఇప్పుడిలా కొనసాగిస్తున్నాను.

నాకు నిజంగా ఆశ్చర్యమే!

నా లైఫ్ జర్నీలో నాకు ఆశ్చర్యం, సంతోషం కలిగించే విషయం ఏమిటంటే... నన్ను రోల్‌మోడల్‌గా చూస్తూ నా నుంచి స్ఫూర్తి పొందుతున్న వాళ్లు ఉన్నారనే విషయం. అంతా బాగున్న వాళ్లు చాలామంది ఏమీ చేయకుండా ఉంటున్నారు. ఏదైనా సమస్య రాగానే దిగాలు పడిపోయి జీవితాన్ని నాలుగ్గోడలకు పరిమితం చేసుకునే వాళ్లున్నారు. కానీ... 'సమస్యకు పరిష్కారం వెతుక్కుని, తనకు ఒక గుర్తింపును తెచ్చుకుంది' అని ప్రశంసిస్తున్నారు. మా వాళ్లు మాత్రం మొదట్లో 'నీకు ఇప్పుడు ఇవన్నీ ఎందుకు, పిల్లాడిని చూసుకుంటూ ప్రశాంతంగా ఉండు. ఇన్ని ఒత్తిడులు పెట్టుకోవద్ద'ని కోప్పడ్డారు. కానీ ఈ పని నాకు ఒత్తిడిని తగ్గిస్తోందని తెలిసి మా వాళ్లు కూడా సంతోషంగా ఉన్నారు. నేను ఎంతో సంపాదిస్తున్నానని కాదు, కానీ నేను ఎటువంటి ఉనికి లేకుండా లక్షల్లో ఒకరిలా ఉండిపోకుండా, ఈ పని వల్ల వందల్లో ఒకరిగా ఓ గుర్తింపు తెచ్చుకోగలిగాను'' అంటున్నప్పుడు పావని కళ్లలో ఆనందం వెల్లివిరిసింది.

– వాకా మంజులారెడ్డి
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

బ్యూటిప్: బంగాళ దుంపతో ముఖం మిలమిల



● ఒక బంగాళదుంపను తీసుకుని తొక్క తీసి.పేస్టులా చేసుకోవాలి. దీన్ని పలుచని వస్త్రంలో వడగట్టి నీటిని తీసేయాలి. ఆ గుజ్జులో 6 టేబుల్ స్పూన్ల పాలు కలపాలి. ఈ మిశ్రమంలో 6 చుక్కల ఎసెన్షియల్ ఆయిల్ వేసి బాగా కలిపి. ఐస్ ట్రేలో వేసి రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి. ● ముఖాన్ని శుభ్రంగా కడిగి.. ఫ్రీజ్ అయిన బంగాళదుంపతో ముఖమంతా రుద్దాక. చేతులతో సున్నితంగా మర్దన చేసి. ఆరిన తరువాత కడిగేయాలి. ● వారంలో మూడుసార్లు ఇలా చేయడం వల్ల ముఖం మీద పేరుకు పోయిన దుమ్మూధూళి, మొటిమల తాలూకు మచ్చలు పోయి ముఖచర్మం నిగారింపుని సంతరించుకుంటుంది.

యువతరం... పిబరే భక్తి రసం

యూత్ పల్స్

'మనసులో ఉండే గదులను అసూయ, ద్వేషం, ఆగ్రహం... వంటి ప్రతికూల శక్తులతో నింపుకుంటూ వెళితే మనసు భారంతో కుంగిపోతుంది. ఆ భారం మన అడుగులపై పడుతుంది. ఒక అడుగు కూడా ముందుకు పడదు. దీనివల్ల ఎవరికి నష్టం? అలాకాకుండా మనసును ప్రేమ, శాంతి, సంతోషాలతో నింపండి. మనసు అత్యంత తేలిక అవుతుంది. అడుగులు వడివడిగా ముందుకు పడతాయి...' ఇలాంటి మాటలతో యువతరాన్ని ఆకట్టుకుంటున్నారు యంగ్ స్పిరిచ్యువల్ ఇన్‌ఫ్లూయెన్సర్‌లు. సోషల్ మీడియాలో వీరు ఆధ్యాత్మికతకు సంబంధించి కొత్త ద్వారాన్ని తెరిచారు. వీరి ఫాలోవర్స్‌లో అత్యధికులు యువతే కావడం మరో విశేషం....

'కాపీ కొట్టండి ఫరవాలేదు' అంటుంది శ్రేయాసి వాలియా. ఇంతకీ ఆమె ఏం కాపీ కొట్టమంటుంది?

'కాపీ కొట్టండి. దయగల హృదయాన్ని, ఎంత పెద్ద విమర్శను అయినా చిన్న చిరునవ్వుతో స్వీకరించే ధీరత్వాన్ని' అంటుంది శ్రేయాసి.

దిల్లీలో జన్మించిన శ్రేయాసి కొన్ని డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల కోసం స్క్రిప్ట్ రైటర్‌గా, అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసింది. ప్రస్తుతం బెంగళూరు కేంద్రంగా 'స్పిరిచ్యువల్ ఇన్‌ఫ్లూయెన్సర్'గా మంచి పేరు సంపాదించుకుంది.

ఏడు సంవత్సరాల వయసు నుంచే ధ్యానం తరగతులకు హాజరయ్యేది శ్రేయాసి. ధ్యానంతోపాటు ఆధ్యాత్మిక విషయాలపై చిన్నప్పటి నుంచి ఆసక్తి ఉంది.

లాక్‌డౌన్ సమయంలో కోవిడ్ మహమ్మారి భయం అనేది ఒక కోణం అయితే కరిగిపోతున్న ధైర్యం, నిలువెల్లా దైన్యం, రకరకాల మానసిక సమస్యలు మరో కోణం. ఈ సమస్యల పరిష్కారానికి ఉచితంగా మెడిటేషన్ తరగతులు నిర్వహించింది. తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో 'ధ్యానం ఎందుకు చేయాలంటే... 500 కారణాలు' అంటూ రాసిన దానికి మంచి స్పందన వచ్చింది.



● జయ కిశోరి



● శ్రేయాసి

'ధ్యానం వల్ల నా కోపం తగ్గిపోయింది. ఆత్మవిశ్వాసం పెరిగింది' అంటుంది శ్రేయాసి.

'ధ్యానం' తరువాత ఆధ్యాత్మిక విషయాలు కూడా రాయడం మొదలుపెట్టింది.

'భక్తితత్వాన్ని గంభీరంగా మాత్రమే చెప్పాలని లేదు' అనే భావనతో ఎంటర్‌టైన్‌మెంట్ వీడియోల ద్వారా కూడా ఎన్నో మంచి విషయాలు చెప్పింది.

'ఇదంతా ఏమిటి! హాయిగా లక్షలు సంపాదించే ఉద్యోగం చేసుకోకుండా' అని తనతో చాలామంది అనేవారు.

ఇక సోషల్ మీడియాలో ట్రోలింగ్ సరేసరి. అయితే వారి మాటలు, ట్రోలింగ్ తనపై ప్రభావం చూపించలేకపోయాయి. 'స్పిరిచ్యువల్ ఇన్‌ఫ్లూయెన్సర్'గా శ్రేయాసికి సోషల్ మీడియాలో ఎంతోమంది ఫాలోవర్స్ ఉన్నారు.

'నేను ఎక్కువ ఇచ్చి తక్కువ తీసుకుంటున్నానా? తక్కువ ఇచ్చి ఎక్కువ తీసుకుంటున్నానా?' అనేది శ్రేయాసి తనకు తాను వేసుకునే ప్రశ్న.

తీరిక సమయంలో పెయింటింగ్స్ వేయడం, పుస్తకాలు చదవడం, బ్యాడ్మింటన్ ఆడడం అంటే తనకు ఇష్టం.

●●●

కోల్‌కత్తాకు చెందిన 27 సంవత్సరాల జయ కిశోరిని 'మీరాబాయి ఆఫ్ జెన్‌జెడ్' అని పిలుచుకుంటారు అభిమానులు. సోషల్ మీడియా కేంద్రంగా కృష్ణుడి గాథలను 30 సెకండ్ల వీడియోలతో చెప్పడం ద్వారా జయ కిశోరి పాపులర్ అయింది.

జయ కిశోరి ఉపన్యాసాలకు ప్రభావితమైన ఎంతోమంది 'మాలో ఒంటరితనం దూరమైంది. స్నేహభావం పెరిగింది' అంటుంటారు.

జయ కిశోరికి ఫేస్‌బుక్‌లో 1.9 మిలియన్లు, యూట్యూబ్‌లో 2 మిలియన్‌ల ఫాలోవర్స్ ఉన్నారు.

'నా తల్లిదండ్రులు ఆర్మీలో పనిచేస్తారు. దీంతో ఎన్నో ప్రాంతాలలో చదువుకోవాల్సి వచ్చింది. అయితే ఏ ప్రాంతంలో చదువుకున్నా జయ దీదీ నాతోపాటు ఉన్నట్లే ఉంటుంది. నాకు ధైర్యం చెబుతూ దారి చూపుతుంది' అంటుంది దిల్లీకి చెందిన పదహారు సంవత్సరాల జయ పాండే.

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఝాన్సీకి చెందిన 14 సంవత్సరాల దేవి ఉష్మ కిషోర్జీ ఒకవైపు పాఠశాల విద్యను కొనసాగిస్తూనే సోషల్ మీడియాలో రీల్స్, షార్ట్స్, పోస్ట్‌ల ద్వారా ఆధ్యాత్మికం నుంచి సెల్ఫ్–లవ్, సెల్ఫ్–కేర్ వరకు ఎన్నో విషయాలపై తన మనసులోని భావాలను పంచుకుంటుంది. దేవికి ఇన్‌స్టాగ్రామ్‌లో పదివేలమంది ఫాలోవర్స్ ఉన్నారు.

'నాకు ఉన్న ఫాలోవర్స్ సంఖ్యను దృష్టిలో పెట్టుకొని ఒక వీడియోకు మూడు లక్షలు ఇస్తాం అంటూ ఆఫర్స్ వస్తుంటాయి. అయితే నేను డబ్బు కోసం రాజీ పడదలచుకోలేదు. వీడియోలను వైరల్ చేయడానికి ఒత్తిడి తెచ్చుకోవడం నా లక్ష్యం కాదు' అంటుంది ముంబైకి చెందిన ఒక స్పిరిచ్యువల్ ఇన్‌ఫ్లూయెన్సర్.

'మీ ఉపన్యాసం విన్న తరువాత నేను ఒంటరిని అనే భావన పోయింది అని మెసేజ్‌లు వస్తుంటాయి. ఇలాంటి మెసేజ్‌లు డబ్బుకంటే ఎంతో విలువైనవి అనిపిస్తాయి' అంటుంది ఆమె.

స్థూలంగా చెప్పాలంటే యంగ్ స్పిరిచ్యువల్ ఇన్‌ఫ్లూయెన్సర్‌లు తమ ఆనందాన్ని డబ్బులలో చూసుకోవడం లేదు. తమ విజయాన్ని కరెన్సీ ధగధగలతో కొలవాలనుకోవడం లేదు.

'మీ పోస్ట్ చదివిన తరువాత, మీ ఉపన్యాసం విన్న తరువాత నాలో చెప్పలేనంత మార్పు వచ్చింది' ఇలాంటి చిన్న మెసేజ్ చాలు వారికి వెయ్యి ఏనుగుల బలాన్ని ఇవ్వడానికి!

విజయపథం

పీ ఫర్ పాడ్‌కాస్ట్.. బీ ఫర్ భార్గవి

లాక్‌డౌన్ లైఫ్‌స్టైల్లో మెరిసిన ఒక ట్రెండ్.... పాడ్‌కాస్ట్. 'పాడ్‌కాస్ట్' పాపులారిటీ గురించి వినడమేగానీ దాని పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకోవడానికి, సక్సెస్‌ఫుల్ పాడ్‌కాస్టర్‌గా రాణించాలనుకునే వారికి సాధికారికమైన సమాచారం కరువైంది. ఈ లోటును పూరించడానికి మంచి పుస్తకాన్ని తీసుకువచ్చి ఔత్సాహికులకు మేలు చేసింది భార్గవి....



● భార్గవి స్వామి

లీడింగ్ హెచ్ఆర్ కన్సల్టింగ్ కంపెనీ 'ఎక్సెల్ కార్పొరేషన్'కు సీయీవోగా ఉన్న బెంగళూరుకు చెందిన భార్గవి స్వామి మన దేశంలోని లీడింగ్ పాడ్‌కాస్టర్‌లలో ఒకరు. కంటెంట్ ప్రొడ్యూసర్‌గా కూడా తన సత్తా చాటుతుంది.

మన దేశంలో పాడ్‌కాస్ట్‌పై వచ్చిన తొలి పుస్తకం 'పీ ఫర్ పాడ్‌కాస్ట్' రచయిత్రిగా ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది. తన అనుభవాలను క్రోడీకరించి ఫస్ట్–పర్సన్‌లో రాసిన ఈ పుస్తకం పాడ్‌కాస్ట్ గురించి ప్రాథమిక విషయాలను తెలుసుకోవాలనుకునేవారికి దిక్సూచిలా నిలిచింది. 'ఆర్ట్ ఆఫ్ పాడ్‌కాస్టింగ్'ను అక్షరాల్లోకి తెచ్చింది.

బిజినెస్ పాడ్‌కాస్ట్ షో 'పీపుల్ హూ మ్యాటర్'తో సక్సెస్‌ఫుల్ పాడ్‌కాస్టర్‌గా పేరు తెచ్చుకుంది భార్గవి. పాడ్‌కాస్టర్‌గా ప్రయాణం మొదలు పెట్టే ముందు దాని లోతుపాతులు ఏమిటో తెలుసుకోవడానికి చిన్నపాటి రీసెర్చ్ లాంటిది చేసింది. అయితే పాడ్‌కాస్టర్‌గా తొలి అడుగులు వేయడానికి అవసరమైన సమాచారం దొరకడం గగనం అయింది. 'జీరో ఇన్‌ఫర్‌మేషన్' అనేది వెక్కిరిస్తున్నా తన పరిశోధనలో ఎక్కడా తగ్గింది లేదు. మాస్‌కమ్యూనికేషన్‌లో మాస్టర్స్ చేసిన భార్గవి తనదైన పద్ధతిలో పరిశోధన చేస్తూ సమాచారాన్ని సంపాదించింది.

'తెలుసుకోవడానికి ఇన్ని విషయాలు ఉన్నాయా!' అనిపించింది.

తాను సక్సెస్‌ఫుల్ పాడ్‌కాస్టర్‌గా రాణించడానికి అవి మంచి మార్గాన్ని చూపాయి.

తన సక్సెస్‌తోనే ఆగిపోకుండా పాడ్‌కాస్టింగ్‌లో సక్సెస్ కావాలనుకునేవారి కోసం 'పీ ఫర్ పాడ్‌కాస్టింగ్' అనే పుస్తకం రాసింది.

వెబ్‌సీరీస్‌ల కోసం స్క్రిప్ట్ రాసినప్పుడు ఫస్ట్ డ్రాఫ్ట్‌లోనే ఓకే అయిపోయేది. 'పీ ఫర్ పాడ్‌కాస్టింగ్' విషయంలో మాత్రం పలుసార్లు పుస్తకాన్ని తిరగరాసింది. ఏదో ఒక విషయాన్ని కొత్తగా చేరుస్తూ వచ్చింది.

ఈ పుస్తకానికి భార్గవి తల్లి ఎడిటర్‌లా వ్యవహరించింది. సూచనలు ఇచ్చింది. తల్లితో కలిసి ఈ ప్రాజెక్ట్ మీద పనిచేయడం భార్గవికి ఎంతో సంతోషాన్ని ఇచ్చింది.

'పుస్తకాలు ఎక్కువగా చదవడం వల్ల రచనల ద్వారా ఒక విషయాన్ని సులభంగా కమ్యూనికేట్ చేయగలిగే విద్య పట్టుబడింది. నాలోని భావాలను ఆవిష్కరించడానికి రచనలను ఒక మాధ్యమంలా చేసుకుంటాను. అయితే పీ ఫర్ పాడ్‌కాస్ట్ అనేది నాలోని భావాల ఆవిష్కరణకు మాత్రమే పరిమితమైపోలేదు. ఎంతోమందికి దారి చూపించింది' అంటుంది భార్గవి.

అరవింద్ అడిగ, కిరణ్ దేశాయ్, అశ్విని సంఘీ... మొదలైన వారి రచనలపై ఆసక్తి చూపించే భార్గవి కార్పొరేట్ దిగ్గజాల ఆలోచనలను, లీడర్‌షిప్, కోచింగ్‌లకు సంబంధించి పుస్తకాలను ఇష్టపడుతుంది. సంతోషం వెనక ఉండే శాస్త్రీయతను తెలుసుకోవడానికి ఆసక్తి ప్రదర్శిస్తుంది.

'పాడ్‌కాస్టర్‌గా నా నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి మరింతగా ప్రయత్నిస్తున్నాను' అంటున్న భార్గవి స్వామి వెబ్‌సీరీస్ కోసం స్క్రిప్ట్‌లు రాయడానికి, ఒక యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్ గురించి ఫిక్షన్ బుక్ రాయడానికి సన్నాహాలు చేస్తోంది.

సక్సెస్ మంత్ర



లాక్‌డౌన్ లైఫ్‌స్టైల్ వల్ల రీడింగ్, రైటింగ్ అనేవి మనకు బాగా చేరువయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా పాడ్‌కాస్ట్ సెగ్మెంట్ దూసుకుపోయింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని పాడ్‌కాస్టర్‌గా ప్రయాణం మొదలుపెట్టాను. 'పాడ్‌కాస్టర్‌గా సక్సెస్ కావాలి' అనుకోగానే సరిపోదు. అందుకు తగిన కసరత్తులు చేయాలి. మనదైన ప్రత్యేకత కోసం ప్రయత్నించాలి. స్కూల్‌రోజుల్లో నేను చదువుల్లో ముందు ఉండడంతో పాటు పాటలు పాడేదాన్ని. నృత్యాలు చేసేదాన్ని. ఉపన్యాస పోటీల్లో చురుగ్గా పాల్గొనేదాన్ని. అయితే ఇవేమీ స్కూలు దగ్గరే ఆగిపోలేదు. సృజనాత్మక విషయాలలో నాకు నిరంతరం తోడుగా నిలుస్తున్నాయి.

'మీ సక్సెస్ మంత్ర ఏమిటి?' అని చాలామంది నన్ను అడుగుతుంటారు. సక్సెస్‌కు షార్ట్‌కట్‌లు ఉండవు. మనల్ని సక్సెస్‌ఫుల్‌గా మార్చడానికి గాడ్‌ఫాదర్‌లు ఉండరు. వృత్తిపై మనం చూపే ఆసక్తి, పడే కష్టం, మన పరిచయాలు విజయపథంలో దూసుకుపోవడానికి కారణం అవుతాయి. సక్సెస్ కోసం ఒకరిని అనుసరించాలనే రూల్ ఏమీ లేదు. ప్రతి ఒక్కరిలో ఒక ప్రత్యేకత ఉంటుంది. అదేమిటో కనుక్కుంటే చాలు.

– భార్గవి స్వామి.
స్టార్ పాడ్‌కాస్టర్, ఎంటర్‌ప్రెన్యూర్

అజేయ లంక...

- వరుసగా నాలుగో విజయంతో గ్రూప్ 'బి'లో టాప్ ర్యాంక్
- చివరి లీగ్ మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై గెలుపు


అసలంక

హరారే: వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ క్రికెట్ టోర్నీ శ్రీలంక జట్టు లీగ్ దశను అజేయంగా ముగించింది. గ్రూప్ 'బి'లో భాగంగా మంగళవారం స్కాట్లాండ్ జట్టుతో జరిగిన చివరిదైన నాలుగో మ్యాచ్‌లో శ్రీలంక 82 పరుగుల తేడాతో గెలిచింది. వరుసగా నాలుగో విజయంతో శ్రీలంక ఎనిమిది పాయింట్లతో గ్రూప్ 'బి' టాపర్‌గా నిలిచింది. ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక 49.3 ఓవర్లలో 245 పరుగులకు ఆలౌటైంది. నిసాంక (85 బంతుల్లో 75; 10 ఫోర్లు), చరిత్ అసలంక (65 బంతుల్లో 63; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేశారు. స్కాట్లాండ్ బౌలర్లలో మార్క్ వాట్ మూడు, క్రిస్ గ్రీవెస్ నాలుగు వికెట్లు తీశారు. 246 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన స్కాట్లాండ్ 29 ఓవర్లలో 163 పరుగులకు ఆలౌటైంది. క్రిస్ గ్రీవెస్ (41 బంతుల్లో 56 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) మినహా మిగతావారు విఫలమయ్యారు. లంక బౌలర్లలో తీక్షణ మూడు, హసరంగ రెండు వికెట్లు పడగొట్టారు.

ఐర్లాండ్‌కు ఊరట...

గ్రూప్ 'బి'లో 'సూపర్ సిక్స్' దశకు చేరుకోలేకపోయిన రెండు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఐర్లాండ్ 138 పరుగుల తేడాతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) జట్టును ఓడించి విజయంతో టోర్నీని ముగించింది. ముందుగా ఐర్లాండ్ 50 ఓవర్లలో 4 వికెట్లకు 349 పరుగులు సాధించింది. ఓపెనర్ పాల్ స్టిర్లింగ్ (134 బంతుల్లో 162; 15 ఫోర్లు, 8 సిక్స్‌లు) భారీ సెంచరీ... బాల్‌బిర్నీ (66; 5 ఫోర్లు, 1 సిక్స్), హ్యారీ టెక్టర్ (33 బంతుల్లో 57; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించారు. అనంతరం యూఏఈ 39 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. గ్రూప్ 'బి' నుంచి శ్రీలంక, స్కాట్లాండ్, ఒమన్... గ్రూప్ 'ఎ' నుంచి జింబాబ్వే, నెదర్లాండ్స్, వెస్టిండీస్ జట్లు 'సూపర్ సిక్స్' దశకు అర్హత సాధించాయి. గురువారం నుంచి 'సూపర్ సిక్స్' దశ మ్యాచ్‌లు మొదలవుతాయి.


స్టిర్లింగ్

భారత్, కువైట్ మ్యాచ్ 'డ్రా'

బెంగళూరు: దక్షిణాసియా ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో భాగంగా మంగళవారం భారత్, కువైట్ జట్ల మధ్య జరిగిన చివరి లీగ్ మ్యాచ్ 1–1తో 'డ్రా'గా ముగిసింది. భారత్ తరఫున కెప్టెన్ సునీల్ ఛెత్రి (45+2వ ని.లో) కెరీర్‌లో 92వ గోల్ సాధించగా... 90+2వ నిమిషంలో భారత ప్లేయర్ అన్వర్ చేసిన సెల్ఫ్ గోల్‌తో కువైట్ స్కోరును సమం చేసింది. లీగ్ దశ తర్వాత భారత్, కువైట్ ఏడు పాయింట్లతో సమంగా నిలిచినా... గోల్స్ అంతరం కారణంగా కువైట్ టాపర్‌గా నిలిచింది. భారత్‌కు రెండో స్థానం దక్కింది.



అంకిత ఓటమి



లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ క్వాలిఫయింగ్ టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ అంకిత రైనా తొలి రౌండ్ మ్యాచ్‌లో 6–3, 6–7 (5/7), 1–6తో జెస్సికా (స్పెయిన్) చేతిలో ఓటమి పాలైంది. అంకితకు 12,750 పౌండ్లు (రూ. 13 లక్షల 32 వేలు) ప్రైజ్‌మనీ దక్కింది.

భారత్ శుభారంభం

బుసాన్: ఆసియా పురుషుల కబడ్డీ చాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు శుభారంభం చేసింది. ఆతిథ్య దక్షిణ కొరియాతో జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 76–13 పాయింట్ల తేడాతో... చైనీస్ తైపీ జట్టుతో జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో భారత్ 53–19తో నెగ్గింది.

కౌంట్‌డౌన్ మొదలు...

100 రోజుల్లో వన్డే ప్రపంచకప్



బాబర్ ఆజమ్, రోహిత్ శర్మ (ఫైల్)
నరేంద్ర మోదీ స్టేడియం

- పూర్తి షెడ్యూల్ విడుదల చేసిన ఐసీసీ
- అక్టోబర్ 5న తొలి పోరు
- అక్టోబర్ 15న భారత్, పాక్ మ్యాచ్
- నవంబర్ 19న ఫైనల్
- కీలక మ్యాచ్‌లన్నీ అహ్మదాబాద్‌లోనే

ఈ శీతాకాలం మునుపటిలా చల్లగా ఉండదు. వన్డే ప్రపంచకప్‌తో హీటెక్కనుంది. ఫోర్లు, సిక్సర్లతో క్రికెట్ మజాను పంచనుంది. భారీ స్కోర్లతో, వీర విహారాలతో సాగిపోనుంది. బంతి, బ్యాట్ పైచేయి తేల్చుకునేందుకు సమాయత్తమైంది. బోరుకొట్టే మ్యాచ్‌లు కాకుండా... హోరెత్తించే షోలతో ఈ మెగా ఈవెంట్ మురిపించేందుకు సిద్ధమైంది. సెంచరీలు కొట్టే బ్యాటర్లు, హ్యాట్రిక్స్ వికెట్లు తీసే బౌలర్లు... ప్రపంచకప్ కలను సాకారం చేసుకునేందుకు తాజా దిగ్గజాలు సై అంటే సై అంటున్నారు.

ముంబై: వన్డే ప్రపంచకప్ అంకానికి అధికారిక షెడ్యూల్ విడుదలైంది. 12 ఏళ్ల తర్వాత భారత్ ఈ మెగా ఈవెంట్‌కు ఆతిథ్యమిస్తోంది. ఈసారి మాత్రం ఒంటరిగా నిర్వహించనుండటం ఈ కప్‌కున్న మరో ప్రత్యేకత. అందుకేనేమో అన్ని అనుకూల, ప్రతికూల అంశాలను పరిశీలించి.... అంతా కసరత్తు చేశాకే ఆలస్యంగా కేవలం వంద రోజుల ముందే షెడ్యూల్ విడుదల చేశారు. గతంలో ఓ ఏడాది ముందే ఐసీసీ ప్రపంచకప్ షెడ్యూల్‌ను ఖరారు చేసేది. వాన ముప్పున్న వేదికల్లో సెమీ ఫైనల్ మ్యాచ్‌లను కేటాయించలేదు. అక్టోబర్, నవంబర్ నెలల్లో జరిగే ఈ మెగా ఈవెంట్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మంగళవారం ముంబైలో విడుదల చేసింది. అక్టోబర్ 5న తెరలేచే ఈ ప్రతిష్టాత్మక టోర్నీకి నవంబర్ 19న జరిగే టైటిల్ పోరుతో తెర పడనుంది.

హైదరాబాద్‌లో భారత్ మ్యాచ్ లేదు

భారత్‌లోని 10 వేదికల్లో ప్రపంచకప్ మ్యాచ్‌లు ప్రత్యక్షంగా చూడొచ్చు. ఇందులో హైదరాబాద్‌కూ ఆతిథ్య భాగ్యం దక్కింది. కానీ భారత్ ఆడే మ్యాచ్‌కు నోచుకోలేకపోయింది. పాకిస్తాన్ ఆడే రెండు మ్యాచ్‌లతో పాటు న్యూజిలాండ్ ఒక మ్యాచ్ ఉప్పల్ మైదానంలో జరుగుతాయి. ఈ రెండింటికి ప్రత్యర్థులు ఖరారు కాలేదు. ప్రస్తుతం జింబాబ్వేలో జరుగుతున్న క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా రెండు జట్లు ఖరారవుతాయి. ముంబై, పుణే, ఢిల్లీ, చెన్నై, అహ్మదాబాద్, ధర్మశాల, లక్నో, కోల్‌కతా, బెంగళూరు ఈ 9 వేదికల్లో ఐదేసి చొప్పున మ్యాచ్‌లు నిర్వహిస్తారు.ఈ మెగా టోర్నీకి సన్నాహాల్లో భాగంగా భారత జట్టు రెండు వామప్ మ్యాచ్‌లు ఆడనుంది. సెప్టెంబర్ 30న గువాహటిలో ఇంగ్లండ్ జట్టుతో... అక్టోబర్ 3న త్రివేండ్రంలో క్వాలిఫయర్–1 జట్టుతో టీమిండియా తలపడుతుంది.



గత ఫార్మాటే

ఈ మెగా ఈవెంట్ కూడా గత ప్రపంచకప్ (2019) ఫార్మాట్‌లాగే రౌండ్ రాబిన్, నాకౌట్ పద్ధతిలో జరుగుతుంది. అంటే పది జట్లు ప్రతీ ప్రత్యర్థితోనూ లీగ్ దశలో తలపడుతుంది. పాయింట్ల పట్టికలో తొలి నాలుగు స్థానాల్లో ఉన్న జట్లు సెమీఫైనల్స్‌కు (నాకౌట్) అర్హత సాధిస్తాయి. తొలి సెమీఫైనల్‌కు నవంబర్ 15న ముంబై... రెండో సెమీఫైనల్‌కు నవంబర్ 16న కోల్‌కతా వేదిక కానున్నాయి. భారత్ గనుక సెమీఫైనల్ చేరితే ముంబైలో ఆ మ్యాచ్ ఆడాల్సి ఉంటుంది. ఒకవేళ సెమీఫైనల్లో భారత్‌కు పాకిస్తాన్ ఎదురైతే ఈ సెమీఫైనల్ కోల్‌కతాలో జరుగుతుంది. నాకౌట్ మ్యాచ్‌లకే (సెమీఫైనల్స్, ఫైనల్) రిజర్వ్ డేలున్నాయి.

ఆరు 'డే' మ్యాచ్‌లు... మిగతావి డే–నైట్...

ఈ టోర్నీలో మొత్తం జరిగే మ్యాచ్‌లు 48. లీగ్ దశలో 45 పోటీలు జరుగుతాయి. ఇందులో కేవలం ఆరు లీగ్‌లే డే మ్యాచ్‌లుగా ఉదయం గం. 10:30 గంటలకు మొదలవుతాయి. మిగతావన్నీ డే–నైట్ మ్యాచ్‌లుగా నిర్వహిస్తారు. వీటితో పాటు నాకౌట్ మ్యాచ్‌లు కూడా డేనైట్ వన్డేలే! డే–నైట్ మ్యాచ్‌లు మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతాయి.

దాయాదులు దంచుకునేది...

మాంచి క్రికెట్ కిక్ ఇచ్చే... అందరూ లుక్కేసే మ్యాచ్ భారత్, పాకిస్తాన్ పోరు! చిరకాల ప్రత్యర్థుల మధ్య అక్టోబర్ 15న అహ్మదాబాద్‌లో లీగ్ మ్యాచ్ జరుగుతుంది. ఇదే కాదు... ఫైనల్ (నవంబర్ 19) సహా 2019 టోర్నీ ఫైనలిస్టులు ఇంగ్లండ్, న్యూజిలాండ్‌ల మధ్య టోర్నీ ఆరంభ పోరు (అక్టోబర్ 5న), ఇంగ్లండ్, ఆస్ట్రేలియా (నవంబర్ 4) తలపడే మేటి మ్యాచ్‌లను లక్ష పైచిలుకు ప్రేక్షకులు చూసే నరేంద్ర మోదీ స్టేడియంలోనే ఏర్పాటు చేశారు. గత మూడు ప్రపంచకప్‌లలో (2011లో భారత్; 2015లో ఆస్ట్రేలియా; 2019లో ఇంగ్లండ్) ఆతిథ్య జట్టు విజేతగా నిలువడం విశేషం.

నాలుగోసారి పూర్తిగా ఇండియాలోనే....

భారత్ ఆతిథ్యమివ్వబోయే నాలుగో వన్డే ప్రపంచకప్ ఇది. ఈసారి పూర్తిగా భారత్‌లోనే జరుగనుండటం ఈ వరల్డ్‌కప్ ప్రత్యేకత! తొలిసారిగా 1987లో పాక్‌తో కలిసి, రెండోసారి 1996లో పాక్, లంకలతో ఉమ్మడిగా, మూడోసారి 2011లో లంక, బంగ్లాదేశ్‌లతో సంయుక్తంగా భారత్ ఈ మెగా ఈవెంట్‌కు ఆతిథ్యమిచ్చింది. ఇప్పటి వరకు 12 సార్లు వన్డే ప్రపంచకప్ జరగ్గా... రెండోసారి మాత్రమే ఆతిథ్య జట్టు టోర్నీ తొలి మ్యాచ్‌లో బరిలోకి దిగడంలేదు. 1996లో భారత్ ఆతిథ్యమిచ్చిన ప్రపంచకప్‌లో ఇంగ్లండ్, న్యూజిలాండ్ మధ్య తొలి మ్యాచ్ జరగ్గా... 2023లోనూ ఈ రెండు జట్ల మధ్యే తొలి మ్యాచ్ జరగనుండటం విశేషం.

ఇదీ షెడ్యూల్

అక్టోబర్ 5: ఇంగ్లండ్ x న్యూజిలాండ్	అహ్మదాబాద్
అక్టోబర్ 6: పాకిస్తాన్ x క్వాలిఫయర్-1	హైదరాబాద్
అక్టోబర్ 7: దక్షిణాఫ్రికా x క్వాలిఫయర్-2	ఢిల్లీ
అక్టోబర్ 7: బంగ్లాదేశ్ x అఫ్గానిస్తాన్	ధర్మశాల
అక్టోబర్ 8: భారత్ x ఆస్ట్రేలియా	చెన్నై
అక్టోబర్ 9: న్యూజిలాండ్ x క్వాలిఫయర్-1	హైదరాబాద్
అక్టోబర్ 10: ఇంగ్లండ్ x బంగ్లాదేశ్	ధర్మశాల
అక్టోబర్ 11: భారత్ x అఫ్గానిస్తాన్	ఢిల్లీ
అక్టోబర్ 12: పాకిస్తాన్ x క్వాలిఫయర్-2	హైదరాబాద్
అక్టోబర్ 13: ఆస్ట్రేలియా x దక్షిణాఫ్రికా	లక్నో
అక్టోబర్ 14: ఇంగ్లండ్ x అఫ్గానిస్తాన్	ఢిల్లీ
అక్టోబర్ 14: న్యూజిలాండ్ x బంగ్లాదేశ్	చెన్నై
అక్టోబర్ 15: భారత్ x పాకిస్తాన్	అహ్మదాబాద్
అక్టోబర్ 16: ఆస్ట్రేలియా x క్వాలిఫయర్-2	లక్నో
అక్టోబర్ 17: దక్షిణాఫ్రికా x క్వాలిఫయర్-1	ధర్మశాల
అక్టోబర్ 18: న్యూజిలాండ్ x అఫ్గానిస్తాన్	చెన్నై
అక్టోబర్ 19: భారత్ x బంగ్లాదేశ్	పుణే
అక్టోబర్ 20: ఆస్ట్రేలియా x పాకిస్తాన్	బెంగళూరు
అక్టోబర్ 21: ఇంగ్లండ్ x దక్షిణాఫ్రికా	ముంబై
అక్టోబర్ 21: క్వాలిఫయర్-1 x క్వాలిఫయర్-2	లక్నో
అక్టోబర్ 22: భారత్ x న్యూజిలాండ్	ధర్మశాల
అక్టోబర్ 23: పాకిస్తాన్ x అఫ్గానిస్తాన్	చెన్నై
అక్టోబర్ 24: దక్షిణాఫ్రికా x బంగ్లాదేశ్	ముంబై
అక్టోబర్ 25: ఆస్ట్రేలియా x క్వాలిఫయర్-1	ఢిల్లీ
అక్టోబర్ 26: ఇంగ్లండ్ x క్వాలిఫయర్ 2	బెంగళూరు
అక్టోబర్ 27: పాకిస్తాన్ x దక్షిణాఫ్రికా	చెన్నై
అక్టోబర్ 28: క్వాలిఫయర్-1 x బంగ్లాదేశ్	కోల్‌కతా
అక్టోబర్ 28: ఆస్ట్రేలియా x న్యూజిలాండ్	ధర్మశాల
అక్టోబర్ 29: భారత్ x ఇంగ్లండ్	లక్నో
అక్టోబర్ 30: అఫ్గానిస్తాన్ x క్వాలిఫయర్-2	పుణే
అక్టోబర్ 31: పాకిస్తాన్ x బంగ్లాదేశ్	కోల్‌కతా
నవంబర్ 1: న్యూజిలాండ్ x దక్షిణాఫ్రికా	పుణే
నవంబర్ 2: భారత్ x క్వాలిఫయర్-2	ముంబై
నవంబర్ 3: క్వాలిఫయర్-1 x అఫ్గానిస్తాన్	లక్నో
నవంబర్ 4: ఇంగ్లండ్ x ఆస్ట్రేలియా	అహ్మదాబాద్
నవంబర్ 4: న్యూజిలాండ్ x పాకిస్తాన్	బెంగళూరు
నవంబర్ 5: భారత్ x దక్షిణాఫ్రికా	కోల్‌కతా
నవంబర్ 6: బంగ్లాదేశ్ x క్వాలిఫయర్-2	ఢిల్లీ
నవంబర్ 7: ఆస్ట్రేలియా x అఫ్గానిస్తాన్	ముంబై
నవంబర్ 8: ఇంగ్లండ్ x క్వాలిఫయర్-1	పుణే
నవంబర్ 9: న్యూజిలాండ్ x క్వాలిఫయర్-2	బెంగళూరు
నవంబర్ 10: దక్షిణాఫ్రికా x అఫ్గానిస్తాన్	అహ్మదాబాద్
నవంబర్ 11: భారత్ x క్వాలిఫయర్-1	బెంగళూరు
నవంబర్ 12: ఇంగ్లండ్ x పాకిస్తాన్	కోల్‌కతా
నవంబర్ 12: ఆస్ట్రేలియా x బంగ్లాదేశ్	పుణే
నవంబర్ 15: తొలి సెమీఫైనల్	ముంబై
నవంబర్ 16: రెండో సెమీఫైనల్	కోల్‌కతా
నవంబర్ 19: ఫైనల్	అహ్మదాబాద్

జట్లు: భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, అఫ్గానిస్తాన్, క్వాలిఫయర్-1, క్వాలిఫయర్-2 (ఈ రెండు జట్లు ప్రస్తుతం జింబాబ్వేలో జరుగుతున్న క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా ఖరారవుతాయి)

సినిమా



విహార యాత్రలో...

'ఆర్‌ఆర్‌ఆర్' సినిమా తెరకెక్కించడం, ఆ తర్వాత మూవీ ప్రమోషన్, ఆ తర్వాత ఆస్కార్ అవార్డుకి సంబంధించిన ప్రమోషనల్ ఈవెంట్స్‌తో దర్శకుడు రాజమౌళి మూడు నెలల క్రితం వరకూ ఫుల్ బిజీగా గడిపారు. నెక్ట్స్ మహేశ్ బాబు హీరోగా భారీ సినిమాకి దర్శకత్వం వహించనున్నారు రాజమౌళి. ఈ చిత్రానికి విజయేంద్ర ప్రసాద్ కథ సమకూరుస్తున్నారు. ఇంకా కథ పూర్తి కాలేదు. ఈలోపు ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి ప్లాన్ చేసుకుంటూనే కుటుంబంతో కలిసి విహార యాత్ర ప్లాన్ చేసుకున్నారు రాజమౌళి. తమిళనాడులో గల తూత్తుక్కుడిలో కుటుంబంతో కలిసి వెకేషన్‌ని ఎంజాయ్ చేస్తున్నారాయన. భార్య రమ, కొడుకు కార్తికేయ, కోడలు పూజా, కుమార్తె మయూఖతో కలిసి హాలిడే బ్రేక్‌లో ఉన్నారు రాజమౌళి. తూత్తుక్కుడిలోని ఆక్వా అవుట్ బ్యాక్ రిసార్ట్‌లో ఈ ఫ్యామిలీ బస చేసింది. అక్కడికి వెళ్లిన గుర్తుగా మొక్కలు నాటారు రాజమౌళి. ఈ విహార యాత్రకు సంబంధించిన ఫొటోలు వైరల్‌గా మారాయి.

నమ్మకంగా ఉన్నాం

- నాగశౌర్య


నాగశౌర్య, యుక్తి తరేజ, పవన్ బాసంశెట్టి

''రంగబలి' చిత్రకథని పవన్ చెప్పినట్లుగానే తీశాడు. ఈ సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. ఈ సినిమాతో అందరూ కనెక్ట్ అవుతారు. విజయంపై చాలా నమ్మకంగా ఉన్నాం'' అని హీరో నాగశౌర్య అన్నారు. నూతన దర్శకుడు పవన్ బాసంశెట్టి తెరకెక్కించిన చిత్రం 'రంగబలి'. నాగశౌర్య, యుక్తి తరేజ జంటగా సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా జూలై 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్‌ను హైదరాబాద్‌లో రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో పవన్ బాసంశెట్టి మాట్లాడుతూ– ''పూర్తి స్థాయి వినోదం నేపథ్యంలో రూపొందిన చిత్రం 'రంగబలి'' అన్నారు.

నిఖిల్‌ని చూసి గర్వపడుతున్నా - నాగచైతన్య

''స్పై థ్రిల్లర్ సినిమాలు తీయడం అంత సులభం కాదు.. అది ఒక సవాల్. ఎందుకంటే ఇలాంటి హాలీవుడ్ సినిమాలను ఓటీటీల్లో చూసేస్తున్నారు. కానీ, 'స్పై' టీజర్, ట్రైలర్ చూశాక చాలా బాగా అనిపించింది. అంతర్జాతీయ స్థాయి విలువలకు ఏ మాత్రం తగ్గలేదు. రాజశేఖర్, చరణ్ తేజ్‌ల ప్యాషన్ ఏంటో తెలుస్తోంది. ఈ సినిమా ఘన విజయం సాధించాలి'' అని హీరో నాగచైతన్య అన్నారు. నిఖిల్ సిద్ధార్థ్, ఐశ్వర్యామీనన్ జంటగా గ్యారీ బీహెచ్ దర్శకత్వం వహించిన చిత్రం 'స్పై'. ఈడీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై కె.రాజశేఖర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా రేపు(గురువారం) విడుదలకానుంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన నాగచైతన్య మాట్లాడుతూ– ''నిఖిల్ అంటే నాకు చాలా ఇష్టం. 'హ్యాపీడేస్' తో కెరీర్ మొదలుపెట్టి, 'స్వామిరారా, కార్తికేయ' తో ఓ ట్రెండ్ సెట్ చేసి, 'కార్తికేయ 2' తో బాక్సాఫీస్‌ని షేక్ చేశాడు.. తనని చూసి నేను చాలా గర్వపడుతున్నాను. 'కార్తికేయ 2' తో ఒక ట్రెండ్ ఎలా సెట్ చేశాడో.. 'స్పై' చిత్రంతో ఆ ట్రెండ్ దాటి తర్వాతి స్థాయికి వెళతాడనే నమ్మకం ఉంది'' అన్నారు.

నిఖిల్ సిద్ధార్థ్ మాట్లాడుతూ–''సుభాష్ చంద్రబోస్ వంటి ఒక గొప్ప వ్యక్తి గురించి ఉన్న సినిమా 'స్పై'. నాలుగురోజుల కిందట ఈ మూవీ ఫైనల్ కాపీ చూశాక 'థ్యాంక్యూ గ్యారీ' అన్నాను.. అంత బాగా ఈ మూవీ తీశాడు. ఇలాంటి సినిమా చేసినందుకు యూనిట్ అంతా గర్వపడుతున్నాం. ప్రతి భారతీయుడు చూడాల్సిన సినిమా ఇది'' అన్నారు. ''ఒక్క ఫోన్ కాల్‌తో 'స్పై' ప్రీ రిలీజ్ వేడుకకి వచ్చిన నాగచైతన్యగారికి థ్యాంక్స్'' అన్నారు కె.రాజశేఖర్ రెడ్డి.


నిఖిల్, రాజశేఖర్ రెడ్డి, నాగచైతన్య, ఐశ్వర్యామీనన్

గ్యారీ బీహెచ్ మాట్లాడుతూ–''డాక్టర్ అయిన నేను సినిమా ఇండస్ట్రీకి వెళ్తానంటే ఎవరూ ఒప్పుకోరు. కానీ, నా తల్లితండ్రులు ఒప్పుకుని, నన్ను ప్రోత్సహించినందుకు కృతజ్ఞతలు. 'స్పై' చాలా బాగా తీశావంటూ నిఖిల్‌గారు నన్ను హత్తుకోవడంతో సినిమా విజయంపై మరింత నమ్మకం పెరిగింది'' అన్నారు. ఈ వేడుకలో ఈడీ ఎంటర్‌టైన్ మెంట్స్ సీఈఓ చరణ్ తేజ్, సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల, కెమెరామేన్ వంశీ పచ్చిపులుసు, యూవీ క్రియేషన్స్ నిర్మాత వంశీ, నటీనటులు సాన్య ఠాకూర్, ఆర్యన్ రాజేష్ పాల్గొన్నారు.

ఆగస్టులో ఆరంభం


నీరజ


సిద్ధు

దాదాపు దశాబ్ద కాలంగా ఇండస్ట్రీలో కాస్ట్యూమ్ డిజైనర్‌గా రాణిస్తున్నారు నీరజ కోన. ఎన్టీఆర్, రామ్‌చరణ్, సూర్య వంటి టాప్ స్టార్స్ చేసిన సినిమాలకు నీరజ కోన కాస్ట్యూమ్ డిజైనర్‌గా చేశారు. సమంత, రకుల్ ప్రీత్‌సింగ్ వంటివారికి కూడా కాస్ట్యూమ్స్ డిజైన్ చేశారు. తాజాగా నీరజ కోన దర్శకురాలిగా మెగా ఫోన్ పట్టనున్నారని సమాచారం. రొమాంటిక్ థ్రిల్లింగ్ లవ్‌స్టోరీగా రూపొందనున్న ఈ సినిమాలో 'డీజే టిల్లు' ఫేమ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తారని తెలిసింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించనున్న ఈ సినిమా షూటింగ్ ఆగస్టు లేదా నవంబరులో ప్రారంభం కానుందట. ఈ సినిమాకు ప్రముఖ ఛాయాగ్రాహకులు పీసీ శ్రీరామ్, మ్యూజిక్ డైరెక్టర్ తమన్, రైటర్ మిథున్ చైతన్యను ఎంపిక చేసినట్లు సమాచారం.

యాక్టర్ అనిపించుకోవడం కష్టం



''స్టార్ అవ్వడం అనేది మన చేతుల్లో లేదు. అయితే ఎంచుకునే పాత్రలతో మంచి యాక్టర్ అవ్వడం అనేది మన చేతుల్లోనే ఉంటుంది. కానీ యాక్టర్ అనిపించుకోవడం అనేది చాలా కష్టం. 'స్టార్' లేదా 'యాక్టర్' అని ఎవరైనా నాకు ఆప్షన్ ఇస్తే.. యాక్టర్ అవుతాననే చాలెంజ్‌నే తీసుకుంటాను'' అని శ్రీ విష్ణు అన్నారు. శ్రీ విష్ణు హీరోగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సామజ వరగమన'. అనిల్ సుంకర సమర్పణలో రాజేష్ దండా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా శ్రీ విష్ణు చెప్పిన విశేషాలు..

- శ్రీ విష్ణు

- 'సామజ వరగమన'లో బాలసుబ్రహ్మణ్యం అనే యువకుడి పాత్రలో నటించాను. థియేటర్ బాక్సాఫీస్‌లో ఉద్యోగం చేస్తుంటాడు బాలసుబ్రహ్మణ్యం. సో.. కొంతమంది హీరోల డైలాగ్స్ ఈ సినిమాలో ఉంటాయి. నవ్వించడమే పనిగా పెట్టుకుని మేం తీసిన సినిమా ఇది.యూత్‌కు, ఫ్యామిలీ ఆడియన్స్‌కు ఈ సినిమా బాగా నచ్చుతుంది. సినిమాలో ఓ సర్‌ప్రైజింగ్ పాయింట్ కూడా ఉంది. తెలుగు సినిమాల్లో ఇప్పటివరకూ ఇలాంటి పాయింట్ రాలేదనే అనుకుంటున్నాం.
- ఇండస్ట్రీలో పెద్ద స్టార్స్ ఎక్కువైపోయారు. పెద్ద దర్శకులు తక్కువైపోయారు. కొన్ని సార్లు స్టార్ డైరెక్టర్స్‌కే స్టార్ హీరోలు దొరకడం లేదు కూడా. ఇక స్టార్ దర్శకులు మాలాంటి వారితో సినిమాలు చేయాలంటే అది టఫ్ అవుతుంది. దీనికి తోడు మార్కెట్ సమీకరణాలు కూడా ఉంటాయి. అలాగే పెద్ద దర్శకులు కొంతమంది దాదాపు రెండేళ్ల వరకూ సినిమాలను ప్లాన్ చేసుకుంటున్నారు. నేను సమయం వృథా కాకూడదని కొత్త దర్శకులతో, వీలైతే నేను ఇంట్రడ్యూస్ చేసిన వారితోనే మళ్లీ సినిమాలు చేసుకునేలా ప్లాన్ చేసుకుంటాను.
- విలన్ రోల్స్ చేయడం నాకు ఇష్టమే. అయితే 'వీరభోగ వసంతరాయలు', 'తిప్పరా మీసం' సినిమాల్లో నెగటివ్ టచ్ ఉండే రోల్స్ చేస్తే ప్రేక్షకులు అంతగా యాక్సెప్ట్ చేయలేదనిపించింది. అందుకే విలన్ రోల్స్ చేయాలనుకోవడం లేదు.
- ప్రస్తుతం హర్ష కొనుగంటి దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్‌లో ఓ సినిమా చేస్తున్నాను. అలాగే 'రాజరాజ చోర'కు ప్రీక్వెల్‌గా హసిత్ గోలి దర్శకత్వంలోనే ఓ సినిమా చేస్తున్నాను.

కథే హీరో

- డీవై చౌదరి

రోహిత్ బెహల్, అపర్ణా జనార్దనన్ జంటగా నటించిన చిత్రం 'లవ్ యూ రామ్'. డీవై చౌదరి స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ సినిమా కథ అందించిన దర్శకుడు కె. దశరథ్ మరో నిర్మాత. ఈ సినిమా ఈ నెల 30న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో డీవై చౌదరి మాట్లాడుతూ – ''దశరథ్, నేను గతంలో '16 డేస్' అనే సినిమా చేశాం. అయితే ఇటీవల కుటుంబం అంతా కలిసి చూడదగ్గ సినిమాలు రావడం తగ్గింది. దీంతో ఓ క్లీన్ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకులకు అందించాలని 'లవ్ యూ రామ్' తీశాం. ఇది డిఫరెంట్ లవ్‌స్టోరీ. కథే హీరో. అందుకే కొత్తవారిని తీసుకున్నాం. కథ విషయానికొస్తే.. ప్రేమించడమే జీవితం అని నమ్మే అమ్మాయి, నమ్మించడమే జీవితం అనుకునే అబ్బాయి మధ్య నెలకొన్న సంఘర్షణే ఈ చిత్రం. నేను, దశరథ్ మూడు వెబ్ సిరీస్‌లకు కథలు రెడీ చేశాం. త్వరలో దశరథ్ నుంచి ఓ పెద్ద ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రకటన వస్తుంది'' అన్నారు.



నారాయణతో సుధాకర్‌కి బ్రేక్ వస్తుంది

- డైరెక్టర్ అనిల్ రావిపూడి

''నారాయణ అండ్ కో' ట్రైలర్ అద్భుతంగా ఉంది. సుధాకర్ నా స్నేహితుడు. తనతో నాది లాంగ్ జర్నీ. తనకి 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' చిత్రంతో చక్కని టేకాఫ్ వచ్చింది. 'నారాయణ అండ్ కో'తో మంచి బ్రేక్ వస్తుందనుకుంటున్నాను'' అని డైరెక్టర్ అనిల్ రావిపూడి అన్నారు. సుధాకర్ కోమాకుల హీరోగా చిన్నా పాపిశెట్టి దర్శకత్వం వహించిన చిత్రం 'నారాయణ అండ్ కో'. పాపిశెట్టి బ్రదర్స్‌తో కలిసి సుధాకర్ కోమాకుల నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకు దర్శకులు అనిల్ రావిపూడి, విజయ్ కనకమేడల, హీరో తిరువీర్, నిర్మాత రాజ్ కందుకూరి, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ అతిథులుగా హాజరై, 'నారాయణ అండ్ కో' విజయం సాధించాలి అన్నారు. సుధాకర్ కోమాకుల మాట్లాడుతూ– ''నారాయణ అండ్ కో' సకుటుంబ సపరివార సమేతంగా చూడదగ్గ సినిమా'' అన్నారు. ''ఇది ఫ్యామిలీ ఫండింగ్ మూవీ. చాలామంది సపోర్ట్‌తో ఈ సినిమా చేశాం'' అన్నారు దర్శక–నిర్మాత చిన్నా పాపిశెట్టి.


అనిల్, సుధాకర్, విజయ్

యాక్షన్ థ్రిల్లర్

జగన్‌మోహన్ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఎస్–99'. శ్వేతా వర్మ హీరోయిన్‌గా యతీష్, నందిని నిర్మిస్తున్న ఈ సినిమా మోషన్ టైటిల్‌ను నిర్మాత రమేష్‌ప్రసాద్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''మా నాన్నగారు (ప్రముఖ దర్శక–నిర్మాత ఎల్వీ ప్రసాద్) సినిమాల కోసం చాలా కష్టపడ్డారు.. ఆ కష్టమే నన్ను ఉత్సాహపరిచి, ఇండస్ట్రీవైపు వచ్చేలా చేసింది. మెకానికల్ ఇంజనీరింగ్ చదివిన నేను ప్రపంచవ్యాప్తంగా ప్రసాద్ ల్యాబ్స్‌ను నెలకొల్పడం హ్యాపీగా ఉంది.


యతీష్, రమేష్‌ప్రసాద్, జగన్‌మోహన్

ప్రస్తుతం సినిమాలు సరిగ్గా ఆడటం లేదు.. కానీ చాలామంది కష్టపడి సినిమాలు చేస్తున్నారు. 'ఎస్–99' టైటిల్ కొత్తగా ఉంది. ఈ మూవీ సక్సెస్ అవ్వాలి'' అన్నారు. ''యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది'' అన్నారు జగన్ మోహన్. ''ఎస్–99' లాంటి చిత్రాలు మరిన్ని తీయడానికి రెడీగా ఉన్నాం'' అన్నారు యతీష్.

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	446	63,416
నిఫ్టీ ▲	126	18,817

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి పొద్దు 11.00 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	13,558	▲ 222
డోజోన్స్	33,938	▲ 223
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,461	▲ 8
డాక్స్	15,847	▲ 39
షాంఘై	3,189	▲ 39
నికాయ్	32,538	▽ 160

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	58,442 ▲	284
బంగారం (99.5 స్వచ్ఛత)	58,208 ▲	285
వెండి (కిలో)	69,523 ▲	131

తప్పుడు లక్ష్యంతోనే నివేదిక

హిండెన్‌బర్గ్‌పై అదానీ గ్రూప్‌ ఫైర్‌

న్యూఢిల్లీ: కార్పొరేట్‌ సుపరిపాలన, సమాచార వెల్లడిలో విశ్వసనీయ విధానాలు అవలంబిస్తున్నట్లు అదానీ గ్రూప్‌ తాజాగా పేర్కొంది. సుప్రీం కోర్టు నియమించిన నిపుణుల కమిటీ గ్రూప్‌లో ఎలాంటి నిబంధనల ఉల్లంఘన జరగలేదని స్పష్టం చేసినట్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్‌ విడుదల చేసిన వార్షిక నివేదికలో పేర్కొంది. యూఎస్‌ షార్ట్‌సెల్లర్‌ హిండెన్‌బర్గ్‌ నివేదిక వెలువడిన ఐదు నెలల తదుపరి వార్షిక నివేదికలో ఇంకా పలు అంశాలపై స్పందించింది. అదానీ గ్రూప్‌ కంపెనీలలో అక్రమాలు జరుగుతున్నట్లు ఈ ఏడాది జనవరి 24న హిండెన్‌బర్గ్‌ నివేదిక ఆరోపించిన సంగతి తెలిసిందే. దీంతో




గ్రూప్‌లోని లిస్టెడ్‌ కంపెనీల షేర్లలో అమ్మకాలు ఊపందుకున్నాయి. ఒక దశలో గ్రూప్‌ మార్కెట్‌ విలువలో 150 బిలియన్‌ డాలర్లమేర ఆవిరైంది. అయితే హిండెన్‌బర్గ్‌ నివేదిక తప్పుడు లక్ష్యాలతో నిరాధార ఆరోపణలకు తెరతీసిందని అదానీ గ్రూప్‌ కొట్టిపారేసింది. ఇది దేశంపై జరిగిన దాడిగా గౌతమ్‌ అదానీ పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం రోజున నివేదిక వెలువడినట్లు తెలియజేశారు. గ్రూప్‌పై తప్పుడు ఆరోపణలు చేసి షేర్ల ధరలను పడగొట్టడం ద్వారా హిండెన్‌బర్గ్‌ లాభాలు ఆర్జించినట్లు వెల్లడించారు. సుపరిపాలన, సమాచార వెల్లడిలో గ్రూప్‌ పటిష్ట విధానాలు అనుసరిస్తున్నట్లు వివరించారు. అన్ని రకాల నిబంధనల అమలుకు కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు.

జూలై 1న హెచ్‌డీఎఫ్‌సీ విలీనం

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుగా ఆవిర్భావం

- 25 హెచ్‌డీఎఫ్‌సీ షేర్లకుగాను 42 హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ షేర్లు జారీ
- హెచ్‌డీఎఫ్‌సీ చైర్మన్‌ దీపక్‌ పరేఖ్‌ వెల్లడి

ముంబై: ఫైనాన్షియల్‌ రంగ దిగ్గజాలు హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ ఏకంకానున్నాయి. జూలై ఒకటి నుంచి విలీనం అమల్లోకి రానున్నట్లు మార్టిగేజ్‌ దిగ్గజం చైర్మన్‌ దీపక్‌ పరేఖ్‌ వెల్లడించారు. దేశీ కార్పొరేట్‌ చరిత్రలోనే అతిపెద్ద లావాదేవీగా రికార్డ్‌ సృష్టిస్తూ బ్యాంకింగ్‌ అనుబంధ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో మాతృ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్‌ విలీనంకానుంది. దీనికి దాదాపు అన్ని అనుమతులూ లభించినట్లు పరేఖ్‌ తెలియజేశారు. విలీనాన్ని అనుమతించేందుకు రెండు సంస్థల బోర్డులూ ఈ నెల 30న విడిగా సమావేశమవుతున్నట్లు పేర్కొన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ వైస్‌చైర్మన్‌ కేకి మిస్త్రీతో కలిపి పరేఖ్‌.. రామ్నస్‌ హౌ స్‌లోని హెచ్‌టీ పరేఖ్‌ లెగసీ సెంటర్‌ వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.



13 లేదా 14 నుంచి

షేర్ల మార్పిడితో చేపడుతున్న విలీనం నేపథ్యంలో జులై 13 లేదా 14 నుంచి హెచ్‌డీఎఫ్‌సీ షేర్లలో లిస్టింగ్‌ నిలిచిపోయే వీలున్నట్లు మిస్త్రీ వెల్లడించారు. స్టాక్‌ ఎక్స్ఛేంజీల నిర్ణయం మేరకు 17కల్లా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుగా ట్రేడ్‌ కావచ్చని అంచనా వేశారు. 2022 ఏప్రిల్‌ 4న తొలుత విలీన అంశం తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. అనుబంధ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో విలీనానికి మాతృ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ సంసిద్ధతను వ్యక్తం చేసింది. వెరసి స్టాక్‌ ఆధారిత 40 బిలియన్‌ డాలర్ల విలువైన లావాదేవీకి తెరలేచింది. విలీనంతో రూ.18 లక్షల కోట్ల ఆస్తులుగల ఫైనాన్షియల్‌ రంగ దిగ్గజం ఆవిర్భవించనుంది.

ఆర్‌ఐఎల్‌.. వెనక్కి

విలీనం ద్వారా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ వెయిటేజీ స్టాక్‌ మార్కెట్‌ ప్రధాన ఇండెక్స్‌లో 14 శాతానికి చేరనుంది. తద్వారా 10.4 శాతంతో ఉన్న హెవీవెయిట్‌ రిలయన్స్‌ ఇండస్ట్రీస్‌ను మించనుంది. డీల్‌ తదుపరి బ్యాంకులో పబ్లిక్‌ వాటాదారుల వాటా 100 శాతానికి చేరనుంది. ప్రస్తుత హెచ్‌డీఎఫ్‌సీ వాటాదారులకు బ్యాంకులో 41 శాతం వాటా లభించనుంది. హెచ్‌డీఎఫ్‌సీలో గల ప్రతీ 25 షేర్లకుగాను వాటాదారులు 42 బ్యాంకు షేర్లను పొందనున్నారు. కాగా.. బ్యాంకుకుగల 7 కోట్లకుపైగా కస్టమర్లలో 2 శాతమే హెచ్‌డీఎఫ్‌సీ ద్వారా రుణాలు తీసుకున్నట్లు బ్యాంకు బోర్డులో స్వతంత్ర డైరెక్టర్‌గా ఎంపికైన మిస్త్రీ తెలియజేశారు. దీంతో మార్టిగేజ్‌ రుణాల వృద్ధికి భారీ అవకాశాలున్నట్లు అభిప్రాయపడ్డారు. మిస్త్రీ ఎంపికకు ఆర్‌బీఐ అనుమతి లభించవలసి ఉంది. హెచ్‌డీఎఫ్‌సీలో 46 ఏళ్లపాటు బాధ్యతలు నిర్వహించిన పరేఖ్‌ సంస్థలో జూన్‌ 30 చివరి పనిదినంగా పేర్కొన్నారు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం 60 ఏళ్లలోపు ఉద్యోగులు బ్యాంకుకు బదిలీకానున్నట్లు వెల్లడించారు.

ఈ వార్తలతో ఎన్‌ఎస్‌ఈలో హెచ్‌డీఎఫ్‌సీ షేరు 1.3 శాతం బలపడి రూ. 2,757 వద్ద నిలిచింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు సైతం 1.4 శాతం పుంజుకుని రూ. 1,658 వద్ద ముగిసింది.

బిలియన్‌ డాలర్‌ 'సీసీఎల్‌'

- తెలుగు కంపెనీ కొత్త రికార్డు
- మార్చికల్లా ఏపీలో కొత్త ప్లాంటు
- సీసీఎల్‌ చైర్మన్‌ రాజేంద్ర ప్రసాద్‌



మీడియా సమావేశంలో శ్రీశాంత్, రాజేంద్ర ప్రసాద్, మోహన్‌కృష్ణ (ఎడమ నుంచి)

హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: ఇన్‌స్టంట్‌ కాఫీ తయారీలో ప్రపంచ దిగ్గజం సీసీఎల్‌ ప్రొడక్ట్స్‌ మార్కెట్‌ క్యాపిటలైజేషన్‌ పరంగా బిలియన్‌ డాలర్‌ (రూ.8,200 కోట్లు) కంపెనీగా అవతరించింది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా దుగ్గిరాల కేంద్రంగా 1995లో ప్రారంభమైన ఈ కంపెనీ 100కుపైగా దేశాల్లో కస్టమర్లను సొంతం చేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో రెండు, వియత్నాం, స్విట్జర్లాండ్‌లో ఒక్కొక్క ప్లాంటు ఉంది. ఏటా 55,000 టన్నుల కాఫీని తయారు చేయగలిగే సామర్థ్యం ఉంది. ప్రపంచవ్యాప్తంగా సెకనుకు 1,000కిపైగా కప్పుల సీసీఎల్‌ కాఫీని కస్టమర్లు ఆస్వాదిస్తున్నారు. అనతికాలంలోనే కాఫీ రిటైల్‌లో భారత్‌లో టాప్‌–3 స్థానానికి ఎగబాకినట్టు సీసీఎల్‌ ప్రొడక్ట్స్‌ ఫౌండర్, చైర్మన్‌ చల్లా రాజేంద్ర ప్రసాద్‌ మంగళవారమిక్కడ మీడియాకు తెలిపారు. అయిదేళ్లలో 2 బిలియన్‌ డాలర్‌ కంపెనీగా అవతరిస్తామన్నారు.

కాఫీ రుచులు 1,000కిపైగా..

సీసీఎల్‌ ప్రొడక్ట్స్‌ 1,000కిపైగా రుచుల్లో కాఫీని తయారు చేస్తోంది. వీటిలో ఫంక్షనల్‌ కాఫీ, కోల్డ్‌ బ్రూ ఇన్‌స్టంట్, మైక్రోగ్రౌండ్‌ ఇన్‌ఫ్యూజ్డ్, స్పెషాలిటీ ఇన్‌స్టంట్‌ కాఫీ ఉన్నాయని కంపెనీ ఎండీ చల్లా శ్రీశాంత్‌ తెలిపారు. 'ఈ స్థాయి ఉత్పత్తులతో దేశీయ మార్కెట్లో కాంటినెంటల్‌ పేరుతో సొంత బ్రాండ్స్‌ను పరిచయం చేయడానికి, స్థిరమైన బిజినెస్‌ టు కన్సూమర్‌ కంపెనీగా రూపొందించడానికి విశ్వాసాన్ని ఇచ్చింది. బీటూసీని పటిష్టం చేయడానికి లాఫ్‌బెర్గ్స్‌ గ్రూప్‌ నుంచి ఆరు బ్రాండ్లను దక్కించుకున్నాం. ఎఫ్‌ఎంసీజీ కంపెనీగా నిలవాలన్నది మా కల. ఇందులో భాగంగా గ్రీన్‌బర్డ్‌ పేరుతో మొక్కల ఆధారిత ఉత్పత్తుల తయారీలోకి ప్రవేశించాం' అని వివరించారు.

ఏపీలో మరో ప్లాంటు..

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లాలో ఉన్న కాంటినెంటల్‌ కాఫీ పార్కులో సీసీఎల్‌ కొత్తగా ప్లాంటును ఏర్పాటు చేస్తోంది. 22 ఎకరాల విస్తీర్ణంలో రానున్న ఈ కేంద్రానికి ఏపీ ముఖ్యమంత్రి వై.ఎస్‌.జగన్‌ మోహన్‌రెడ్డి ఇటీవలే శంకుస్థాపన చేశారు. ఈ యూనిట్‌ కోసం రూ.400 కోట్ల పెట్టుబడి చేస్తున్నట్టు కంపెనీ ఈడీ మోహన్‌కృష్ణ వెల్లడించారు. వార్షిక తయారీ సామర్థ్యం 16,000 మెట్రిక్‌ టన్నులు. 2024 మార్చిలోగా ఉత్పత్తి ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు.

సెన్సెక్స్‌ 446 పాయింట్లు ప్లస్‌

- మూడు రోజుల నష్టాలకు బ్రేక్‌
- హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం షేర్ల దన్ను
- బక్రీద్‌ సెలవు తేదీ మార్పు

ముంబై: ప్రపంచ ప్రతికూలతలను అధిగమిస్తూ దేశీయ స్టాక్‌ మార్కెట్‌ మంగళవారం లాభాలు గడించింది. హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్‌ బ్యాంక్‌ షేర్లు రాణించడంతో సూచీలు మూడురోజుల నష్టాల నుంచి గట్టెక్కాయి. తొలి సెషన్‌లో పరిమిత శ్రేణిలో కదలాడిన సూచీలు.., మిడ్‌ సెషన్‌ నుంచి కీలక రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో పరుగులు తీశాయి. ఉదయం సెన్సెక్స్‌ 182 పాయింట్లు పెరిగి 63,152 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 468 పాయింట్లు దూసుకెళ్లి 63,468 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 446 పాయింట్ల లాభంతో 63,416 వద్ద



స్థిరపడింది. ఈ సూచీలో మొత్తం 30 షేర్లకు గానూ మూడు మాత్రమే నష్టపోయాయి. నిఫ్టీ 58 పాయింట్లు పెరిగి 18,749 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. రోజంతా 18,829 – 18,714 శ్రేణిలో కదలాడింది. ఆఖరికి 126 పాయింట్లు ఎగసి 18,817 వద్ద నిలిచింది. ఎఫ్‌ఎంసీజీ, ఇంధన మినహా ఇతర అన్ని రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లకు డిమాండ్‌ నెలకొంది.

- బక్రీద్‌ సందర్భంగా మహారాష్ట్ర ప్రభుత్వం జూన్‌ 29న (గురువారం) సెలవు ప్రకటించింది. దీనికి అనుగుణంగా స్టాక్‌ ఎక్స్ఛేంజీలు సెలవు రోజును గురువారానికి మార్చాయి. దీంతో బుధవారం (నేడు) ట్రేడింగ్‌ యథావిధిగా కొనసాగుతుంది.

అన్‌లిమిటెడ్‌ స్టోర్లలో 'రెడ్‌ అలర్ట్‌ సేల్‌'

న్యూఢిల్లీ: వివిధ ఉత్పత్తులపై అత్యుత్తమ రాయితీలు, ఆఫర్లతో 'రెడ్‌ అలర్ట్‌ సేల్‌' ప్రారంభించినట్లు అన్‌లిమిటెడ్‌ స్టోర్స్‌ ప్రకటించింది. అన్ని బ్రాండెడ్‌ వస్త్రాలపై 50% ఫ్లాట్‌ ఆఫర్‌ అందిస్తుంది.



అలాగే రూ. 3 వేల షాపింగ్‌పై అంతే విలువైన ఉత్పత్తులను ఉచితంగా పొందవచ్చు. దేశవ్యాప్తంగా అన్ని అన్‌లిమిటెడ్‌ స్టోర్లలో ఈ ఆఫర్‌ జూలై రెండో తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. కస్టమర్లంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కంపెనీ కోరింది.

నెమ్మదించిన అంకురాలు..

- 2023లో తగ్గిన కొత్త యూనికార్న్‌లు
- బిలియన్‌ డాలర్లు దాటిన స్టార్టప్‌లు మూడే
- ఆస్క్‌ ప్రైవేట్‌ వెల్త్‌ నివేదికలో వెల్లడి

ముంబై: దేశీయంగా స్టార్టప్‌ వ్యవస్థలో మందగమనాన్ని సూచిస్తూ 2023లో కొత్త యూనికార్న్‌ల సంఖ్య గణనీయంగా తగ్గింది. 2022లో మొత్తం 24 అంకుర సంస్థలు ఒక బిలియన్‌ డాలర్లకు పైగా వేల్యుయేషన్‌ అందుకోగా ఈసారి కొత్తగా మూడు మాత్రమే ఆ హోదా దక్కించుకున్నాయి. మొత్తం యూనికార్న్‌ల సంఖ్య 84 నుంచి 83కి తగ్గింది. ఆస్క్‌ ప్రైవేట్‌ వెల్త్‌ హురున్‌ ఇండియన్‌ ఫ్యూచర్‌ యూనికార్న్‌ సూచీ 2023 నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఇన్వెస్టర్లలో పెట్టుబడులపై ఆసక్తి మందగించడంతో అంకుర సంస్థలకు నిధుల లభ్యత తగ్గుతోందనడానికి తాజా పరిణామం నిదర్శనమని ఆస్క్‌ ప్రైవేట్‌ వెల్త్‌ సీఈవో రాజేష్‌ సలూజా తెలిపారు. పలు స్టార్టప్‌ల వ్యాపార విధానాలు పటిష్టమైనవిగా లేకపోవడం వేల్యుయేషన్ల తగ్గుదలకు దారితీసిందని, అయితే సరైన కంపెనీలకు మాత్రం పెట్టుబడులు లభిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. బైజూస్‌ వంటి కొన్ని స్టార్టప్‌లలో సమస్యలు నెలకొన్నప్పటికీ భారతీయ స్టార్టప్‌ వ్యవస్థకు ఫండింగ్‌పై ప్రతికూల ప్రభావాలేమీ ఉండబోవని సలూజా చెప్పారు.భారత్‌లో అంకుర సంస్థల వృద్ధికి అపార అవకాశాలు ఉన్నాయని, వచ్చే అయిదేళ్లలో దేశీయంగా యూనికార్న్‌ల సంఖ్య 200కు చేరగలదని అంచనా వేస్తున్నట్లు హురున్‌ ఇండియా చీఫ్‌ రీసెర్చర్‌ అనాస్‌ రెహ్మాన్‌ జునైద్‌ చెప్పారు. చైనాలో 1,000కి పైగా యూనికార్న్‌లు ఉన్నాయని.. భారత్‌ ఆర్థికంగా



ఎదగాలంటే స్టార్టప్‌లు చాలా కీలకమన్నారు.

- అంకుర సంస్థలను యూనికార్న్‌లు (ఒక బిలియన్‌ డాలర్ల వేల్యుయేషన్), గెజెల్స్‌ (500 మిలియన్‌ డాలర్ల పైగా వేల్యుయేషన్‌ కలిగి ఉండి, మూడేళ్లలో యూనికార్న్‌లుగా ఎదిగే అవకాశం ఉన్నవి), చీతాలు (250 మిలియన్‌ డాలర్ల వేల్యుయేషన్, అయిదేళ్లలో యూనికార్న్‌లుగా ఎదిగే అవకాశం ఉన్నవి)గా వర్గీకరించారు.
- 250 మిలియన్‌ డాలర్ల పైగా వేల్యుయేషన్‌ ఉన్న మొత్తం అంకుర సంస్థల సంఖ్య గతేడాది 122గా ఉండగా 2023లో 147కి చేరింది.

జాబ్‌ పాయింట్‌

వెస్టర్న్‌ రైల్వేలో 3624 అప్రెంటిస్‌లు

ముంబై ప్రధాన కేంద్రంగా ఉన్న రైల్వే రిక్రూట్‌మెంట్‌ సెల్‌(ఆర్‌ఆర్‌సీ)–వెస్టర్న్‌ రైల్వే.. 2023–24 సంవత్సరానికి సంబంధించి వెస్టర్న్‌ రైల్వే పరిధిలోని డివిజన్‌ /వర్క్‌షాప్‌లలో అప్రెంటిస్‌ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 3624.
» **శిక్షణ కాలం:** ఒక సంవత్సరం.
» **ట్రేడులు:** ఫిట్టర్, వెల్డర్, కార్పెంటర్, పెయింటర్, డీజిల్‌ మెకానిక్, మెకానిక్‌ మోటార్‌ వెహికల్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్‌ మెకానిక్, వైర్‌మ్యాన్, మెకానిక్‌ రిఫ్రిజిరేటర్‌(ఏసీ–మెకానిక్), పైప్‌ ఫిట్టర్, ప్లంబర్, డ్రాఫ్ట్స్‌మ్యాన్‌(సివిల్), పీఏఎస్‌ఎస్‌ఏ, స్టెనోగ్రాఫర్, మెషినిస్ట్, టర్నర్.
» **అర్హత:** పదో తరగతితోపాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 26.07.2023 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** పదో తరగతి, ఐటీ మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు. రాతపరీక్ష/వైవా ఉండదు.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తు ప్రారంభతేది:** 27.06.2023.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 26.07.2023.
» **వెబ్‌సైట్:** www.rrc-wr.com

మనూ, హైదరాబాద్‌లో 12 నాన్‌టీచింగ్‌ పోస్టులు

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్‌ నేషనల్‌ ఉర్దూ యూనివర్సిటీ(మనూ).. వివిధ ప్రాంతాల్లోని మనూ క్యాంపస్‌లలో డైరెక్ట్‌ రిక్రూట్‌మెంట్‌ ప్రాతిపదికన నాన్‌–టీచింగ్‌ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12
» **పోస్టుల వివరాలు:** రీజనల్‌ డైరెక్టర్‌–02, అసిస్టెంట్‌ రీజనల్‌ డైరెక్టర్‌–04, ఇన్‌స్ట్రక్టర్‌–పాలిటెక్నిక్‌ సివిల్‌ ఇంజనీరింగ్‌–01, సీనియర్‌ టెక్నికల్‌ అసిస్టెంట్‌–01, ఎంటీఎస్‌–04.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ,డిగ్రీ,పీజీ,పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** పరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:**07.07.2023.
» **దరఖాస్తు హార్డ్‌కాపీ స్వీకరణకు చివరితేది:** 14.07.2023.
» **వెబ్‌సైట్:** https://manuu.edu.in

ఆర్‌బీఐలో 40 పోస్టులు

ముంబైలోని రిజర్వ్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా(ఆర్‌బీఐ) సర్వీసెస్‌ బోర్డ్‌.. కాంట్రాక్ట్‌ ప్రాతిపదికన లేటరల్‌ రిక్రూట్‌మెంట్‌ విధానంలో కన్సల్టెంట్స్‌/సబ్జెక్ట్‌ స్పెషలిస్ట్స్‌ /అనలిస్ట్‌ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 40
» **పోస్టుల వివరాలు:** డేటా సైంటిస్ట్‌–03, డేటా ఇంజనీర్‌–01, ఐటీ సెక్యూరిటీ ఎక్స్‌పర్ట్‌–10, ఐటీ సిస్టమ్‌ అడ్మినిస్ట్రేటర్‌–డిపార్ట్‌మెంట్‌ ఆఫ్‌ ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీ–08, ఐటీ ప్రాజెక్ట్‌ అడ్మినిస్ట్రేటర్‌–డిపార్ట్‌మెంట్‌ ఆఫ్‌ ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీ–06, నెట్‌వర్క్‌ అడ్మినిస్ట్రేటర్‌–03, ఎకనామిస్ట్‌(మాక్రో–ఎకనామిక్‌ మోడలింగ్)–01, డేటా అనలిస్ట్‌(అప్లైడ్‌ మ్యాథమేటిక్స్)–01, డేటా అనలిస్ట్‌(అప్లైడ్‌ ఎకనామెట్రిక్స్)–02, డేటా అనలిస్ట్‌(టీఏబీఎం/హెచ్‌ఏఎన్‌కే మోడల్స్)–02, అనలిస్ట్‌(క్రెడిట్‌ రిస్క్)–01, అనలిస్ట్‌(మార్కెట్‌ రిస్క్)–01, అనలిస్ట్‌(లిక్విడిటీ రిస్క్)–01.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ, పీజీపీఎం/పీజీడీఎం ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ స్క్రీనింగ్‌/షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 11.07.2023.
» **వెబ్‌సైట్:** www.rbi.org.in

స్పా, విజయవాడలో 17 నాన్‌టీచింగ్‌ పోస్టులు

విజయవాడలోని స్కూల్‌ ఆఫ్‌ ప్లానింగ్‌ అండ్‌ ఆర్కిటెక్చర్‌(స్పా).. డైరెక్ట్‌ రిక్రూట్‌మెంట్‌/డిప్యుటేషన్‌పై నాన్‌టీచింగ్‌ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 17
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌(డిప్యుటేషన్)–01, సెక్షన్‌ ఆఫీసర్‌–02, ప్రైవేట్‌ సెక్రటరీ–01, అకౌంటెంట్‌–01, పర్సనల్‌ అసిస్టెంట్‌(డైరెక్ట్‌/డిప్యుటేషన్)–02, జూనియర్‌ సూపరింటెండెంట్‌(టెక్నికల్)(డైరెక్ట్‌/డిప్యుటేషన్)–02, టెక్నికల్‌ అసిస్టెంట్‌–05, లైబ్రరీ అసిస్టెంట్‌–01, గ్రాఫిక్‌ డిజైనర్‌/సీనియర్‌ టెక్నికల్‌ అసిస్టెంట్‌(పబ్లికేషన్)–01, గ్రాఫిక్‌ అసిస్టెంట్‌/టెక్నికల్‌ అసిస్టెంట్‌(పబ్లికేషన్స్)–01.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
దరఖాస్తును రిజిస్ట్రార్, స్కూల్‌ ఆఫ్‌ ప్లానింగ్‌ అండ్‌ ఆర్కిటెక్చర్, ఐటీఐ రోడ్, విజయవాడ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 31.07.2023.
» **వెబ్‌సైట్:** www.spav.ac.in

టోఫెల్‌.. కీలక మార్పులు ఇవే!

» విదేశీ వర్సిటీల్లో ప్రవేశాలకు ప్రామాణిక పరీక్ష టోఫెల్‌
» టోఫెల్‌లో మార్పులు ప్రకటించిన ఈటీఎస్‌
» రెండు గంటలకు తగ్గిన పరీక్ష సమయం
» జూలై 26 నుంచి అమల్లోకి రానున్న కొత్త విధానం

టెస్ట్‌ ఆఫ్‌ ఇంగ్లిష్‌ యాజ్‌ ఎ ఫారెన్‌ లాంగ్వేజ్‌.. సంక్షిప్తంగా టోఫెల్‌! ఇది విదేశీ విద్య విద్యార్థులు తప్పనిసరిగా అర్హత సాధించాల్సిన పరీక్ష!! ముఖ్యంగా అమెరికా, యూకే, కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లోని యూనివర్సిటీల్లో అడుగుపెట్టాలంటే.. టోఫెల్‌ స్కోర్‌ తప్పనిసరి! నిర్వాహక సంస్థ ఎడ్యుకేషనల్‌ టెస్టింగ్‌ సర్వీస్‌(ఈటీఎస్)..ఇటీవల ఈ పరీక్షలో పలు కీలక మార్పులను ప్రకటించింది. కొత్త విధానం జూలై 26 నుంచే అమల్లోకి వస్తుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో.. టోఫెల్‌ నూతన విధానం, తాజా మార్పులు, బెస్ట్‌ స్కోర్‌కు మార్గాలు తదితర వివరాలు..

టోఫెల్‌.. అమెరికా సహా ప్రపంచ వ్యాప్తంగా 160 దేశాల్లోని 11,500 ఇన్‌స్టిట్యూట్‌లు ప్రామాణికంగా తీసుకుంటున్న లాంగ్వేజ్‌ టెస్ట్‌. డొమైన్‌ సబ్జెక్ట్‌తో సంబంధం లేకుండా అన్ని విభాగాల అభ్యర్థులకు ఇంగ్లిష్‌ లాంగ్వేజ్‌పై ఉన్న అవగాహన విదేశీ యూనివర్సిటీల ప్రవేశాల్లో కీలకంగా మారుతోంది. దీంతో స్టడీ అబ్రాడ్‌ అభ్యర్థులకు టోఫెల్‌ స్కోర్‌ అత్యంత ఆవశ్యకంగా మారింది. ఈ పరీక్షకు ఏటా లక్ష మంది వరకూ హాజరవుతున్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న పరీక్ష విధానంపై అభ్యర్థుల్లో కొంత ప్రతికూలత నెలకొంది. ముఖ్యంగా సుదీర్ఘమైన టెస్ట్‌ సమయం, తుది స్కోర్‌ కేటాయింపులో పరిగణనలోకి తీసుకోని ప్రశ్నలు ఉండటం వంటి కారణాలతో సమయాభావం ఏర్పడుతోందనే వాదన వినిపిస్తోంది. ఈ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న టోఫెల్‌ నిర్వాహక సంస్థ.. ఎడ్యుకేషనల్‌ టెస్టింగ్‌ సర్వీస్‌(ఈటీస్).. ఈ పరీక్షలో పలు కీలక మార్పులు చేసింది.

పరీక్ష వ్యవధి రెండు గంటలే

టోఫెల్‌ కొత్త విధానంలో పరీక్ష వ్యవధిని రెండు గంటలకు తగ్గించారు. ఇంతకాలం మొత్తం నాలుగు విభాగాల్లో (రీడింగ్, రైటింగ్, స్పీకింగ్, లిజనింగ్) మూడు గంటల వ్యవధిలో పరీక్ష నిర్వహిస్తుండగా.. తాజా–పరీక్ష సమయం రెండు గంటలుగా నిర్ణయించారు.

విభాగాల వారీగా ప్రశ్నలు

- **రీడింగ్‌ సెక్షన్:**రెండు ప్యాసేజ్‌ల నుంచి 10 ప్రశ్నలు చొప్పున మొత్తం 20 ప్రశ్నలు ఉంటాయి. 35 నిమిషాల వ్యవధిలో సమాధానాలు ఇవ్వాలి.
- **లిజనింగ్‌ సెక్షన్:** మూడు లేదా నాలుగు లెక్చర్స్. ఒక్కో లెక్చర్‌ నుంచి 6 ప్రశ్నలు ఉంటాయి. అదే విధంగా రెండు లేదా మూడు సంభాషణలు ఇచ్చి.. ఒక్కో సంభాషణపై 5 ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం 36 నిమిషాలు.
- **స్పీకింగ్‌ సెక్షన్:** ఇండిపెండెంట్‌ టాస్క్‌–1, ఇండిపెండెంట్‌ టాస్క్‌–2, ఇండిపెండెంట్‌ టాస్క్‌–3, ఇండిపెండెంట్‌ టాస్క్‌–4. దీనికి లభించే సమయం 16 నిమిషాలు.
- **రైటింగ్‌ సెక్షన్:** ఇందులో రెండు టాస్క్‌లు ఇచ్చి దాని ఆధారంగా ప్రశ్నలు అడుగుతారు. టాస్క్‌–1లో రైటింగ్‌ ఇంటిగ్రేటెడ్‌ టాస్క్, టాస్క్‌–2లో అకడమిక్‌ రైటింగ్‌ డిస్కషన్‌ టాస్క్‌ ఉంటాయి. ఒక్కో టాస్క్‌కు 29 నిమిషాల సమయం కేటాయిస్తారు.

అన్‌-స్కోర్డ్‌ కొశ్చన్స్‌ తొలగింపు

టోఫెల్‌ కొత్త విధానంలో భాగంగా అన్‌–స్కోర్డ్‌(స్కోర్‌ కేటాయింపులో పరిగణించని) ప్రశ్నలను పూర్తిగా తొలగించారు. ప్రస్తుత విధానంలో లిజనింగ్‌ విభాగంలో అన్‌ స్కోర్డ్‌ కొశ్చన్స్‌ పేరుతో అయిదు ప్రశ్నల వరకు అడుగుతున్నారు. వీటికి సమాధానాలు ఇవ్వడం తప్పనిసరి. కానీ.. ఈ ప్రశ్నల ద్వారా పొందిన మార్కులను స్కోర్‌ నిర్ధారణలో పరిగణనలోకి తీసుకోరు. వీటి కారణంగా అభ్యర్థులు సమయాభావ సమస్యను ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న ఈటీఎస్‌.. ఇకపై లిజనింగ్‌ విభాగంలో స్కోర్డ్‌ కొశ్చన్స్‌నే అడగనుంది.

కొత్తగా రైటింగ్‌ ఫర్‌

కొత్తగా 'రైటింగ్‌ ఫర్‌ యాన్‌ అకడమిక్‌ డిస్కషన్‌' పేరుతో కొత్త టాస్క్‌ చేర్చారు. ఇందులో అభ్యర్థులు ఆన్‌లైన్‌ విధానంలో ప్రొఫెసర్‌ ఇచ్చిన ప్రశ్నను చదివి.. దానికి అప్పటికే ఇద్దరు విద్యార్థులు ఇచ్చిన సమాధానాలను కూడా పరిశీలించాల్సి ఉంటుంది. ఆ తర్వాత వాటిని పరిగణనలోకి తీసుకుంటూ.. అదే అకడమిక్‌ అంశంపై సమాధానాన్ని ఇవ్వడంతోపాటు, తమ అభిప్రాయాన్ని కూడా వ్యక్తీకరించాల్సి ఉంటుంది.

రీడింగ్‌ సెక్షన్‌లోనూ సమయం కుదింపు

ప్రస్తుత విధానంలో మూడు లేదా నాలుగు ప్యాసేజ్‌ల నుంచి 10 ప్రశ్నలు చొప్పున మొత్తం 40 ప్రశ్నలు రీడింగ్‌ సెక్షన్‌లో అడుగుతున్నారు. వీటికి కనిష్టంగా 54 నిమిషాలు, గరిష్టంగా 72 నిమిషాల సమయం కేటాయిస్తున్నారు.

కొత్త విధానంలో మాత్రం రెండు ప్యాసేజ్‌లు, వాటి ఆధారంగా 20 ప్రశ్నలు మాత్రమే అడుగుతారు. వీటికి 35 నిమిషాల్లో సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. అంటే..పాత విధానంతో పోల్చితే అభ్యర్థులకు దాదాపు సగం సమయం కలిసొస్తుంది.

స్కోర్‌ వెల్లడి

కొత్త విధానంలో పరీక్ష పూర్తి కాగానే.. అభ్యర్థులు తమ స్కోర్‌ వెల్లడి తేదీని తెలుసుకునే సదుపాయం



కూడా కల్పించనున్నారు. దీనివల్ల అభ్యర్థులు తమ ఫలితాల కోసం ఈటీఎస్‌ పంపే సమాచారం కోసం వేచి చూసే పరిస్థితికి ఫుల్‌స్టాప్‌ పడనుంది. పరీక్ష సమయంలో ఎప్పటికప్పుడు అభ్యర్థులకు సూచనలు అందిస్తూ.. వారికి ఆన్‌లైన్‌ విధానంలో సహకరించే పద్ధతిని కూడా అమలు చేయనున్నారు.

స్థానిక కరెన్సీలో ఫీజు

టోఫెల్‌ అభ్యర్థులకు అనుకూలించే మరో మార్పు.. స్థానిక కరెన్సీలో ఫీజు చెల్లించే అవకాశాన్ని అందుబాటులోకి తేనుండడం. ఇప్పటి వరకు టోఫెల్‌ అభ్యర్థులు రిజిస్ట్రేషన్‌ సమయంలో డాలర్ల రూపంలోనే ఫీజు చెల్లించే విధానం ఉంది. కొత్తగా జూలై 26 నుంచి స్థానిక కరెన్సీలో అంటే మన దేశానికి చెందిన అభ్యర్థులు రూపాయల్లో కూడా ఫీజు చెల్లించే అవకాశం అందుబాటులోకి రానుంది.

ఇప్పటికే టోఫెల్‌ పరీక్ష తేదీలను, స్లాట్లను రిజర్వ్‌ చేసుకున్న అభ్యర్థులు కూడా జూలై 26 నుంచి అమల్లోకి వచ్చే కొత్త విధానంలో పరీక్షకు హాజరయ్యే అవకాశాన్ని ఈటీఎస్‌ కల్పిస్తోంది.

విజయానికి ప్రిపరేషన్‌ ఇలా

రీడింగ్‌

ఈ విభాగంలో అభ్యర్థులకు అకడమిక్‌ సంబంధిత ప్యాసేజ్‌లు ఇస్తారు. వీటి ఆధారంగా అడిగే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ విభాగం ప్రధాన ఉద్దేశం.. అభ్యర్థులు యూనివర్సిటీ స్థాయి అకడమిక్స్‌ను అవగాహన చేసుకోగలరా లేదా? అనేదే. కాబట్టి ఇందులో రాణించేందుకు విద్యార్థులు తమ అకడమిక్‌ అర్హతలకు అనుగుణంగా ఆయా పుస్తకాలను నిరంతరం చదువుతుండాలి.

లిజనింగ్‌ టెస్ట్‌

ఈ విభాగంలో క్లాస్‌ రూం డిస్కషన్స్, లెక్చర్స్‌ లేదా ఇతర సంభాషణలు సమ్మిళితంగా ఉండే ఆడియోను వినాల్సి ఉంటుంది. ఆ సంభాషణల ఆడియో పూర్తయిన తర్వాత.. వాటి ఆధారంగా అడిగే ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కో ఆడియోకు సంబంధించి ఆరు ప్రశ్నలు అడుగుతారు. ఇందులో రాణించాలంటే.. ఇంగ్లిష్‌ న్యూస్‌ ఛానెళ్లను వీక్షించడం, అందులోని చర్చలను అనుసరిస్తూ భాష, యాసపై అవగాహన పెంచుకోవాలి.

రైటింగ్‌ టెస్ట్‌

ఈ విభాగంలో రాణించేందుకు అభ్యర్థులు అంతకుముందు దశలైన రీడింగ్, లిజనింగ్‌లో తమకు ఎదురైన రెండు అంశాలపై ఎస్సే రాయాల్సి ఉంటుంది.

స్పీకింగ్‌ టెస్ట్‌

రైటింగ్‌ టెస్ట్‌లో మాదిరిగానే ఇందులో కూడా అభ్యర్థులు అప్పటికే తాము ఎదుర్కొన్న రీడింగ్, లిజనింగ్‌ విభాగాల్లో పేర్కొన్న అంశాలు, లేదా కొత్త టాపిక్స్‌పై తమ అభిప్రాయాలను చర్చా రీతిలో వ్యక్తం చేయాల్సి ఉంటుంది.

స్కోరింగ్‌ ఇలా

టోఫెల్‌లో ప్రతి విభాగంలో గరిష్టంగా 30 పాయింట్లు చొప్పున 120 పాయింట్ల స్కోర్‌ ఉంటుంది. ఈ స్కోర్స్‌లో ప్రతి విభాగంలో 24 నుంచి 30 పాయింట్లు పొందితే.. హై పెర్‌ఫార్మెన్స్‌ క్యాండిడేట్‌గా పరిగణిస్తారు. ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లు, యూనివర్సిటీలు ఈ అధిక స్కోర్‌ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తాయి.

రిజిస్ట్రేషన్‌

టోఫెల్‌ అభ్యర్థులు పరీక్ష కోసం ఎప్పుడైనా రిజిస్టర్‌ చేసుకోవచ్చు. ఏడాది పొడవునా.. నిర్దిష్ట తేదీల్లో పరీక్ష జరుగుతుంది. పరీక్షకు హాజరయ్యే విషయంలోనూ ఎలాంటి పరిమితి లేదు. అభ్యర్థులు ఒక దశ పరీక్ష రాశాక.. కనీసం 12 రోజుల తర్వాత మాత్రమే మరో దశకు దరఖాస్తు చేసుకోవాలనే నిబంధన అమలవుతోంది.

టోఫెల్‌ కొత్త స్వరూపం

సెక్షన్‌	ప్రశ్నలు	సమయం
రీడింగ్‌	20	35 నిమిషాలు
లిజనింగ్‌	28	36 నిమిషాలు
స్పీకింగ్‌	4 టాస్క్‌లు	16 నిమిషాలు
రైటింగ్‌	2 టాస్క్‌లు	29 నిమిషాలు

టోఫెల్‌ మార్పులు.. ముఖ్యాంశాలు

• జూలై 26 నుంచి నూతన విధానంలో టోఫెల్‌ పరీక్ష. • రెండు గంటల వ్యవధిలోపే పరీక్ష నిర్వహణ. •కొత్తగా రైటింగ్‌ ఫర్‌ యాన్‌ అకడమిక్‌ డిస్కషన్‌ టాస్క్. • అన్‌స్కోర్డ్‌ ప్రశ్నల తొలగింపు. • పరీక్ష ముగిసిన వెంటనే స్కోర్‌ వెల్లడి తేదీని చూసుకునే అవకాశం. • స్థానిక కరెన్సీ(రూపాయల్లో) ఫీజు చెల్లించే సదుపాయం.

• పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.ets.org/toefl.html; www.ets.org/toefl/ibtenhancements.html

క్లుప్తంగా...

ఆచార్య బేతవోలుకు సాహిత్య అకాడమీ భాషా సమ్మాన్ పురస్కారం


ఆచార్య బేతవోలు రామబ్రహ్మం

నల్లజర్ల: శాస్త్రీయ, మధ్య యుగ సాహిత్య రంగంలో చేసిన కృషికి గుర్తింపుగా తూర్పు గోదావరి జిల్లా నల్లజర్లకు చెందిన ఆచార్య బేతవోలు రామబ్రహ్మానికి కేంద్రప్రభుత్వం మంగళవారం సాహిత్య అకాడమీ భాషా సమ్మాన్ పురస్కారం ప్రకటించింది. త్వరలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఆయనకు ఈ పురస్కారం కింద రూ.లక్ష నగదు బహుమతి, రాగి ఫలకంపై ప్రశంసాపత్రం అందజేయనున్నారు. ఆచార్య రామబ్రహ్మం నల్లజర్లలో 1948 జూన్ 10వ తేదీన జన్మించారు. సంస్కృతం, తెలుగు భాషల్లో ప్రముఖ పండితుడు, కవి, అనువాదకుడు, వ్యాకరణవేత్త. అష్టావధానం, కవిత్వం, నాటకాలు, కథలు, అనువాదాలు, సాహిత్య వ్యాసాలు, పరిశోధన పత్రాలతో 34కు పైగా పుస్తకాలు రచించారు. గతంలో సాహిత్య అకాడమీ అనువాద బహుమతి, క్లాసికల్ తెలుగుకు రాష్ట్రపతి సర్టిఫికెట్ ఆఫ్ ఆనర్, మహర్షి బద్రియాన్ వ్యాస్ సమ్మాన్ వంటి అనేక అవార్డులు, బహుమతులను అందుకున్నారు. ఆచార్య రామబ్రహ్మానికి సాహిత్య పురస్కారం వచ్చిన సందర్భంగా నల్లజర్లలో ఆయన మిత్రులు, గ్రామస్తులు వేడుకలు జరుపుకొన్నారు.

'అమ్మ ఒడి' కేవైసీ కోసం తమిళనాడుకు వలంటీర్


కేవైసీ కోసం షేక్ షీరెన్ వేలిముద్ర తీసుకుంటున్న వలంటీర్ షేక్ రసూల్ అహ్మద్

అవనిగడ్డ: జగనన్న అమ్మ ఒడి పథకం లబ్ధిదారునికి కేవైసీ చేయించడం కోసం వలంటీర్ తమిళనాడులోని వెల్లూరు జిల్లాకు వెళ్లారు. కృష్ణాజిల్లా అవనిగడ్డ 7వ వార్డుకు చెందిన షేక్ షారూఖ్ అబ్దుల్లా, షేక్ షీరెన్ దంపతుల కుమారుడు స్థానిక ఉర్దూ స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్నాడు. ఇతనికి అమ్మ ఒడి పథకం మంజూరైంది. తల్లి షేక్ షీరెన్ గర్భిణి కావడంతో ఆమె తమిళనాడులోని వెల్లూరు జిల్లా వలతూర్ గ్రామంలోని పుట్టింటికి వెళ్లింది. కేవైసీ చేయడానికి తల్లి వేలిముద్రలు కావాల్సి రావడంతో మూడవ సచివాలయ వలంటీర్ షేక్ రసూల్ అహ్మద్ మంగళవారం తమిళనాడులోని వలతూర్ గ్రామానికి వెళ్లి షేక్ షీరెన్‌తో కేవైసీ చేయించారు.

వృత్తి నిపుణుల జాబితాలోకి కౌలు రైతులు

'అగ్రికల్చర్ ప్రొఫెషనల్స్'గా గుర్తింపు • అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కొత్త ప్రయోగం

సాక్షి, అమలాపురం/కొత్తపేట: వైద్యులు.. ఇంజినీర్లు.. ప్రభుత్వ ఉద్యోగులు.. వ్యాపారులు.. ప్రైవేట్ ఉద్యోగులతోపాటు వ్యవసాయ రంగంలోని కౌలు రైతులు కూడా వృత్తి నిపుణుల జాబితాలో చేరారు. ఇతర వృత్తి నిపుణులకు ఇస్తున్న మాదిరిగానే ఇకపై కౌలుదారులను కూడా అగ్రికల్చర్ ప్రొఫెషనల్స్ (వ్యవసాయ నిపుణులు)గా గుర్తిస్తూ ఇకపై వీరికి కూడా వ్యక్తిగత రుణాలు అందించేందుకు అంబేడ్కర్ కోనసీమ జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. పంట భూమి లేకపోయినా.. వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులను 'అగ్రికల్చరల్ ప్రొఫెషనల్స్'గా గుర్తించి జిల్లా యంత్రాంగం రుణాలు మంజూరుకు శ్రీకారం చుట్టింది.


అగ్రికల్చర్ ప్రొఫెషనల్స్‌కు చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, కలెక్టర్ శుక్లా

రెవెన్యూ అధికారుల సిఫార్సులతో..

కౌలు కార్డులు (సీసీఆర్‌సీ) ఉన్నా రుణాలు అందుకోలేక ఇబ్బంది పడుతున్న కౌలుదారుల దుస్థితిని గుర్తించిన అంబేడ్కర్ కోనసీమ జిల్లా యంత్రాంగం రైతుల పేరిట సెంటు భూమి లేకున్నా.. సంబంధిత వీఆర్వో, వీఏవోలు, తహసీల్దార్ సిఫార్సు మేరకు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) రుణాలు మంజూరు చేసింది. పైలట్ ప్రాజెక్టుగా జిల్లాలో తొలివిడతగా 10 మండలాల్లోని 10 గ్రామాలను ఎంపిక చేసి.. ఆయా గ్రామాల్లో 540 మంది అగ్రికల్చరల్ ప్రొఫెషనల్స్‌కు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వీరిలో 323 మందికి మంగళవారం రుణాలు అందజేశారు. కొత్తపేట మండలం అవిడిలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, కలెక్టర్ హిమాన్షు శుక్లా ఎంపిక చేసిన రైతులకు రూ.1,40,58,100 చెక్కు రూపంలో అందజేశారు.

విజయవంతమైతే అన్ని గ్రామాలకు విస్తరణ

కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ.. తొలి దశలో 10 మండలాల్లోను, రెండవ దశలో మిగిలిన 22 మండలాల్లోని 25 గ్రామాల్లోని ఈ విధానాన్ని అమలు చేస్తామని చెప్పారు. వ్యక్తిగత రుణాలతోపాటు ఐదు మండలాల పరిధిలో 38 గ్రూపులకు చెందిన 526 మంది రైతులకు సైతం రుణాలు అందించనున్నారు. 6 నెలల్లో ఫలితాలు చూసి జిల్లాలోని అన్ని గ్రామాలకూ విస్తరిస్తామన్నారు. ఇందుకోసం డీసీసీబీతోపాటు యూనియన్ బ్యాంక్ సైతం ముందుకు వచ్చాయని కలెక్టర్ చెప్పారు. ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ.. పైలట్ ప్రాజెక్టుగా జిల్లాలో దీనిని అమలు చేయడం అభినందనీయమన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి.. రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసి కౌలు రైతులకు మేలు చేసేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు పాల్గొన్నారు.

బ్యాంక్ రుణం ఇదే తొలిసారి



నేను 30 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నా. నాకు సొంత భూమి లేదు. ఏటా పరిస్థితిని బట్టి 10 నుంచి 20 ఎకరాల వరకు సాగు చేస్తాను. ఎప్పుడూ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు చేయడం తప్ప ప్రభుత్వం నుంచి లేదా బ్యాంకుల నుంచి రుణం పొందలేదు. జగన్ హయాంలో తొలిసారిగా బ్యాంక్ రుణం వచ్చింది. రైతు భరోసా పేరుతో రైతుల అకౌంట్లలో సొమ్ములు వేస్తున్నట్టుగా ఇప్పుడు మా అకౌంట్‌లో రుణం సొమ్ములు వేశారు. చాలా సంతోషంగా ఉంది.
– టి.వీరన్న, అవిడి, కొత్తపేట మండలం

వడ్డీకి అప్పు తెచ్చేవాళ్లం



ఇప్పటివరకు వ్యాపారుల వద్ద అప్పులు చేయడం.. నూటికి రూ.3 నుంచి రూ.5 చొప్పున ప్రతినెలా వడ్డీ చెల్లించే వాళ్లం. పైగా ధాన్యం వారు కట్టిన ధరకే అమ్మాల్సి వచ్చేది. సాగు మధ్యలో కాని అప్పులు ఇచ్చేవారు కాదు. ఇప్పుడు రూ.1.20 వడ్డీ. సాగుకు ముందే రుణం ఇచ్చారు. తిరిగి చెల్లించడం ద్వారా మరిన్ని రుణాలు పొందుతాం.
– డి.పెంటయ్య, అవిడి, కొత్తపేట మండలం

నాలుగేళ్లలోనే డిగ్రీ ప్లస్ బీఈడీ

- ఎన్‌టీఏ నోటిఫికేషన్ విడుదల
- నవీన బోధన విధానాలతో ప్రణాళిక
- రాష్ట్రంలో 150 సీట్లు.. జూలై 19 వరకు దరఖాస్తులు

సాక్షి, అమరావతి : సమీకృత బీఈడీ కోర్సులు ఈ ఏడాది నుంచి ప్రారంభం కానున్నాయి. ఇంటర్ తర్వాత నాలుగేళ్లలోనే డిగ్రీతో పాటు బీఈడీ పూర్తి చేయవచ్చు. సాధారణంగా బీఈడీ చేయాలంటే మూడేళ్ల డిగ్రీ పూర్తి చేసి, రెండేళ్ల బ్యాచులర్ ఆఫ్ ఎడ్యుకేషన్ కోర్సు చేయాలి. దీనికి మొత్తం ఐదేళ్లు పడుతుంది. కొత్త విధానం వల్ల నాలుగేళ్లలోనే పూర్తి చేసే వీలుంది. జాతీయ విద్యా విధానం-2020లో భాగంగా తీసుకొచ్చిన ఈ కోర్సును జాతీయ స్థాయిలో పలు కళాశాలల్లో ప్రవేశపెడుతున్నారు. వీటిలో ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) దేశ వ్యాప్తంగా 178 పట్టణాల్లో 13 మాధ్యమాల్లో కంప్యూటర్ బేస్డ్ టెస్టు (సీబీటీ) నిర్వహిస్తోంది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను సోమవారం అర్ధరాత్రి ఎన్‌టీఏ విడుదల చేసింది. తద్వారా ఆంధ్రప్రదేశ్‌లో రెండు వర్సిటీల్లో ఇంటిగ్రేటెడ్ బీఎస్సీ బీఈడీ, బీఏ బీఈడీ కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. ఎన్టీఏ 2023-24 విద్యా సంవత్సరానికి తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, ఎచ్చెర్లలోని బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో మొత్తం 150 సీట్లలో ప్రవేశాలు కల్పించనున్నారు. ఆధునిక విద్యా బోధనకు అనుగుణంగా సమీకృత బీఈడీ కోర్సును ఎన్‌సీఈఆర్‌టీ రూపొందించింది. విద్యార్థి మానసిక ధోరణి, ఆన్‌లైన్, డిజిటల్ విద్యా బోధనతో పాటు సరికొత్త మెలకువలతో ఎలా బోధించాలన్న అంశానికి ఈ కోర్సులో అత్యధిక ప్రాధాన్యమిస్తారు. తరగతి గదిలో పాఠాల కన్నా, అనుభవం ద్వారా నేర్చుకునే రీతిలో పాఠ్య ప్రణాళిక రూపొందించినట్టు అధికారులు చెబుతున్నారు.

ప్రవేశ పరీక్ష ఇలా : ఇంటర్ ఉత్తీర్ణులు ఈ ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంటుంది. పన్నెండో తరగతి, ఇంటర్ సిలబస్‌లోంచి ప్రశ్నలు ఇస్తారు. మొత్తం 160 బహుళ ఐచ్ఛిక ప్రశ్నలుంటాయి. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్, టీచింగ్ అప్టిట్యూడ్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఎన్‌సీఈఆర్‌టీ ప్రశ్నపత్రాన్ని రూపొందిస్తుంది.

	ముఖ్య తేదీలు
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ	19.7.2023
డేటా కరెక్షన్‌కు చివరి తేదీ	20.7.2023
పరీక్ష తేదీ	తర్వాత ప్రకటిస్తారు
హాల్ టికెట్ల డౌన్‌లోడ్	పరీక్షకు మూడు రోజుల ముందు

దరఖాస్తు చేసుకోవాల్సిన వెబ్‌సైట్లు : www.nta.ac.in, https://neet. samarth.ac.in/

కొత్తగా మూడు గురుకుల జూనియర్ కళాశాలలు మంజూరు

- నంద్యాల, చిత్తూరు, శ్రీకాకుళం జిల్లాల్లో ఏర్పాటు
- ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి క్లాసులు
- ఒక్కొక్క కళాశాలలో ఎంపీసీ 40, బైపీసీ 40 సీట్లు
- 17కు చేరిన ఏపీ బీసీ వెల్ఫేర్ జూనియర్ కళాశాలల సంఖ్య

సాక్షి, అమరావతి: మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ పరిధిలో మరో మూడు కొత్త జూనియర్ కాలేజీలు మంజూరు అయ్యాయి. ఇప్పటికే రాష్ట్రంలో 14 జూనియర్ కాలేజీలు ఉండగా, కొత్తగా మంజూరైన వాటితో కలిపి ఆ సంఖ్య 17కు చేరింది. కొత్త జూనియర్ కాలేజీలను ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించారు. నంద్యాల జిల్లా డోన్ అసెంబ్లీ నియోజకవర్గంలోని బేతంచర్ల(బాలురు), చిత్తూరు జిల్లా పుంగనూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని సదుం(బాలురు), శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస(బాలికలు) కాలేజీలు ప్రారంభమయ్యాయి. ఒక్కో కాలేజీలో ఎంపీసీ 40, బైపీసీ 40 సీట్లు చొప్పున కేటాయించారు. కాగా, రాష్ట్రంలో బీసీ గురుకుల విద్యాలయాల సంస్థ పరిధిలో మొత్తం 105 గురుకులాలు ఉన్నాయి. వాటిలో 17 జూనియర్ కాలేజీలు కాగా, మిగిలిన 88 పాఠశాలల్లో 5 నుంచి 10వ తరగతి వరకు క్లాసులు నిర్వహిస్తున్నారు. మొత్తం 44 వేల మంది విద్యార్థులు వీటిలో చదువుతున్నారు.

నీట్, జేఈఈలో బీసీ విద్యార్థుల ప్రతిభ

నీట్, జేఈఈ పరీక్షల్లో బీసీ విద్యార్థులు ప్రతిభ చూపారని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి కృష్ణమోహన్ తెలిపారు. వాటి ఫలితాలను అంచనా వేస్తే మెడికల్ సీట్లు నలుగురు, డెంటల్ ఒకరు, వెటర్నరీ నలుగురు, అగ్రికల్చర్ బీఎస్సీ సీట్లు నలుగురు సాధించే అవకాశం ఉందని చెప్పారు. ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ ఆరుగురు విద్యార్థులు, ఇంజినీరింగ్ సీట్లు 24 మంది సాధించనున్నారని వివరించారు.

ప్రతి మూడవ శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ డే

- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ జవహర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగుల వ్యక్తిగత సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతి నెల మూడవ శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ డేను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్లు, శాఖాధిపతులను ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు సంతోషంగా ఉండేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని సీఎస్ తెలిపారు. ఉద్యోగులు తమ వ్యక్తిగత సమస్యలపై ఫిర్యాదులను జిల్లా కలెక్టర్లు, శాఖాధిపతులకు సమర్పించాలని చెప్పారు. ఉద్యోగుల సమస్యలను నిర్ణీత వ్యవధిలోగా ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లు, శాఖాధిపతులను సీఎస్ ఆదేశించారు. జగనన్నకు చెబుదాం పోర్టల్‌లో నమోదు చేసిన ప్రతి అర్జీకి ఐడీ ఇవ్వాలని సూచించారు. యూనిక్ ఐడీ జారీ చేయడం ద్వారా ఆ సమస్య ఏ దశలో ఉందో సులభంగా తెలుసుకోవచ్చని తెలిపారు.



రట్టయ్యిందా?

మన జన్యువుల్లో ఒక చిన్న మార్పు ఉన్నా ఏదో ఒక రకమైన వ్యాధికి గురికావడం ఖాయం. కానీ మనిషికి అతిదగ్గరి చుట్టంగా చెప్పుకొనే వానరాల్లో మాత్రం ఇలా ఉండదు. జన్యుపరమైన మార్పులు ఎన్ని ఉన్నా వాటికి మనలా వ్యాధులు అంటవు. ఎందుకిలా? ఈ విషయాన్ని తెలుసుకొనేందుకే హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) సహా అంతర్జాతీయ శాస్త్రవేత్తలు ఓ భారీ అధ్యయనాన్ని చేపట్టి పూర్తి చేశారు. ఇందులో భాగంగా సుమారు 233 వానర జాతులకు చెందిన 809 జన్యుక్రమాలను మానవ జన్యుక్రమాలతో పోల్చి చూశారు. భారత్‌లోని 19 వానర జాతులకు సంబంధించిన 83 నమూనాల జన్యుక్రమ నమోదు, విశ్లేషణ బాధ్యతలను సీసీఎంబీ చేపట్టింది. అంతరించిపోతున్న వానర జాతుల సంరక్షణకు, జన్యుపరమైన వ్యాధులను మరింత లోతుగా అర్థం చేసుకునేందుకు ఈ అధ్యయనం ఉపయోగపడుతుందని అంచనా.

– సాక్షి, హైదరాబాద్

మనుషులతో పోలిస్తే కోతుల్లో వ్యాధులు లేకపోవడంపై భారీ అధ్యయనం

233 వానర జాతులకు చెందిన 809 జన్యుక్రమాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు • భారత్‌లో 19 వానర జాతులకు చెందిన 83 నమూనాలను విశ్లేషించిన సీసీఎంబీ

ప్రత్యేకమైన జన్యుమార్పులు గుర్తింపు...

మానవ, వానర జన్యుక్రమాలను పోల్చి చూసినప్పుడు రెండింటిలోనూ సుమారు 43 లక్షల మిస్‌సెన్స్ జన్యుమార్పులు ఉన్నట్లు స్పష్టమైంది. ఈ ప్రత్యేకమైన జన్యు మార్పులు శరీరానికి అవసరమైన అమైనోయాసిడ్ల రూపురేఖలను మార్చేస్తాయి. ఫలితంగా ఈ అమైనో యాసిడ్లతో తయారయ్యే ప్రొటీన్లు కూడా సక్రమంగా పనిచేయకుండా మనం వ్యాధుల బారిన పడుతూంటాం. అయితే ప్రస్తుతం ఏ మార్పుల కారణంగా మనకు వ్యాధులు వస్తున్నాయన్నది గుర్తించడంలో చాలా పరిమితులున్నాయి. జన్యు మార్పులు వందలు, వేల సంఖ్యలో ఉండటం దీనికి కారణం. మధుమేహం, గుండె జబ్బుల్లాంటి ప్రాణాంతక ఆరోగ్య సమస్యలకూ జన్యుపరమైన మూలకారణం ఇప్పటివరకూ తెలియకపోవడానికి కూడా జన్యుమార్పులకు సంబంధించిన సమాచారం లేకపోవడమూ ఒక కారణం. ఈ నేపథ్యంలోనే శాస్త్రవేత్తలు... వానరులు, మనుషుల జన్యుక్రమాలను సరి పోల్చే పరిశోధన చేపట్టారు. కొన్ని వ్యాధులు ఒకటి కంటే ఎక్కువ జన్యు వుల్లో వచ్చిన మార్పుల వల్ల పుడతాయని... మొదట్లో వాటి ప్రభావం తక్కువగానే ఉన్నా క్రమక్రమంగా ఈ జన్యు మార్పులన్నీ కలసికట్టుగా పనిచేయడం మొదలు పెట్టి మధుమేహం, కేన్సర్ వంటి వ్యాధులుగా పరిణమిస్తాయని అంచనా.



కొన్నింటిని గుర్తించాం...

మానవులు, వానరాలను వేరు చేసే 43 లక్షల ప్రత్యేకమైన జన్యుమార్పులు (మిస్‌సెన్స్ మ్యుటేషన్స్)లలో ఆరు శాతం వాటిని ఇప్పటికే గుర్తించామని, ఇవి మనుషుల కంటే వానరాల్లోనే చాలా ఎక్కువగా ఉన్నాయని కృత్రిమ మేధ కంపెనీ ఇల్యూమినా ఉపాధ్యక్షుడు కైల్ ఫార్ తెలిపారు. ఈ ఆరు శాతం జన్యుమార్పులు మానవ వ్యాధులు వానరాలకు అంటకుండా కాపాడుతున్నట్లు భావిస్తున్నామని ఆయన చెప్పారు. వ్యాధికారక జన్యుమార్పులను గుర్తించేందుకు తాము ప్రైమేట్ ఏఐ-3డీ అనే డీప్ లెర్నింగ్ అల్గారిథమ్‌ను ఉపయోగించామని చెప్పారు. ఈ అల్గారిథమ్ జన్యుశాస్త్రానికి సంబంధించిన చాట్‌జీపీటీ అనుకోవచ్చు. చాట్‌జీపీటీ మనుషుల భాషను అర్థం చేసుకుంటే ప్రైమేట్ ఏఐ-3డీ జన్యుక్రమాన్ని అర్థం చేసుకోగలదు. అంతే తేడా!

విస్తృత స్థాయిలో వానర జన్యుక్రమం నమోదు...

ఈ అధ్యయనంలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేకానేక వానర జాతుల జన్యుక్రమాలను నమోదు చేశారు. ''ఐదు గ్రాముల బరువుండే చిన్న కోతి మొదలుకొని చింపాంజీల వరకూ... భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాల్లో మాత్రమే కనిపించే వెస్టర్న్ హూలాక్ గిబ్బన్, పశ్చిమ కనుమల్లో నివసించే లయన్ టెయిల్డ్ మకాక్ వరకు అనేక వానర రకాల జన్యుక్రమాలను ఇందులో నమోదు చేశారు. ఈ స్థాయిలో వానర జన్యుక్రమ నమోదు జరగడం ఇదే మొదటిసారి''అని సీసీఎంబీ శాస్త్రవేత్త డాక్టర్ గోవింద స్వామి ఉమాపతి 'సాక్షి'తో మాట్లాడుతూ చెప్పారు. భూమ్మీద ఉన్న మొత్తం వానర జాతుల్లో దాదాపు సగం జాతుల జన్యుక్రమం ఇప్పుడు అందుబాటులో ఉందని అంచనా. ఈ విస్తృతస్థాయి జన్యుక్రమం ఫలితంగా వానరాల జన్యుక్రమాలను పోల్చి చూడటం సాధ్యమైందని, తద్వారా పరిణామ క్రమంలో వాటిలో వచ్చిన మార్పులను కూడా పరిశీలించే అవకాశం దక్కిందని డాక్టర్ ఉమాపతి తెలిపారు. అంతేకాకుండా వానరాలను మనుషులను వేరు చేసే అంశాలేమిటన్నది కూడా మరింత స్పష్టమవుతుందన్నారు. జన్యుక్రమాలు అందుబాటులోకి రావడం పరిణామ క్రమాన్ని అర్థం చేసుకోవడానికి మాత్రమే కాకుండా... మనకు వచ్చే వ్యాధుల వివరాలు తెలుసుకోవడానికి, వానరాల సంరక్షణకూ ఉపయోగపడుతుందని వివరించారు. ''వానర జన్యుక్రమ నమోదు.. వాటిని సంరక్షించాల్సిన అవసరాన్ని మరింత గట్టిగా చెబుతున్నాయి''అని సీసీఎంబీ డైరెక్టర్ వ్యాఖ్యానించారు. ఈ అధ్యయనం ఫలితం ఇంకొకటి కూడా ఉంది. మనిషికి మాత్రమే ప్రత్యేకమనుకున్న జన్యుపరమైన అంశాలు దాదాపు సగం తగ్గాయి! అంటే మనిషికి.. వానరానికి మధ్య ఉన్న అంతరం మరింత తగ్గిందన్నమాట!

గ్రీన్ ఎనర్జీకి స్టార్ రేటింగ్

- పునరుత్పాదక విద్యుత్ కొనుగోలు ఆధారంగా జారీ
- 100% వినియోగిస్తే 5 స్టార్స్, 75%కి 4 స్టార్స్, 50%కి 3 గ్రీన్ స్టార్స్
- నిబంధనలు రూపొందించిన ఏపీఈఆర్‌సీ

సాక్షి, అమరావతి: పునరుత్పాదక విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించడంలో భాగంగా కేంద్రం నిర్దేశించిన లక్ష్యాలను సాధించే వినియోగదారులకు 'గ్రీన్ స్టార్స్' ఇవ్వనున్నారు. ఈ మేరకు పునరుత్పాదక విద్యుత్ కొనుగోలు బాధ్యత నిబంధనలు 2022కు మొదటి సవరణను (రెగ్యులేషన్ 6 ఆఫ్ 2023)ను ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ప్రతిపాదించింది. రెన్యూవబుల్ పవర్ పర్చేజ్ ఆబ్లిగేషన్‌లో భాగంగా సగటు విద్యుత్ కొనుగోలు ఖర్చు కంటే పునరుత్పాదక విద్యుత్ టారిఫ్ ఎక్కువగా ఉండకూడదని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ఇటీవల స్పష్టం చేసిన విషయాన్ని కూడా ఏపీఈఆర్‌సీ గుర్తు చేసింది. గ్రీన్ ఎనర్జీ కోసం వార్షిక ప్రాతి పదికన గ్రీన్ స్టార్స్ రేటింగ్ సర్టిఫికెట్లను ఇవ్వాలని సూచించింది. దీని ప్రకారం ఏటా పునరుత్పాదక విద్యుత్‌ను 100% వినియోగిస్తే 5 స్టార్స్, 75% వాడితే 4 స్టార్స్, 50% కొంటే 3 గ్రీన్ స్టార్స్ లభించనున్నాయి. నెల మొత్తం వినియోగం ఆధారంగా అటువంటి ఆకుపచ్చ నక్షత్రాలు వారి నెలవారీ బిల్లులలో కూడా సూచిస్తారు. ప్రతి నెలా డిజిటల్ సర్టిఫికెట్లను కూడా జారీ చేస్తారు. దీనిపై అభిప్రాయాలను వెల్లడించాల్సిందిగా డిస్కంలను కమిషన్ కోరింది. విద్యుత్ చట్టం, 2003 ప్రకారం ..2024-25 ఆర్థిక సంవత్సరంలో పునరుత్పాదక విద్యుత్‌ను కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులు ఆర్థిక సంవత్సరం ప్రారంభమయ్యే తేదీకి 3 నెలల ముందు డిస్కంలకు తమ అభ్యర్థనలను సమర్పించాలని ఏపీఈఆర్‌సీ చెప్పింది.

తెలంగాణ

రామగుండంలో 'ఉగ్ర' కలకలం

గుజరాత్ పోలీసుల అదుపులో తండ్రి, కూతురు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉగ్రవాదులతో సంబంధాలున్నాయన్న అనుమానంతో గుజరాత్ పోలీసులు రామగుండంలో తండ్రి, కూతురిని అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల శ్రీనగర్‌కు చెందిన నలుగురు ఇస్లామిక్ స్టేట్ సానుభూతిపరులను గుజరాత్ యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ (ఏటీఎస్) అరెస్టు చేసింది. వారిలో సమేరా భాను అనే మహిళతో తెలంగాణ రాష్ట్రంలోని పలువురు చాటింగ్ చేసినట్లు గుర్తించిన ఏటీఎస్ పోలీసులు పాతబస్తీతో పాటు వివిధ ప్రాంతాల్లో మంగళవారం దాడులు నిర్వహించారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటూ సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పని చేస్తున్న తండ్రి (40), కూతురు (20) నాలుగు రోజుల క్రితం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని శ్రీనగర్ కాలనీలోని బంధువుల ఇంట్లో షెల్టర్ తీసుకున్నారు. దీంతో గుజరాత్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని రామగుండం సీపీ ముందు హాజరుపరిచి ఉగ్రవాద సంబంధాలపై విచారించినట్లు సమాచారం. సమేరా భానుతో ఎలా పరిచయం? ఎన్ని రోజుల నుంచి తెలుసు? ఏం చాట్ చేశారు.. తదితర అంశాలపై ప్రశ్నించి తదుపరి విచారణ కోసం హైదరాబాద్ తరలించారు.

గురుకుల విద్యార్థి ఆత్మహత్య

పాఠశాలలో చేరిన మర్నాడే..


రంజిత్ గౌడ్ (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: పాఠశాలలో చేరిన మర్నాడే ఓ గురుకుల విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలో మంగళవారం జరిగిన ఈ సంఘటనపై పోలీసుల కథనమిది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం జైకేసారం గ్రామానికి చెందిన పందుల శ్రీధర్‌గౌడ్ కుమారుడు రంజిత్ గౌడ్ (13) గతేడాది పటాన్‌చెరులోని బీసీ గురుకుల పాఠశాలలో చేరాడు. అయితే తన ఊరి నుంచి దూరం ఎక్కువగా ఉండటంతో.. ఈ విద్యాసంవత్సరం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలోని మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలో సోమవారం సాయంత్రం విద్యార్థిని ఎనిమిదో తరగతిలో చేర్పించారు. మంగళవారం ఉదయం 8.30 గంటల సమయంలో విద్యార్థులంతా అల్పాహారం తినేందుకు వెళ్తుండగా వారితో పాటే వెళ్లిన రంజిత్.. కొద్దిసేపటి తర్వాత తన ప్లేట్ తీసుకొస్తానంటూ చెప్పి తిరిగి రాలేదు. అరగంట తర్వాత విద్యార్థులు వెళ్లి చూడగా.. అతను పడుకునే బెడ్‌కు టవల్‌తో ఉరేసుకుని కనిపించాడు. దీంతో తోటి విద్యార్థులు కిందకు దింపి ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకువెళ్లారు. రంజిత్‌ను వెంటనే అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943